# జంగల్‌నామా

మావోయిస్ట్ గెరిల్లాజోన్‌లో అనుభవాలు



సత్నామ్

# జంగల్‌నామా

## మావోయిస్టు గెరిల్లా జోన్‌లో అనుభవాలు

సత్నామ్

**JANGALNAMA**

Travels in a Maoist Guerrilla Zone

by ***Satnam***

Translation from English ***Konatham Dileep***

© Satnam

Cover design Ramanajeevi

Backcover Photo C Vanaja

Rs 100/

Published by Malupu Books Hyderabad
http //malupu wordpress com email malupuhyd@gmail com
Cell 9866559868
For copies 2 1 1/5 Nallakunta Hyderabad 500 044

Published March 2012

ప్రచురణ సంఖ్య 3

ప్రచురణ కాలం మార్చి 2012

**జంగల్‌నామా**

*మావోయిస్టు గెరిల్లా జోన్‌లో అనుభవాలు*

మూలం ***సత్నామ్***

ఇంగ్లీషు నుంచి అనువాదం ***కొణతం దిలీప్***

© సత్నామ్

కవర్ డిజైన్ రమణజీవి

బ్యాక్ కవర్ ఫోటో సి వనజ

వెల రూ 100/-

ప్రచురణ మలుపు బుక్స్ హైదరాబాద్

ప్రతులకు 2-1-1/5 నల్లకుంట హైదరాబాద్ - 500 044

ముద్రణ చరిత ఇంప్రెషన్స్ హైదరాబాద్ ఫోన్ 27678411

C16968
175554

# విషయ సూచిక

అబూజ్‌మడ్ ఇప్పుడు అదృశ్య పర్వతం కాదు
VII

ఉపోద్ఘాతం
XVII

అడవిలోకి ప్రయాణం
1

గెరిల్లా క్యాంపులో
16

అడవిలో మా నడక
62

అల్విదా
163

# అబూజ్‌మడ్ ఇప్పుడు అదృశ్య పర్వతం కాదు

'రాగ్‌డ్ ట్రౌజర్డ్ ఫిలాంత్రఫిస్టు'లకు చిరుగులవో, అతుకులవో బట్టలయినా ఉన్నాయి. ఆ చాలీచాలని బట్టలతో అన్ని రుతువులలో నిర్మాణాలు చేసే క్రమంలో, పనిలో ఉన్నంత కాలం ఆ నిర్మాణమే ఆశ్రయమిస్తుంది. వాళ్లు ఎంతో ఔదార్యంతో తమ నెత్తురు చెమటగా చేసి శ్రమను ధారపోస్తారు. సుందర నిర్మాణాలు చేస్తారు.

కాని ఆదివాసులకు గోచిపాత తప్ప ఆ చిరుగుల, అతుకుల బట్టలు కూడా లేవు. ఆకాశం తప్ప నీడ లేదు. అడవిలో తవ్వుతున్న గనుల్లో, నిర్మాణమవుతున్న పరిశ్రమల్లో వాళ్లు శ్రామికులు కూడా కాలేకపోతున్నారు. ఆ గనుల తవ్వకాల కోసం, ఆ నిర్మాణాల కోసం తమ కాళ్లకింది ఎంతో విలువయిన ఖనిజాలను, తమకు ఆహార్యమైన అడవిని ఎంతో ఔదార్యంతో పెట్టుబడికి అప్పగించి తాము స్థానభ్రష్టులు కావల్సివస్తున్నది. ఈ ఔదార్యాన్ని పోల్చడానికి సామాజిక బృందాల్లో ఇంకెవరయినా సాటి వస్తారా?

అటువంటి ఆదివాసులు నివసించే మధ్య భారతంలోకి, బస్తర్ అడవుల్లోకి 1980లలో విప్లవకారులు ప్రవేశించారు. వాళ్ల ప్రవేశానికి ముందు అక్కడికి బైలదిల్లా నుంచి కిరండుల్ రైలు మార్గం మీదుగా విశాఖపట్నం సముద్రతీరానికి అటునుంచి జపానుకు ఇనుప రజం తీసుకవెళ్లే కంపెనీ ప్రవేశించింది.

2002లో ఆదివాసుల మధ్యన ఈ విప్లవ గెరిల్లాలు ఎట్లా పని చేస్తున్నారని చూడడానికి పంజాబీ రచయిత సత్నామ్ అడవిలో సుదూర

ప్రయాణం చేసి రాసిన జంగల్‌నామా – బస్తర్ అడవుల్లో కేవలం గెరిల్లాల ఇరవై నాలుగు గంటల జీవితాన్నే కాదు, అది ఆదివాసుల జీవితంలో భాగమై తెస్తున్న మార్పు గురించి ఎంతో సరళమైన పద్ధతిలో చెప్తుంది. కాని బుద్ధితో కాకుండా హృదయంతో చెప్తుంది. రాజకీయ పరిభాషతో కాకుండా అనుభవాలసారంగా చెప్తుంది. ఒక రోజు, రెండు రోజుల రిపోర్టింగ్‌కో, ఇంటర్వ్యూకో వెళ్లిన పై పై సమాచారం వలె కాకుండా రెండు నెలల నిరంతర ప్రయాణాలు, ఆదివాసులు, గెరిల్లాలతో కలిసి జీవించి, పరిశీలించిన లోతయిన అవగాహనగా చెప్తుంది. ప్రకృతిలో భాగమైన ఆదివాసుల రేలాగీతమంత సహజమైన సౌందర్యాత్మక కవిత్వ శైలిలో చెప్తుంది.

ఒక వేకువ వేళ కొండల్లోంచి ప్రవహించే సెలయేరులో స్నానానికి వెళ్లినప్పుడు నదిలో మెరుస్తూ కనిపించే అభ్రకం నుంచి మనను ప్రపంచంలోనే విలువైన బస్తర్ ఖనిజాల పరిచయంలోకి తీసుకపోతుంది. బస్సు చూడని, రైలు చూడని ఆదివాసీ గెరిల్లా అయి, తుపాకీ పట్టి ఈ మూడింటికీ అవసరమైన ఇనుము తన కాళ్ల కింది నుంచే వస్తుందని తెలుసుకున్న వైనాన్ని – ఈ ఇనుము ఇక్కడి నుంచి పయనించి, మళ్లా ఇక్కడికి పయనించి తన జీవితంలో సృష్టించిన అగాథాలను, తన మీద విరుచుకపడిన కొండలను పూడ్చడానికి, తొలగించడానికి, పోరాడడానికి తప్పని స్థితిని అనివార్య సహజత్వంతో వివరిస్తుంది.

అడవిలో పూసి రాలిపోయే ఇప్పపూలు కంటి చూపుకు, చక్కని పరిమళానికి లేదా చాలాకాలం తర్వాత సారా కాచుకోవడానికి అని మాత్రమే తెలిసిన ఆదివాసులు వ్యాపారులు ప్రవేశించాక అది ఉప్పు కోసం వినిమయం చేయొచ్చునని మాత్రమే తెలుసుకున్నారు.

ఆవుపాలు మనం తాగితే దూడకెట్లా, కోడిగుడ్లు మనం తింటే కోడిపిల్లలు ఎట్లా వస్తాయి అన్నంత అమాయకత్వం నుంచి బస్తర్‌లో ఆదివాసులు ఇవ్వాళ

గ్రీన్‌హంట్‌ను ప్రతిఘటించి భూంకాల్ మిలీషియాగా ఎదిగారు. బస్తర్‌లో ఒక ప్రత్యామ్నాయ స్వావలంబన అభివృద్ధి నమూనాను అమలు చేసుకుంటూ బస్తర్‌లోకి బహుళజాతి కంపెనీల ప్రవేశాన్ని ప్రతిఘటిస్తున్నారు.

సత్నామ్ కలిసిన ఐతు మాటల్లో చెప్పాలంటే ఇది ఒక కోడిగుడ్డు దొరికితే వ్యాపారం చేసి కోట్లు సంపాదించే షేక్ చిల్లీ వంటి పగటి కల కాదు, బీహార్ కొండలు తొలిచి కాలువలు తవ్వే దశరథ్‌మాంఝీవంటి ఆచరణాత్మక కల. ప్రకృతిలో లభించే సహజవనర్లను, ప్రజా సాంకేతిక జ్ఞానాన్ని ఉపయోగించుకుని స్వావలంబనలో చైనాలో విప్లవకాలంలో సాధించిన అభివృద్ధి వంటిది. ఆ విషయాన్ని సత్నామ్ విడిగా ఒక అభివృద్ధి నమూనాగా చెప్పడు. వేట అంటే ఆసక్తి ఉన్న ఆదివాసీ గెరిల్లా వెంట చేపలు పట్టడానికి వెళ్లి చేపలు పెంచడానికి నిర్మించిన చెరువు నుంచి ప్రారంభించి చెక్‌డ్యామ్‌ల నిర్మాణాన్ని, ఆదివాసుల జీవితం వేట నుంచి వ్యవసాయ నాగరికతలోకి మారుతున్న క్రమాన్ని వివరిస్తాడు. ఆదివాసులు నిర్మిస్తున్న చెక్‌డామ్‌లకు, కాలువలకు, నర్మదా డ్యామ్‌లకున్న వ్యత్యాసం గురించి వివరిస్తాడు.

ప్రపంచంలో ఏ అడవిలో వలెనే బస్తర్ అడవుల్లోనూ ఇదివరకు రెండు రకాల అగ్నులు నిరంతరం జ్వలిస్తున్నాయి. ఒకటి ఆకలి, జఠరాగ్ని. ఆకాశం బయలులో రాత్రిళ్లు నిరంతరం రగిలే నెగళ్లు రెండవది. ఇప్పుడక్కడికి విప్లవం అనే అగ్నిని రగిలించడానికి గెరిల్లా ప్రవేశించాడు.

గెరిల్లా అంటే ఎవరు? తెలుగులో విస్తృతి ప్రచారంలో ఉన్న పాట నుంచి చెప్పాలంటే – వీళ్లు ఈ అడవిలోకి పేరుకోసం వచ్చారా – అంటే తలిదండ్రులు పెట్టిన పేరు వదులుకొని వచ్చారు. ఆస్తి కోసం వచ్చారా అంటే – తల్లితండ్రి, రక్తబంధువులు, ఇల్లు వదులుకొని వచ్చారు. స్థిరపడడానికి వచ్చారా అంటే ప్రజల మధ్యన నిరంతరం నీటిలో చేపలవలె చలనంలోనే ఉన్నారు.

ఈ అడవిలోకి వీళ్లు సత్నామ్ మాటల్లో చెప్పాలంటే మానవజాతి మూలాలను అన్వేషించే ఔత్సాహిక సామాజిక శాస్త్రవేత్తల వలె ప్రవేశించారు ఆ క్రమంలో చేతిలో తుపాకి మందుగుండు పెట్టుకునే మాగజైన్ యూనిఫారాలు వచ్చి సమాజాన్ని సమూలంగా మార్చే గెరిల్లాలుగా మారారు

జనం మధ్య నదిలో వలె ఈత వ్యవస్థకు రాజ్యానికీ ఎదురీత గెరిల్లా జీవితం రోమ్‌లో సైనిక క్రమశిక్షణ స్పార్టకస్ నాయకత్వంలో బానిసల తిరుగుబాటు దీక్ష గెరిల్లా అలవరచుకోవల్సిన లక్షణాలు

ఈ గెరిల్లాలు బస్తర్‌లో ఇరవై ఐదేళ్లుగా ఒక విధ్వంసాన్ని అడ్డుకుంటూ ఒక ప్రత్యామ్నాయ నిర్మాణాన్ని చేస్తున్నారు ఆ ప్రత్యామ్నాయం ఆదివాసీ జీవితం నుంచి సమూహ లక్షణం సహజాతమైన స్వభావం స్వొంత ఆస్తి భావన లేని చైతన్యం డబ్బు మార్కెటు లేని పరస్పర ఆధునిక జీవితాన్ని ఆదివాసులను మళ్ళీ ఇవ్వదలుచుకున్నది అయితే ప్రకృతిలో భాగమంటే జంతువు వలె బతకడం కాదు సమూహం అంటే మందలో బతకడం కాదు సమాజం గడిచి వచ్చిన దశల్లోని జ్ఞానాన్ని చైతన్యాన్ని ప్రజాపరం చేయడం

ఒక్కమాటలో అజ్ఞానమే ఆనందమనే దశ నుంచి జ్ఞానమే ఆనందమనే దశకు ఆదివాసులు చేరుకునే అణచివేత దోపిడీ లేని సమాజం ఆ జ్ఞానం తరతరాల సంచిత ఆచరణ వివేకం పోరాటం చైతన్యంలో భాగమై పొందడం

గెరిల్లాలు తెస్తున్న ఈ మార్పులను చిన్ని చిన్ని పరిశీలనల నుంచి సత్నామ్ చెప్తాడు ఉదయమే సెలయేరులో స్నానమయ్యాక క్యాంపు దగ్గర కిచెన్ దగ్గరికి వస్తాడు కిచెన్‌లో హైరార్కీ లేదు అని మొదలుపెడతాడు స్త్రీలకు పురుషులకూ అందరికీ వంట పనులు వడ్డనలకు వంతులుంటాయి అనారోగ్యంగా ఉన్నవాళ్లకు తప్ప ప్రత్యేక ఆహారం ఎవరికీ ఉండదు నాయకుడికైనా సెంట్రీకైనా

ఏం తింటారు? చాలా సాత్వికమైన ఆహారం ఇప్పుడు కూరగాయలు పండించుకుంటున్నారు గెరిల్లాలు పదేళ్ల ప్రయత్నం చదువు కృషితో ఆదివాసులకు కూరగాయలు పండించడం నేర్పారు దున్నడం లేదు రసాయనిక ఎరువులు లేవు విత్తనాలు భూమిలో చల్లుతారు అవి కూరగాయలకు ప్రసిద్ధమై రచయితకు సుపరిచితమైన పంజాబ్‌లోని కూరగాయలవంటివి కావు

గొడ్డు మాంసమో పంది మాంసమో వాళ్లు తినరు హిందూ ముస్లిం విశ్వాసాల వల్ల కాదు వాళ్లకు మతం లేదు అవి తింటే డిసెంట్రీకి పెడుతుందని తినరు ఇటువంటి విశ్వాసాల కోసం 1857 ప్రథమ భారత స్వాతంత్ర్యం సంగ్రామం నుంచి గుజరాత్ మారణకాండ వరకు నాగరిక భారత దేశంలో పెట్టుబడి ప్రోత్సహించిన మారణకాండను వంటింటి దగ్గర తింటూ చేసే చర్చ వలె వాళ్ల చైతన్యంలో భాగం కావడాన్ని రచయిత మనకు చెప్పాడు

సత్నామ్ మొదటిసారి బస్తర్ గెరిల్లా ప్రాంతానికి వెళ్లేప్పటికి అఫ్ఘనిస్థాన్‌పై అమెరికా దాడి జరిగింది ఇంకా ఇరాక్‌పై దాడి జరుగలేదు అఫ్ఘనిస్థాన్ కొండల్లో తోరాబోరా గుహల్లో దాగి పోరాడుతున్న తిరుగుబాటుదార్ల చర్చ వచ్చింది భారతదేశంలో పదకొండు కోట్లమంది ఆదివాసులు ఉన్నారు వీళ్లు తూర్పు నుంచి మధ్య భారతం గుండా పడమరకు ఉత్తరం నుంచి దక్షిణానికి విస్తరించి ఉన్నారు మధ్య ఆసియా నుంచి ప్రవహించే తైలం మీద పట్టుకోసం అమెరికా ఇస్లాం దేశాల మీద దాడిచేస్తే భారత దేశానికి హృదయం నుంచి హృదయం దగ్గరికి ప్రవహించే రక్త నది వలె విస్తరించిన ఆదివాసీ ప్రాంతం వియత్నామ్ వలె ప్రతిఘటించాలి అని గెరిల్లాలు చెప్పారు అంటే ఈ పదకొండు కోట్ల మంది ఆదివాసుల సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి తేరానామ్ మేరానామ్ సబ్‌కా నామ్ వియత్నామ్ తేరాబరీ మేరాబరీ సబ్‌కాబరీ నక్సల్బరీ – అన్నంత మమేకత్వంలో ప్రపంచ ప్రజల సంఘీభావం కావాలని అక్కడి గెరిల్లాలిచ్చిన చైతన్యంతో ఆదివాసులు చెప్తున్నారు

అడవి భూమిని వేల వేల ఎకరాల్లో గనుల తవ్వకానికి. పరిశ్రమల నిర్మాణానికి ఇవ్వడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ఒప్పందాలు అమలు చేయడానికి పోలీసు, పారామిలిటరీ బలగాలను సాల్వాజుడుంను తయారు చేసి–అది కూడ చాలక ఇప్పుడు యుద్ధమే ప్రకటించాయి. మరి వాస్తవానికి ఇవ్వాళ బస్తర్‌లోని గెరిల్లా ప్రాంతంలో స్థితి ఏమిటి?

గ్రామరాజ్య కమిటీల నేతృత్వంలో అభివృద్ధి కమిటీలు వేసి, సహకార సంఘాలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలు పరిశ్రమతో నీటి వనర్లు కల్పించుకున్నారు. పంటలు, కూరగాయలు పండిస్తున్నారు. విద్య, వైద్యం సమకూర్చుకుంటున్నారు, భూపంపిణీ చేసారు.

ప్రభుత్వ స్కూళ్లు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలంటే, పోలీసు క్యాంపులు. గెరిల్లాల చదువంటే మంచి జీవితాచరణ, భవిష్యత్తును మెరుగుపరచుకునే పోరాట పటిమ, దోపిడీ పీడనలను ప్రతిఘటించే నిర్భయత్వాన్నిచ్చే శాస్త్రీయమైన విద్య.

గోండులకు ఒకటి రెండు లెక్కపెట్టడం వింతగా ఉంటుంది. వాళ్లకు సంఖ్యా ప్రపంచం తెలియదు అని మొదలుపెట్టి గెరిల్లాల విద్యా విధానం గురించి చెప్తాడు.

అట్లాగే వైద్యం – గెరిల్లాలు ఆదివాసీ జీవితంలో ఫైటర్‌కున్నంత విలువ డాక్టర్‌కిస్తారు అంటాడు. ఇద్దరి కర్తవ్యమూ ప్రాణాలు కాపాడడమే. నీళ్లు వేడి చేసుకుని తాగాలని చెప్పడం దగ్గర ప్రారంభించి, మూఢ విశ్వాసాలను తొలగించి ఆరోగ్య, వైద్య జ్ఞానాన్ని పొందడం వరకు గెరిల్లాల కృషి చేస్తాడు.

ఒక అదివాసి అమ్మాయి కథ వివరణ ఎన్ని పొరల్లోకి విచ్చుకుంటుందో చూద్దాం. రచయితతో పాటు ఇద్దరు మహిళా గెరిల్లాలు ఒక ఊళ్లో వారం రోజుల నుంచి మంటల్లో శరీరమంతా కాలిన ఒక బాలికను చూస్తారు.

ఆమెను కాల్చి చంపేసిన భర్త ఎటో వెళ్లిపోయాడు. ఆ దిక్కులేని అమ్మాయి అంబాడుతూ మంటల్లో పడిన లచ్చక్క అనే ఆదివాసీ గెరిల్లా మహిళ హృదయాన్ని ఆ దృశ్యం ఎంతో కలచివేస్తుంది. ఎక్కడ ఆసుపత్రి ఉంది? ఎంత దూరం, ఎట్లా తీసుకవెళ్ళడం, చికిత్స ఏమిటి? ఎన్ని మేకలు అమ్మితే అందుకు అవసరమైన డబ్బు వస్తుంది, అందుకోసం తానేం చేయాలి? ఆ అమ్మాయి వారం రోజుల తర్వాత చనిపోయినట్లు తెలుస్తుంది. ఆదివాసీ పిల్లలు ఎదగకుండానే విషజ్వరాలతో చస్తున్నారు. ఎదిగిన పిల్లలకు బలవంతపు పెళ్లిళ్లు చేస్తున్నారు. ఆ బంధనాలు తెంచుకోవడానికి ఆమె గెరిల్లాల్లో కలిసింది. మళ్లీ తనకా జీవితం వస్తుందా. తాను కూడ చనిపోతే, తన సమాధి మీద – ఈ యువతి పితృస్వామ్యానికి సమాధి కట్టే స్వప్న సాధనలో పోరాటంలో మరణించింది – అని రాయమంటుంది.

ఇవ్వాళ బస్తర్‌లో మావో కలగన్న 'ఆకాశంలో సగం' పోరాటంలో ఉన్నారు.

గెరిల్లాల హెజిమొనీ ఉన్న ప్రాంతమంత కరువు, వ్యభిచారం, హత్య, దోపిడీలు లేవు. చిన్న చిన్న నేరాలు కూడా లేవు.

ఆఫ్ఘనిస్థాన్‌పై అమెరికా దాడికి వ్యతిరేకంగా బస్తర్‌లో జరిగిన ప్రదర్శనలు బయటి మైదాన ప్రాంతాల్లో కూడా జరగలేదు. అమెరికా అంటే వాళ్లకు తెలుసు. తోరాబోరా గుహలమీద బాంబులు వేయడానికి వచ్చినట్లే బస్తర్‌లోకి బహుళ జాతి కంపెనీలుగా వచ్చి తమను నిర్వాసితులను చేయనున్నవని వాళ్లు బైలదిల్లా అనుభవాలతోనే తెలుసుకున్నారు. తమ ప్రభుత్వాలు అందుకు అండగా నిలిచాయని, అందుకే శత్రువని తెలుసు.

గెరిల్లా దినచర్యలో సెంట్రీ పని అన్నిటికన్నా కష్టతరమైనదంటాడు. మూడు గంటలో, గంటన్నరో ఎంత సేపైనా ఒక్కడు క్యాంపును కాపాడే బాధ్యతను మీద

వేసుకొని అన్ని దిక్కులూ మనిషే ఒక చూపై కాపలాకాయాలి. యంత్రం కాదు కదా. ఎంత గతం, ఎన్ని జ్ఞాపకాలు మనసులో దొర్లిపోతాయి. ఏమరుపాటు తనకే కాదు అక్కడి అందరి వర్తమానానికి, భవిష్యత్తుకు ఎంత ప్రమాదమవుతుందో.

బస్తర్ ఆదివాసుల జీవితంలో పాట, నాట్యం ఎంత అవిభాజ్యమైన భాగాలో చూసిన రచయితకు రేలా పాటలు, చేతనా నాట్యమంచ్ ప్రదర్శనలు, అసిండా, ధాకావంటి రూపాల్లో, జానపద బాణీల్లో గెరిల్లాలు ప్రవేశపెట్టిన సరిగ్గా నూరేళ్ల కిందటి గుండాధర్, భూంకాల్ గాథలు వినిపించాయిగానీ నాయనమ్మ, అమ్మమ్మలు చెప్పిన కథలు వినిపించలేదు.

బస్తర్ అడవుల్లో ఆదివాసుల ఆకలి అనే అగ్నివల్ల ఇదివరలో కథలు చెప్పే వృద్ధులు మిగలలేదు.

ఇప్పుడు విప్లవాగ్నివల్ల రాజ్యం యవ్వనసుమాలనే కాల్చివేస్తున్నది.

పాత సమాజంలోని ఫ్యూడల్ అణచివేత, మూఢవిశ్వాసాల నుంచి, ఆధునిక రాజ్యంలోని పోలీసుల, ఫారెస్టు, రెవెన్యూ దోపిడీల నుంచి విముక్తం కావడానికి ఆదివాసులు నిరంతరం గెరిల్లాలుగా రిక్రూట్ అవుతూనే ఉన్నారు. ఇది జీతభత్యాలు లేని ప్రజా సైన్యం. నెలకు సగం స్నానం చేసే సబ్బుముక్క, సగం బట్టలుతుక్కునే సబ్బు ముక్క, సగం కడుపు నింపే తిండి, నోట్‌బుక్కు, పుస్తకాలు, యూనిఫారం గానీ, ఆయుధాలు గానీ అందరికి సరిపడాలేవు. ఈ ప్రజా సైనికులనుంచి విప్లవం ఆశిస్తున్నది మాత్రం, ప్రాణాలకు తెగించిన త్యాగం.

ఇక్కడ బస్తర్‌లోని నదుల వలె విప్లవం దృఢంగానూ, స్థిరంగానూ ప్రవహిస్తున్నది. ఇక్కడ ప్రజా న్యాయం అమలవుతున్నది. అధికార కేంద్రాలయిన పోలీస్ స్టేషన్‌లకు పోకుండా రైతాంగ కమిటీల దగ్గర పంచాయితీ పరిష్కారాలవుతున్నాయి. బసంతి అనే గెరిల్లా మాటల్లో చెప్పాలంటే ఆధిపత్య భావన లేని చోట న్యాయ వివక్ష ఎంతో సులభం.

గెరిల్లా చర్యలు అంటే ఎన్‌కౌంటర్లు, ల్యాండ్‌మైన్‌లు తప్ప సమాచారం కాని మన సభ్య ప్రపంచానికి ఎర్ర నైపుణ్యంతో కూడిన విప్లవంలో భాగమైన ఈ అభివృద్ధిని, ఈ ప్రత్యామ్నాయ రాజకీయ సంస్కృతిని సత్నామ్ కళ్లకు కడతాడు.

ప్రవాహం గురించి ఇప్పుడు నువ్వు చూస్తున్న నీళ్లు నిన్నటివై పోయాయి. అప్పుడే కొత్త నీరు వచ్చేసింది అంటారు. అట్లే అప్పుడే ఇది బస్తర్‌కు ఎనిమిదేళ్ల క్రితం చరిత్ర. ఈ ఎనిమిదేళ్లలో సత్నామ్ మళ్లీ బస్తర్‌కు వెళ్లి వచ్చాడు. మళ్లీ తన అనుభవాలు రాసే ఉంటాడు.

అబూజ్‌మాడ్ ఇపుడెంత మాత్రమూ ఇంక అదృశ్య పర్వతం కాదు. అక్కడ కూడ నిన్న ఎన్‌కౌంటర్ అయింది. ఏడుగురు అమరులయ్యారు.

నిర్మాణమవుతున్న ఒక ప్రత్యామ్నాయ అబూజ్‌మడ్ మీద, మన ఆదివాసుల మీద, మన ప్రజలమీద, మన మీద, మన ప్రభుత్వమే - అవును అవసరమైతే యుద్ధమే అని దాడికి దిగింది.

ఏడుగురు అక్కచెల్లెళ్లు పొన్నపూలు ఏరుకోవడానికి పోతే పులి మింగిన జానపద కథ వినడానికి సత్నామ్‌కు చాలా కోరిక ఉన్నది.

ఆయనేమో ఆ పులి నోట్లో తల పెట్టి పోరాడుతున్న గెరిల్లాల నాయకత్వంలోని ప్రజల గాథ వినిపించాడు.

తెగిపడిన ఈ చిటికెన వేలు పట్టుకొని మనం పడిపోయిన అమరుడి చేతిలో జెండానందుకొని ముందుకు సాగినట్లుగా అబూజ్‌మాడ్‌పై చుక్కల పర్వతానికి పయనిద్దామా.

- వరవరరావు

*9 ఫిబ్రవరి 2010*

*(పెంగ్విన్స్ ఇంగ్లీషు ప్రచురణకు ముందుమాట)*

# ఉపోద్ఘాతం

జంగల్ నామా అడవులపై రాసిన పరిశోధనాత్మక పుస్తకం కాదు. అలా అని అది కాల్పనిక సాహిత్యమూ కాదు. బస్తర్ అడవుల్లో పర్యటించినప్పుడు అక్కడ నేను స్వయంగా చూసిన కమ్యూనిస్టు గెరిల్లాల, ఆదివాసుల జీవన విధానాలను ఈ పుస్తకం వివరిస్తుంది. ఇది నా డైరీలాగానో లేదా ఒక యాత్రానుభవం లాగానో భావించవచ్చు. ఇందులోని పాత్రలన్నీ నిజమైనవే. పాలకుల చేత చట్టవ్యతిరేకులుగా ముద్రపడిన వీరు తమ స్వప్నాలను నిజం చేసుకునేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. ఒక కొత్త జీవితం...ఒక కొత్త యుగం.. అదే వారి స్వప్నం. వారి భవిష్యత్తు ఎలా ఉండబోతుందో కాలమే నిర్ణయిస్తుంది. వారు చరిత్రను తిప్పాలనుకుంటున్న మలుపు గురించి వారి మాటల్లోనే విందాం. నమ్మిన సిద్ధాంతాల కొరకు జీవితాలను తృణప్రాయంగా అర్పించే వారి జీవితం ఎలా ఉంటుందో ఈ పుస్తకం చదివితే అర్థం అవుతుంది.

– సత్నామ్,

అక్టోబర్ 2003

# అడవిలోకి ప్రయాణం

అడవిలో అది నా మొదటి రోజు. కాదు, కాదు, అది నా మొదటి రాత్రి!

అడవిలోకి ప్రవేశించాలంటే రాత్రి తాలూకు చీకటి తెరల సాయం కావాల్సిందే. బైలడిల్లాకు పగటి పూట చేరుకుని ఉంటే చీకటిపడేంతవరకూ రోడ్ల వెంట రికామీగా తిరగాల్సి వచ్చేది. నాకిచ్చిన సమయం కన్నా మూడు గంటలు ముందే అక్కడికి చేరుకున్నాను నేను. దూరం నుంచి వినిపిస్తున్న రాంలీలా సంగీతం నన్ను ఆకర్షించింది. కాస్త సమయం గడుస్తుందని అటుకేసి నడిచాను. ఒక రెండు గంటలు ఆ రణగొణ ధ్వనిలో గడిపి నాకిచ్చిన సంకేత స్థలం వద్దకు చేరుకున్నాను.

ఇంకో గంట సమయం ఉంది.

మధ్యరాత్రి అవుతుండగా, 'ఇక పదండి. సమయం అయ్యింది' అన్నాడు నా గైడ్.

నేను నా షూ లేసులు బిగించి కట్టుకుని నా కిట్ బ్యాగును అందుకుని 'రెడీ' అన్నాను.

ఇద్దరం అడవికేసి నడక సాగించాం. కొన్ని గతుకుల రోడ్లు తిరిగాక టౌన్ నుండి బయటికి వెళ్ళే రహదారిపైకి చేరుకున్నాం. రాంలీలా నుండి కొంతమంది అప్పుడే ఇళ్లకి వెనక్కి మళ్లుతున్నారు. మమ్మల్ని ఎవరూ దాటేసి వెళ్లకుండా, మేమూ ఎవరినీ దాటేసి వెళ్లకుండా జాగ్రత్తగా నడుస్తున్నాం.

క్రమంగా మాతో వచ్చేవారు కనుమరుగయ్యారు. మేము కాస్త దూరం రహదారి పై నడిచి వీలైనంత త్వరగా ఇంకో మార్గంలోకి వెళ్లాలి. హఠాత్తుగా ఒక కారు హెడ్ లైట్లు మాపై పడ్డాయి. నా గైడ్ తన వెనకే నడవమని నాకు సైగ చేశాడు. ఆ కారు హెడ్ లైట్ల వెలుతురుకి ఒక క్షణం నాకు కళ్లు మిరుమిట్లు గొలిపాయి.

'ఈ రోడ్డుపై ట్రాఫిక్ పెద్దగా ఉండదు. అప్పుడప్పుడూ పోలీసు జీపులు మాత్రం తిరుగుతుంటాయి' లోగొంతుకతో చెప్పాడు నా గైడ్.

'ఇంకొద్ది దూరమే వెళ్లాలి మనం' చప్పుడు చేయకుండా నడుస్తున్నాడతను. కాసేపటికి ఇరువైపులా చెట్ల వరుస ఉన్న ఒక బాటపైకి వచ్చాం మేం. కొంచెం దూరం ఆ దారిపై నడిచాక వెనకకు తిరిగి ఒక సారి చూసుకుని పక్కనే ఉన్న పొదల దగ్గరికి వెళ్లాడతను.

క్షణం తరువాత అతను 'నేనే' అనడం వినిపించింది నాకు. మావైపొక మానవాకారం నడిచి వచ్చింది. అతనితో చేతులు కలిపాం మేమిద్దరం. కాస్త పక్కకి వంగి భుజానికి ఉన్న కిట్ బ్యాగును సరిచేసుకున్నాడతను. వెన్నెల వెలుగులో అతగాడు బక్కపలుచగా, మధ్యస్థమైన ఎత్తుతో ఉన్నాడని అర్థమైంది నాకు. నా గైడ్ లాగానే చాలా చురుకుగా ఉన్నాయతని కదలికలు.

ముందు నా గైడ్, వెనక మా కొత్త కామ్రేడ్ నడుస్తుంటే మధ్యలో నేనున్నాను.

దారిలో మాకొక చిన్న గ్రామం ఎదురైంది. మా గైడ్ మావైపు తిరిగి టార్చిలైట్లు వెలిగించొద్దు అని చెప్పాడు. మా అందరి వద్దా టార్చిలైట్లు ఉన్నాయి. బాటలో ఏదైనా అడ్డంకి ఎదురైనప్పుడు మా గైడ్ మాకు సంకేతం ఇచ్చేందుకు పాదంతో నేలపై గట్టిగా తాటించేవాడు. ఆ సంకేతం వచ్చినప్పుడు మేమొక లిప్తపాటులో టార్చిలైటు వెలిగించి ఆర్పేసేవాళ్లం. ఇప్పుడు ఆ సౌలభ్యం లేకపోవడంతో ఇకపై నేను ముందు నడిచే గైడ్ అడుగులను జాగ్రత్తగా గమనించాలి.

మా బాట ఏటవాలుగా ఉంది. బహుశా ఏదో చిన్న లోయలోకి దారి తీస్తున్నట్టుంది. పాదం పెట్టడానికి కూడా స్థలం లేదు. మా గైడ్ కూడా ఒక్కో

అడుగూ జాగ్రత్తగా వేసి, నేను అనుసరించేవరకూ ఎదురు చూస్తున్నాడు. ఆ చీకట్లో సరిగా చూసుకోక ఒక రాయిపై నా పాదం జారింది. నేను పడకుండా నా గైడ్ నన్ను ఒడిసి పట్టుకున్నాడు, కానీ అప్పటికే నా బరువంతా ఆ మెలికపడ్డ పాదంపైన పడింది. అయినా నేను లక్ష్యపెట్టక ఒక మైదాన ప్రాంతం వచ్చే వరకూ అలాగే నడక సాగించాను. కాసేపటికి ఆ గ్రామం దాటి వెళ్లాం. ఆ అడవి దారుల గుండా దాదాపు రెండు గంటలు నడిచామేమో. చిమ్మ చీకటి ఉండటంతో చుట్టూ ఉన్న అడవి కూడా మాకేమీ కనపడటం లేదు.

ఆ రెండు గంటలూ ఒక్కరం కూడా నోరు మెదపలేదు. మా అడుగుల చప్పుడు, మా కిట్ బ్యాగుల్లోని సీసాల్లో నీళ్ల చప్పుడు తప్ప మరే చప్పుడూ వినపడటం లేదు.

రెండున్నర గంటలు అలా నడిచాక మా గైడ్ ఒక చోట ఆగాడు. ఒక పది నిముషాలు విశ్రాంతి తీసుకొని బయలుదేరుదాం అన్నాడు. మా కిట్ బ్యాగులు నేలపై పెట్టి. సీసాల్లోని నీళ్లు తాగి కూలబడ్డాం. జనావాసాలకు చాలా దూరం వచ్చేశాం కనుక ఇప్పుడు కాస్త మాట్లాడుకోవచ్చు.

మేము గట్టిగానే మాట్లాడుతున్నా మా మాటలు అయిదారు అడుగుల దూరం మించి వినపడట్లేదు. ఈ అడవిలో మా మాటలు వినేవారు ఎవరూ లేకున్నా ఇక్కడ మెల్లగా మాట్లాడటం అనేది ఒక అలిఖిత శాసనం. రాత్రివేళ అడవిలో విశ్రమిస్తున్న జంతువులూ, పక్షులను డిస్టర్బ్ చేయదల్చుకోలేదు మేము.

పెద్దగా ఏమి మాట్లాడుకోకుండానే పది నిముషాలూ గడిపేశాం. మరో గుక్క నీళ్లు తాగి ఇక బయలుదేరాం.

మా బాట కాసేపు అడవి గుండా, కాసేపు పొలాలగుండా మరికాసేపు చిన్న చిన్న పొదల గుండా సాగుతోంది. దారి పొడవునా రాళ్లు మాత్రం ఉంటున్నాయి. అక్కడక్కడా మా పాదాలకు ఈ రాళ్ళే లేక చెట్టు వేళ్లో అడ్డు పడేవి. ఒకరికి అడ్డంకి ఎదురైనా ముగ్గురమూ ఆగేవారం. అడ్డంకి ఎదురైన వ్యక్తి మిగతా ఇద్దరికీ సైగ చేసేవాడు. ఒక్క మాట కూడా మాట్లాడుకోకుండా సైగలతోనే ఒకరిని ఒకరం హెచ్చరించుకునేవారం.

ఇంకో గంట నడిచాక మాలో ఒకరు "వ్యాన్ వస్తోంది" అని అరిచారు. ముగ్గురం పక్కనే ఉన్న పొదల్లోకి దూకి దాక్కున్నాం. ఒక మోటార్ సైకిల్ హెడ్‌లైట్ల వెలుతురు మా తలలపైనుండి వెళ్లింది. దాని ఇంజన్ రొద కొద్ది క్షణాల తరువాత మాకు దూరంగా వెళ్లిపోయింది. ఇలాంటి మెలితిరిగిన కాలిబాటపై మోటార్ సైకిల్ ఎలా వెళ్లిందో అర్థం కాలేదు నాకు. అదే అంటే, నా గైడ్ మేమొక కాలువ పక్కనే ఉన్న కాలిబాటపై ఉన్నామని, కాలువపై ఉన్న బ్రిడ్జీపైనుండి ఆ మోటార్ సైకిల్ వెళ్లిందని వివరించాడు.

ఆ చీకట్లో ఆ మోటార్‌సైకిల్ మా వైపు వస్తున్న విషయం గమనించలేదు. ఆ దారిలో నాలుగు చక్రాల బళ్లు వచ్చే అవకాశం లేదని అందుకే వ్యాన్ లాంటి వాహనాలు రావని నా గైడ్ చెప్పాడు. అసలు ఇక్కడ మోటార్‌సైకిల్ కనపడటమే అరుదట. ఇంకేమైనా బళ్లు వస్తాయేమోనని కాసేపు కదలకుండా అలాగే ఉన్నాం ముగ్గురం. తెల్లవారుజాము మూడు నాలుగింటికి పట్నం నుండి వస్తున్న ఈ మోటార్‌సైకిల్ అనుమానాలు రేకెత్తించింది. మా గైడ్ చెవులు రిక్కించి దూరం నుండి ఇంకేమైనా శబ్దాలు వస్తున్నాయేమో విన్నాడు. కాసేపటికి ఇంకే ప్రమాదమూ లేదని నిర్ధారించాడు.

దారి పొడుగూతా నిశ్శబ్దంగా ఎందుకుండాలో ఇప్పుడు స్పష్టంగా అర్థం అయ్యింది నాకు. అడవిలో అలుముకున్న ఈ పొదలవల్ల ఏదైనా వాహనం వచ్చినా దాని లైట్ల వెలుతురు ఎక్కువ దూరం కనపడదు, కానీ దాని శబ్దం కొంచెం దూరం వినపడుతుంది. ఆ శబ్దాన్ని ముందే పసిగట్టలేక పోయినందుకు మా గైడ్ బాధపడ్డాడు. నా వెనక ఉన్న కామ్రేడే ఆ మోటార్‌సైకిల్ వెలుతురు చూసి మమ్మల్ని హెచ్చరించింది.

ఇంకా తెలవారక ముందే మా గైడ్ మమ్మల్ని గుబురు పొదల మధ్య ఉన్న ఒక పెద్ద చెట్టు మొదట్లో ఆపి 'ఒక గంట విశ్రమించి సూర్యోదయానికి ముందే మళ్లీ బయలుదేరుదాం' అని చెప్పాడు.

కింద ఉన్న చెత్తా చెదారం కాస్త శుభ్రం చేసి తన బ్యాగులో నుంచి ఒక ప్లాస్టిక్ షీటును తీసి నేలపై పరిచాడు. చెరో అర్ధగంట కాపలా ఉండాలని నిర్ణయించుకుని నన్ను పడుకోమని చెప్పారు వారిద్దరూ.

అడవిలో అది నా మొదటి రాత్రి... కింద చల్లని నేల, పైనుండి కురుస్తున్న సన్నని మంచు బిందువులు, నేలపై ఆ నాలుగు ఫీట్ల "పడక" పై ఎవరైనా ఎలా పడుకోగలరు? వారిద్దరూ డ్యూటీ ఎప్పుడు మారారో కూడా నేను గమనించలేదు. కానీ నేను నిద్ర లేచేసరికి మాత్రం నా గైడ్ మెలకువతోనే ఉన్నాడు. ఇంకో కామ్రేడ్ దూరాన కాపలా కాస్తున్నాడు. మెల్లగా వేకువ కిరణాలు ప్రసరిస్తున్నాయి. పక్షుల కిలకిలారావాలు వినిపించసాగాయి.

అప్పుడతన్ని మొదటిసారి చూశాను. 22-23 యేళ్లు ఉంటాడేమో ఆ చామన ఛాయ రంగులో ఉన్న యువకుడు. వెడల్పాటి నుదురుతో, ఉషోదయం లాంటి చిరునవ్వు అతని పెదాలపై...చెంపలపై నునుఎరుపు, స్నేహపూర్వకమైన చూపులు...

నిన్న రాత్రి రోడ్డు పక్కన చీకట్లో మమ్మల్ని కలిసిన యువకుడు ఇతనే. ఒకవేళ ఆ చీకట్లో ఇతణ్ని కాకుండా మరొకరిని కలిసి ఉంటే? ఉహూ, అలా జరిగే అవకాశమే లేదు.

'నీ పేరు?' అడిగాన్నేను

'బసు' జవాబిచ్చాడు

'నిన్ను చూస్తే బెంగాలీలా కనపడడం లేదే'

'నేను బెంగాలీని కాదు. కానీ బెంగాలీలో మాట్లాడగలను. ఇక సిద్ధమవ్వండి మనం బయల్దేరుదాం' అన్నాడు

మా చూపులు ఒక క్షణం కలుసుకున్నాయి. ఒకరికొకరు అభివాదం చేసుకున్నాం. లేచి నిలబడి అతనితో షేక్ హాండ్ చేద్దామని ప్రయత్నించాను, కానీ నా పాదం సహకరించలేదు. అక్కడ జివ్వుమనే నొప్పి మొదలైంది.

'ఏమైంది' అడిగాడతను.

'నిన్న కాలు మడతపడింది. మనకు ఇబ్బందే అయేటట్టుంది.' బదులిచ్చాను

'చలికి ఆ నొప్పి ఎక్కువైనట్టుంది' అన్నాడు బసు నా పాదం కేసి చూస్తూ. తన బ్యాగులోనుండి ఒక ఆయింట్మెంట్ తీసి ఇచ్చాడు నాకు. కాలుకి కాస్త మర్దన చేసి బూట్లు తొడుక్కున్నాను. కానీ నిలబడలేకపోయాను. మూడో కామ్రేడ్

సాయంతో అయిదారు అడుగులు వేశాను. అప్పుడు అతని చేతిలో చేయి వేసి 'నా కాలు నొప్పి మనం చేతులు కలపకుండా ఆపింది' అన్నాను.

అతను చిరునవ్వుతో నా భుజం తట్టాడు.

అతని ఆసరా వదిలి నేను ఓ నాలుగు అడుగులు వేశాను. ఇప్పుడు కాస్త మెల్లగా నడవగలుగుతున్నాను కానీ ఇలా నడిస్తే మా ప్రయాణం ఎప్పటికీ పూర్తవదు.

బిసు ఒక వెదురు కొమ్మను విరిచి తీసుకువచ్చి నాకు ఇచ్చాడు. ఇప్పుడు కొంచెం మెల్లగానయినా నడవగలగుతున్నాను. వాళ్లు నా కిట్ బ్యాగును మోస్తామన్నారు, కానీ అప్పటికే బ్యాగును భుజానికి తగిలించుకున్నాను కనుక వద్దన్నాను. కొంచెం దూరం నడిచాక నా పాదం నొప్పి కొంచెం నెమ్మదించింది.

'మిమ్మల్ని సిటీకి వెనక్కి తీసుకువెళ్లి కొన్ని రోజులు అక్కడే ఉంచాలి' అన్నాడు బిసు

'వెనక్కి వెళ్లడం కొరకు రాలేదు నేను. నాకేం ఫరవాలేదు'

రాత్రి నడిచినంత వేగంగా కాకపోయినా నేను బాగానే నడవగలగడంతో బిసుకి నేను వెనక్కి వెళ్లాలనే ఆలోచన రాలేదు. వాళ్లు నా నీళ్ల సీసా తీసుకున్నారు. దాంతో ఒక కిలో బరువు తగ్గింది. నాకైతే పది కిలోల భారం తగ్గినట్టు అనిపించింది.

మేము నెమ్మదిగా లక్ష్యం వైపు పురోగమించసాగాం. ఒక్కోసారి ఎగుడుదిగుడు నేలపై పాదం పడితే నొప్పి జివ్వుమనేది. పొద్దు గడుస్తున్నకొద్దీ పాదం కొంచెం వెచ్చబడి నొప్పి కాస్త తగ్గింది.

రాత్రి గంటసేపే పడుకున్నా కానీ మంచిగా నిద్రపట్టింది. వారిద్దరూ నన్ను గార్డ్ డ్యూటీ నుండి మినహాయించారు.

'రాత్రి చేసిన సాయానికి మీ రుణం ఎలా తీర్చుకోవాలి' అడిగాన్నేను

'ఏదీ గార్డ్ డ్యూటీ నుంచి మినహాయించినందుకా?'

'అవును'

'అది మా బాధ్యత కదా'

సత్నామ్

బసు, తనతో ఉన్న కామ్రేడ్ దగ్గర ఆయుధాలేవీ లేవు. అయినా వారు రాత్రి గార్డ్ డ్యూటీ చేశారు. సిటీకి వెళ్లినప్పుడు ఆయుధాలు తీసుకువెళ్లమని చెప్పాడతను. రాత్రి ఏదైనా ప్రమాదం ఎదురైతే పరుగెత్తి ప్రాణాలు కాపాడుకోవాల్సిందే. గార్డ్ డ్యూటీ చేసేది కేవలం వస్తున్న ప్రమాదాన్ని ముందే పసిగట్టి హెచ్చరించేందుకే. రాత్రి పూట నడుస్తున్నప్పుడు అప్పుడప్పుడూ ఆగి చెవులు రిక్కించి వినేవాడతను. అతని చెవులు చీమ చిటుక్కుమన్నా ఇట్టే పట్టేసేవి. దారి రెండుగా చీలినప్పుడు టార్చిలైటును ఒకసారి వెలిగించి చూసి ఒక దారిని ఎంచుకునేవాడు.

ఒకే ఒక్కసారి అతను తప్పు దారిని ఎంచుకున్నాడు. అప్పుడు కూడా ఒక పదిహేను ఇరవై అడుగులు నడవగానే అనుమానంగా చీకట్లో ఉన్న అడవికేసి చూసి టార్చిలైట్ వేసి చూసుకుని వెనకకు మరలాడు. ఇంతటి చిమ్మచీకట్లో కూడా అడవి దారులను అవలీలగా గుర్తించగల అతని శక్తికి నేను అబ్బురపడ్డాను.

నన్ను కలిసినప్పుడు బసు అడిగిన మొదటి ప్రశ్న "టార్చి లైట్ ఉందా?"

బహుశా ఆ టార్చ్ లేకపోయుంటే మేము కలిసేవాళ్లమే కాదేమో. ఈ అడవి దారుల్లో ప్రయాణించడానికి టార్చ్ ఎంతో అవసరం.

రెండు గంటలకు మించి ఏ రాత్రీ నిద్రపోయేవారం కాదు. అయినా పెద్దగా అలసట కలిగేది కాదు. అడవిలోకి ప్రవేశించే ముందు దాని అందాల్లో తడిసిపోవాలని ఉంటుంది. అడవిలోని చెట్టూ చేమను, పక్షులను, జంతువులనూ చూడాలనీ, వాటితో స్నేహం చేయాలని, అన్నింటికీ మించి అడవిలో ఉండే మానవ మిత్రులను కలవాలని మనసు ఉవ్విళ్లూరుతుంటుంది. అయితే మేము అడవిలోకి ప్రవేశించాక మొదటి మూడు రోజులు నాకు జంతుజాలమూ, మనుషులూ పెద్దగా కనపడలేదు. దట్టమైన అడవిలోకి ప్రవేశించేదాకా మా ప్రయాణం ఊళ్లకు దూరంగా సాగడం వల్ల అనుకుంటాను మాకు మనుషులు తారసపడలేదు.

నా కుతూహలం కొంచెం పెరిగింది. ఇంతకీ అడవిలో మనుషులెక్కడ? వారు ఎలా ఉంటారు? వాళ్లేమి తింటారు? ఏం తాగుతారు? ఎలాంటి వస్త్రాలు ధరిస్తారు? వారి జీవన విధానం ఎలాంటిది? మూడు రోజులైనా ఒక్క మానవమాత్రుడూ కనపడడేమిటనే నా కుతూహలంలో అలసట కూడా మరిచాను.

అకస్మాత్తుగా కొండల నడుమ ఉన్న వరి పొలంలో ఒక మంచెపై నిలబడ్డ మనిషి కనపడ్డాడు. మొలకు ఒక చిన్న వస్త్రం తప్ప అతని దేహంపై ఏ అఛ్ఛాదనా లేదు. పక్షులను పారద్రోలుతున్నాడతను.

'బసు! చూడక్కడ. బహుశా దగ్గరలో ఏదో ఊరు ఉన్నటుంది'

'మనం చాలా ఊళ్ల పక్కనుండే వచ్చాం. కానీ చుట్టూ చెట్లుండడం వల్ల అవి మనకు కనపడలేదు'

'అతను మనల్నే చూస్తున్నట్టున్నాడు కదూ'?

'అవును. అతనికి మనమెవరో తెలుసు. అతను పార్టీ సానుభూతిపరుడేమీ కాదు. ఈ ప్రాంతంలో మనం తిరుగుతుంటామని అతనికి తెలుసు. కానీ ఎవరికీ చెప్పడులే. మనం కూడా అతనిని మద్దతియ్యమని ఎప్పుడూ అడగలేదు. ఈ ప్రాంతంపై మనం పెద్దగా దృష్టి కేంద్రీకరించలేదు. సిటీకి దగ్గరగా ఉంది కాబట్టి ఇక్కడ ప్రభుత్వ ప్రతిఘటన ఉండొచ్చు. దాన్ని నివారించడానికే ఇక్కడ ఇప్పుడే విస్తరించాలనుకోవట్లేదు'

అప్పటిదాకా నిర్భయంగా ప్రయాణించిన నేను, బసు ఆ ప్రాంతం తమది కాదు అనగానే కొంచెం కంగారుపడ్డాను.

అకస్మాత్తుగా దాడి జరిగితే ఎదురుకోవడానికి మావద్ద ఏమీ లేదు. మాదగ్గర ఉన్నదల్లా గుప్పెడు బియ్యం, కొన్ని మిగిలిపోయిన బిస్కెట్లు, అందరి వద్ద ఒక్కో పెన్ను. శత్రువు ఎదురుపడితే ఈ పెన్నులనే గన్నులుగా చూపెట్టగలరు వారు. బిస్కెట్లను క్యాట్రిడ్జులనీ, నా బ్యాగులో ఉన్న చాక్లెట్లను బుల్లెట్లనీ అనగలరు.

బసు నవ్వాడు నా ఆలోచనలు విని.

'ఇక్కడ పార్టీ కార్యకలాపాలు లేవంటే అర్థం ఇక్కడ మనపై దాడి జరిగే ప్రమాదం ఉన్నదని కాదు. ఇక్కడ కూడా ప్రజలు గెరిల్లాలనే సపోర్ట్ చేస్తారు. ఏదైనా పోలీస్ కదలిక ఉంటే ఆ విషయం మనకు ముందే చేరవేస్తారు' అన్నాడు

మా మాటలు ముగిసే సరికి ఆ గిరిజనుడు కనుమరుగు అయ్యాడు.

ఎప్పటిలానే మేము ఒక వరుసలో నడుస్తున్నాము. గెరిల్లాల అధీనంలో ఉన్న ప్రాంతంలో కూడా ఇదే విధంగా ఉంటుంది ప్రయాణం. ఇది వారి పద్ధతి. మిలిటరీ పద్ధతి. ఇవ్వాళ కూడా నా స్థానం మధ్యలోనే. అడవిలో ఉన్నంత కాలం, మా బృందంలో ముగ్గురున్న పదముగ్గురున్నా, నా స్థానం అక్కడే. బయటి నుండి వచ్చే అతిథులను మధ్యలోనే ఉంచుతారెప్పుడూ. మిలిటరీ దృష్టికోణంలో అది అత్యంత సురక్షితమైన స్థానం.

మధ్యాహ్నం మమ్మల్ని ఒక దట్టమైన చెట్ల గుంపులో వదిలి సమీప గ్రామంలో భోజనం తేవడానికి వెళ్లాడు బసు. ఒక గంట తరువాత అన్నం, చేపల కూరతో వచ్చాడు. గిరిజనులకు ఇది అత్యంత ప్రీతిపాత్రమైన ఆహారం. ఆ ముతక బియ్యం అన్నంలో అన్నీ సన్నని రాళ్లే. ఎప్పుడూ తాజా చేపలనే తినే అలవాటు ఉన్న నాకు ఆ ఎండు చేపలను తినడం కూడా కష్టమయ్యింది. అక్కడ రెణ్నెళ్లు ఉన్నా నాకు ఎండుచేపలు అలవాటు కాలేదు.

మాకు అన్నదానం చేసిన గిరిజనుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఆ కూరను అన్నంలో కలుపుకుని నమలకుండా మింగేశాను. పంటి కిందికి రాయి రాకుండా ఉండాలంటే ఇదే ఉత్తమ మార్గం! ఇంత చేసినా అప్పుడప్పుడు ఒక రాయి పంటిలో ఇరుక్కునేది. దాన్ని వేలితో తడిమి తీసేసేవాణ్ని. బసు, అతనితో ఉన్న కామ్రేడ్ మాత్రం ఈ ఇబ్బందేమీ లేకుండా హాయిగా భోజనాన్ని ఆస్వాదిస్తున్నారు.

తాము కూడా అన్నాన్ని నమలకుండానే మింగేస్తామని తరువాత చెప్పారు వారు. అభిమానంతో అన్నం పెట్టిన గిరిజనులను ఎంతో గౌరవిస్తారు గెరిల్లాలు. ఇప్పుడు తమకు ఇదే ఆహారం అలవాటయ్యిందని అన్నారు.

రాత్రి ప్లాస్టిక్ షీటును పరచుకుని పడుకున్నాం. సిటీకి చాలా దూరం వచ్చినా రూల్ ప్రకారం వారు వంతులవారీగా సెంట్రీ డ్యూటీ చేశారు. మిలిటరీ జీవన విధానంలో రక్షణ అనేది ఒక విడదీయరాని భాగం. దాన్ని వారొక పనిలా భావించరు. ఆ రాత్రి కూడా నన్ను సెంట్రీ డ్యూటీ నుండి మినహాయించారు.

మరునాటి సాయంత్రం మేమొక గ్రామం సమీపంలోకి చేరాం. ఎప్పటిలా దానికి కొద్ది దూరం నుండి వెళ్లకుండా నేరుగా గ్రామంలోకే వెళ్లాం. దీనర్థం మేము గెరిల్లా జోన్‌లోకి ప్రవేశించామన్న మాట. ఆ పల్లెకు కొద్ది దూరంలో ఉండగానే బసు ఒక యువకుడిని పిలిచాడు. వారేం మాట్లాడుకున్నారో ముక్క కూడా అర్థం కాలేదు నాకు.

గోండీ అటు ఉత్తర భారత భాషల వలెగానీ, ఇటు దక్షిణ భారత భాషల వలెగానీ ఉండదు. హిందీ, బెంగాలీ, తెలుగు భాషలతో పోలిక ఉండదు. అదేదో ఆఫ్రికన్ భాషలా ఉంటుంది.

మొలకు చిన్న గుడ్డ మాత్రమే చుట్టుకున్న ఆ గిరిజన యువకుడు పదిహేను నిమిషాల తరువాత తిరిగివచ్చాడు. బసుతో ఏదో మాట్లాడాక, గ్రామంలోకి దారి తీశాడు.

చిన్న చిన్న గుడిసెల మధ్యలోంచి నడిచి ఒక ఇంటి వసారాలోకి ప్రవేశించాం. కింద పెండతో అలికి చాలా శుభ్రంగా ఉందా ప్రదేశం. ఇరువైపులా ఎండు కర్రలతో ఒక దడివంటిది కట్టారు.

అక్కడ ఏడెనిమిది మంది గిరిజన యువకులు కూర్చున్నారు. అందరూ మిలిటరీ యూనిఫార్మ్ ధరించి, చేతిలో ఒక నోట్ బుక్, పెన్సిల్‌తో కూర్చుని ఉన్నారు. వారి తుపాకులు ఒక పక్కన ఉన్న చెక్క స్టాండుకు ఆనించి ఉన్నాయి. ఇద్దరు యువకులు రక్షణ కొరకు సెంట్రీల్లాగా నిలబడ్డారు.

మమ్మల్ని చూసి, లేచి తుపాకులు చేతబట్టి ఒక వరుసక్రమంలో నిలబడ్డారు వారు. ఒక్కొక్కరూ ముందుకు వచ్చి మాతో చేతులు కలిపి తిరిగి లైనులోకి వెళ్ళి నిలబడసాగారు. ఎవరైనా అతిథులు వస్తే వారికి స్వాగతం

పలికే పద్ధతి ఇదేననుకుంటాను. కమాండర్ ఆదేశం మేరకు వారు ఆ లైనును వదిలి తమ తమ పనుల్లోకి వెళ్లిపోయారు.

ఇద్దరు కామ్రేడ్లు వంట పనుల్లోకి వెళ్లగా మిగతా వారు తమ చదువు పనిలో నిమగ్నమయ్యారు.

వారిచ్చిన వేడి వేడి టీ తాగగానే మా అలసట సగం తీరింది. కాసేపటికి నా కన్ను అంటుకుంది. అరగంట సేపు మాంచి కునుకు తీశాక వారు నన్ను లేపారు.

భోజనం తయార్!

మళ్లీ చేపలు, అన్నం. కానీ ఇవ్వాళ తాజా చేపలు. చిన్న చిన్న చేపలు, ముక్కలు చేయకుండా అలాగే వండారు.

అందరూ ఇష్టంగా తింటున్నారు, కానీ నాకే మింగుడు పడట్లేదు. ఇప్పుడు ఆ చేపల తలలు తీసేస్తూ తినడం బాగోదు. అందుకే నా ప్లేటులో ఉన్న చేపల్లో రెండు మూడు మాత్రం ఉంచుకుని మిగతావి బసుకి ఇచ్చేశాను. ఆ మిగిలిన చేపల తలలు జాగ్రత్తగా తీసేసి తిన్నాను. అన్నంలో రాళ్లు మాత్రం యధాప్రకారం ఉన్నాయి. కాబట్టి నేను మెల్లగానే తిన్నాను.

భోజనం అయ్యాక మళ్ళీ టీ ఇచ్చారు. మాతో వచ్చిన కామ్రేడ్ ఒక భూజియా (మురుకులు) ప్యాకెట్ తీసి గెరిల్లాలందరికి తలా కొంచెం పంచాడు. అదొక విందు భోజనం లాగే ఉంది ఈ అడవిలో. తన తోటి కామ్రేడ్లను సంతోషపెట్టడానికి పట్నం నుండి తెచ్చాడట ఈ భుజియా ప్యాకెట్‌ను. చివరికి ఆ ఖాళీ భుజియా ప్యాకెట్‌ను ఒక కామ్రేడ్ జాగ్రత్తగా శుభ్రపరచి దాస్తుంటే

'ఎందుకది' అని బసుని అడిగాను.

'దాన్ని దాచిపెట్టి ఏదో ఒక పనికి వినియోగిస్తారు' వివరించాడు బసు.

అయితే వారేదీ వృధా చేయరన్న మాట. అందుకేనేమో అడవిలో ఎక్కడా చెత్తా, చెదారం కనపడలేదు నాకు. అయినా చెత్తా చెదారం నాగరికతకు గుర్తు కదా. సంవృద్ధి, విలాసాలు...అటు తరువాత మిగిలేది చెత్త, మురుగు...

గోవా బీచులను, మంచుతో కప్పబడి ఉన్నరోహ్‌తాంగ్‌పాస్‌నూ మలినపరిచేది 'నాగరిక' మానవుడే కదా! టౌన్లు, నగరాలే కాదు అటు హిమాలయాలనూ, ఇటు అంటార్టికానూ కూడా వదల్లేదు కదా...

అడవుల్లో పాలిథీన్ చాలా అరుదుగా కనపడుతుంది. ఉదయం బహిర్భూమికి నీళ్ళు తీసుకుపోవడానికి లేదా వర్షంలో తమ పుస్తకాలు తడవకుండా ఉండడానికి మాత్రమే గెరిల్లాలు పాలిథీన్‌ను వాడతారు. అడవిలో పారే నదులే తమ తాగునీటి ఆధారం కావడం వల్ల గిరిజనులు వాటిని కలుషితం చేయరు. పర్యాటక పరిశ్రమ అనే అంటువ్యాధి ఇంకా వారికి సోకలేదు లేకుంటే అనేక రకాలైన అశుద్ధాలు అటు ప్రకృతిని ఇటూ సమాజాన్నీ కలుషితం చేసేవి. ఈ అడవులు రుషికేశ్, హరిద్వార్, బెనారస్ లేదా అలహాబాద్ వలె పుణ్యక్షేత్రాలు కానందుకు బహుశా భగవంతునికే కృతజ్ఞతలు చెప్పాలేమో నాకు తెలియదు. అదే కనుక జరిగుంటే ఇప్పుడున్న పవిత్రత స్థానంలో చెత్తకుప్పలు, కలుషిత నదులూ కనిపించేవి.

నాగరికులూ, సంస్కృతి ఉన్నవారూ ఇక్కడ కాలుమోపకపోవడం వల్లనే ఇక్కడ ఢిల్లీ, కోల్‌కతాలో ఉన్నటువంటి వ్యభిచారగృహాలు లేవు.

నా ప్రయాణంలో నన్ను బాగా కదిలించిన విషయం ఏమిటంటే ఈ గిరిజనులు నదులను ఏ విధంగా అవమానపరచరు. అలాగని వాటిని పూజించరు కూడా.

వారు తప్పుడు పనులు చేయరు, వాటిని కడిగేసుకోవడానికి పూజలూ పునస్కారాలూ చెయ్యరు.

వారు చాలా సాధారణమైన, సృజనాత్మకమైన, అమాయకమైన, నిర్మోహమాటపు మనుషులు.

నాగరికపు ప్రపంచపు సంక్లిష్టతలకు, సున్నితత్వాలకు, దొంగతనాలకు, మోసాలకు వారు బహుదూరంగా ఉన్నారు.

వారు వేసుకునే బట్టలు కూడా చాలా సాధారణమైనవి.

సత్నామ్

చిరుచీకట్లు కమ్ముకుంటుండగా మేము మా తరువాతి ప్రయాణానికి సిద్ధమయ్యాం. అక్కడి నుండి ముగ్గురు సాయుధ యువకులు మాతో జతకలిశారు. వారిలో ఒకరు ముందు నడవగా ఒకరు మధ్యలో మరొకరు చివరలో ఉన్నారు. ఒక వరుసక్రమంలో నడుస్తూ మేము ఆ గ్రామం అంచుగుండా అడవిలోకి ప్రవేశించాం.

ఆ రాత్రి, మరునాడు మొత్తం మా ప్రయాణం సాగింది. దారిలో వాగులూ, వంకలూ, కొండలూ గుట్టలూ దాటాం, నరసంచారమే లేని చిక్కటి అటవీ ప్రాంతంలోకి ప్రవేశించాం. అక్కడ ఒక యువకుడు కలిశాడు మాకు. మా బృందంలో ఒక కామ్రేడ్‌ను వెంటబెట్టుకుని చెట్లలోకి అదృశ్యమయ్యాడు. ఈ అడవిలో మనిషి కనపడడమూ, అతను అదృశ్యమవడమూ హఠాత్తుగానే జరుగుతాయి.

వెళ్లిన యువకుడు మరో ఇద్దరితో కలిసి వెనక్కి వచ్చాడు. అక్కడి దాకా మాతో వచ్చిన బృందం సెలవు తీసుకుని వెనకకు మళ్లింది. ఇక్కడి నుండి ఈ కొత్త బృందం మా బాధ్యత తీసుకుంది.

చీకటి పడుతుండగా అటు ఆకలి, ఇటు నిస్సత్తువ మమ్మల్ని ఆవహించాయి. ఎక్కడైనా కొంచెం ఆహారం దొరికితే బాగుండు...

బసు వైపు తిరిగి "ఇంకా ఎంత దూరం పోవాలి మనం" అడిగాను

'రెండున్నర గంటలు' తాపీగా బదులిచ్చాడు.

'ఓపిక లేదా' మళ్లీ తనే అడిగాడు.

'అహ. అదేం లేదు' అన్నాన్నేను. మనసులోని బద్ధకాన్ని పైకి కనపడనీయకుండా 'నడుద్దాం పదండి' అన్నాను.

గంటకు ఒక పది నిముషాలు విశ్రాంతి తీసుకుంటూ మా నడక సాగింది. నడక-విశ్రాంతి-నడక- విశ్రాంతి-మళ్లీ నడక...ఇలా మూడు రాత్రులు, మూడు పగళ్లు నడిచాం. గమ్యస్థానం వచ్చాకనే మజిలీ ఉంటుందని మాతో ఉన్న కమాండర్ గోండిలో చెప్పాడు. సమయం గడుస్తున్న కొద్దీ శరీరం బరువుగా అనిపిస్తుంటే మనసు మాత్రం దృఢంగా మారింది. గమ్యస్థానం

దగ్గరవుతుంటే ఇలాగే అనిపిస్తుంది. ఇక్కడ అలసిన దేహాన్ని విజయరేఖ దగ్గరలోనే ఉందని మనసు ఉత్సాహపరుస్తోంది.

చివరికి ఒక కొండ మొదట్లో ఉన్న మా గమ్యస్థానానికి చేరుకున్నాం. కమాండర్ ఆదేశాల మేరకు అందరం ఆగాం. మా గమ్యస్థానం ఇదేనని కమాండర్ మాకు చెప్పాడు. పక్కనే ఉన్న గుట్ట దిగువన క్యాంప్ ఉన్నదట. మాతో ఉన్న ఒక కామ్రేడ్ ముందుకు వెళ్లి ఒక పదిహేను నిముషాల తరువాత ఇంకో ఇద్దరు కామ్రేడ్లను వెంటబెట్టుకుని వచ్చాడు. కరచాలనాలూ, రెడ్ సెల్యూట్లు అయ్యాక గుట్టను ఎక్కి అవతల వైపుకు చేరుకున్నాం.

అక్కడ ఒకటి, రెండు, మూడు ...ఇలా అనేక టెంట్లు...ఒక గ్రామం అంతా ఉన్నట్టుంది.

క్యాంపుకు చేరుకున్నాం!

ప్రతి టెంటులోను ఒక కరెంటు బల్బు. ఆ కొండల నడుమ మినుకు మినుకుమంటున్న విద్యుద్దీపాల కాంతి అంతటా పరుచుకుంది. ఎన్నో చీకటి రాత్రులు గడిపిన నాకు ఇది వింతగా తోచింది. దారిలో మాకెక్కడా లైటు కనపడలేదు. ఇక్కడ మాత్రం ఈ వెలుతురులో అడవి మొత్తం జీవకళతో తొణికిసలాడుతోంది.

మొదటి టెంటు పక్కనుండి వెళుతూ అందులోకి తొంగి చూశాను. అది వంటశాల. కాని అప్పటికే ఆకలి చచ్చిపోయింది. పొయ్యి కూడా చల్లారినట్టుంది. రెండో టెంటు పక్కన ఉన్న అల్లిబిల్లి దారి గుండా నడుస్తుండగా మాకు స్వాగతం చెప్పడానికి సిద్ధమవుతున్న 30 మంది గెరిల్లాలు కనపడ్డారు. అందరూ యూనిఫారంలోనే ఉన్నారు. ప్రతి ఒక్కరి వద్దా అయుధం ఉంది. కరచాలనాలు, లాల్ సలాంలు షరా మామూలే...

లాల్ సలాం!

ఇది ప్రతి భారతీయ భాషలోనూ భాగం అయిపోయింది. ఈ పదం అర్థం కావడానికి గోండీ, హిందీ, బెంగాలీ, తెలుగు, మరాఠీ లేదా పంజాబీ రావాల్సిన అవసరం లేదు. అది అన్ని భాషల్లోకి పాకి పోయింది – ఇంక్విలాబ్ జిందాబాద్ లాగా.

మా అందరికీ ఒకరినొకరు అర్థం చేసుకునే భాష ఒకటి ఉన్నట్టుంది. మా కనుచూపు ద్వారా, సైగల ద్వారా, వెచ్చని కరస్పర్శ ద్వారా...

టీ తయారయ్యిందని సంకేతం - విజిల్ మోగింది.

ప్రతి ఒక్కరు ఒక ప్లేటు, గ్లాసు తీసుకుని సందడిగా ఉన్న కిచెన్ వైపు నడిచారు. మూడు పొయ్యిలు వెలుగుతున్నాయి అక్కడ - మూడు రాళ్లను ఒక దగ్గర చేర్చి చేసిన పొయ్యిలపై పెద్ద పెద్ద పాత్రలున్నాయి.

కిచెన్ బయట చర్చోపచర్చలు సాగుతున్నాయి. కడుపుకు ఆహారమే కాక మెదడుకు మేత కూడా ఇక్కడ లభ్యం!

భోజనం అయ్యాక అందరూ వారి వారి టెంట్లలోకి వెళ్లిపోయారు. నాకు ఏడో టెంట్ ఇచ్చారు.

'ఒకట్రెండు రోజుల్లో మీకో ప్లాస్టిక్ షీట్ ఇస్తాం. అప్పటిదాకా సర్దుకోండి.' ఎవరో అన్నారు. అతని వైపు తిరిగి చిరునవ్వు నవ్వాను

'ఇక్కడ అందరితో హిందీలో మాట్లాడవచ్చా?' అడిగాన్నేను

'కొద్దిగా అర్థం అవుతుంది. కొంతమందికే మాట్లాడడం వస్తుంది' అని టెంటులో ఉన్న మరో ఇద్దరిని చూపిస్తూ - వాళ్లు హిందీలో మాట్లాడగలరని చెప్పాడు.

క్యాంపులో ఉన్న అత్యధికులు గోండి తెగ వారే. కొద్ది మంది తెలుగు వారు కాగా మరి కొందరు బెంగాలీలు, ఉత్తర భారతానికి చెందినవారు. ఇక్కడెవరికీ పంజాబీ తెలియదు.

మన మాతృభాషలో మాట్లాడితేనే మనకు సంతృప్తిగా ఉంటుంది కదూ? పరభాషలో ఏదో తెలియని అడ్డుగోడలు ఉంటాయనిపిస్తుంది.

మా రాక ఇక్కడి క్యాంపు దినచర్యను కొంచెం డిస్టర్బ్ చేసినట్టుంది. మామూలుగానైతే రాత్రి పది గంటల వరకు లైట్లు స్విచ్ ఆఫ్ చేయాలి. సూర్యోదయం కన్నా ముందే మేలుకోవాలి.

మళ్లీ విజిల్ మోగడంతో అయిదు నిముషాల్లోపే అందరూ లైట్లు ఆఫ్ చేశారు. క్యాంప్ మొత్తం చీకట్లు అలుముకున్నాయి. బాగా అలిసిపోయి ఉండటం వల్ల ఎప్పుడు నిద్రాదేవి ఒడిలోకి జారిపోయామో కూడా గుర్తుకులేదు.

***

# గెరిల్లా క్యాంపులో

ఇంకా తెలవారక ముందే వచ్చిన విజిల్ నన్ను నిదురలేపింది. మరో అయిదు నిముషాలు కునుకు తీద్దామని అలాగే కళ్లు మూసుకున్నా, కానీ ఎవరో చెయ్యితట్టి లేపారు.

వచ్చింది యూనిఫాంలో ఉన్న ఒక గెరిల్లా, 'బయటికి పదండి, ఆరున్నర అవుతోంది. ఇప్పుడు హాజరు తీసుకునే టైమయ్యింది' అన్నాడు. చేతిని తన ఛాతీపై ఆనించి 'గార్డ్' అని సైగ చేశాడు.



నాకు తరువాత తెలిసింది 'గార్డ్' అంటే అర్థం ఏమిటో. నన్నెప్పుడూ నీడలా కాపాడుతూ, తన కనుచూపును దాటిపోనీయకుండా చూసుకునేవాడే గార్డ్ అంటే.

టైమెంత అని అడిగితే అతను బదులివ్వలేదు. నా మణికట్టును చూపించి మరోసారి అడిగాను. అతను వాచీలేదని సైగచేశాడు. "గోండీనా" ప్రశ్నించాను.

అవునన్నట్టు తల ఊపాడు.

అవును, కాదు అనేది చెప్పడానికి ప్రపంచవ్యాప్తంగా ఏ భాషా అక్కరలేదేమో!

హాజరు కార్యక్రమానికి దాదాపు 45 మంది హాజరయ్యారు, అందులో 15 మంది యువతులు. అందరి భుజాలకు ఆయుధాలు ఉన్నాయి. రూల్ ప్రకారం నేను కూడా ఆ హాజరు కార్యక్రమంలో పాల్గొనాల్సివచ్చింది. నా గార్డ్ నా వెనుకే నిలబడ్డాడు. హాజరు పిలవడం మొదలైంది. ఒకటి, రెండు, మూడు,

ఇలా ఇరవై వరకూ లెఖ్ఖ సాగింది. మళ్ళీ ఒకటి నుండి మొదలై ఇరవై వరకు పిలిచారు. నాకిది వింతగా తోచింది. హాజరు కార్యక్రమం ముగిసిన తరువాత వ్యాయమం కొరకు వెళ్తుంటే నాపక్కన నడుస్తున్న వ్యక్తిని అడిగాను ఎందుకు అలా ఇరవై వరకే లెఖ్ఖపెట్టారని. చాలామంది గోండు అబ్బాయిలకు, అమ్మాయిలకు ఇరవై మించి లెఖ్ఖపెట్టడం రాదట. అందుకే ఇలా ఇరవై వరకూ మాత్రమే లెఖ్ఖపెట్టి మళ్ళీ ఒకటి నుండి మొదలుపెడతారట. తరువాతి రోజుల్లో, ఈ పద్ధతిని అన్ని స్క్వాడ్లు అనుసరించడం గమనించాను. హాజరు తీసుకోవడం అయిపోయాక ఎన్ని ఇరవైలు ఉన్నాయో సరిచూసుకునే బాధ్యత క్యాంప్ కమాండర్‌దే.

లెఖ్ఖ సరిపోక, ఎవరైనా తప్పిపోయినట్టు తెలిస్తే వెంటనే వారిని వెతకడానికి ఒక బృందం బయలుదేరుతుంది. అడవిలో తప్పిపోయే అవకాశం చాలా ఎక్కువ. ఎక్కడ చూసినా కాలిబాటలే ఉంటాయి. పరిసరాలు కూడా చూడడానికి ఒకే విధంగా ఉంటాయి. ఎంతో అనుభవం ఉంటే కానీ కొన్ని కొండగుర్తులు గుర్తుపట్టలేం. అడవిలో పుట్టిపెరిగినవారికి అయితే ఇవన్నీ చిన్న వయసులోనే తెలుస్తాయి, కానీ వారు కూడా ఒకోసారి తికమకపడిపోతారు.

ఎదురుగా ఉన్న మైదానంలో దళసభ్యులు తమ ఆయుధాలను పక్కన చెట్లవద్ద వదిలి వ్యాయామం చేస్తున్నారు. అడ్డంపడ్డ ఒక చెట్టు కాండంపై పెట్టిన ట్రాన్సిస్టర్‌లో బిబిసి వార్తలు వస్తున్నాయి.

నడుంనొప్పి ఉన్న ఒక దళ సభ్యుడు, మలేరియాతో బాధపడుతున్న సభ్యుడు, గతవారమే జ్వరం బారినపడ్డ ఇంకొక సభ్యుడు ...ఇలా కొంతమందికి వ్యాయామం నుండి మినహాయింపు లభించింది.

జాగింగ్‌తోపాటు రకరకాల వ్యాయామాలు చేస్తున్నారు దళసభ్యులు. కొందరు బరువులు ఎత్తుతున్నారు. ఇంకొందరు వెదురు బొంగుల సాయంతో పోల్ వాల్ట్ చేస్తున్నారు.

దాదాపు ఎనిమిది అవుతుండగా కిచెన్ నుండి విజిల్ వచ్చింది. అంటే ఉదయం టిఫిన్, టీ టైము అయ్యిందన్నమాట. అందరూ తమతమ ప్లేట్లు, గ్లాసులు పట్టుకుని కిచెన్ వైపు నడిచారు.

ఉదయాన్నే కిచెన్ ముందు చాలా రష్ ఉంటుంది. అందరూ వరుసలో నిలుచోవాల్సిందే. కమాండర్లైనా, కొత్త దళసభ్యుడైనా అందరూ అదే లైనులో నిలబడాలి. వంట్లో బాగోలేనివారికి మాత్రం ముందుగా ఆహారం ఇస్తారు. అందరూ మిలిటరీ యునిఫారం ధరిస్తారు. కిచెన్ దగ్గర ప్రత్యేక హోదాలేమీ ఉండవు. అందరికీ అదే ప్లేటు, అదే ఆహారం.

వెదురుతో చేసిన టేబులు, కుర్చీలు కూడా ఉన్నాయి. అక్కడ కూర్చుని అయినా తినొచ్చు లేదా అక్కడే ఉన్న చెట్లకు జారగిలబడో లేదా ఒక రాయిమీదో కూర్చుని ఆ అల్పాహారాన్ని ఆస్వాదించొచ్చు.

కాసేపట్లో చిన్న చిన్న బృందాలుగా దళసభ్యులు చుట్టూ చేరారు. ఉదయం వార్తలపై చర్చలు జోరందుకున్నాయి. అఫ్ఘానిస్తాన్‌పై అమెరికా దాడి వార్త ఆ రోజు అక్కడ ప్రధాన చర్చనీయంశం అయ్యింది. నార్తర్న్ అలయెన్స్ కిరాయి సైనికులు కాబూల్ నగరంలోకి ఎప్పుడు ప్రవేశిస్తారు? అమెరికా తన పదాతిదళాన్ని యుద్ధంలోకి పంపుతుందా? తాలిబాన్లు గెరిల్లా యుద్ధం ఎప్పుడు మొదలుపెడతారు? ఇవే కాక, అమెరికా దాడిపై యూరోపులో వెల్లువెత్తిన నిరసనలు, పాకిస్తాన్లో రాజకీయ అనిశ్చితి కూడా అక్కడ చర్చలు నడుస్తున్నాయి. ఢిల్లీలో యుద్ధానికి వ్యతిరేకంగా ర్యాలీ చేసిన విద్యార్థుల అరెస్టుపై కూడా అక్కడ ప్రస్తావన వచ్చింది. యుద్ధవ్యతిరేక ఉద్యమం నడపాలనే ప్రతిపాదన కూడా వచ్చిందక్కడ. మొత్తానికి క్రియాశీలక రాజకీయ చర్చలకు ఈ వంటశాల ఒక చక్కని వేదిక.

'ఈ గిరిజనులు యుద్ధవ్యతిరేక ఉద్యమంలో ఎలా పాల్గొనగలరు?' కుతూహలంగా అడిగాను.

గత రెండు నెలల నుండి అక్కడ ప్రజలను సమీకరిస్తున్నామని, ముందు యుద్ధమనే ఆలోచనకు వ్యతిరేకంగా, ఇప్పుడు ఏకంగా యుద్ధానికే వ్యతిరేకంగా ఆ సమీకరణ సాగుతోందని వాళ్లు నాకు చెప్పారు. అడవిలో ఎన్నో ప్రదర్శనలు కూడా జరిపారట. బుష్, వాజ్‌పేయిల దిష్టిబొమ్మలు కూడా దగ్ధం చేశారట. దీనితో పాటు అనేక వందల యుద్ధవ్యతిరేక సమావేశాలు జరిపారట. ఈ

వార్తలేవీ బూర్జువా పత్రికల్లో నా కంటబడలేదు. బయట వార్తాపత్రికలన్నీ 'పౌర సమాజం' ఆధీనంలో ఉన్నాయి. 'నాగరిక ప్రపంచానికి' అడవుల్లో నివసించే ప్రజల రాజకీయాల గురించి ప్రచురించే ఆసక్తి లేదు.

ఈ పత్రికలు అమెరికన్ సామ్రాజ్యవాదులను కీర్తిస్తూ మన భారత ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలు తాటికాయంత అక్షరాలతో ప్రచురిస్తాయి. ప్రజలకు ఇష్టం లేకపోయినా, ఆగ్రహం తెప్పించినా అవి పట్టించుకోవు.

యుద్ధాన్ని వ్యతిరేకించేవాళ్ళను దేశద్రోహులంటే వీళ్లు నవ్వుతారు. అఫ్ఘానిస్తాన్ పై అమెరికా యుద్ధాన్ని నిరసించడం భారతదేశంలో దేశద్రోహం ఎలా అవుతుందో వారెవరికీ అర్థం కాదు.

'అసలు మనదేశంలో జాతీయభావం అంటే అర్థం మారిపోయింది. ఇవ్వాళ జాతీయభావం అంటే అమెరికన్ సామ్రాజ్యవాదానికి మద్ధతు పలకడమే' అన్నాడొక దళ సభ్యుడు.

'ఇదో కొత్త తరహా ప్రపంచీకరణ. ఇందులో భారత్ లాంటి దేశాల ప్రయోజనాలు, సామ్రాజ్యవాదుల స్వప్రయోజనాలు కలగలిసిపోయాయి' వివరించాడా కామ్రేడ్.

అటు పాకిస్తాన్ లోనూ అంతే. అమెరికాకు వ్యతిరేకంగా నిరసన తెలిపితే వారిని దేశద్రోహులని ముషారఫ్ అంటాడు. రెండు దేశాల్లోను జాతీయభావం అంటే అమెరికనిజం అయిపోయింది. అమెరికా వ్యతిరేకత అంటే జాతి వ్యతిరేకతతో సమానం ఇప్పుడు. మన పౌర సమాజంలో పైస్థాయి వ్యక్తులు కూడా ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. ఈ అడవి తాలూకు ముఖ్యమైన వార్తలేవీ వార్తాపత్రికల్లో కనపడడం లేదంటే కారణం అర్థంచేసుకోదగ్గదే.

ఆ గిరిజనులు మొదటిసారిగా జార్జ్ బుష్, వాజ్ పేయి, ముషారఫ్, అనే పేర్లను వింటున్నారని నాకు తరువాతి రోజుల్లో అర్థమయ్యింది. యుద్ధం పుణ్యమా అని ఈ 'ద్రోహ కూటమి' పేర్లన్నీ వీరికి తెలిశాయి.

అంతేకాక అసలు వీరికి దేశద్రోహం అంటే అర్థం కూడా తెలియదు. వీరికి తెలిసిందల్లా కాంట్రాక్టర్లు, పోలీసులు కలిసి అడవిని దోచుకుంటారని,

వారికి ప్రభుత్వం కూడా అండగా నిలబడుతుందని. ఇటువంటి ప్రభుత్వానికి మద్ధతుగా అమెరికా నిలబడుతుంది కాబట్టి అమెరికా కూడా తమకు శత్రువే అని వీరి భావన.

ఈ దేశపు పౌరసమాజం ఇంత చిన్న లాజిక్ అర్థం చేసుకోవడంలో విఫలమవుతున్నది. ఉన్న సమస్యలను సంక్లిష్టంగా విశ్లేషించడం, అటుపై ఈ సంక్లిష్టతలో ఇరుక్కుపోవడం వారికి అలవాటైన పని. దేశభక్తి, దేశద్రోహం, అర్థంకాని గొట్టుపదజాలంతో నిండిన పొడగాటి ఉపన్యాసాలు, సంక్లిష్ట యంత్రాంగాలు ఇవేవీ సాధారణ గిరిజన జీవితంలో భాగం కావు. గిరిజనుల ప్రశ్న చాలా సరళమైనది. 'ఈ అడవి మాదా కాదా?'

వారు ఈ ప్రశ్నకు జవాబు కూడా సరళంగానే ఉండాలని కోరుకుంటారు...అచ్చం వారి జీవితం లాగానే.

పట్టాణాల్లో ఇటువంటి యుద్ధవ్యతిరేక ఆందోళనలు ఏమి జరగట్లేవు. 'మీరు బయటి ప్రపంచానికి మీ రాజకీయ కార్యాచరణ గురించి తెలియజెప్పొచ్చు కదా?' ఒక దృఢకాయుడైన గెరిల్లాను అడిగాన్నేను.

'దానివల్ల ఒరిగేదేమిటి' నిర్మొహమాటంగా అడిగాడతను. అడవిలో ఏ పోలీసు వాహనాన్నో మందుపాతర పెట్టి పేల్చివేస్తేనో, లేక ఎన్‌కౌంటర్ అయి బుల్లెట్లు పేలితేనో మాత్రమే గెరిల్లాల గురించి బయటి ప్రపంచానికి తెలిసేది. అడవిలో తుపాకీ మోతలు కాకుండా ఇంకేం జరుగుతుందో ఎవరికీ తెలియదు.

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధవ్యతిరేక ప్రదర్శనల వార్తల గురించి వారేమనుకుంటున్నారో అడగాల్సిన పనిలేదు. దండకారణ్యంలో వ్యాపిస్తున్న ఈ రాజకీయచైతన్యం, నగరాలను చేరినప్పుడు తప్పకుండా అది నగర ప్రజల్లో ఒక చర్చను రేకెత్తిస్తుంది. అడవిలో అక్షరజ్ఞానంలేని, ఏ వనరులూ లేని గిరిజనుల కన్నా అన్ని సమాచార సాధనాలూ, అంతులేని విజ్ఞాన సంపత్తి ఉన్న తామెందుకు ఇంత వెనుకబడి ఉన్నాం అని అపుడు నగరవాసులు తమని తాము ప్రశ్నించుకుంటారు.

సత్నామ్

ఇంతలో ఒక కురచగా ఉన్న కామ్రేడ్ మాట్లాడడం మొదలుపెట్టాడు.

'దండకారణ్యంలో జరిగే ఈ నిరసన ప్రదర్శనలు నగరజీవితాన్ని పెద్దగా ప్రభావితం చేయకపోవచ్చు. కానీ ఈ ప్రదర్శనలు, చర్చలు చాలా విలువైనవి. అఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడిని మన దేశ నాయకులు ఎంతో కీర్తించారు. వారు ఈ దాడిని కాశ్మీర్ ఆందోళనలని అణచివేయడంతో ముడిపెడుతున్నారు. పౌరసమాజం యొక్క ప్రచార వ్యవస్థ మొత్తం అటు అఫ్ఘనిస్తాన్ దాడినీ, ఇటు కాశ్మీర్ ఆందోళనల అణచివేతను ఒకే త్రాసులో వేసి చూపడానికి ప్రయత్నిస్తున్నది. తాలిబాన్, అల్‌ఖైదాపై దాడి పేరుతో ముస్లిములపై అమెరికా చేస్తున్న అకృత్యాలను దాచి ఉంచే ప్రచారాన్ని హిందూ మతోన్మాదులు కొనసాగిస్తున్నారు.

బస్తర్‌లో మారుమోగుతున్న ఈ యుద్ధవ్యతిరేక నినాదాలు నగరాన్ని చేరకపోతుండవచ్చు, కానీ మన కార్యక్రమాలని మాత్రం దేశవ్యాప్తంగా ప్రచారం చేయాలి"

ఈ బక్కపలచటి కురచ మనిషి గెరిల్లాలాగా అనిపించట్లేదు. అసలు ఆ భుజానికి వేలాడుతున్న తుపాకీని ఎప్పుడైన ఉపయోగిస్తాడో లేదో కూడా అనుమానమే. కానీ ఇతడిలో ఏదో ప్రత్యేకత ఉంది.

టిఫిన్ తినడం అయ్యాక అందరూ తమ ప్లేట్లు, గ్లాసులు కడుక్కుని వాటివాటి స్థానాల్లో పెట్టుకుంటారు. ఈ రెండు తప్పిస్తే వారివద్ద మరే పాత్రలూ ఉండవు. కొందరైతే గ్లాసు వాడటం కూడా మానేసి తమ ప్లేట్లలోనే టీ తాగుతారు. తమ కిట్ బ్యాగును వీలైనంత తేలికగా ఉంచుకునేందుకే వారి ప్రయత్నం.

***

అందరూ ఏదో ఒక పనిలో నిమగ్నమయ్యారు. ఖాళీగా ఉన్నవారినెవరినైనా పట్టుకుని వారితో మాట్లాడటమే నా పని. ఒక విధంగా ఇది కొంచెం కష్టమైన పనే. ఎందుకంటే ఎవరో ఒకరు ఖాళీగా దొరికేంత వరకూ వేచిచూడడం దుర్భరంగా ఉండేది. ఆ బాధపడటం ఎందుకని క్యాంప్ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లును పరిశీలించే నిమిత్తం బయలుదేరాను. క్యాంప్ రక్షణ బాధ్యతల్లో

ఉన్న యువతీయువకులు అంత అప్రమత్తంగా ఉన్నట్టు కనపడలేదు నాకు. ఒక్క విజిల్ వేస్తే అందరూ పొజీషన్ తీసుకుంటారేమో, అయినా....

అటూ ఇటూ నడిస్తే మడతపడిన నాపాదం నొప్పి కూడా కొంచెం నెమ్మదిస్తుంది. వెంట ఒక గార్డ్ కూడా ఉన్నాడు కాబట్టి ఉత్తినే తిరగడం కాకుండా ఏదో ఒక పని చేసినట్టు కూడా ఉంటుందని అనిపించింది. మధ్యాహ్నం భోజనం చేశాక పర్యటనకు అనుమతి ఇచ్చారు.

భోజనం చేయడానికి ముందే బెంగాల్ నుండి వచ్చిన ఒక కామ్రేడ్ కలిశాడు. బెంగాలీల్లో చాలామందికి హిందీ వచ్చు కాబట్టి అతనితో మాట్లాడడానికి పెద్దగా ఇబ్బంది ఉండదని అతని దగ్గరికి నడిచాను.

'ఉద్యమ పురిటిగడ్డ నుండి వచ్చారు కదా, మీకు ఎక్కువ అనుభవం ఉంటుండొచ్చు. ఈ అడవిలో నుండి మీరీ యుద్ధాన్ని గెలవగలరను కుంటున్నారా?' ప్రశ్నించాను.

'భారతదేశం చాలా విశాలమైనది' ఒక క్షణం ఆగాడతను. నా కళ్లు రాసుకుంటున్న ఫైలు నుండి అతనివేపు మరలించాను. వెదురు టేబుల్‌పైన ఉన్న తన తుపాకీపై ఒక చేయి ఆనించి నావేపు చూడకుండా మాట్లాడుతున్నాడు.

'పట్టణాల్లో జనాభా కోట్లల్లోకి చేరింది. సమాచార వ్యవస్థ చాలా సంక్లిష్టంగా మారింది. రాజ్యం అత్యంత శక్తివంతమైన సైనిక శక్తిని కలిగి ఉంది. శ్రామిక వర్గ ప్రజల్లో, పట్టణాల్లోని పెటీ బూర్జువా వర్గాల్లోకి విప్లవ రాజకీయాలు తీసుకుపోవడంలో మేం కొంచెం వెనకబడ్డాం. ఇప్పటి సంక్షుభిత వాతావరణాన్ని తమకు అనువుగా మార్చుకోలేనంతగా బలహీనంగా ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు శక్తులు ఉన్నాయి. అయితే చాలా ఏళ్ల విరామం తరువాత అభివృద్ధి చెందిన దేశాల్లోని ప్రజలు ఇపుడు ఉద్యమాల్లోకి వస్తున్నారు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. దేశం అంతర్గత సంక్షోభంలో కూరుకుపోయిన ఈ సమయంలో మనం రాజకీయంగా జోక్యం చేసుకోవడంలో విఫలం అయితే, దండకారణ్యం ఒకటే విప్లవం ఎలా తీసుకురాగదు? మనం ఈ సంక్షోభ

పరిస్థితుల్లో పెద్ద సంఖ్యలో సామాన్య ప్రజలను ఆర్గనైజ్ చేయాలి. అడవిని దాటి మైదాన ప్రాంతాల్లోకి ఉద్యమం విస్తరించడం చాలా అవసరం. పట్టణ ప్రాంతాల్లో మన విప్లవోద్యమ కార్యకలాపాలు విస్తరించాలి' వివరించాడా కామ్రేడ్.

'మరి ప్రజాయుద్ధం సంగతేమిటి?'

'నేను పట్టణాల్లోకి విస్తరించాల్సిన ఆవశ్యకత గురించి మాట్లాడుతున్నాను. ప్రజాయుద్ధాన్ని విస్మరించట్లేదు. మనం అడవులకే పరిమితం అవలేం. నగరాలను మన ప్రభావం నుండి దూరంగా ఉంచలేం. ఈ రెండిటి మధ్య దూరం చాలా అసహజంగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులను మాకు అనుకూలంగా మార్చుకుని తద్వారా విప్లవోద్యమం విజయం సాధించే దిశగా మా ప్రయత్నం ఉంటుంది.'

ఈ బెంగాలీ కామ్రేడ్‌కి చాలా విషయ పరిజ్ఞానం ఉంది. విప్లవ రాజకీయాలను వ్యాప్తి చేయడం గురించి అతనికి ఎంతో ఆరాటం ఉంది.

'ఈ క్యాంప్ ఉద్దేశ్యం ఏమిటి'? నా మూడో ప్రశ్న సంధించాను.

'వేర్వేరు ప్రాంతాల్లో ఉండే గెరిల్లాలు తమ అనుభవాలు పంచుకోవడానికి, ఒకరి నుండి మరొకరు నేర్చుకోవడానికి మేం తరచూ ఇటువంటి క్యాంపులు నిర్వహిస్తుంటాం. చిన్న చిన్న లక్ష్యాలను ఆంబుష్ చేసి ఛేజిక్కించుకోవడంపై వీరికి శిక్షణ, ప్రాక్టీస్ ఇస్తున్నాం ఇక్కడ'.

నిన్న దళ సభ్యులు సాధన చేస్తుండగా చూశాను కదులుతున్న లక్ష్యాలను ఛేధించడం, శత్రువును ఒక వేపుకు ట్రాప్ చేసి మరోవైపు నుండి దాడి చేయడం, ఒక వైపు దాడి చేస్తూనే మరోవైపు ఆత్మరక్షణ కూడా చేసుకోవడం వంటివి.

ఈ మిలటరీ విషయాలు నాకు పెద్దగా తెలియదు. కాబట్టి నేను అక్కడ చూసినవి, విన్నవి వివరిస్తే సరిపోతుంది. అయినా ఒక క్యాంపు ఎలా నడుస్తుందో చూడడానికి వెళ్లలేదు నేను. ఆ సమయంలో నేనక్కడ ఉండటం యాధృచ్చికం.

***

ఈనాటికీ నాగరికత వాసన సోకని తెగలు ఎన్నో ఉన్నాయట మన దేశంలో అక్కడి ప్రజలు హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు కారు. కాబట్టి వారికి ఒక దేవుడు లేడు. వారెన్నడూ రాముడు, మహ్మద్, క్రీస్తు గురించి వినలేదు. వారు అవుమాంసం తింటారు. అడవి పందులను వేటాడతారు. చివరికి పురుగులను కూడా వదలరు! కొందరైతే వంటిపై దుస్తులు కూడా ధరించరు. వారి జీవితంలో పాపం, పుణ్యం, జాలి, క్రూరత్వం వంటి వాటికి చోటు లేదు. ఇక మానసిక సమస్యలైతే వారి దరికూడా చేరవు. నేను దండకారణ్యం వెళ్లింది ఈ జీవితం చూడడానికే. నేను చూసింది కూడా ఇదే. ముందు ముందు అడవిలో వారి జీవనంపై మరింత తెలుసుకుందాం.

క్యాంపును చుట్టిరావడానికి నాతోపాటు ఒక అబ్బాయినీ, ఇద్దరు అమ్మాయిలను పంపించారు. ముగ్గురూ గోండు తెగకు చెందినవారే. ఆ అబ్బాయికి కొంచెం హిందీ వచ్చు. నాకు సహాయంగా ఉంటాడని అతన్ని పంపించారు. ఇక ఆ ఇద్దరు అమ్మాయిలకు హిందీ ఒక్క ముక్క కూడా రాదు. వారిని ప్రధానంగా నా రక్షణ కొరకు పంపించారు.

నిన్న మేం క్యాంపులోకి వచ్చిన దారిగుండానే బయటికి నడిచాం. మేం ఎక్కుతున్న గుట్టచుట్టూ దట్టమైన వెదురుపొదలు ఉన్నాయి. ఆగుట్టపైభాగాన ఒక ఎత్తైన టవర్‌పై సెంట్రీ పోస్టు ఉంది. దాంట్లో ఒక యువతి సెంట్రీ డ్యూటీలో ఉంది. సెంట్రీ టవర్ కింద ఇద్దరు యువకులున్నారు. అందులో ఒకతను వెదురుగడలతో కుర్చీ తయారు చేస్తున్నాడు. తయారైన ఒక టేబుల్ ప్రక్కనే వేసి ఉంది. మమ్మల్ని చూసి ఇద్దరూ లేచి షేక్‌హాండిచ్చారు. టవర్‌పైనున్న యువతి కూడా అక్కడి నుండే పిడికిలి ఎత్తి అభివాదం చేసి మళ్లీ తన డ్యూటీలో మునిగిపోయింది.

ఇక్కడ ఈ టేబుల్, కుర్చీలతో ఏం పని అని అడిగాన్నేను. అవి చదువుకోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి వాడతారని నాతోపాటు దుబాసీగా వచ్చిన యువకుడు చెప్పాడు. ఒకరు టవర్ మీద సెంట్రీడ్యూటీ చేస్తే, మరొకరు టవర్ కింద ఉంటారు. ఇంకో ఇద్దరు చదువుకుంటూనో, విశ్రాంతి

తీసుకుంటూనో ఉంటారు. సెంట్రీపోస్టు వద్ద కూడా వారి కిట్‌బ్యాగులు, పుస్తకాలు వారి వెంటే ఉంటాయి.

ఆ టేబుల్, కుర్చీలు, తయారు చేస్తున్న యువకుడికి కొడవలి, వంకకత్తి వంటి పనిముట్లను వాడటంలో ఎంతో నైపుణ్యం ఉన్నట్టుంది. కత్తితో వెదురును ముక్కలుగా నరికి, అక్కడే దొరికే ఒక చెట్టు నారతో వాటిని బిగించి కడుతున్నాడు. అతనికి వెదురుతో తలుపులు, కిటికీలు, ఇతర రకాల ఫర్నీచర్ చేయడం కూడా వచ్చుట. ఇపుడు గెరిల్లాస్క్వాడ్‌లో సభ్యునిగా తన నైపుణ్యాన్ని విప్లవోద్యమం కొరకు ఉపయోగిస్తున్నాడు. ఎంతో అందమైన రైఫిల్ మడమలను తయారు చెయ్యగలడట ఇతను.

రెండో సెక్యూరిటీ పోస్ట్ దగ్గరికి వెళ్లడానికి కొన్ని గుట్టలు, సెలయేర్లూ దాటాల్సి వచ్చింది. మా నడక మొత్తం మిలటరీ ఫార్మేషన్‌లోనే సాగింది. గెరిల్లా జీవితం చాలా క్రమశిక్షణతో కూడుకున్నది. అడవిలో స్వేచ్ఛా జీవితం గడిపిన గిరిజనులకు ఈ మిలటరీ క్రమశిక్షణ అలవాటు కావడం కొంచెం కష్టమే. అందుకే దళంలో చేరినాక కూడా కాస్త విరామం దొరికితే ఈ గిరిజన యువతీయువకుల సంతోషానికి హద్దులుండవు, వంట చెరకు ఏరుకురావడం, అడవిలో పండ్లు ఏరడం, వెదురుగడలు నరకడం వంటి పనులను వీరెంతో ఆనందంగా చేస్తారు.

దారిలో ఒక కొండవాగును దాటుతుంటే నీటిలో ఉన్న ఒక ఎర్రటి ముద్ద వంటిది నన్నాకర్షించింది. అది ఏమిటని అడిగాను.

'అయస్కాంతం' బదులిచ్చాడు నా దుబాసీ.

బహుశా అది చెకుముకి రాయి కావచ్చు. కాని పట్టుకుంటే నాచులా మెత్తగా జారిపోతుంది. కదిలించడానికి ప్రయత్నిస్తే అందులోంచి కొంచెం భాగం నీటితో పాటు కొట్టుకుపోయింది. మిగతాది మళ్లీ ముద్దలా మారిపోయింది. అది అయస్కాంతమా లేక ఇనుప ఖనిజమో నాకు తెలియదు. కానీ బస్తర్ నలుచెరగులా ఈ ఇనుప ఖనిజం విస్తరించి ఉంది. బైలడిల్లాలోని ఇనుప ఖనిజం గనులు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందినవి. ఈ బస్తర్

ఇనుముపైనే జపాన్‌లోని ఫ్యాక్టరీలు, ప్రసిద్ధిగాంచిన వాహనాల పరిశ్రమలు ఆధారపడ్డాయి. ఈ ఇనుపఖనిజం గనులే ఇక్కడి గిరిజనుల జీవితాలతో ఆడుకున్నాయనే నిజం మనసును జలదరింపజేస్తుంది. ప్రతిరోజు బైలడిల్లా గనుల నుండి వెలికితీసిన ఇనుప ఖనిజం రెండు గూడ్స్ రైళ్ల నిండా విశాఖపట్నం ఓడరేవు ద్వారా జపాన్‌కు వెళుతుంది. ఈ అంతులేని సంపదకు హక్కుదార్లు అయిన గిరిజనులకు మాత్రం బాణాలు, కొడవళ్ళు, గొడ్డళ్లు తయారు చేసుకోవడానికి మినహా ఇనుము ఎన్ని అద్భుతాలు సృష్టించగలదో తెలియదు.

ఆధునిక నాగరికతకు ఈ ఇనుమే మూలమని వారికి అసలే తెలియదు. స్థానిక గిరిజనులకు బైలడిల్లా గనులలో ఉద్యోగాలు కూడా లేవు. వారు యంత్రాలతో పని చేయడంరాని అమాయకులని అందరి అభిప్రాయం. ఈ అమాయక గిరిజనుల్లో మగవారిని బరువులు మోసే బండపనికి, ఆడవారిని యంత్రాలను నడపగలిగే నాగరికుల కోర్కెలను తీర్చడానికి మాత్రమే వాడతారు.

రెండో సెక్యూరిటీ పోస్ట్ దగ్గరికి వెళ్లడానికి చాలా దూరమే నడచాం మేం. పోస్ట్ దగ్గరికి వచ్చాక నాతో ఉన్న గార్డ్ ఒక సంకేతపదం అరిచాడు. అటునుండి మరో సంకేతపదం వినవచ్చింది. ఒకవేళ సరైన సంకేత పదం వినపడకపోతే వెంటనే తుపాకీ మోతలే జవాబులవుతాయి.

అక్కడ అయిదుగురు గెరిల్లాలు ఉన్న ఈ సెక్యూరిటీ పోస్ట్ వద్ద కాసేపు గడిపి మేం క్యాంపుకు తిరిగి వచ్చాం.

అడవిలో చాలా త్వరగా చీకటవుతుంది. సాయంత్రం అయిదున్నరకే ఏడు అయినట్లుగా ఉంది.

కొంచెం చలి ఎక్కువగానే ఉండటం వల్ల మా టెంటు బయట ఒక పెద్ద మొద్దుతో చలిమంట వేశాం. ఈ మొద్దు కొంచెం పొడుగ్గానే ఉంది కాబట్టి రాత్రంతా మండుతూనే ఉంటుంది. నిన్నటి చలిమంట రెండుగంటలకే ఆరిపోవడంతో మధ్యరాత్రి నుండి చలికి వణికిపోయాం. అందుకే ఇవ్వాళ కొంచెం పొడవాటి మొద్దును తెచ్చారెవరో.

***

మూడు పూటలా వరి అన్నమే! ఒక్క గెరిల్లాలే కాదు, బస్తర్‌లో నివసించే ప్రతి ఒక్కరి ఆహారం అదే. దాంట్లోకి గుమ్మడికాయ కూర లేదా లేత వెదురుగడల కూర. ఇక్కడ పప్పు చాలా అరుదుగా దొరికే ఆహారం. ఎప్పుడో ఒక్కసారి పప్పు దొరికిందంటే ఆ రోజు పండగే.

అడవిలో సాగునీటి సౌకర్యాలు లేవు కాబట్టి కూరగాయల పెంపకం లేదు. గుమ్మడి కాయ గింజలు వెదజల్లి ఇక వాటి గురించి మర్చిపోతారు ఈ గిరిజనులు. ఒకటో రెండో గుమ్మడికాయలు కాస్తే సంతోషిస్తారు. పురుగుపట్టి పోయినవి ప్రకృతికి ఆహారం అని సరిపెట్టుకుంటారు.

అప్పుడప్పుడు ఉదయం అల్పాహారం లాగా చిక్కటి జావను చేసుకుంటారు. దంపుడు బియ్యంతో మరమరాలు కూడా అల్పాహారంగా స్వీకరిస్తారు.

దగ్గరలో ఉన్న టౌను నుండి ఎవరో గోధుమపిండి తెస్తే నేనే వారికి రొట్టెలు చేయడం నేర్పించాను. బోర్లించిన ప్లేటుపై కాస్త పిండి ముద్ద వేసి గ్లాసును రొట్టెల కర్రలా వాడి ఒక రేకును పెనంలా వాడి మొత్తానికి వారికి రొట్టెలు రుచి చూపించగలిగాను.

మరునాడు ఎండబెట్టిన ఆవుమాంసం కూర వండారు. ఈ గిరిజనులు హిందువులు కారు. కాబట్టి గోహత్య మహాపాతకం అని అనుకోరు. వారు ముస్లింలూ కారు. కాబట్టి హలాల్ చేయాలనే నియమం కూడా లేదు. వారు మానవులను తప్ప అన్నిటినీ తింటారు. మనుషులను మింగే పని నాగరిక సమాజంలో అనేక రూపాల్లో, అనేక పద్ధతుల్లో జరుగుతూ ఉంటుంది. ఈ గిరిజనులు మనుషులను దేవుళ్లలాగా కొలవరు. అలా అని అవమానపరచరు. కోపం వస్తే క్షణకాలంలో మెడకాయ నుండి తలకాయను వేరు చేసేస్తారు. మనిషి ప్రాణాలు తీయడం వారికి చాలా చిన్న పని. కానీ వారు ఆపనిని చాలా అరుదుగా చేస్తారు. అరవై లక్షల జనాభా ఉన్న దండకారణ్యంలో ఏటా ఏ రెండోమూడో హత్యానేరాలు జరుగుతాయి. అదే మనం నాగరిక సమాజం అనుకునే ఢిల్లీలో వార్తాపత్రికల నిండా హత్యలు, దోపిడీలు, కత్తిపోట్లు, దొంగతనాల వార్తలే.

ఒకవేళ గిరిజనుడు హత్య చేస్తే ఆ విషయం ఒప్పుకుని దానికి శిక్ష అనుభవించడానికి సిద్ధంగా ఉంటాడు. అదే నాగరిక సమాజంలో అయితే హంతకుడు ఎప్పటికీ అరెస్ట్ చేయబడడు. అతను అటు పార్లమెంటుకో, ఇటు శాసనసభకు ఎన్నికై ఇతరులకు న్యాయం చేసే శాసనకర్త రూపమెత్తుతాడు.

అడవిలో రకరకాల కూరగాయల సాగు గురించి ఆ రోజు సాయంత్రం ఓ ఆసక్తికర చర్చ సాగింది. గిరిజన రైతులకు టమోటా, చిక్కుడు, బటానీ, బెండకాయ, వంకాయ, మిరపవంటి పంటల విత్తనాలు సరఫరా చేస్తే ఎలా ఉంటుందని చర్చించాం. ఇటువంటి ప్రయోగాలు దండకారణ్యంలో అక్కడక్కడా మొదలైనయి, కానీ ఇంకా చేయాల్సింది చాలా ఉంది. సాగునీరు దొరకకపోవడం ఒక ప్రధాన సమస్య కాగా నేలంతా పెద్ద, చిన్నా రాళ్లతో కూడి ఉండటం మరో సమస్య. ఈ రెండు సమస్యలను అధిగమించాలంటే ఎంతో శారీరక శ్రమ, ఉమ్మడి కార్యాచరణ అవసరం. అందుకొరకు ఒక పెద్ద అవగాహనా కార్యక్రమమే చేపట్టాలి.



వంటశాల నుండి తిరిగి వస్తుంటే ఐతు నన్ను అనుసరించాడు. ఐతు అనేది పంజాబీ పేరు బహుశా ఆదివారం పుట్టి ఉంటాడు అందుకే అతని తల్లితండ్రులు ఆ పేరు పెట్టారేమో అనుకున్నాను. కానీ నిజానికి అది అమరుడైన అతని మిత్రుని పేరు అట. చనిపోయిన తన మిత్రుని స్వప్నాలను సాకారం చేయడానికే అతని పేరును పెట్టుకున్నాడట.

ఐతు బాగా చదువుకున్న వ్యక్తి. సైన్సులో ఉన్నత విద్యనభ్యసించాడు కానీ మన సైంటిస్టుల్లా హృదయం లేనివాడు కాదు. తెలిసిన దారుల్లోనే నడుస్తూ సమాజంతో సంబంధం లేనట్టుండే శాస్త్రవేత్త కాదతను. అతను మాట్లాడితే ఆ మాటలు హృదయాంతరాల్లోనుండి వస్తాయి. తన భావాలను దాచుకోవడం తెలియదతనికి. మొదటిసారి కలిసినప్పుడే ఎంతోకాలంగా పరిచయం ఉన్న వ్యక్తిలా మాట్లాడుతాడు.

'మనిషి ముఖం అతని లోపలి భావాలకు నిలువుటద్దం' అనే పాత నానుడి ఇప్పుడు పనికిరాదు. మనుషుల రూపాలు కృత్రిమం అయ్యాయి. మోసపూరితమైన

తొడుగులను ఎన్నిటినో తయారు చేసుకుందీ ప్రపంచం. ఎప్పుడు ఏ తొడుగు అవసరమో దాన్ని ముఖానికి తగిలించుకోవడం నేర్చుకున్నారు మనుషులు. కానీ ఏటు మాత్రం ఇంకా పాతకాలపు నానుడికి ప్రతిరూపమే.

'ఐతుభాయ్ నువ్వు ఎన్నటికీ ఇంకో మనిషిని చంపలేవు' అన్నాన్నేను టెంటు వేపు నడుస్తూ.

కళ్ళాద్దాలను సవరించుకుంటూ, చిరునవ్వుతో 'నన్ను తక్కువ అంచనా వేయకండి. సమయం వచ్చినప్పుడు గురిచూసి కాల్చగలను. ఏదో ఒకరోజు చాలా మంది శత్రువులను మట్టుబెట్టడం మీరే చూస్తారు' అన్నాడు. అతనెంత ప్రేమించగలడో అంత ద్వేషించగలడు కూడా. కోపం వచ్చినప్పుడు అతని కింది పెదవి చిత్రంగా అదురుతుంది.

అతను సంతోషంగా మాట్లాడుతున్నప్పుడు చూస్తే నిజంగా సమయం వచ్చినప్పుడు ఎంత గురి చూసి కాల్చగలడో చెప్పడం కష్టమే.

అతని నడుము చుట్టూ ఉన్న బుల్లెట్ల బెల్టు, తుపాకీలో లోడ్ చేసిన మ్యాగజీన్. తలపై మావో టోపీ. వీటన్నిటినీ తీసివేస్తే మాత్రం అతనో పురాతత్వ శాస్త్రవేత్త లాగా కనపడతాడు. ఈ అడవిలో రాళ్ల క్రింద సమాధి అయిన ఏ పురాతన నాగరికతనో వెతుకుతున్నవాడిలా అనిపిస్తాడు.

సైన్సులో ఉన్నత విద్యనభ్యసించాక ఉద్యోగానికి పరిమితమైతే తను నేర్చుకున్న విజ్ఞానం అవసరం ఉన్న ప్రజలకు చేరదని నిశ్చయించుకున్నాడతను. నేరుగా ప్రజలవద్దకే వెళ్లాలని నిశ్చయించుకున్న అతను చివరికి దండకారణ్యంలోకి చేరాడు.

అతడిని ఎపుడు చూసినా ఏదో ఒక ప్రణాళికలు వేస్తున్నట్టే కనపడేవాడు. ఒక కోడి నుండి పౌల్ట్రీఫారం తయారుచేయడం ఎలా వంటివన్నమాట. అయితే అవి పగటి కలలు కావు. స్వప్నాలను సాకారం చేసుకోవడానికి నిరంతరం కృషి చేసే వ్యక్తి ఏటు. అడవిలో ఉత్పత్తి అయినవన్నీ అడవిలోనే వినియోగించాలనే స్వప్నం ఉంది అతనికి. నిజానికి అది చాలా గొప్ప స్వప్నం. మావో కాలంనాటి చైనాలో జరిగినట్టే స్థానిక వనరులతో స్వయంసమృద్ధి

సాధించే స్వప్నం అది. తన టెంటువద్దకు వెళ్లకుండా నాతోపాటు నా టెంటు వేపు వచ్చాడు ఐతు.

నా టెంటులో మండుతున్న చలిమంటను చూసి నవ్వాడు 'అడవికి కొత్తగా వచ్చిన వాళ్లంతా ఇలాగే రహస్యంగా చలిమంట వెలిగిస్తారు. పొగ వస్తే శత్రువుకు మన జాడ తెలుస్తుందని మేం కూడా చలిమంటలు వేయం. అయితే ఇప్పుడు మనం ఉన్న ప్రదేశానికి నలుచెరగులా ఉన్న గ్రామాల్లోని ప్రజలంతా మనవాళ్లే కాబట్టి ఆ భయం లేదు. ప్రతి గ్రామంలోనూ ప్రజాసైన్యం ఉంది. అడవి అంతటా మన గెరిల్లా స్క్వాడ్లు ఉన్నాయి. జాగ్రత్తగా ఉండటం అవసరమే కానీ దానర్థం టెంటు లోపల చలిమంట వేసుకొమ్మని కాదు. మన వాళ్లు ఆరుబయటే వంటలు చేయడం నువ్వు గమనించలేదా? భయంలేదు. బయటే చలిమంట వేసుకొమ్మ'ని చెప్పాడతను. నేను చలిమంటను బయటికి మార్చాను. దానికి పుల్లలు జతచేశాడు ఐతు.

బస్తర్ అడవుల్లో అనేక చోట్ల ఈ మంటలు వెలిగిస్తారు. వండుకునే పొయ్యిలు కూడా ఆరుబయటే ఉంటాయి. ఇక్కడి గిరిజనులు కూడా గుడిసెల్లో నిద్రిస్తారు. ఇంటిముందు ఒక మంట వెలిగించి దాని చుట్టూ గోనెపట్టాల వంటివి పరచుకుని చలికాలంలో కూడా వాటిపైనే నిద్రిస్తారు. పంటలకు కాపలా కాసేటప్పుడూ ఇలాగే ఒక మంట వేసుకుని దాని ప్రక్కనే కూర్చుంటారు. అడవి జీవితంలో అగ్ని ఒక విడదీయలేని బాగం. మనుషులు ఉన్నా లేకున్నా ఒక లావాటి మొద్దు ఎప్పుడూ కాలుతూనే ఉంటుంది. ఈ మంటలను చూసి శత్రువు గెరిల్లాల జాడ కనిపెట్టడం అసాధ్యం. ఎందుకంటే ఈ అడవిలో ఎక్కడ చూసినా కనిపిస్తాయవి.

బస్తర్ అడవుల్లో మనకు కనిపించేవి రకరకాల మంటలు. ఆకలి మంటలు, అడవిలో కార్చిచ్చులు, విప్లవాగ్నులు!

కడుపులోని ఆకలి మంటలు మనుషులను నిలువెల్లా దహించేవేసే చితిమంటల వంటివి. ఇక టేకు, వెదురు వంటి అటవీ ఉత్పత్తులే ఇవాళ కాంట్రాక్టర్ల, వ్యాపారస్తుల ఇళ్లను వెచ్చగా ఉంచే మంటలు. కానీ అవి బస్తర్ అడవిని దహించివేసే కార్చిచ్చువంటివి.

ఈ పుస్తకం పేజీలు తిప్పుతుంటే మీ చేతికి తగిలే వెచ్చదనం మాత్రం ఇంకో రకపు అగ్నిది. ఈ మూడు రకాల మంటలు రకరకాల రూపాలు ఆకారాలు సంతరించుకుంటాయి. ఒకచోట అ అగ్ని వేదనను, బాధను, కళ్లముందర శూన్యాన్ని ప్రతిబింబిస్తే, మరోచోట ఆ అగ్ని ఒక భయంకర సర్పపు కోరల వలే గోచరిస్తుంది. మరోచోట ఈ అగ్నే దారిని చూపే టార్చిలైట్ అవుతుంది.

మండుతున్న దుంగపై మొలిచిన ఒక పుట్టగొడుగును తీసి నా చేతికిచ్చాడు ఐతు. అదెక్కడ చెదిరిపోతుందోనని నేను దాన్ని మృదువుగా నిమిరాను, కానీ అది చాలా గట్టిగా, కింది మొద్దు అంత గట్టిగా ఉంది. ఇలాంటి పుట్టగొడుగును నేను ఎన్నడూ చూసి ఉండలేదు.

'అమెరికాకు, యూరప్‌కు ఎగుమతి అవుతుందిది' చెప్పాడు ఐతు.

'బహుశా మందులు తయారు చేస్తారేమో దీన్నుండి' అన్నాన్నేను.

'లేదు. ఇళ్లల్లో, ఆఫీసుల్లో అలంకరణ వస్తువుగా వాడుతారు దీన్ని. పుచ్చిపోతున్న వెదురు, ఇతర కలప దుంగలపై పెరుగుతుంది ఇది. ఎన్నేళ్లయినా ఇది మాత్రం పాడవదు. ఒకటి పాడైపోతుంటే మొలిచే ఇది మాత్రం పాడవకుండా శాశ్వతంగా ఉండటం సృష్టి వైచిత్రి. ఎంత అందంగా ఉందో చూడండి' అన్నాడు ఐతు.

'నిజమా' ఆశ్చర్యంగా అడిగాను. 'నాకిది నగరాల్లో ఎక్కడా కనపడలేదు. నేరుగా అమెరికా, యూరప్‌లకు ఎగుమతి చేస్తారేమో. మరి దీన్ని సేకరించే గిరిజనులకు గిట్టుబాటు ధర లభిస్తుందా?' అడిగాను నేను.

'లేదు లేదు. ఈ అడవి నుండి ఇది బయటికే వెళ్లదు. దీనికి బైట మంచి ధర పలుకుతుందని ఎవరికీ తెలియదు. ఈ అడవిలోనే ఇటువంటి చలి మంటల్లో కాలి బూడిదవుతుంది.'

అడవిలో దొరికే ఇతర ఔషధ మూలికలు గురించి చెప్పాడు ఐతు. ఇంత పెద్ద ఔషధ మూలికల ఖజానా ఉన్నా అడవి బిడ్డలు సరైన వైద్య సౌకర్యాలు లేక పిట్టల్లా రాలుతున్నారని చెప్పాడు.

'ఏదో ఒకనాడు మేం ఈ సమస్యను అధిగమిస్తాం' చెప్పాడతను గంపెడు ఆత్మవిశ్వాసంతో.

***

ఉదయపు విజిల్ మోగడానికి చాలా ముందే టెంటులో అలికిడికి లేచాను. నా గార్డ్ రంగన్న ఎటో వెళ్లడానికి రెడీ అవుతున్నాడు. బయట ఇంకా చీకటి తెరలు తొలగలేదు. 'ఎక్కడికి వెళ్తున్నావ'ని అడిగాను.

'సెంట్రీ డ్యూటీ'

బయట ఉన్న వాచ్ టవర్ కేసి చూపిస్తూ అన్నాడు. 'అయితే నా గార్డ్ డ్యూటీ ఇంకెవరికో పడిందన్నమాట.' మనుసులో అనుకున్నాను.

రంగన్న వెళ్లాక మళ్లీ పడుకోవడానికి ప్రయత్నించాను కానీ నిద్రపట్టలేదు. ఒకసారి క్యాంప్ చుట్టూ ఒక రౌండ్ వేసి వద్దామని బయల్దేరాను. ఒక దుప్పటి కప్పుకుని, టార్చిలైట్ తీసుకుని ఎడమవేపు ఉన్న మరో టెంట్ ముందు మండుతున్న చలిమంట దగ్గరికి నడిచాను. నేనూహించినట్టుగానే అక్కడ రెండు ఆకారాలు చలికాచుకుంటున్నాయి.



'ఇంత త్వరగా లేచారేమిటి? పదండి నేను తోడుగా వస్తాను' అంటూ రైఫిల్ చేతపట్టుకుని లేచాడు ఒక గెరిల్లా.

'లేదు నేనేమీ బహిర్భూమికి వెళ్లట్లేదు. రంగన్న సెంట్రీ డ్యూటీ కనిలేచాడు. నాకూ మెళకువ వచ్చింది. ఒకసారి అలా క్యాంప్ చుట్టూ ఒక రౌండ్ వేసి ఎవరైనా మెళుకువగా ఉన్నారేమో చూద్దామని బయలుదేరాను'.

'మేమిద్దరం ఉన్నాం' చిరునవ్వుతో బదులు ఇచ్చాడు ఎదురుగా ఉన్న అమ్మాయికేసి చూపిస్తూ. ఆ మహిళా గెరిల్లా మా మాటలేం పట్టించుకోకుండా చలిమంటకేసి తదేకంగా చూస్తోంది.

'మీరేమైనా సీరియస్ చర్చల్లో ఉన్నారా' అనుమానంగా అడిగాను.

'లేదు లేదు ఇప్పుడే క్యాంప్ చుట్టూ తిరిగి ఇలా వచ్చి ఈ చలిమంట దగ్గర కూర్చున్నాం' చెప్పాడతను.

'మరి ఈ అమ్మాయి ఏదో దీర్ఘాలోచనలో ఉన్నట్టుంది?'

'తనకి హిందీ రాదు'

'గోండీనా' అడిగాను.

'లేదు, తెలుగమ్మాయి' చెప్పాడు.

ఇతడిది ఒరిస్సా అట. అక్కడే ఒక పల్లెటూరిలో పుట్టి పెరిగాడు. కాలేజీ విద్యను మధ్యలోనే ఆపేసి గెరిల్లా దళంలో చేరాడు. ఇప్పుడు డిప్యూటీ కమాండర్ అయ్యాడు.

ఈ ఇద్దరూ క్యాంప్ చుట్టూ పెట్రోలింగ్ బాధ్యతలో ఉన్నారు ఇవాళ. వీరితోపాటు మరో ముగ్గురు గెరిల్లాలు ఇతర చోట్ల గస్తీ నిర్వహిస్తున్నారు.

'రాత్రి డ్యూటీ కష్టం అనుకుంటా' అడిగాన్నేను.

'అలా ఏం కాదు'

ఒంటరిగా ఉన్నప్పుడే ఈ డ్యూటీ చాలా కష్టం. ప్రక్కన ఎవరూ లేనప్పుడు ఆలోచనలు ఎటెటో వెళ్లుంటాయి. ఒక్కోసారి ఆ ఆలోచనలు ఊరిలోని చిన్ననాటి స్నేహితుల దగ్గరికి వెళతాయి. ఒకసారి అవి కాలేజి ఆట స్థలం దగ్గరికి వెళితే మరోసారి అవి ఇంటి దగ్గర ఉంటే చిట్టిపొట్టి తమ్ముళ్లు, చెల్లెళ్ల దగ్గరికి మోసుకెళతాయి. ఉన్నట్టుండి అమ్మ పిలిచినట్టనిపిస్తుంది. ఉలిక్కిపడి చూసేసరికి తను అడవిలో సెంట్రీ డ్యూటీ చేస్తున్నానని, అమ్మ చాలా చాలా దూరంలో ఉన్నదని అర్థం అవుతోంది. ఇక్కడ తాను ఒంటరి. నిశ్శబ్దంగా నిలబడి గాలి సవ్వడికి జతగా అడవిలో నుండి వినపడుతున్న ఏవేవో తెలియని ధ్వనులను గుర్తించడానికి ప్రయత్నిస్తుంటాడు. దాపునే మరో కామ్రేడ్ ఉన్నా మైళ్ల దూరం వరకూ ఎవరూ లేనట్టే అనిపిస్తుంది. అతని వెలుపల ఆవరించి ఉన్న భయంకర నిశ్శబ్దం అతని లోలోపల కూడా నిండిపోతుంది. అతను ఉన్నచోటునుండి కదలడు. చిన్న కూనిరాగం కూడా తీయడు. ఒక క్షణం కూడా కూర్చోడు. ఒక దమ్ములాగుదామని ఆలోచించడు.

ముఖాముఖి యుద్ధం చేయడం కన్నా సెంట్రీ డ్యూటీ చేయడమే కష్టం. ఇది యుద్ధం కోసం జరిగే అనిశ్చిత నిరీక్షణ. అంతులేని నిరీక్షణ. సెంట్రీ

డ్యూటీలో ఉన్న గెరిల్లా మనసు లోపల అల్లకల్లోలంగా ఉన్నా సముద్రంలా ఉన్నా, బైటికి మాత్రం శిల్పంలా నిశ్చలంగా ఉంటాడు.

సెంట్రీ డ్యూటీ చేసేటప్పుడు ఆలోచనలల్లో మునిగిపోవడం చాలా ప్రమాదకరంగా పరిణమించవచ్చు. అయితే ఎంత చురుకైన వ్యక్తులైనా ఒకోసారి ఏదో ఆలోచనలోపడి కొట్టుకుపోతారు. మామూలుగానైతే గెరిల్లా జీవితం అనుక్షణం శత్రువును దెబ్బతీసే యుద్ధం. కానీ సెంట్రీ డ్యూటీలో ఉన్నపుడు శత్రువు దాడి చేయకుండా కాచుకునే పని ఎంతో నైపుణ్యంగా చేయాలి. సెంట్రీ అజాగ్రత్త వల్ల కామ్రేడ్లు పట్టుబడ్డ సంఘటనలు కొన్ని జరిగాయి. అదే విధంగా సెంట్రీ అప్రమత్తత వల్ల పెద్ద ప్రమాదాలు తప్పిపోయిన ఉదంతాలు కూడా ఉన్నాయి.

సెంట్రీ డ్యూటీ ప్రతిరోజు మారుతుంది. ఒక్కో షిఫ్టు ఒకటి నుండి రెండు గంటలు ఉంటుంది. గెరిల్లాలు చేసే పనులన్నిటిలోనూ అతి కష్టమైంది సెంట్రీ డ్యూటీనే. కానీ ఈ ఒరియా డిప్యూటీ కమాండర్ మాత్రం నేనడిగితే అది కష్టమైన పనేం కాదన్నాడు.



కష్టతరమైనదాన్ని కూడా సులభమని అనడం కూడా గెరిల్లా మనస్థత్వంలో భాగం.

ఇంకా తెలవారక ముందే మేం క్యాంప్ చుట్టూ ఒక రౌండ్ వేశాం. ప్రతి టెంటు వద్దా ఒకరు ఇద్దరు కూర్చునో, ఏదో పని చేసుకుంటూనో ఉన్నారు. క్యాంపులో రాత్రి వేళలోనూ ఏదో ఒక పని జరుగుతూనే ఉంటుంది.

***

'కామ్రేడ్ కోసా!'

ఆ పిలుపు విని టెంట్‌లో నాతోపాటు ఉంటున్న నా కొత్త గార్డ్ కామ్రేడ్ కోసా నా వేపు చూశాడు.

'ఇవాళ మనం స్నానానికి వెళదామా?'

'ఓ తప్పకుండా వెళదాం. వచ్చేటపుడు లేత వెదురు గడలు తెచ్చుకోవచ్చు'

'లేత వెదురుగడలు! వర్షాలు పడ్డాక ఓ రెండు నెలల వరకూ దొరుకుతాయి. అవి కూరగాయల్లా ఉపయోగపడతాయని బహుశా అడవి వెలుపల చాలా మందికి తెలియదు.

రైతుకైతే వెదురుగడ ఓ ముల్లు గర్రగా ఉపయోగపడుతుంది. డబ్బున్నోళ్లకది ఫర్నీచర్‌గా, పేదవాళ్లకు గుడిసెకు ఊతంగా, ముసలి వాళ్లకు చేతికర్రగా, కాంట్రాక్టర్లకు కనకవర్షం కురిపించే కల్పతరువులా, అడవిలో గిరిజనులకు మాత్రం వెన్నువిరిచే పనిలా రుచీపచీలేని కూరగాయలా...

వెదురు గడలు తెద్దామని కోసా ఉత్సాహంగా అన్నపుడు నేను అవి ఎంత రుచిగా ఉంటాయోనని భ్రమపడ్డాను. కానీ తరువాత కోసా చెప్పాక తెలిసింది. అవి బతకడానికి తినే బలుసాకులాగా ఉంటాయని. కోసా నాకు అడవిలో జీవితం గురించి చాలా సంగతులు చెప్పేవాడు. అవి అతని మాటల్లోనే వినండి.

'మేమిక్కడ ఏమేం తింటామో తెలుసకోవాలని ఉందా? చేపలు, బియ్యం, అడవిలో దొరికే పళ్లు, వినడానికి బాగానే అనిపిస్తుంది. దూరం నుండి చూసేవారికి అడవిలో జీవితం ఆహారానికి కొరత లేకుండా అద్భుతంగా కనిపించవచ్చు కూడా. కానీ ఈ క్యాంపు బయటికి వెళ్లి గిరిజన గూడేలలో చూస్తే మీకు యాభై ఏండ్లు దాటిన వారు కనిపించరు. ఇక్కడ బిడ్డ పుట్టినప్పటినుండి చావు వెన్నాడుతూనే ఉంటుంది. యాభై ఏళ్లకు చేరేలోపు అది మమ్మల్ని మింగేస్తుంది.

ఈ కొండ వాగులు ఎండిపోతే చేపలకు, ఎండ్రకాయలకు కొరత ఏర్పడుతుంది. వర్షాకాలంలో చేపలు, వెదురుగడలు రెండూ దొరుకుతాయి. అయితే వెదురుగడలు దొరికినపుడు వాటిని తిని, తరువాతి రోజులకు చేపలను దాచుకుంటాం. వర్షాకాలం ముగిశాక చేపలు, అడవిలో దొరికే పళ్లూ తింటాం. ఇక చలికాలంలో భూమిలో దొరికే దుంపలు తవ్వి తింటాం. చలికాలంలో చలికి తాళలేక మా పిల్లలు, మా పశువులూ చనిపోతాయి. నీళ్లులేని కాలంలో చెట్లు, గడ్డీ అన్ని ఎండిపోయి మా గొర్రెలు, ఆవులకు తినడానికి మేత

కరువైతుంది. అందుకే అవి చనిపోయే లోపు మేమే వాటిని కోసుకుని తింటాం. వాటిని తినకపోతే ముందు అవి చనిపోతాయి, అటు తరువాత మేమూ చనిపోతాం. బహూశా ఈ అడవికి వచ్చాకే మొదటిసారి గొడ్డుమాంసం తిని ఉంటారు మీరు. అడవి బయటుండేవారు పెద్దగా గొడ్డుమాంసం తినరు. బహూశా వారికి తినదగ్గ పదార్థాలు చాలా లభ్యం అవుతాయోమో. వారి నదులు, వాగులు ఎండిపోయేవేమో, పశుగ్రాసం ఎపుడూ దొరుకుతుందేమో, అందుకే వాళ్లు అవులను చంపి తినరేమో. ఇక్కడ బతకాలంటే కొన్ని చేయక తప్పదు. లేకుంటే మరణం తప్పదు.'

కోసా గోండ్ తెగకు చెంది వాడు. ఈ అడవిబిడ్డ. అతని మాటలు వయసులో చాలా పెద్దవాడు మాట్లాడినట్టు ఉంటాయి. తన ముందే చాలా తరాలు గడిచిపోయనట్టు, ఆ అనుభవం అంతా రంగరించి మాట్లాడుతున్నట్టు అనిపిస్తుంది. తన అనుభవాలను మంచి పదాలలో అల్లిక చేసి చెప్పే కళ ఉంది కోసా దగ్గర. అతను నా గార్డ్ కాకుండా నా గైడ్ అయితే బాగుండును. ఈ చెట్టు పుట్టల గురించి, జంతువులు, నదుల గురించి మొత్తంగా గోండ్ జీవితం గురించి నాకు వివరించేవాడు.



గడిచిన రోజుల గురించి మధురమైన జ్ఞాపకాలతో నిండిన ఖజానాలాంటి వాడు కోసా. సమకాలీన సంగతులపై అతడికి చక్కని పట్టు ఉంది. భవిష్యత్ చిత్రం ఎలా ఉంటుందో కూడా అతనికి అవగాహన ఉంది.

ఉదయం హాజరు కార్యక్రమం ముగిశాక మేము వ్యాయామానికి వెళ్లకుండా అడవిలోకి నడవడం ప్రారంభించాం. మా చర్చ అటు తిరిగి ఇటు తిరిగి మళ్లీ తిండి మీదకే వచ్చింది.

అడవిలో కూరగాయలు దొరకనపుడు ఎర్రచీమలతో చేసిన పచ్చడి తింటామని చెప్పాడు కోసా. ఈ ఎర్రచీమల పుట్టల మీద నీళ్లు పోయటమో లేదా పుట్ట మొదట్లో బాగా మాగిన పండునొకదాన్ని ఉంచడం ద్వారా చీమలను బయటికి రప్పిస్తారు. వాటిని పట్టుకొని ఆకుల మధ్య ఉంచి ఒక బండపైన వేసి పచ్చడిలా మారుస్తారు. ఆ తరువాత దాన్ని నిప్పులపై వేయించి కొంచెం ఉప్పు, మిరియాల వంటివి జత చేస్తే రుచికరమైన చీమల పచ్చడి తయార్.

ఎటూ చూసినా వెదురు, ఇతర కలపనిచ్చే చెట్లు ఉన్న అడవిలో వాటిని

ఉపయోగించి ఏం తయారు చేయొచ్చు అనే ప్రశ్న అడిగాను కోసాను.

'ఆ విషయంలో పెద్దగా పురోగతి లేదు. అడవిలో వెదురు, టేకు, ఇప్ప, తుమ్మ వంటి చెట్లు ఎన్నో ఉన్నా వాటిని ఉపయోగించుకోవడంలో కొంచెం వెనుకబడే ఉన్నాం. అయినా కడుపు నిండితేనే కదా ఏదో ఒక పనిలో నైపుణ్యం అభివృద్ధి అయ్యేది. ఇక్కడ ఆ కనీస అవసరమే తీరట్లేదు. కర్రను ఉపయోగించి గుడిసెలు వేసుకోవడమో, వెదురు బుట్టలు చేసుకొని బియ్యం లాంటివి నిలవ చేసుకోవడమో చేస్తాం. ఇంత మంట వేసుకుని ఆరుబయట నిద్రించే వాళ్లకు కుర్చీలు, టేబుళ్లతో పనేం ఉంటుంది? అందుకే అవి తయారుచేయడం అంటే సమయం వృధా చేసుకోవడం అనే అభిప్రాయం ఉంది ఇక్కడ. కాంట్రాక్టర్లు డబ్బు సంపాదించడానికి ఈ అడివిని మొత్తం నరికి అమ్ముకోగలరు. డబ్బులు అవసరం ఉన్న మా గిరిజనులు కొందరు వారికి సాయపడనూ గలరు.

గిరిజనులకు నిత్యావసరాలైన ఉప్పు, మిరియాలు, పసుపు వంటివి వారిని కాంట్రాక్టర్ల, వ్యాపారస్తుల గుప్పిట్లో ఉండేటట్టు చేశాయి. ఇవాళ గిరిజనులకు ఒక స్వంత అస్తిత్వం లేకుండా పోయింది. కాంట్రాక్టర్లు, గిరిజనులను పశువుల్లా ఉపయోగించుకుంటున్నారు ఇక్కడ స్త్రీల మానప్రాణాలకు రక్షణ లేదు. ఇనుము, మాంగనీసు, వజ్రాలు, కలప... కాంట్రాక్టర్లు ఇక్కడ దోచుకోని వనరు లేదు. దాన్ని వెలకట్టడం కూడా కష్టమే.

గిరిజనులకు మాత్రం ఒంటి మీద గుడ్డ కూడా కరువే. వారికి ఇప్పటికీ అదే ఆకలి, అదే అనారోగ్యం, అదే చావు, అదే నిస్సహాయత, అదే ఆదిమ జీవితం. 'ప్రకృతికి దగ్గరగా ఉన్న జీవితం' అని మీరు అనుకునేది నిజానికి జంతువులా జీవించడం. ఇంకా చెప్పాలంటే జంతువుల కంటే హీనంగా జీవించడం. కోసా గొంతు మూగబోయింది. అడవి నిశ్చలంగా ఉంది. అక్కడ గాలి కూడా స్తంభించినట్టు అనిపించింది.

***

నడుస్తూ నడుస్తూ మేం మూడో సెక్యూరిటీ పోస్ట్ వద్దకు చేరుకున్నాం. అక్కడ కాపలా ఉన్న మహిళా కామ్రేడ్‌కి చెయ్యి ఊపి ముందు కొండపై

నున్న మరో సెక్యూరిటీ పోస్ట్ కేసి నడవసాగాం. దారంతా ముళ్లపొదలు, చెట్లతో నిండి ఉంది. 'చుట్టూ తిరిగి వెళ్లే మంచి దారిని వదిలేసి నేరుగా వెళ్లే కష్టమైన దారి గుండా వెళ్తున్నాం' అన్నాడు కోసా.

'ఇక్‌పాండి' అన్నాడు కోసా ఉత్సాహంగా.

మా నోళ్లలో నీరూరాయి స్థానికంగా దొరికే రుచికరమైన పండు అది.

ఈ పండును తెంపి తినడం అంటే గెరిల్లాలకు చాలా ఇష్టం. చేతులు గీరుకుపోకుండా ఈ పండును తెంపడం అసాధ్యం. ఈ సారి ఆ పండును తెంపి తెచ్చేందుకు నేనే ముందుకు నడిచాను.

మాటల మధ్యలో తనకు పెళ్లైందని చెప్పాడు కోసా. అతని భార్య వేరే స్క్వాడ్‌లో పనిచేస్తుందట. కోసా 9వ తరగతి వరకు చదువుకున్నాడట. స్కూల్లో హిందీ, స్క్వాడ్‌లో చేరాక తెలుగు నేర్చుకున్నాడట. ఇక ఇప్పుడేమో ఇంగ్లీష్ నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

చాలా మంది గోండ్ యువతీ యువకులు దళంలో చేరిన తరువాతనే అక్షరాలు నేర్చుకోవడం మొదలు పెడతారని కోసా చెప్పాడు. అందుకే నాకు ఎప్పుడు చూసినా గెరిల్లాలు పుస్తకాలు పట్టుకొని చదువుకుంటూనో, అంకెలు నేర్చుకుంటూనో కనపడ్డారు. దాదాపు గెరిల్లాలందరి వద్దా ఒక పెన్ను మాత్రం తప్పక కనపడింది.

ఇక్కడ అందరికీ పాడడం, నృత్యం చేయడంవచ్చు. అవి వారికి వంశపారంపర్యంగా వచ్చిన విద్యలు. పెద్దా, చిన్నా, ఆడా, మగా అందరూ కలిసి నృత్యం చేస్తారు. ఊరు ఊరంతా కలిసి నృత్యం చేయడం మనం చూస్తామిక్కడ. ఇక పాటలన్నీ బృందగానాలే. ఎక్కడైనా ఒంటరిగా పాడుకునే పాట వినపడుతుందేమోనని నేను అడవిలో ఉన్నన్ని రోజులు వెతికాను. కానీ ఒక్కటీ వినపడలేదు. ఒక సారెప్పుడో రాయ్‌పూర్ రేడియో కేంద్రం నుండి మాత్రం ఒక యువతి పాడిన సోలోపాట విన్నాను. బయట ఈ పాట కూడా నలుగురూ కలిసి పాడే బృందగానమే అని చెప్పారు నాకు దళసభ్యులు.

కోసా పాటలు కూడా రాస్తాడట.

★★★

మరునాడు ఉదయం అల్పాహారానికి సేమియా హల్వా చేస్తూండటం నా కంట బడింది. అందులో కొన్ని వేరుశనగ గింజలు కూడా వేస్తున్నారు. బహుశా ఇంత రుచికరమైన వంటకం అరుదుగా చేస్తుండవచ్చు ఇక్కడ. అడవిలోకి వచ్చాక స్వీటు తయారుచేయగా చూడటం ఇదే మొదలు కానీ తీరా తిందామని నోట్లో పెట్టుకునేసరికి ఒక క్షణం అర్థం కాలేదు. అది స్వీటు కాదు, ఉప్పగా ఉండే సేమియా ఉప్మా! స్వీటు తినాలనే నా కోరిక చప్పున చల్లారింది. సగం తిన్నాక అదే రుచిగా అన్పించసాగింది.

టిఫిన్ చేశాక వంటశాల దగ్గర కూర్చున్న ఇద్దరు కొత్త కుర్రాళ్లతో మాట్లాడాలనుకున్నాను. ఇద్దరూ యూనిఫారం ధరించలేదు. అసలు వారెందుకు వచ్చారో తెలుసుకోవాలనే కుతుహలం నాది. రోజూ ముగ్గురు నలుగురు కొత్త యువకులు వస్తున్నారిక్కడికి. సివిల్ డ్రెస్‌లో ఉన్నారు కాబట్టి వీళ్లు గెరిల్లాలు అయి ఉండరు.

ఇక్కడి ఊళ్ల పేర్లు చాలా వింతగా ఉండి నాకు ఒక పట్టాన గుర్తుండటం లేదు. నాకు ముందే జ్ఞాపకశక్తి తక్కువ. దానికి తోడు ఈ గోండీ భాషలో ఉన్న ఊర్ల పేర్లు అసలే గుర్తుండటం లేదు. ఆ వచ్చిన పిల్లలను పేరేమిటని అడిగితే ఒక్కడు మాత్రం చెప్పాడు. అతను మూడేళ్లు స్కూలుకు వెళ్లాడట. కాబట్టి కాస్త హిందీ అర్థం అవుతుంది. మిగతా పిల్లలయితే నా ప్రశ్న విని నవ్వి ఊరుకున్నారు.

'వారికి మీరు అడిగిందేమిటో అర్థం కావట్లేదు' చెప్పాడు మొదటి అబ్బాయి.

'మరి గోండీలో నీ పేరేమిటి అని అడగాలంటే ఏమనాలి?' అడిగాడు

'పిదర్ బాతా'

'పిదర్ బాతా' రెండో అబ్బాయి వైపు తిరిగి అడిగాడు.

'కన్నా' బదులిచ్చాడు అబ్బాయి. నేను ఆ హిందీ వచ్చిన అబ్బాయితో సంభాషణ కొనసాగించాను. క్యాంప్‌లో ఉన్న చాలా మంది గెరిల్లాల కన్నా వీడి హిందీ ప్రావీణ్యం మెరుగ్గా ఉంది. పేరు లచ్చా అట

ఇద్దరు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు కలిసి వంటశాలలో గెరిల్లాలకు సాయపడడానికి ప్రక్కనే ఉన్న గ్రామం నుండి వచ్చారట. అమ్మాయిలు నీళ్లు తేవడానికి పోగా ఈ కుర్రాళ్లు వంట చెరుకు ఏరుకొచ్చారట. ఇలా రోజుకో గిరిజనగూడెం ప్రజలు కుర్రాళ్లని క్యాంప్‌లో సహాయం చేయడానికి వంతులు వేసుకొని పంపిస్తారట.

మీరిక్కడికి స్వచ్ఛందంగానే వచ్చారా? అడిగాన్నేను.

'అవును ఇదివరకొకసారి వచ్చాను. మళ్లీ నాకే రావాలనిపించింది' చెప్పాడా కుర్రాడు

'ఓకే నీకు వీళ్లు నచ్చారా?' ప్రశ్నించాను

'ఆ నచ్చారు వీళ్లుచాలా రోజులపాటు ఇటుకేసి రాకపోతే నాకు దిగులుగా ఉంటుంది. వాళ్ల కొరకు ఎదురుచూస్తూ ఉంటాను"

'దిగులా? ఏం దిగులు? వాళ్లు రావట్లేదని దిగులా? వారి రాక వల్ల మీకు కలిగే లబ్ది ఏమిటి?'



నా ప్రశ్న విని ఆ కుర్రాడు మౌనముద్ర దాల్చాడు.

'నీకు లబ్ది అంటే ఏమిటో తెలుసా' అని అడిగాను.

తెలుసన్నాడు.

'మరి వాళ్ల రానప్పుడు దిగులు ఎందుకు?' మళ్లీ అదే ప్రశ్నను అడిగాను.

'వాళ్ళ వల్ల నాకు కలిగే లబ్ది ఏమిటో తెలియదు. కానీ వాళ్లు రాకపోతే మాత్రం దిగులుగా అనిపిస్తుంది.'

'అసలు వాళ్ల వల్ల మాకు జరిగే లాభం ఏ లేదు' తేల్చేశాడు ఓ క్షణం ఆలోచించాక.

'లాభం లేనప్పుడు మరి వాళ్ల కొరకు ఎదురుచూపులెందుకు' నేను వదలదలుచుకోలేదు.

ఆ కుర్రాడు అయోమయంలో పడ్డాడు.

వాళ్ల రానప్పుడు అతనికి కలిగే 'దిగులు' వాళ్ల వల్ల కలిగే 'ప్రయోజనం' ఈ రెండిటికి గల సంబంధం అతను అర్థం చేసుకునేలా చేయాలని నా ప్రయత్నం.

'వాళ్లంటే నాకు చాలా ఇష్టం. వారిక్కడ ఉన్నప్పుడు పోలీసులు ఇటుకేసి రారు' కాసేపు ఆలోచించి బదులిచ్చాడా యువకుడు.

'పోలీసులు మిమ్మల్ని ఇబ్బంది పెడతారా?'

'వాళ్లు మా కోళ్లు కోసుకుని తింటారు' నేరుగా జవాబిచ్చాడు.

'మరి వీళ్లు అలా ఇబ్బంది పెట్టరా?'

'లేదు' నవ్వుతూ చెప్పాడు.

దాదాల (గెరిల్లాల) కొరకు పనిచేయడం అనేది తనిష్ట ప్రకారమే జరుగుతున్నదని చెప్పాడు. తన ఊరికి చెందిన ఇద్దరు యువతులు, ఒక యువకుడు దళంలో చేరారట.

అక్కడి నుండి నా టెంట్‌కు తిరిగి వస్తుంటే ఐతు ఎదురయ్యాడు.

'ఇవ్వాళ ఎక్సర్‌సైజ్ చేయడానికి రాలేదేం' అని ప్రశ్నించాడు.

'అలా అడవిలోకి చిన్న రౌండ్ వేసి వచ్చాం' చెప్పాను.

దగ్గరలో పారుతున్న సెలయేరులో స్నానానికి వెళ్లడానికి ఐతును ఒప్పించాను. ఓ పదినిముషాల తరువాత నేను, ఐతు, కోసా తోపాటు మరో గెరిల్లా కలిసి సెలయేరు దగ్గరికి వెళ్లాం. కోసా ఓ చెట్టు వెనకాల నిలబడి సెంట్రీ డ్యూటీ చేస్తుండగా మేం ముగ్గురం నీళ్లలోకి దిగాం. స్నానం చేస్తుంటే నా ముందు ఐతు అతని మనసులోని అభివృద్ధి ప్రణాళికను ఆవిష్కరించాడు. ఒక చెరువు తవ్వడం నుండి ఆనకట్ట నిర్మించడం, అటుపై ఈ ప్రాంతపు రూపురేఖలు మార్చేయడం వరకు. ఒక కోడినుండి గుడ్లను అక్కడి నుండి కోడి పిల్లలను చివరికి ఒక పౌల్ట్రీఫారం ఏర్పాటు చేయడం వరకు. చెరువులు, చేపలు, కూరగాయల సాగు, ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించడం... వనమూలికల నుండి మందుల తయారీ, తద్వారా వివిధ వ్యాధులకు చికిత్స. అతని ప్రణాళిక నా మెదడుకు మేతలా మారింది.

పోరాటాల నుండి ఉత్పత్తి. మళ్లీ ఉత్పత్తి నుండి పోరాటాలు. అడవిలో ప్రతి వస్తువు నుండి ఒక ఉత్పత్తి వ్యవస్థను తయారు చేయడం. దానిని ఇక్కడ ప్రజల జీవనస్థితిగతులు మెరుగుపరచడానికి వినియోగించడం. ఐతు ఆలోచనలే కనుక రూపం దాలిస్తే ప్రస్తుత పరిస్థితులు మొత్తం మారిపోతాయి.

పురాణ కథలల్లో చెప్పినట్టు ఏదో ఒకనాడు కొండను తొలగించడం సాధ్యమేనని ఏటు నమ్ముతాడు అందుకే అతను నిత్యం రాళ్లను పగులగొట్టి, దారిని తయారు చేసే పనిలో నిమగ్నమై ఉంటాడు.

మన పుక్కిటి పురాణాల్లో చెప్పినట్టు దేవుళ్లు అద్భుతాలను ఆవిష్కరించారో లేదా తెలియదుకానీ బస్తర్‌లో మాత్రం అటువంటి అద్భుతం ఒకటి ఆవిష్కరించబడుతోంది. ఇక్కడి అడవులు ఇప్పుడు కాంట్రాక్టర్ల నుండి, ప్రభుత్వం నుండి దగా నుండి విముక్తి చేయబడ్డాయి. అడవుల్లో ఇపుడు అమ్మాయిలు స్వేచ్ఛగా తిరగవచ్చు. ఇక్కడ స్వప్నాలు నిజమవుతున్నాయి. మరో ప్రపంచం సాధ్యమేనన్న నమ్మకం కలుగుతోంది. అందుకే గెరిల్లాలు కొంతకాలంపాటు కనిపించకపోతే కన్నా, లచ్చా వంటి కుర్రాళ్లకు ఏదో వెలితిగా దిగులుగా అనిపిస్తోంది. వాళ్ల కళ్లముందే పర్వతాలు కరిగిపోవడం చూస్తున్నారు. నమ్మకాలు నిజమవడం గమనిస్తున్నారు.

కాసేపటికి ఐతు సెంట్రీ డ్యూటీకి వచ్చి కోసాను స్నానం చేయడానికి పంపించాడు.



'ఐతు చాలా పట్టుదల, ఉత్సాహం గలవాడు' అని ప్రక్కనే ఉన్న శ్రీకాంత్ అనే గెరిల్లాతో అన్నాడు.

అవునన్నాడు శ్రీకాంత్

'ఐతు ప్రణాళికలు విజయవంతమవుతే ఈ ప్రాంతం స్వర్గంలా మారుతుంది. కానీ...' ఆగిపోయాను.

'కానీ ఏమిటి?' నావేపు చూస్తూ అడిగాడు శ్రీకాంత్

'అడవి బయటి మొత్తం రాజ్యం గుప్పిట్లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో మీ అభివృద్ధి నమూనా నిలబడగలుగుతుందా? ఉద్యమం నలుదిశలా వ్యాపించకుంటే అదెలా సాధ్యపడుతుంది?'

'అవును' అన్నాడు శ్రీకాంత్

'నేను లేవనెత్తిన అంశాలపై నాతో చర్చించండి. ఇవి మీ నుండి తెలుసుకోవడానికి. బయటి ప్రపంచానికి తెలియజెప్పడానికే నేను ఇక్కడికి వచ్చింది'.

'అయితే మనం సాయంత్రం కలిసి చర్చించుకుందాం' అన్నాడతను

అందరం కలిసి క్యాంప్ వేపు నడిచాం.

మధ్యాహ్నం భోజనం ముగిశాక ఒక గంటకు శ్రీకాంత్ నా టెంటుకు వచ్చాడు.

'బైట బెంచీపై కూర్చుందాం' అన్నాడు

నేను నా ఫైల్ తీసుకుని బైటికి నడిచాను.

శ్రీకాంత్ చాలా అరుదుగా మాట్లాడతాడు. అతని వ్యక్తీకరణ చాలా స్పష్టంగా ఉంటుంది. అందులో ఎలాంటి సంక్లిష్టత గానీ తత్తరపాటుగానీ ఉండవు. తను మాట్లాడేది అర్థం చేయించేందుకన్నట్టుగా అతను మన కళ్లలోకి నేరుగా చూస్తాడు. మనం ఏదైనా చెప్పేటప్పుడు అస్సలు మధ్యలో కల్పించుకోడు. వింటున్నంత సేపూ ఊ కొడుతూ మనల్ని ప్రోత్సాహిస్తుంటాడు. నాయనమ్మలు కథలు చెపుతుంటే చిన్నపిల్లలు ఎలా శ్రద్ధగా ఆలకిస్తారో అలా ఉంటుంది శ్రీకాంత్ తీరు. మాట్లాడేటపుడు అతని పెదాలు తప్ప శరీరంలో ఇంకే భాగమూ కదలదు. గొంతుతో మనతో సంభాషిస్తూ తన చూపుతో హృదయాన్ని చేరుతాడు అతను. 43

ఎన్ని భారీ నష్టాలను చవిచూసినా చుట్టుప్రక్కల ఉన్న మైదాన ప్రాంతాలను తప్పక జయిస్తామని చెప్పాడతను. అక్కడి ప్రజలు గెరిల్లాలను అమితంగా అభిమానిస్తారని, బాగా చూసుకొంటారని, వారిని సాదరంగా ఆహ్వానిస్తారని అతనన్నాడు.

'అణచివేత ఎంతున్నా మైదాన ప్రాంతంలో ఉద్యమం బలపడేలా చేయాలి' దేశంలోని అన్ని కొండ ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధం మొదలు పెట్టాలనేది తమ లక్ష్యం అట. తూర్పు కనుమలు, పడమటి కనుమలు ఈ పాటికే సర్వే చేసి కార్యాచరణ మొదలుపెట్టబోతున్నారట. గెరిల్లా యుద్ధం విస్తరించాలంటే అడవిలో అభివృద్ధి జరగడం అవసరమని వారికి తెలుసు. అయితే ఈ అభివృద్ధి దానికదిగా వారికి ఒక లక్ష్యం కాదు. అది విప్లవోద్యమంలో ఒక విడదీయరాని భాగం. ఉద్యమం ముందుకు సాగకుండా

అభివృద్ధి కూడా ముందుకు సాగదు. అంతే కాదు వారు చేపట్టిన అభివృద్ధి నమూనా కేవలం అడవికే పరిమితమైతే కూడా లాభం లేదు.

ఉద్యమంలో స్తబ్దత నెలకొందని బయటి ప్రపంచంలో ఒక అభిప్రాయం ఉందని అతనికి చెప్పాను. అడవిలో అన్నలు సాధించినదేమిటి? అన్నదానిపై బయట ఎలాంటి చర్చ జరగడం లేదని, అసలు బయటి వారెవరికీ ఉద్యమ కార్యకలాపాలు పెద్దగా తెలియవని చెప్పాను. దండకారణ్యంలో అడపాదడపా జరిగే ఎన్‌కౌంటర్ల గురించి మాత్రమే బయటికి తెలుస్తుంది. అడవిలో ఉద్యమం మిగతా సమాజాన్ని కదిలించలేకపోతోంది. దేశ రాజకీయ యవనికపై వారొక ప్రబల శక్తిగా ఇంకా అవతరించలేదన్నాను.

నేను చెప్పిందంతా ఏకాగ్రతతో విన్నాడు శ్రీకాంత్. ఆ తరువాత ఒక్కో అంశం పై తనేమనుకుంటున్నాడో వివరించాడు. రాజ్యం ఇటీవలి కాలంలో ఉద్యమశక్తులపై విపరీతమైన అణచివేతకు పాల్పడడం వలన ఉద్యమంలో స్తబ్దత నెలకొందనడం సరైంది కాదనన్నాడు. గత కొన్నేళ్లుగా నిర్బంధం వలన వందలాది అమరులైనారని అందువల్ల ఉద్యమం తిరిగి శక్తియుక్తులను కూడదీసుకోవడం గొప్ప సవాల్‌గా మారిందని చెప్పాడు. యుద్ధాలలో ఇటువంటి తాత్కాలిక వెనుకంజ సాధారణమేనని, కానీ అంతిమ విజయం మాత్రం విప్లవ ఉద్యమ శక్తులదేనిని ధీమా కనబరిచాడు.

ఇందుకొరకు నిరంతరం ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయని, ఉద్యమ విజయాలపై బయట ఒక చర్చను రేకెత్తించడం అవసరమని చెప్పాడు శ్రీకాంత్.

ప్రస్తుతం దేశరాజకీయాలపై తమ ప్రభావం చెప్పుకోదగిన స్థాయిలో లేకపోయిన మాట వాస్తవమేనని, అయితే సాయుధ పోరాటం ద్వారానే దేశ రాజకీయాలను ప్రభావితం చేయగలమని మరచి పోరాదని చెప్పాడు. ఏదో ఒకనాడు తాము ఒక ప్రబల రాజకీయ శక్తిగా ఎదుగుతామని అన్నాడు.

మళ్లీ కలుస్తామనే ఆశతో ఇద్దరం వీడ్కోలు చెప్పుకున్నాం.

***

సత్నామ్

'లెమన్ టీ తాగుదామా' అడిగాడు ఐతు.

అసలైతే క్యాంపులో టీ తాగే సమయం కాలేదు. కానీ ఈ లెమన్ టీ ప్రతిపాదన నా నోరూరించింది. అయినా లెమన్ టీ అసలు టీ కిందే లెక్క కాదు, కాబట్టి మేం రూల్స్ అతిక్రమించినట్టు ఏం కాదు.

ఏటు ఆఫర్‌ను అంగీకరించాను.

పొయ్యి వెలిగిస్తుండగా ఏటు అన్నాడు "మనం ఇంకొన్ని కప్పుల నీళ్లు కలపాలి. అతిథులు వస్తున్నారు".

ఇంకో ముగ్గురు గెరిల్లాలు జత కలిశారు.

లెమన్ టీ తాగి కొంచెం సేదదీరాక ఉదయం మా కంటపడ్డ ఓ అడవిపంది పైకి చర్చ మళ్లింది.

'దాన్ని కొట్టుకొచ్చి ఉంటే ఈ సాయంత్రం విందు భోజనం దొరికి ఉండేది' అన్నాన్నేను.

'మంచిదైంది. లేకుంటే నిన్న ఆవు మాంసం తిన్నాం, ఇవ్వాళ పంది మాంసం తినుంటే క్యాంప్‌లో గందరగోళం అయి ఉండేది. ఈ ఆవు-పంది కలిసివస్తే కల్లోలం జరిగిపోతుంది. ఏదో కొంచెం వరి అన్నం, తేలికపాటి ఆహారం తీసుకునే గెరిల్లాలు ఇలా రెండు రోజులు వరుస బెట్టి మాంసం తింటే విరోచనాల బారినపడి ఆగమాగం అయ్యేవారు. డాక్టర్ పవన్‌కు ఒక టెంట్ నుండి మరో టెంట్‌కు పరుగులుబెట్టే పనిబడేది. ఈ క్యాంపులో జరిగిన గందరగోళం వార్త ఢిల్లీ దాకా చేరేది' అని ఒక గెరిల్లా అనగానే అందరూ ఫక్కున నవ్వారు. 45

క్యాంపులో అంతగా నవ్వులు పువ్వులు పూయడం నేను తొలిసారిగా చూశాను.

మా సరదా సంభాషణ మతోన్మాదం అనే సున్నితమైన అంశాన్ని మా మధ్యకు తెచ్చింది.

ఆవు, పంది అనేవి కేవలం రెండు జంతువుల పేర్లుగా కాక దేశంలో సగం ప్రజానీకాన్ని ఆవహించిన నమ్మకాలుగా స్థిరపడ్డాయి. బ్రిటీషు వలస

పాలకులు దేశంలో ప్రవేశపెట్టిన ఈ విషపూరిత భావజాలం ఒక తరం తరవాత ఒక తరం మనుషులను హింసోన్మాదపు జంతువుల్లా మారుస్తూనే ఉంది. మనిషి నిలువునా సజీవదహనమైపోయినా ఈ అనాగరిక మత విశ్వాసాలకు మాత్రం భంగం వాటిల్లరాదు. చరిత్ర, సాంప్రదాయాలు, రాజకీయాలు... అన్ని విషపూరితమైపోయాయి. 1947లో జరిగిన ఘోరమైన మత కల్లోలాల నుండి గత ఆరు దశాబ్దాలుగా ఈ రావణకాష్టం రగులుతూనే ఉన్నా సగటు భారతీయుడికి జ్ఞానం కలగట్లేదు.

కాలం చెల్లిన విశ్వాసాలు, విలువలు మానవజాతి వికాసానికి ఏ విధంగానూ తోడ్పడవు.

గోమాంసం తినడాన్ని త్యజించిన వారు అప్పటి సమాకాలీన పరిస్థితులకు అనుగుణంగా ఆ నిర్ణయం తీసుకుని ఉంటారు. ఈ రోజు గిరిజనులు కొందరు ఇంకా గోమాంసం తింటున్నారంటే దానికి కారణం అది వారి మనుగడకు అవసరం కాబట్టి. గోమాంసం తిన్నవారు అందరూ పాపులు కాదు. అలాగే పంది మాంసం తిన్నవాడు కాఫిర్ కాదు. వాస్తవికత నుండి దూరం జరిగి కొన్నింటికి దైవత్వాన్ని ఆపాదించడం వల్లే సమస్యలు వస్తాయి. అంతెందుకు బైటకి ఆవును గోమాత అన్నవాళ్లే చనిపోయిన ఆవును తాకడానికి కూడా జంకుతారు. అపుడు ఆ పవిత్రమైన ఆవును పాతిపెట్టడానికి వారికి తక్కువ కులం వాళ్లే దిక్కు అవుతారు. ఆ గోమాత అంతిమ సంస్కారాలకు వారి వద్ద ఏ మంత్రమూ, ఏ ఆచారమూ లేదు. ఎంతో పవిత్రంగా భావించే ఓ చిహ్నానికి చివరికి ఇటువంటి దుర్గతి పట్టడం బహూశా వేరే ఏ మతంలోనూ కనపడదేమో. ఎంత వైరుధ్యం!

క్యాంపులో గెరిల్లాలకు విరోచనాలు పట్టుకుంటే డాక్టర్ పవన్ వైద్యం చేయగలడేమో కానీ ఇదే క్యాంపులో మత కల్లోలాలు చెలరేగితే మాత్రం ఆ దేవుడు కూడా ఏమి చేయలేదు. అపుడు వైద్యమూ, ప్రార్థనా రెండూ పని చేయవు. అదృష్టవశాత్తూ ఆవు, పందిల మధ్య పెద్దగా ఘర్షణ లేని గోండుల నడుమ ఉన్నాం మనమిపుడు.

సత్నామ్

వంటశాల నుండి తిరిగి వస్తుంటే 'ఐతు భాయ్! ఈ గోండ్‌లు మానవ ప్రవృత్తికిచాలా దగ్గరగా ఉన్నారు. వాళ్లు హిందువులో, ముస్లింలో కారు కదా' అన్నాన్నేను.

'అవున్నిజమే' అన్నాడు ఏటు.

'వారికి కూడా దేవుళ్లు ఉన్నారు. కానీ అదృష్టవశాత్తూ మత కల్లోలాలను రెచ్చగొట్టే రకం కాదు వాళ్లు గిరిజన ప్రాంతాల్లో చర్చిలు, మసీదులు కట్టే ఆధ్యాత్మిక సంస్థలు ఒక కొత్తరకం తుఫాన్ సృష్టిస్తున్నాయి. ఈ మిషనరీ స్కూళ్లలో నేర్పించే విద్య అనే వెలుగు నిజానికి ఈ గిరిజనులు కళ్లను మసకబారేటట్టు చేస్తోంది.'

'ఈ మిషనరీలు గిరిజనుల భూమిని, వారి సంస్కృతిని, వారి చరిత్రనూ మింగేయాలని చూస్తున్నారు. గిరిజనులు కత్తులు, త్రిశూలాలతో కొట్టుకొని చావాలని వారి పన్నాగం. గిరిజనులు జల్, జంగిల్ జమీన్ కోసం చేసే పోరాటాన్ని దారి మళ్లించాలనేది ఈ మిషనరీల వ్యూహం కానీ మేం వారి ఆటలు సాగనివ్వం. ఇక్కడి గిరిజనుల్లో ఉన్న మూఢనమ్మకాలను ప్రారదోలేందుకు కూడా మేం ప్రయత్నిస్తున్నాం' అని వివరించాడు.

గిరిజనుల కొరకు ఒక శాస్త్రీయ విద్యా సిలబస్‌ను ఐతు తయారు చేస్తున్నాడు. సైన్సును, నిజాలను అర్థం చేసుకొనే శక్తి ఉండి కూడా బూర్జువా సంస్థలకు కారుచౌకగా తమ మేధోశక్తిని అమ్ముకునే విద్యాధికుల పట్ల ఐతుకు ఒక లాంటి జాలి ఎగతాళి ఉన్నాయి.

★★★

మరుసటి రోజు చుట్టుప్రక్కల గూడేల నుండి చాలా మంది అమ్మాయిలు, అబ్బాయిలు వచ్చారు. ఈ కోలాహలం చూసి ఈ రోజు ఏమైనా రిక్రూట్‌మెంట్ దినం జరుగుతుందేమోనని అనుకున్నాను.

'కోసా! ఏమిటి అంతమంది వచ్చారు. ఇవ్వాళ ఏమన్నా విశేషమా?' అని అడిగాను.

'ఏం లేదు క్యాంపును చూసి తమ మిత్రులను కలవడానికి వీళ్లంతా వచ్చారు' బదులిచ్చాడు కోసా.

"ఇంతమందిని రానిస్తే ప్రమాదం కదా!" అడిగాను

"ఏం ప్రమాదం? వాళ్లు మా వాళ్లే కదా. అలాంటి ప్రమాదం ఉంటే ఇన్ని రోజులు ఇక్కడ ఉండే వాళ్లం కాదసలు. మన క్యాంపు గురించి చాలా దూరంలో ఉన్న గూడేల వాళ్లకు కూడా తెలుసు. తమ సన్నిహితులు ఇక్కడ ఉన్నారని తెలుసుకుని వారిని కలవకుండా ఎవరైనా ఎలా ఉండగలరు! అందుకే వాళ్లిలా వచ్చారు".

అక్కడంతా పండుగ వాతావరణం నెలకొని ఉంది. తమ ఆత్మీయులను కలిసి కాసేపయ్యాక వెళ్లిపోయారా అబ్బాయిలు, అమ్మాయిలు. ఉద్యమం గురించి వారికి బాగానే అర్థమవుతోంది ఇపుడు. జల్, జంగల్, జమీన్ కొరకు సాగే పోరాటమే ఈ గిరిజన యువతీ యువకులను గెరిల్లాలకు చేరువ చేస్తోంది.

నాకు భోపాల్, భరత్‌పూర్‌లలో కార్గిల్ యుద్ధం కొరకు జరిగిన రిక్రూట్‌మెంట్ సందర్భంగా జరిగిన లాఠీఛార్జ్, పోలీస్ కాల్పులు గుర్తుకువచ్చాయి. ప్రజా సైనిక శక్తికి, పైనుండి మనమీద రుద్దబడిన ప్రభుత్వం సైనిక శక్తికి ఎంత తేడా ఉంది కదా!

వంటశాలలో డ్యూటీ చేస్తున్న ఒక గెరిల్లా నేపధ్యం చాలా ఆసక్తికరంగా అనిపించింది నాకు. మొదలు అతని పెద్దక్క దళంలో చేరిందట. ఓ ఏడాది గడిచాక ఇతను దళంలో చేరితే మరో రెండేళ్లకు ఇతని ఇద్దరు చెల్లెళ్లు కూడా ఇంటిని వదిలి చేరారట. ఇక్కడ దళంలో జీవితం చాలా నచ్చిందని చెప్పాడు అతను.

ఈ గిరిజనులు విల్లు, బాణం వాడటం నేర్చుకున్నంత వేగంగా తుపాకీని వాడటం, దాని భాగాలను శుభ్రపరచడం, రిపేర్ చేయడం నేర్చుకుంటారు. మిలిటరీ యూనిఫారం ధరించాలని ఎంతో ఉబలాటంగా ఉన్నా నిక్కర్, బనీన్ ధరించే పీపుల్స్ మిలీషియా సభ్యుల్లా కూడా వారు చాలా గర్వంగా ఫీలవుతారు.

కొత్త సైన్యం అంటే ఇక్కడి కుర్రాళ్లకు ఎనలేని ఆసక్తి. కోళ్లను ఎత్తుకుపోయే పోలీసులను ఎలా ఎదుర్కోవాలో ఇప్పుడు వారికి తెలుసు. గిరిజన స్త్రీ ఇపుడు రాత్రైనా పగలైనా అడవిలో స్వేచ్ఛగా తిరగగలుగుతుంది. దగ్గర నుండి ఓ గెరిల్లా స్క్వాడ్ వెళుతున్నపుడు ఆమె ఇంకా సురక్షితంగా ఉన్నాననుకుంటుంది.

ఈ అడవి పుత్రికలు నేటికీ క్రూరమృగాలంటే భయపడుతుండవచ్చు కానీ ఒకప్పుడు తనని హడలెత్తించిన రెండు కాళ్ల జంతువు మాత్రం ఇప్పుడు కనపడకుండా పోయింది.

అడవిలో పరిస్థితి చాలా మారింది. అయితే మారాల్సింది కూడా చాలా ఉంది. ఇక్కడి ప్రజలు ఇప్పుడు ఆనందంగా ఉన్నారనే చెప్పొచ్చు. ఈ మార్పులు వారి జీవితంలో తొలిసారిగా చూస్తున్నారు. కొత్త తరానికి ఇదొక సంధియుగం. పాత తరానికేమో ఈ మార్పు ఒక అద్భుతం!

ఒకప్పుడు దళం దగ్గర ఉన్న తుపాకులను చేపట్టేవారు లేని పరిస్థితి నుండి, ఇవ్వాళ తుపాకుల సంఖ్య కన్నా గెరిల్లాల సంఖ్య ఎక్కువ అయిన పరిస్థితికి వచ్చామని కోసా చెప్పాడు.

గెరిల్లాలు ఏ గూడేనికి వెళ్లినా మొత్తం గూడెంలోని ప్రజానీకం యావత్తూ వారిని కలువడానికి వస్తారు. గ్రామాల్లోని యువతీయువకులైతే దళంతో పాటే పొద్దుపోయేవరకూ గడుపుతారు. ఇక తాము బయలుదేరే సమయానికి దళ సభ్యులే వీరిని బలవంతాన ఇళ్లకు పంపించి వేస్తారు. అపరిచితులను ఎప్పుడూ నమ్మని గిరిజనులు, సాయుధులను చూసి భయపడే ఈ గిరిజనులే ఇవ్వాళ ఈ బలగాలను చూసి ఆనందిస్తున్నారు. దళం గూడెం సమీపంలోకి వచ్చిన ప్రతిసారీ గిరిజనులు తమ దగ్గర ఉన్న బియ్యం, కూరగాయలు, మంచినీళ్లు తీసుకుని వస్తారు. గెరిల్లాలు చేపలైతే ఈ గిరిజనులు ఒక సముద్రం వంటి వారు. అడవిలో ఇప్పుడు కొత్త నృత్యాలు, కొత్త పాటలు ఇంకా కొత్త ఆలోచనల జాతరొకటి సాగుతోంది. ఇక్కడ ప్రతిదీ కొత్త రూపు సంతరించుకుంటోంది. ప్రతిదీ కొత్త వెలుగులో కనపడుతోంది. శిశిరం తరువాత చిగురించే వసంత పుష్పాల్లా ఉన్నారు ఇక్కడి గిరిజనులు. పేదరికం, అనారోగ్యం, ఆకలి మధ్య ఉన్నా వారు సంతోషంగానే ఉన్నారు. వారి గుండెల నిండా రేపటి గురించి ఆశలు నిండి ఉన్నాయి. కళ్ల ముందే ఒక స్వప్నం సాకారమవుతూ కనపడుతోంది. కానీ దానికొరకు వారు ఫణంగా పెట్టేది భారీగానే ఉంది. కానీ ఏదీ ఫణంగా పెట్టకుండా వసంతం వచ్చేది కాదేమో!

ఇంకో రెండు రోజుల్లో నేను ఈ క్యాంపు నుండి బయలుదేరాల్సి ఉంటుందని నాకు తెలిపారు. మళ్లీ ఈ మనుషులను కలుస్తానో లేదో. కాబట్టి ఉన్న రెండు రోజులూ బాగా వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నాను.

***

రాత్రి భోజనాలప్పుడు డాక్టర్ పవన్‌ను కలిశాను.

'బాగున్నారా డాక్టర్' అడిగాను

'బాగున్నాను!' బదులిచ్చాడు పవన్

ఆకారం చూస్తే బెంగాలీ లాగా, రంగు చూస్తే మదరాసీ లాగా ఉంటాడు పవన్. హిందీలో అనర్గళంగా మాట్లాడగలడు. అనేక భాషల్లో రాయగలడు. కళ్లద్దాలు ధరించి సీరియస్‌గా కనపడే పవన్ చేతిలో ఎల్లప్పుడూ ఒక మందుల సంచీ మాత్రం ఉంటుంది. ఏ సమయంలో కడుపు నొప్పి, రక్తహీనత, మలేరియాతో బాధపడుతున్న రోగి ఎదురవుతాడో తెలియదు ఆ అడవిలో. ప్రతి మహిళా గెరిల్లా రక్తహీనతతో బాధపడుతూనే ఉంటుంది. అందుకే డాక్టర్ పవన్ వద్ద పెద్ద పరిమాణంలో ఐరన్ టాబ్లెట్లు ఉంటాయి. పవన్ కూడా గెరిల్లా యూనిఫారం ధరించినా అతని చేతిలో ఎప్పుడూ ఆయుధం ఉండదు. అంతేకాదు అతను ఏడాది పొడుగునా దళంతో ఉండడు. అడవి బయట డాక్టర్ వృత్తిలో ఉన్న పవన్ ఏడాదికి ఒకటి రెండు సార్లు ఇలా అడవిలోకి వస్తుంటాడు.

గిరిజనులకు ప్రాథమిక ఆరోగ్య రక్షణలో శిక్షణ ఇస్తుంటాడు పవన్. చైనా విప్లవ సమయంలో "బేర్‌ఫుట్ డాక్టర్స్" చాలా పేరు సంపాదించారు. వారు నిజంగా కాళ్లకు చెప్పులు లేకుండా ఉండేవాళ్లే లేరో నాకు తెలియదు. కానీ పవన్ శిక్షణ ఇచ్చే గిరిజనులు మాత్రం కాళ్లకు చెప్పులు లేని వారే. ఈ క్యాంప్‌లో యువ గెరిల్లాలకు వివిధ వ్యాధులు, వాటి చికిత్సకు వాడవలసిన మందుల గురించి పవన్ శిక్షణ ఇస్తున్నాడు.

'మీరు ఎన్నేళ్ల నుండీ ఈ శిక్షణ ఇస్తున్నారు?' అడిగాను పవన్‌ను

'చాలా ఏళ్లయింది.'

మలేరియా వంటి నయం చేయగల సాధారణ వ్యాధుల వల్ల ప్రజలు చనిపోతే అది తను చూడలేనంటాడు పవన్. అడవిలో రోగాలబారిన పడి మరణించేవారిలో సగం మంది మలేరియా బారినపడ్డవారే. ఇక్కడ ఏదైనా రోగం వచ్చిన వారికి డాక్టర్ అందుబాటులో ఉండదు కాబట్టి దేవుడే దిక్కు కానీ ఆ దేవుడు ఎప్పటికీ ప్రత్యక్షం కాక బాధితులు మరణిస్తూనే ఉంటారు.

'ఈ గిరిజనులు ఏ పాపమూ చేయరు. ఎవరికీ చెడుచేయరు. కానీ వారికి శిక్ష విధించబడుతోంది. ఎక్కడైతే పాపం, మోసం ఉన్నాయో అక్కడ శిక్ష లేదు. శిక్ష ఉన్న చోట పాపం లేదు. ఇదీ లోకం తీరు' అని నిట్టూర్చాడు.

ఒకరిని ఒకరు దోచుకునే వ్యవస్థ అంటే పవన్‌కు చాలా చిరాకు, 'బయట ఉన్నప్పుడు నేను సంపాదించిన దాన్ని పొదుపు చేసి మందులు కొంటాను. అవి తీసుకొని అడవిలోకి వస్తాను. ఇలా చేయడం నాకెంతో సంతృప్తినిస్తుంది. నాలోని వేదన కొంచెం అయినా ఉపశమిస్తుంది. చెడుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వారికి బలం ఇవ్వడం ద్వారా నేనూ ఆ మంచిపనిలో పాలుపంచుకున్నట్టవుతుంది'

డాక్టర్ చదువు అయిపోగానే చేసే హిపొక్రేట్స్ ప్రతిజ్ఞ రోజునే పవన్ తన జీవిత లక్ష్యం ఏమిటో నిర్ణయించుకున్నాడు. చాలా మంది యువ డాక్టర్లకు ఈ ప్రతిజ్ఞ ఒక నామమాత్రపు తంతు. దాన్ని వారు త్వరలోనే మర్చిపోతారు. కొందరు ఏడాదిలో మర్చిపోతే కొందరికి అయిదు లేదా పదేళ్లు పట్టొచ్చు. చాలా మందికి ఆ ప్రతిజ్ఞ ఒక నవ్వులాటగా ఉంటుంది. వారి కెరీర్‌కి ఈ ప్రతిజ్ఞ ఒక అడ్డంకిగా భావిస్తారు. మూటల కొద్దీ డబ్బు సంపాదించే స్వప్నాలతో ఈ వృత్తిలోకి వస్తారు చాలా మంది. వారి దృష్టిలో రోగం అనేది డబ్బు సంపాదించే బంగారంలాంటి అవకాశం. రోగులు ఎక్కువ వస్తే 'ఈ సీజన్ బాగుంది' అనుకునే రకాలు వీళ్లు. 'దేవుని తరువాత దేవునంతటి వాడు వైద్యుడు' అనేది పాత నానుడి. కానీ లోకంలో అందరు పేదలకులాగే బస్తర్‌లో కూడా ఇటు దేవుడూ లేడు అటు వైద్యుడూ లేడు. దేవుడేమో కంటికి కానరాడు. వైద్యుడేమో ఫక్తు వ్యాపారి అయ్యాడు. డబ్బుంటే వైద్యం ఉంటుంది. లేకుంటే మృత్యువే గతి అవుతుంది.

సార్వత్రిక గ్రంథాలయ
17554

ఐతు పవన్ ఇద్దరూ ఒకలాంటి వారే వారిక్కడ ఒక స్వప్నం సాకారం చేసే ప్రయత్నంలో ఉన్నారు ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించాలనే స్వప్నం!

ఇంతలో పవన్ విద్యార్థులు వచ్చారు భుజానికి తూపాకులు చేతిలో నోట్‌బుక్కులు జేబులో పెన్నులు వంటశాల పక్కన ఉన్న టెంటులోకి వెళ్ళి కూర్చున్నారు

రెండు ప్లస్ రెండు మూడు ప్లస్ నాలుగు ఇరవై ఒకటి ప్లస్ ముప్పైఆరు సులభమైన లెక్కలు నేర్చుకుంటున్నారు వాళ్లు గోండు యువతకు అంకెల ప్రపంచం వింతగాను ఆసక్తికరంగాను ఉంటుంది వాళ్లు చిన్నతనం నుండి గంపకొద్దీ ఇప్పపూలు పుట్టల్లోంచి చీమలు సేకరించినా ఎన్నడూ వాటిని లెక్కించాల్సిన అవసరం రాలేదు తాము సేకరించిన వాటిని తీసుకుని అమ్మకుతోడుగా వారాంతపు సంతకు పోయినప్పుడు షావుకారు ఎంత ఇచ్చేవాడో కూడా తెలియదు వాళ్లకు చాలా సార్లు గంపెడు ఇప్పపూలు తీసుకుని ఓ గుప్పెడు ఉప్పు లేదా రెండు చిటికెల పొగాకు మాత్రం ఇచ్చేవాడు షావుకారు అక్కడి పెద్దగా బేరమాడే అవకాశం కూడా ఉండేది కాదు ఒక వేళ అయిదో పదో రూపాయలు చేతిలో పడ్డా వాటిని లెక్కపెట్టడం కూడా వచ్చేది కాదు

రెండు ప్లస్ రెండు! ఇరవై ఒకటి ప్లస్ ముప్పై ఆరు! ఇప్పుడు వారికి అంకెల విలువ తెలుస్తోంది అడవిలో చెట్టు విలువ పదుల వేల రూపాయలు చేస్తుందని దాన్ని కొట్టినందుకు కాంట్రాక్టర్ తన తండ్రికి చెల్లించే ఎదు రూపాయలు కాదని

ఎంత డబ్బు! అడవిలో ఇంత సంపద ఉందని తెలుసుకుని వాళ్లు ఆశ్చర్యచకితులవుతున్నారు

మొదట్లో వాళ్లు వంద వరకు లెక్కపెట్టడానికే చాలా కష్టపడతారు 9 రాయాల్సివచ్చినప్పుడు 6 లేదా 4 రాస్తారు ఎదో అర్థం కాని అల్లిబిల్లి అక్షరాలు చుట్టేస్తారు కానీ పాట పాడమంటేనో నృత్యం చేయడం అంటేనో వెంటనే మొదలుపెట్టేస్తారు

ఓ గంట చదువుకున్నాక ఒక పాట పాడి కాస్త సేదతీరుతారు. ఒకరు పుస్తకంలోని కథను చదువుతుంటే మిగతావారు ఆసక్తిగా వింటారు. అక్షరాల్లో ఒక కథ మొత్తం ఒదిగిపోవడం వారిని అబ్బురపరుస్తుంది. పవన్ వారికి సంతల్లో షావుకార్లు చేసే మోసాల గురించి కూడా వివరిస్తాడు. ప్రజలే ఒక ఉత్పత్తికి బదులుగా మరో ఉత్పత్తిని మార్పిడి చేసుకోవాలని, మధ్య దళారులని నిర్మూలించాలని వారికి నూరిపోస్తాడు.

పవన్ క్లాసు అయిపోయాక మరొక ఉపాధ్యాయుడు అతని స్థానంలో వస్తాడు తుపాకీని శుభ్రం చేసినట్టు, వ్యాయామం చేసినట్టు, ఈ క్యాంప్‌లో పాఠశాల కూడా దైనందిన జీవితంలో ఒక భాగం.

సాయంత్రం నుండే ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. పాఠశాల అయిపోయే సమయానికి అవి ఇంకా దట్టం అయ్యాయి. ఈ అకాల వర్షాలు మొత్తం కార్యక్రమాలని తలక్రిందులు చేస్తాయి. ఈ వర్షాల వల్ల చలి కూడా పెరిగిపోతుంది. క్యాంప్‌లో చలి నుండి రక్షించే దుస్తులు కూడా లేవు.

'ఈ వర్షాన్ని మేం ఊహించలేదు.' నా టెంటులోకి వస్తూ అన్నాడు కోసా. 'చలి నుండి కాపాడుకోవడానికి మంట వేసుకోవాల్సిందే' అన్నాడు.

'కట్టెలన్నీ తడిసిపోవా?' అడిగాను.

'వాతావరణం మారడం గమనించి నిన్ననే కట్టెలు సేకరించి ఉంచాం' అన్నాడు.

ప్రతి టెంటులోనూ ఓ ఎండుకట్టెల మోపు ఉంది. సెంట్రీ డ్యూటీలో ఉన్న వాళ్ళు. ఓ ప్లాస్టిక్ కవర్ కప్పుకొని వర్షం నుండి తమని తాము రక్షించుకుంటారు. వర్షాకాలంలో సెంట్రీ డ్యూటీ సాధారణంగా గంటన్నర నుంచి ఉండదు.

'వర్షాకాలం గడవడం చాలా కష్టం అనుకుంటా' అడిగాను.

'చాలా కష్టం. మా దారులన్నీ బురదమయం అవుతాయి. చాలాసార్లు చెట్ల కిందే తలదాచుకోవాల్సి వస్తుంది. కానీ మా మందుగుండు ఎక్కడ తడిసిపోతుందో అనే భయం ఉంటుంది మాకు. మనిషికి జబ్బు చేస్తే మందులు వాడొచ్చు కానీ మా బుల్లెట్లు తడిస్తే మాత్రం ఇబ్బందే.'

'ఏం తింటారు వర్షాకాలంలో?'

'దగ్గరలో ఏదైనా గూడెం ఉంటే వాళ్లు ఏదో ఒకటి వండి పెడతారు. గూడెం లేకపోయినా, వంటచెరుకు దొరక్కపోయినా పచ్చి బియ్యం తిని బతకాల్సిందే'.

మేం మాట్లాడుతుండగానే భోరున వర్షం ప్రారంభమైంది. మా టెంటులకు ఇరువేపులా నీళ్లు పోయేందుకు చిన్న చిన్న కాలువలు తవ్వారు. అయినా కొన్ని నీళ్లు టెంటులోకి ప్రవేశించాయి. మా సామాన్లన్ని రెండు ప్లాస్టిక్ సీట్లపై దాచాం. వర్షం ఉన్నా క్యాంపు గస్తీ కొనసాగుతూనే ఉంది. ఈ వర్షం ఆగకపోతే రాత్రి మాకు జాగరమే.

సమయం గడవడానికి ప్రతి ఒక్కరూ ఏదో ఒక సంఘటన గురించి చెబుతున్నారు. అడవిలో ఎలుగుబంటిని చూసిన వారు, దారిలో పామును చూసిన వారి అనుభవాలు.

ఓ మూడు గంటల తరువాత వర్షం నెమ్మదించి చిన్న ముసురులా మారింది. టెంటులో ఇంకో రెండు ప్లాస్టిక్ షీట్లు పరిచారు. గెరిల్లాలు ఆ కొద్ది స్థలంలోనే ముడుచుకుని పడుకున్నారు.

ఉదయం లేచేసరికి కోసా ఓ చలిమంట ప్రక్కన కూర్చుని కనిపించాడు.

'రాత్రంతా నిద్రపోలేదా కోసా' అడిగాను.

'పడుకున్నాను. ఇప్పుడే నిద్రలేచాను. వాతావరణం చాలా బాగుంది అలా వెళ్లి వద్దామా?' అన్నాడు.

నేను బూట్లు వేసుకొని సిద్ధం అయ్యాను.

నవంబర్ రెండోవారం అది. వర్షం వల్ల చలి హెచ్చింది. ఉత్తర భారతంతో పోలిస్తే ఒక నాలుగైదు డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రత ఉంటుంది ఇక్కడ. వర్షం నీరు ఇంకిపోయినా ఇంకా కాలిబాటలు అన్నీ జారుడుగానే ఉన్నాయి. వర్షానికి తడిసిన సరిసరాలు కడిగిన ముత్యాల్లా ఉన్నాయి. అడవిలో వేకువ ఎపుడూ అందంగా ఉంటుంది. ఇవ్వాళ వర్షంతో ఆ అందం

ద్విగుణీకృతమైంది. కనుచూపు మేరలో ఎక్కడా ఒక్క పక్షి కనపడకపోయినా ఏదో తెలియని సంగీతం చెవులకు సోకుతోంది. అసలైతే అడవిలో నిశ్శబ్దం కూడా చెవులకు ఇంపుగానే ఉంటుంది. కానీ ఇవ్వాళ అడవి నిశ్శబ్దంగా లేదు. అది ఆనందంతో ఊగుతోంది. వర్షానికి కొండపై నుండి కొట్టుకువచ్చిన మట్టితో క్రిందనున్న సెలయేరు ఎర్రబారింది.

'ఇవ్వాళ మనం ఈ నీళ్ళు తాగాల్సిందేనా' కోసాను అడిగాను సెలయేరు వైపు నడుస్తూ.

'గిరిజనులు ఆ నీళ్లనే తాగుతారు. మనం వాటినే కాచి చల్లార్చి తాగుతాం. ఇక్కడ నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు పెద్దగా రావు అయినా ఎందుకైనా మంచిదని మనల్ని కాచిన నీళ్లే తాగమని మన డాక్టర్లు సూచించారు. ఇక్కడి గిరిజనులకేమో మన అలవాట్లు వింతగా కనిపిస్తాయి. నీళ్లు వేడి చేసుకుని తాగడం, ఉదయాన్నే టూత్‌బ్రష్‌తో తోముకోవడం, ఎప్పుడూ బూట్లు ధరించడం, పుస్తకాలు చదవడం... ఇవేవీ వాళ్ల దైనందిన జీవితంలో ఉండవు.'

నేను అన్నం స్పూన్‌తో తినడం కూడా వారికి వింతగానే కాదు అవసరం లేని ఆడంబరంలా కనిపించేది. చేతులున్నపుడు స్పూన్ వాడటం అనవసరం కదా. అలాగే చుట్టూ ఉన్న చెట్ల నిండా ఆకులు ఉన్నపుడు ప్లేట్లు కూడా అక్కరలేదు. ఆకును తెంపుకుని, అందులో అన్నం వడ్డించుకుని చేతితో తినేయడమే. దళంతో పాటు టీ తాగినపుడు గిరిజనలు ఓ చెట్టు ఆకును తెంపి దాన్ని కప్పులా వాడుతారు. అడవిలో అన్నీ డిస్పోజబులే. నగరాల్లో మాత్రం ఆకులో తినడమంటే స్టేటస్‌సింబల్ అన్నమాట.

ఓ బండరాయిపై కూర్చున్నాం నేనూ కోసా.

'నగరాలు మాకు మద్దతు పలుకుతాయా?' ప్రశ్నించాడు కోసా

'తప్పకుండా! నగర జీవితం నరకప్రాయంగా మారిన వాళ్లు, అక్కడి జీవితంతో విసుగెత్తిన వాళ్లు తప్పకుండా మతిస్తారు.'

'కానీ ఎప్పుడు?'

కోసా ప్రశ్నకు నా దగ్గర సూటి సమాధానం లేదు. నగరంలో బాధాసర్పద్రష్టుల సంఖ్య తక్కువేమీ లేదు. అడవిలో అయినా పట్నంలోనయినా ఈ దరిద్రనారాయణులు నాగరిక సమాజంలో ఎపుడూ భాగం కాలేదు.

అడవిలోనయితే విప్లవాగ్ని రాజకుంది. మరి నగరంలో కొలిమి ఎపుడు అంటుకుంటుందంటే, ఆ ప్రశ్నకు నా వద్ద జవాబు లేదు. కానీ ఆ రోజు తప్పక వస్తుందని కోసాకు హామి ఇచ్చాను.

'ఇవ్వాళ ఏం చేస్తున్నారు' అడిగాడు ఐతు

'ఎక్కడికి పిలిస్తే అక్కడికి వెళ్లడమే' నవ్వుతూ అన్నాను.

నీవేం చేస్తున్నావని అతన్ని అడిగాను. 'నాకు కూడ పెద్దగా పనేం లేదు. ఇవ్వాళ గెరిల్లా యుద్ధంలో శిక్షణ ఇస్తున్నారు కాబట్టి నేను ఖాళీగానే ఉన్నాను'

'ఎందుకు? నీకు ఆ సబ్జెక్ట్‌పై ఆసక్తి లేదా? నువ్వు శాస్త్రవేత్తవని నీకు మినహాయింపా?'



'ఉట్టి శాస్త్రవేత్తను కాను. ఎర్ర శాస్త్రవేత్తను' ఏటు జవాబు విని ఇద్దరం గట్టిగా నవ్వేశాం.

ఎరుపు, శాస్త్రవేత్త.... అంటే కమ్యూనిస్టు సైంటిస్ట్ అన్నమాట చైనా సాంస్కృతిక విప్లవం ఈ రెండు పదాలను ప్రపంచం నలుమూలలకు చేరవేసింది. విప్లవం సమయంలో ఈ రెండు పదాలు చాలా ప్రాచుర్యం పొందాయి. ఆ కాలంలో విప్లవోద్యమం విద్యార్థికులను బాగా ప్రభావితం చేసింది. ఉత్తుంగ తరంగంలా ఎగిసిన సాంస్కృతిక విప్లవం ఈ రెండు పదాలను ప్రపంచం నలుమూలలకు చేరవేసింది. చైనా ఉద్యమం రంగు వెలిసిపోవడం ప్రారంభం కాగానే ఈ పదాలు కూడా వాటి మెరుపు కోల్పోయాయి. మెల్లగా ఎరుపు రంగుపై నిపుణుడు అజమాయిషీ చేయడం మొదలుపెట్టాడు. కొన్నాళ్లకు నిపుణుడు మిగిలి కమ్యూనిస్టు మాయమయ్యాడు. నిపుణుడికి తన వ్యవస్థను నడపడంలో సర్వం తెలిసి ఉంటుంది. కానీ అతడే కనుక కమ్యూనిస్టు అయితే కాలం చెల్లిన వ్యవస్థలను మార్చగలడు. లేకుంటే అతను కేవలం వ్యవస్థకు నమ్మినబంటుగా మిగిలిపోతాడు.

చైనా పెట్టుబడిదారీ విధానాలు అవలంభించడం మొదలుపెట్టాక ప్రపంచవ్యాప్తంగా నిపుణులు కమ్యూనిస్టులు కావడం ఆగిపోయింది. విప్లవోద్యమం ఉచ్ఛదశలో ఉన్నపుడు ఏటు, పవన్ వంటి విప్లవకారులు తయారయ్యారు. జీవితంలో సగభాగం గడిచిపోయినా వారిలోని కమ్యూనిస్టు స్ఫూర్తి, నిపుణుడు–ఇద్దరూ సజీవంగానే ఉన్నారు. వారిలో ఆ రెండు అంశాలూ ఇంకా బలపడ్డాయని చెప్పాలి. వారు విప్లవోద్యమానికి గుండెకాయ వంటి దండకారణ్యంలో ఉండటం, ఉద్యమంతో అనుక్షణం మమేకమై ఉండటం వల్లనే ఇది సాధ్యపడింది. నిత్యపోరాటం, కార్యాచరణ లేని దగ్గర మాత్రమే ఉద్యమం కుంటుపడుతుంది. అపుడు విప్లవం మన డ్రాయింగ్‌రూమ్‌లో కాఫీ కప్పుకే పరిమితమై దాని ఆత్మ మరణిస్తుంది. ఏ వ్యవస్థ అయినా నిపుణులను తయారు చేయగలదు. కానీ వారు ఉద్యమంతో కలిసిపని చేసినపుడే వ్యవస్థను మార్చగలిగే శక్తి కాగలరు. డెబ్భైయవ దశకంలో విప్లవోద్యమంలో ఒక పెద్ద గొలుసుకట్టు వలె నిపుణులు ఉండేవారు. క్రమంగా ఆ గొలుసుకు తుప్పుపట్టి కొన్ని లింకులు ఊడిపోయాయి. గొలుసు చిన్నదైంది. కానీ ఈ నాటికీ పోరాటం మాత్రం కొనసాగుతూనే ఉంది. 

ఐతు, పవన్ నేను కలిసి అడవిలో ప్రవహించే నది వద్దకు వెళ్లాం. దారిలో ఉన్న అనేక ఔషధ మొక్కలను శాస్త్రీయ నామాలతో సహా పరిచయం చేశాడు ఐతు.

బస్తర్‌లోని మాథ్ ప్రాంతంలో వజ్రాలు కూడా లభిస్తాయని చెప్పాడు ఐతు. వజ్రాలను తవ్వితీసే గిరిజనులు దారుణమైన అణచివేతకు గురఅయి పేదరికంలో మగ్గేవారట. జష్‌పూర్ వద్ద నదుల్లో బంగారం, వజ్రాలు వెలికితీసే గిరిజనులది కూడా ఇదే దుర్భరమైన పరిస్థితి. వడ్లు పండించే రైతులకన్నా వజ్రాలు తవ్వితీసే గిరిపుత్రుల బ్రతకు ఘోరంగా ఉండేది. స్మగ్లర్లు, ముఠాకోర్లు, గ్యాంగుల చేతిలో ఈ ప్రాంతం మొత్తం అరాచకత్వం రాజ్యమేలేది. బస్తర్ నుండి ఆఫ్రికాలోని సియర్రాలియోన్ వరకూ వజ్రాలు బంగారం దొరికే ప్రతిచోటా ఇదే పరిస్థితి. గిరిజనులు ఆకలితో అలమటిస్తుంటే బొంబాయి, గుజరాత్, యూరప్‌లోని వ్యాపారులు ఖజానాలు మాత్రం గలగల మంటూంటాయి.

వజ్రాలు, బంగారం గిరిజనుల కడుపు నింపవు. అందుకే అవి భూమిలో ఉండటమే కరెక్టు. మాథ్‌లో వజ్రాల వ్యాపారుల అరాచకత్వానికి విప్లవోద్యమం అడ్డుకట్ట వేసింది. వారిని ఆ ప్రాంతం నుండి తరిమివేశారు గెరిల్లాలు. అక్కడి గిరిజనులు ఇపుడు వ్యవసాయం చేసుకుని రెండు పూటలా తినగలుగుతున్నారు. అణచివేత నుండి విముక్తిని పొందారు.

గిరిజనులకు వ్యవసాయం నేర్పడం చాలా కష్టమవుతుందని ఐతు చెప్పాటు. వందల ఏళ్ల నుండి మార్పు లేకుండా కొనసాగుతున్న వారి జీవన విధానాలను మార్చడం గెరిల్లాలకు పెద్ద సవాల్‌గా మారింది.

ఆ రోజు సాయంత్రం ఒక వెదురు బెంచీపై కూర్చుని నోట్స్ రాసుకోసాగాను. నా కథనంలోని పాత్రలు ఎక్కడి నుండి వచ్చారో, వారి గతం ఏమిటో, ఏమీ తెలియదు. ఒక మహోన్నత లక్ష్యం కొరకు వాళ్లంతా ఇక్కడ కలిశారు.



గెరిల్లాలు ఎప్పుడూ పనికిరాని మాటలు మాట్లాడటం నేను వినలేదు. ఎవరైనా వృథా సంభాషణ మొదలు పెట్టినా ఇతరులు వెంటనే వారిస్తారు. ఇక్కడి వాతావరణంలో ఒక చిత్తశుద్ధి కనపడుతుంది. చిత్తశుద్ధి, అంకితభావం, క్రమశిక్షణ. ఈ మూడు కలగలసి ఉంటాయిక్కడ.

***

ఈ క్యాంపులో నేను ఇంకా 24 గంటలే ఉంటాను. ఆ తరువాత ఈ క్యాంపు ఇంకో దిశగా ప్రయాణం అవుతుందేమో. సంచార తెగల్లాగే గెరిల్లాల తెగ కూడా ఒక చోట ఉండరు. వారు దీన్ని చలనశీలత అంటారు. సాయంత్రం వచ్చిన కొత్త గెరిల్లా దళానికి కూడా మాలాగే ఘనస్వాగతంలభించింది. వీడ్కోలు కూడా అంతే ప్రేమగా ఉంటుంది. వెళ్లిపోతున్న కరచాలనాలు, సెల్యూట్‌లు చేయడానికి వారికి క్యాంప్‌లోని గెరిల్లాలు అందరూ ఒక చోటకి వస్తారు. మళ్లీ కలుస్తారో లేదో ఎవరికీ తెలియదు. ఆ సందర్భం యుద్ధానికి బయలుదేరుతున్నట్టు ఉంటుంది. ఇదీ యుద్ధమే కదా? నిర్విరామ యుద్ధం!

సత్నామ్

వెళ్లిపోతున్న బృందం మళ్లీ తిరిగి వస్తుందా? ఎవరికీ తెలియదు. అందుకే కలిసినప్పుడు, విడిపోయినపుడు ఆత్మీయ ఆలింగనాలు ఉంటాయి. వారు ఒకరికొకరు ఆశను, శక్తినీ ఇచ్చిపుచ్చుకుంటారు.

***

క్యాంపులో గెరిల్లాలు వంటశాలలో రోజుకు నాలుగుసార్లు కలుసుకుంటారు. ఇక్కడ మనుషుల మధ్య దూరాన్ని తగ్గించి, ఒక సామూహిక తత్వాన్ని బోధించే చక్కని ప్రదేశం వంటశాల. ఇదేదో గడిచిన రోజుల అవశేషం కాదు. ఇప్పటి సమాజానికి ఎంతో అవసరమైన వ్యవస్థ. ఇక్కడ ఏది తలుపుల, తాళాల మాటున దాచి ఉంచరు. అన్నీ అందరికీ లభ్యం అవుతాయి. ఇళ్లలో నాలుగు గోడల మధ్య జన్మించే రహస్యాల, దూరాలకు ఇక్కడ తావులేదు. రాబోయే సమాజానికి ఇదో చిన్న భవిష్యత్ చిత్రపటం.

ఇక్కడ వివక్ష ఉండదా అంటే ఉంటుంది. కొందరికి ఇక్కడ ప్రత్యేక మినహాయింపులు లభిస్తాయి. మహిళా గెరిల్లాలకు బెల్లం, గుడ్లు, అదనంగా ఇస్తారు. ఇవి ఆరోగ్యంగా ఉన్న మగ గెరిల్లాలకు లభించవు. మహిళా గెరిల్లాలకు లభించే ఇంకో అదనపు ఆహారం గుప్పెడు వేరుశనగ గింజలు. కానీ ఈ వివక్ష ఎవరికీ కోపం తెప్పించదు. కేవలం ఉన్నత వర్గాలకు లభించే ఆహారం సమాజంలోని అందరికీ దొరికితే ఎంత బాగుంటుందో కదా. ఈ సామూహిక ఆహారలభ్యత అనే కల నెరవేరాలంటే ఆ ఆలోచన ఆచరణ సాధ్యం అని నమ్మేవాళ్లుండాలి. ఈ ఆలోచన చూడడానికి చాలా తేలికగా కనిపించవచ్చు, కానీ ఆచరణలో పెట్టాలంటే చాలా కష్టపడాలి. ఈ క్యాంపులో మనకు అలాంటి ఆలోచనను అమలులో పెట్టే వాళ్లున్నారు. ఐతు, పవన్, శ్రీకాంత్, కోసా, రంగన్న, బసు ఆ ఆలోచనను మనస్ఫూర్తిగా నమ్మినవాళ్లు.

క్యాంప్‌లో నేనున్న చివరి రోజు ఉదయం టిఫిన్ చేశాక శ్రీకాంత్‌తో కూర్చున్నాను. నగరాల్లో విప్లవోద్యమం ఎలా విస్తరిస్తున్నారో అందులో వారు ఎదుర్కొంటున్న సాధకబాధకాలేమిటో శ్రీకాంత్ నాకు వివరించాడు.

ప్రజలను సాయుధులను చేయకుండా రాజకీయ శక్తి రాదని శ్రీకాంత్ అభిప్రాయం. ప్రజలు అశక్తులైనపుడు వారికి నిస్సహాయత. నిరాశ తప్ప ఏమి మిగలదు.

తమ సాయుధ పోరాటం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో చాలా మార్పు వచ్చిందని శ్రీకాంత్ చెప్పాడు. పరిస్థితులు కొంచెం ప్రతికూలంగా ఉన్నా ప్రజల విప్లవోద్యమానికి వెన్నుదన్నుగా ఉన్నారు.

మా సంభాషణ త్వరలోనే ముగిసింది. మళ్లీ కలుసుకుంటామనే ఆశాభావంతో కరచాలనం చేసుకున్నాం.

శ్రీకాంత్ వంటి వాళ్లు వేరే ప్రపంచంలో నివసిస్తారు. అది వాళ్లకు వాళ్లే సృష్టించుకున్న చిన్న ప్రపంచం. దాన్ని వాళ్లు విశ్వవ్యాప్తం చేయాలని అనుకుంటున్నారు. కానీ వారికున్న స్వల్ప శక్తితో అది ఎలా సాధ్యమవుతుంది? ఇంత చిన్న శక్తి కోట్లాది మంది ప్రజలను ఎలా ప్రభావితం చేయగలుగుతుందని నేనెపుడూ ఆలోచించేవాణ్ని. కానీ వాళ్లది సాధ్యమేనని నమ్ముతున్నారు. చరిత్ర పురోగమించేది ఇలాగే కదా. వాళ్లు ఒక భవిష్యత్‌ను మొలకెత్తించే బీజాలమని భావిస్తున్నారు. ఈ మొలకెత్తిన బీజాలు ఒక నాటికి వట వృక్షంలా ఎదుగుతాయి. వారి ఆత్మవిశ్వాసం బలమైనది, అవధులు లేనిది! చరిత్రలో ఇలా జరిగిన సందర్భాలను వారు మనకు గుర్తు చేస్తారు.

తాము అటువంటి ఉదాహరణను ఒకదాన్ని సృష్టిస్తున్నామని వారనుకుంటున్నారు. తమ లక్ష్యం సమున్నతమైనదని వారి నమ్మకం. తమ లక్ష్యంలో గల స్వచ్ఛత, నిబద్ధత వారికి మృత్యువును కూడా ముద్దాడే ధైర్యాన్నిస్తుంది. వారు మృత్యువును లెక్కచేయక జీవితాన్ని ఆనందిస్తారు. వారి జీవనం చాలా వింతగా అనిపిస్తోండొచ్చు మనకు. మంచి తిండిలేక, రోగాల నుండి రక్షణలేక, ఎటువంటి సౌకర్యాలు, విలాసాలు లేక... దేశదిమ్మరుల్లా జీవిస్తూ. ఈ రోజు పొయ్యి ఇక్కడ, రేపు ఇంకో దగ్గర, ఎల్లుండి అసలు తిండి దొరుకుతుందో లేదో తెలియక. ఇదీ వారి జీవితం, ఇవీ వారి స్వప్నాలు.

రాబోయే రోజుల్లో వాళ్లు అడవిలో ఎలా ప్రయాణిస్తారో ఏం చేస్తారో తెలుసుకుంటాను నేను.

ఉదయం 5.30కు విజిల్ మోగగానే క్యాంపులో ఉన్న వాళ్లంతా వరుసలో నిలబడ్డారు. వెళ్లేవారు వేరే వరుసలో నిలబడ్డారు. మేం అందరి వద్దకు వెళ్లి కరచాలనాల చేసి, సెల్యూట్ చేసి ఒక సన్న కాలిబాట గుండా క్యాంపు బయటికి నడిచాం.

★★★

# అడవిలో మా నడక

దాదాపు గంటన్నర నుండి ఏకబిగిన నడుస్తున్నాం. మేం వదిలి వచ్చిన క్యాంపు కనుమరుగయ్యింది. మా అడుగుల సవ్వడి తప్ప మరో అలికిడి లేదు. ఇలా నడిచేటపుడు ఒకరితో ఒకరు మాట్లాడటం నిషిద్ధం. చుట్టూ ఉన్న నిర్మానుష్యమైన పరిసరాల వల్ల మనం చిన్నగా మాట్లాడినా అది ఎంతో దూరం వరకూ వినిపిస్తుంది. అంతే కాదు మాటల్లో పడితే కొంచెం అజాగ్రత్తగా ఉండే ప్రమాదం కూడా ఉంది.



మా స్క్వాడ్‌కు ఒక మహిళా గెరిల్లా నేతృత్వం వహిస్తోంది. ఇంకో గంటన్నర నడిచాక ఒక చోట కాసేపు విశ్రాంతి కొరకు ఆగాం. మా వెంట రెండు రోజులకు సరిపడా పూరీలు తెచ్చుకున్నాం.

ఆ రోజంతా నడిచి చీకటిపడ్డాక ఆ రాత్రికి ఒక చదునైన ప్రదేశం చూసుకొని బస చేయాలని ఆగాం. అక్కడే షీట్లు పరచుకుని విశ్రమించాం. దళంతో ఉన్నపుడు దగ్గడం, గుర్రుపెట్టడం వంటివి అసలే చేయకూడని పనులు. రాత్రి ప్లాస్టిక్ షీట్‌పై కదలాలన్నా చాలా జాగ్రత్తగా చప్పుడు కాకుండా కదలాలి.

పడుకున్నానన్న మాటే కానీ అసలు నిద్రపట్టలేదు. పైనున్న చెట్టు ఆకుల నుండి మంచు బిందువులు మాపై రాలుతున్నాయి. ఉదయం వరకు మేం కప్పుకున్న దుప్పట్లన్ని తడిసిపోవడం ఖాయం. అడవిలో ఉన్నప్పుడు జలుబు చేసి తుమ్మినా కష్టమే. అందుకే గెరిల్లాలు తలకు రక్షణగా మంకీ క్యాంప్ వంటిది ధరించి జలుబు రాకుండా జాగ్రత్తపడాలి.

సత్నామ్

సూర్యోదయం కాకముందే మా ప్రయాణం మళ్లీ మొదలైంది. మా వద్ద ఉన్న నీళ్లు రాత్రి వరకే అయిపోయాయి. దాహంతో నోరు పిడచగట్టుకుపోతున్నా అలాగే నడక కొనసాగించాం. ఒక అరగంట నడిచాక ఆగడానికి విజిల్ మోగింది. అనువైన స్థలం చూసుకొని దళం విశ్రమించింది.

దగ్గరలోని సెలయేరులో మేం మొహాలు కడుక్కుని వచ్చేసరికి సమీప గిరిజన గూడెం నుండి మంచినీళ్లు, ఆహారం వచ్చాయి.

అక్కడి నుండి మా నడక మూడు రోజులపాటు సాగింది. మధ్యలో మధ్యలో ఆగడం కాసేపు విశ్రాంతి తీసుకుని మళ్లీ నడవడం మూడు రోజుల తరువాత ఒక సంకేత స్థలంలో ఆగాం. అక్కడ ఒక కొత్త దళం వచ్చి కలవగానే అప్పటి వరకూ మాతో ఉన్న దళం మమ్మల్ని వీడి వెళ్లేది. కొత్త వాళ్లతో కాస్త పరిచయం పెరిగే సరికి వాళ్లు విడిపోయే సమయం వచ్చేది.

ఇపుడు నేనున్న గెరిల్లా దళంలో మొత్తం 14 మంది సభ్యులు ఉంటే అందులో నలుగురు అమ్మాయిలే. ఆ అమ్మాయిల వయసు 18, 19 సంవత్సరాలు ఉండొచ్చు కానీ చూడడానికి మాత్రం 14 ఏళ్లు ఉన్నట్టు కనపడుతున్నారు. ఎవరి వద్దా ఆయుధాలు లేవు. 

'నేను మీకు అనువాదకుడిగా పనిచేస్తాను' అంటూ ఓ పాతికేళ్ల యువకుడు ముందుకు వచ్చాడు.

'మీ కమాండర్ ఎవరు' ప్రశ్నించాను నేను.

'నేనే. నా పేరు చందన్'

'మీ స్క్వాడ్ దగ్గర ఆయుధాలు లేవు. ఎలా పోరాడుతారు మీరు?'

'మేం పోరాడే వాళ్లం కాదు. పాటలు.... పాటలు పాడే సాంస్కృతిక బృందం. చేతన నాట్యమంచ్ (పిఎన్ఎం). మేం పాటలు పాడతాం, నృత్యం చేస్తాం, నాటకాలు వేస్తాం.' చేతన నాట్యమంచ్ గోండు యువతీ యువకుల సాంస్కృతిక బృందం. దాని కమాండర్ చందన్ మాత్రం గోండీ కాదు. వారు మిలటరీ యూనిఫారంలో ఉన్నా వారి వద్ద కేవలం ప్రదర్శనలపుడు వాడే బొమ్మ తుపాకులు మాత్రమే ఉంటాయి.

'అయితే మీకు ఎలాంటి రక్షణ ఏర్పాట్లు ఉండవా?' ప్రశ్నించాను.

'లేదు. ఒకవేళ ప్రభుత్వం మమ్మల్ని చంపాలనుకుంటే చాలా తేలికగా ఆ పని చేయవచ్చు. ఇదివరకు ఎంతోమంది కళాకారుల్ని హత్య చేసిందీ ప్రభుత్వం. అయినా మేం అదరం బెదరం. మా పని మేం చేస్తూనే ఉంటాం.'

అతని బృందం ఎప్పుడూ ప్రజలతో మమేకమై ఏది దొరికితే అది తింటూ, గిరిజన గూడేల్లో ప్రదర్శనలు ఇస్తూ ఉంటారు.

నాకు పోలీస్ ఎన్‌కౌంటర్లతో మరణించే సిఎన్ఎం కళాకారులు గుర్తుకొచ్చారు. వారిని భయంకరమైన నక్సలైట్లు అని ముద్రవేసి ఎన్‌కౌంటర్ చేస్తారు పోలీసులు (నేను అడవి నుండి బైటకి వచ్చిన ఏడాది తరువాత ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఓ బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు కళాకారులను చంపేశారు.)

నిజమే మరి! ప్రజల్లో చైతన్యాన్ని నింపే ఈ కళాకారులు ప్రభుత్వానికి ప్రమాదకరంగా కనిపించడంలో వింతేముంది. వారి ఆట, పాట, మాటల ద్వారా సామాన్య జనానికి తమకు జరుగుతున్న అన్యాయాలేమో వివరిస్తారు కదా వీళ్లు. 'కలం ద్వారా, కళ ద్వారా ప్రజలను మేల్కొలపడం ఈ దేశంలో నిషిద్ధం' అని అన్నాడు చందన్. పాటలను, రాతలను కూడా అణచివేసే రాజ్యం ఎక్కువకాలం మనజాలదని, అది త్వరలోనే కుప్పకూలుతుందని అతని దృఢమైన అభిప్రాయం.

'పట్టణాల్లో కూడా ప్రజలకు స్వేచ్ఛలేదు. మాట మీద నిర్బంధం, రాత మీద నిర్బంధం, చివరికి వీధుల్లో ఆందోళన కూడా చేసే స్వేచ్ఛ లేదు. గద్దర్ పరిస్థితి చూశారు కదా? అతని ఇంట్లోనే చంపడానికి ప్రయత్నించారు. తామే ఈ దుశ్చర్యకు ఒడిగట్టామని ఈ పోలీసులు ఎప్పటికీ ఒప్పుకోరు. రాజ్యం అతని పదసవ్వడికే వణికిపోతుంది. అదే బొంబాయిలో జరిగే అశ్లీలనృత్యాలు వారికి పెద్ద సమస్యగా కనిపించవు. ప్రజల జీవితంలోని సాధక బాధకాలను మేం చెప్పాలని ప్రయత్నిస్తే మాత్రం ఏదో పెద్ద ఉపద్రవం వచ్చినట్టు గగ్గోలు పెడుతుంది ప్రభుత్వం.'

'కానీ మీ పాటలన్నీ తిరుగుబాటు గురించే కదా. వాటిని ప్రభుత్వం ఎలా సహిస్తుంది. అది తిరుగుబాటును జరగనిస్తుందా?'

'మీరు అన్నది నిజమే. కానీ మేం తిరుగుబాటు గొంతుకలం మాత్రమే. బుల్లెట్లం కాదు. పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నప్పుడు వాళ్లు తిరుగుబాటు గొంతుకను ఎలా నొక్కేయగలరు? గొంతుకను ఎప్పటికీ అణగదొక్కలేరు. అది అంతటా వ్యాపిస్తుంది. అక్షరాలను నిషేధించవచ్చు కానీ పాటను ఏం చేసి ఆపగలరు. మా నాలుకలు తెగ్గోసినా మేం పాట పాడుతూనే ఉంటాం. వాళ్లు మా గొంతుకలు కోయగలరేమో కానీ ఎందరిని చంపుతారు? ఎందరిని? ఇక్కడ ప్రతి ఒక్కరు పాడుతారు. ప్రతి ఒక్కరు నాట్యం చేస్తారు.'

'కానీ రాజ్యం గొంతులు కోస్తూనే ఉంటుంది.'

'అయినా మేం పాడుతూనే ఉంటాం. ఇక్కడి గాలిలో వ్యాపించిన మా పాటలు గొంతులు కోసినా ఆగవు. మీరు అడవి తల్లి పాటను విన్నారా! ఇక్కడ ప్రతి ఒక్కరు పాడుతారు దీన్ని.

*జుంబక్ జుంబక్ జుంబక్ బాలా!*
*జుంబక్ జుంబక్ జుమ్!*
*అడవీ తల్లికీ దండాలో*
*తల్లీ అడవికీ దండాలో!*

ఈ పాటను ఎవరు చంపగలరు? పాటను పాడే గొంతుకను ఎవరు నొక్కగలరు. ఈ పాట ఒక ప్రతిధ్వని. ఒక సార్వజనీన, అంతులేని ప్రతిధ్వని. ఇక్కడి ప్రతిచెట్టు, పుట్టల్లో ఈ పాట ప్రతిధ్వనిస్తుంది. అదిక్కడి గాలిలో వ్యాపించి ఉంది. ఇక్కడి గర్జించే నదుల్లో, ఇక్కడి మట్టిలో, అణువణువులో మిళితమై ఉంది. దాన్ని ఎవరు అంతం చేయగలరు? ఎవరూ చేయలేరు.

అడవి తల్లికీ దండాలు. అడవిపై సర్వహక్కులు స్థానికులవే. ఇక్కడి నీరు, ఖనిజాలు, ఉత్పత్తులు అన్నీ.

అడవిలో ప్రతిధ్వనిస్తున్న గిరిజనుల గుండెచప్పుడు ఇది. ఈ ప్రతిధ్వనికి మరణం లేదు.

***

చందన్ కళాబృందం అడవిలో చాలా లోపల క్యాంపు పెట్టినప్పటికీ చుట్టుపక్కల గూడేలనుండి గిరిజనులు అక్కడికి తరలివచ్చారు. రాత్రి చిక్కబడుతోంది. అక్కడ అనేక చలిమంటలు వెలుగుతున్నాయి. వాటి చుట్టూ గుమిగూడారు ప్రజలంతా. ఎవరికీ ఇంటికి వెళ్లాలని లేనట్టుగా కూర్చున్నారు. కొన్ని బృందాలు పాటలు పాడుతున్నాయి, కొందరు నాటకాలకు రిహార్సల్స్ చేసుకుంటుంటే, మరికొందరు. ఆ మంటల వెలుగుల్లో నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు.

'ఈశ్వర్ అన్నా, నూక సిద్ధమయ్యింది' నన్ను ఉద్దేశించి అన్నాడు చందన్.

'నూకనా? అదేమిటి? అయినా నా పేరు ఈశ్వర్ కాదు' అన్నాను.

'ఏదో ఒక ఈశ్వర్ లెద్దూ! పిలవడానికి పేరు ఒకటి కావాలి కదా. అయినా ఈశ్వర్ అనే పేరు బాగానే ఉంది కదా.'

నేను నవ్వాను.

'నూక అంటే విరిగిన బియ్యం. ఇక్కడి ప్రజలకు అదే రోజువారీ ఆహారం. ఇవ్వాళ మనకు కూడా అదే భోజనానికి. ప్రతి ఇంటి నుండి గుప్పెడు నూకలు తీసుకవచ్చి వండుతాం కదా అందుకే చాలా రుచిగా ఉంటుంది. కానీ జాగ్రత్తగా నములు అసలే బుజ్జివి కదా నలిగిపోతాయి" చిరునవ్వుతో అన్నాడు చందన్.

నూక నిండా చిన్న చిన్న రాళ్లే. అందుకే చందన్ జాగ్రత్తగా నమలమని చెప్పింది.

నూక, అనపకాయ బస్తర్‌లో సర్వసాధారణంగా తినే ఆహారం. అనపకాయి గింజల్ని ఖాళీస్థలంలో వెదజల్లుతారు. చాలాచోట్ల అవి చెట్ల మీదికి ఎగబాకుతూ కనిపిస్తాయి మనకు. కాసిన అనపకాయలను కూర వండు కోవడమే కాకుండా కొన్ని కాయలను ఎండబెట్టి ఆ ఖాళీ బుర్రను నీళ్లు, తాటి కల్లు నిలువ చేసుకోవడానికి వాడతారు. బస్తర్‌లో దొరికే అనపకాయ లోపల రెండు ప్రత్యేక అరల్లాంటివి ఉంటాయి. కింద ఒక చిన్న అర దానిపై ఒక పెద్ద అరలో గిజిగాడి గూడులా ఉంటుందది.

'చందన్ భాయ్! బియ్యంతో ఇంకా ఏమేం తయారు చేస్తారు ఇక్కడి గిరిజనులు?'

'బియ్యం గంజితో జావ చేసుకుని ఉదయాన్నే తాగుతారు.'

బస్తర్‌లో అనేక రకాల బియ్యం సాగుచేస్తారు. కానీ దిగుబడి చాలా తక్కువ. అందుకే ఇతర చోట్ల రైతులు చేసినట్టుగానే ఇక్కడి గిరిజనులు కూడా కొత్త పంట వచ్చేంత వరకూ సంతలో ఆహార ధాన్యాలను కొనుక్కుంటారు. తిండికొరకు పిల్లలను అమ్ముకోవడానికి గిరిజనులు సిద్ధపడ్డారనే వార్తలు చదివినపుడు వారు ఎంత దుర్భరమైన పేదరికంలో ఉన్నారో తెలుస్తుంది మనకు.

గెరిల్లాలు ఇంకా చేరని చోట ఆకలిచావులు సర్వసాధారణం. ప్రక్కన ఉన్న పట్టణాల్లో గిరిజన యువతులు వ్యభిచార గృహాల్లో మగ్గుతున్నారు. గెరిల్లాలు ఉన్న ప్రాంతాల్లో పై రెండు సమస్యలు కనపడవు మనకు.

ఎప్పుడైనా కరవు పరిస్థితులు నెలకొంటే పెద్ద గ్రామాల్లో, పట్టణాల్లో ఉన్న గిడ్డంగులపై గెరిల్లాల సాయంతో దాడి చేస్తారు గిరిజనులు. కొల్లగొట్టిన ఆహారధాన్యాలను అందరూ సమానంగా పంచుకుంటారు. గెరిల్లా ఉద్యమం లేకపోయి ఉంటే ఈ కరవు గిరిజనులను పొట్టనబెట్టుకునేది. అయినా బైటి ప్రపంచానికి ఆ వార్త తెలిసేది కాదు. ఎప్పుడైనా ఈ సమస్య తీవ్ర రూపందాల్చి బైటికి ఈ వార్తలు పొక్కితే అప్పుడు దీనిపై రకరకాల అమానుషమైన చర్చలు జరుగుతాయి.

'ఇది ఆకలి చావు కాదు, కడుపు నొప్పి వల్ల మరణించారు వాళ్లు'

'ఈ మరణం ఆకలి వల్ల కాదు మురిగిపోయిన మామిడి టెంకలు తినడంవల్ల'

'అతను చనిపోయింది ఆకలి వల్ల కాదు, సరిగా తినకపోవడం వల్ల ఎందుకంటే అతని గుడిసెలో ఓ గుప్పెడు బియ్యం లభించాయి.'

ఇలా రకరకాల కారణాలు చెపుతారు. కానీ ఆకలి వల్ల మాత్రం కాదంటారు. ఇక ప్రధాని జాతినుద్దేశించి ప్రసంగిస్తూ 'ఆకలిచావులు అబద్ధం ఎందుకంటే దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. వాటి పంపిణీనే సరిగ్గా జరగట్లేదు. అలా జరిగేలా అధికా యంత్రాంగం చర్యలు తీసుకోవాలి' అని సెలవిస్తారు.

అందుకే గెరిల్లాలు అధికా యంత్రాంగం దయాదాక్షిణ్యాలపై గిరిజనులు ఆధారపడకుండా తామే గోడౌన్లను చేరుకునేలా ప్రజలను చైతన్య పరుస్తున్నారు.

***

ఆ రాత్రి గూడెంలోని స్త్రీలు, పురుషులు, పిల్లలు అందరూ సాంస్కృతిక బృందం చుట్టూ చేరారు. ఓ మూలకు రాందేవ్ అనే కళాకారుడు తన ముందున్న జనానికి గోండీ పాటలు వినిపిస్తున్నాడు. బుడ్డి దీపం వెలుగులో అయిదారుగురు ఉద్యమకారులు ఒక నోట్ బుక్కులో పాటలు రాసుకుంటున్నారు. ఒక అక్షరాన్ని దేవనాగరి లిపిలో ఎలా రాయాలని వారిలో వారు వాదించుకుంటున్నారు.

పక్కనే ఉన్న గుడిసె ముందు చాలా పశువులు ఉండటం నా కంట పడింది. నా ఫైలు తీసుకుని కొంతమంది గిరిజన రైతుల దగ్గరికి వెళ్లి వారి పశువులు, కోళ్ల గురించి అడిగాను. దళ కమాండర్ వేరే పనుల్లో నిమగ్నమై ఉండటంతో రాజు అనే కళాకారుడిని అనువాదకుడిగా ఉండమని అడిగాను.

పాలను గోండీలో పాల్ అంటారట. కానీ ఈ గిరిజనులు ఆవు పాలను తాగరు. వాళ్లకు పాలతో అనేక పదార్థాలు తయారు చేయవచ్చని తెలుసు కానీ అవేమిటో స్పష్టంగా తెలియదు. వాళ్లసలు ఆవు నుండి పాలు పిండనే పిండరు కాబట్టి ఇక పాలు వాడటమనే ప్రసక్తే ఉండదు. ఆవు పాలు లేగ దూడల కొరకేనని అవి అవి మనుషులు ఉపయోగించడం ఉచితం కాదని వాళ్ల ఆలోచన.

వారి తర్కం చాలా సహజమైనది, సులభమైనది. మనుషులు ఆవు, బర్రెల పాలు తాగడం వారికి వింతగా అనిపిస్తుంది. కొన్ని గ్రామాల్లో మాత్రం ఒకటి రెండు ఇళ్లలో పాల వాడకం ఉన్నది.

మీగడను గోండీలో మినదు ఉత్త అంటారు, ఆ పదం పలకడానికే నేను చాల కష్టపడాల్సి వచ్చింది. పెరుగును గోండీలో ఏమంటారని అడిగితే అందరు బిక్కమొహం వేశారు. కొందరికీ అసలీ ప్రశ్నలే అర్థరహితంగా అనిపిస్తున్నట్టున్నాయి. మరికొందరికేమో ఇదో చక్కని ఆటవిడుపు అయ్యింది. ఒక అరగంట సేపు ఆ పదం ఏమిటో కనుక్కునే ప్రయత్నం సాగింది. చివరికి పెరుగును గోండీలో హల్లా అంటారనే నిర్ణయానికి వచ్చాం. ఇక వెన్న,

జున్నులకు గోండీలో ఒక పదమే లేదని చాలా ఊళ్లలో విచారించిన పిమ్మట నాకు అర్థం అయ్యింది.

ఒక వస్తువును ప్రజలు వాడితేనే కదా ఆ భాషలో దానికొక పదం పుట్టేది! బయటి నుండి వచ్చే ప్రతి వస్తువు తనతో పాటు పేరును కూడా తెచ్చుకుంటుంది. ఉదాహరణకు ఇప్పుడు గోండులు వాడే రవ్వ బయటి నుండి వచ్చిందే దాన్ని వీళ్ళు రవ అంటారు. ఇక్కడ గోధుమల సాగులేదు కాబట్టి రవ్వ బయటినుండి దిగుమతి అయ్యింది బస్తర్‌కు. ఇక్కడ ఆవులు బాగానే ఉన్నా పాల వాడకం లేకపోవడం మాత్రం ఆశ్చర్యకరమే. ఇక్కడ ఆవులను మాంసానికి, మారకానికి మాత్రమే వాడుతారు. వాటి పాలనపోషణ కూడా పెద్దగా పట్టించుకోరు వీళ్ళు. వాటిని తాడు పెట్టి కట్టేయడం కానీ, కొట్టాల్లో ఉంచడం కానీ చేయరు. కనీసం ఆవు పెండ కూడా సేకరించరు. అక్కడక్కడా ఇంటి ముందు, ఇంటి లోపల గచ్చును పెండతో అలకడం మాత్రం కనిపిస్తుంది. దానికి తప్ప పెద్దగా పెండ వాడకం కనపడలేదు. ఆవులను మేతకొరకు రోజంతా అడవిలోకి పంపి సాయంత్రం ఇళ్ల వద్దకు తోలుకొస్తారు. పశువులు కాసేవాడుండడు, కట్టేసేందుకు ఒక గుంజ ఉండదు.



గొడ్డు మాంసం తిని బతికిన ఆదిమ భారతీయుల జీవనశైలి గల బస్తర్ గిరిజనులకు, ఆవులు పెంచుకుటూ బతికే మధురలోని మనుషులకూ మధ్య చాలా తేడా ఉన్నది. ఒక సమూహం యొక్క జీవన స్థితిగతులే వారి భాష, సంస్కృతుల అభివృద్ధిని ప్రభావితం చేస్తాయి.

గోండులకు పాల వాడకం నేర్పిస్తే అది కొత్త కొత్త పనులకు ఆస్కారం కలిస్పిస్తుందని తద్వారా ఇక్కడ అభివృద్ధిని వేగిరపరుస్తుందని నేను చందన్‌కు చెప్పాను. అయితే అవి నేర్పడానికి కనీసం 20 యేళ్లు పడుతుందని తను అన్నాడు. గోండులు కొత్త విషయాలు నేరుకోవడానికి చాలా సమయం తీసుకుంటారు. కొత్త విషయాలను ఒక పట్టాన అంగీకరించని, కొత్త వ్యక్తులను తొందరగా నమ్మని ఈ గిరిజనుల మధ్య నిలదొక్కుకోవడానికి గెరిల్లాలు 10 యేళ్లు కష్టపడాల్సి వచ్చింది.

గడచిన ఎన్నో యేళ్లుగా పెండను ఎరువుగా వాడాలని గిరిజనులకు చెబుతున్నాడట చందన్ కానీ వాళ్లు ఒక బొందను తవ్వి అందులో కొన్నాళ్లు పెండను వేసి తరువాత దాని గురించే మరచిపోతారట ఎప్పుడైనా దాని గురించి మళ్లీ గుర్తుచేస్తే తేలికగా నవ్వుతారట ఇక్కడ పాల ఉత్పత్తి వాడకం చాలా కష్టమైన పనులు పశువులకు మేత సాగునీరు రోజువారీ వేసే దాణా పెండ తీయడం పశువులు కాయడం పాల క్యాన్లు సమకూర్చుకోవడం వాటిని శుభ్రపరచడం వీటన్నిటి కన్నా ముఖ్యంగా పాల పట్ల వారికున్న భావన – ఇవన్నీ మన ముందున్న ప్రతిబంధకాలు

పాలు ఉన్నది దూడల కొరకే అని ఎలా నమ్ముతారో అలాగే గుడ్లు ఉన్నది కోడి పిల్లల ఉత్పత్తి కొరకే అని కూడా వారు నమ్ముతారు గుడ్లు మనం తినేస్తే కోడిపిల్లలు ఎక్కడి నుండి వస్తాయి?

బస్తర్‌లో తల్లులు తమ పిల్లలను అనేక సంవత్సరాల పాటు తమ పాలే ఇచ్చి పెంచుతారు ఇక్కడ ప్రతిదీ సహజ సిద్ధమైనదే ప్రతిదీ ప్రకృతి మీద ఆధారపడేదే ఇక్కడి గిరిజనులు ఈ పరిస్థితిలో ఎలాంటి మార్పూ రాకూడదని కోరుకుంటారు వీళ్లు మేకలను కూడా పెంచుతారు కానీ బయటి ప్రపంచంలో మేకపాలు కూడా వాడుతారని వీరికి తెలియదు

గోండుల సంస్కృతిని అర్థం చేసుకొని దాన్ని గౌరవిస్తూనే వారిని విప్లవానికి సన్నద్ధం చేయడానికే తనిక్కడికి వచ్చానని చందన్ చెప్పాడు

ఇక్కడ అన్నిటినీ అత్యవసరంగా మార్చేయాల్సిన అవసరం ఉన్నది

చూద్దాం మనం ఎంతమేరకు విజయం సాధించగలమో జల్ జంగల్ జమీన్‌పై గిరిజనుల హక్కులను ఖాయపరచడం మాముందున్న ప్రథమ లక్ష్యం అది జరిగాక అనేక అవకాశాలు వాటంతట అవే పుట్టుకువస్తాయి దానితో సర్వతోముఖాభివృద్ధి సాధ్యం అవుతుంది మా అభివృద్ధి కమిటీ ఇందుకొరకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేస్తున్నది గిరిజనుల పురాతన సంస్కృతినే మార్పు కొరకు పనిముట్టుగా వాడాలని మా ప్రయత్నం వారు పాడే పాటలు వినండి ఈశ్వర్ భాయ్ మనుషులను ఎలా సంఘటితపరుస్తాయో! వారిని

నిర్దేశించే వారెవరూ లేకున్నా మొత్తం గ్రామస్తులంతా కలిసి ఆడి పాడుతారు ఒకరు తప్పటడుగు వేసినా మరొకరు అతడిని సరిదిద్దుతారు వారి పాదాలను చూడు ఎంత లయబద్ధంగా నాట్యం చేస్తున్నాయో! లయబద్ధత వారికి సహజంగానే వస్తుంది - దాన్ని ఏ పాఠశాలలో నేర్పరు వారికి నిజానికి వారి జీవితమే ఒక పెద్ద పాఠశాల అందులో ప్రతి ఒక్కరూ విద్యార్థే ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులే వేల ఏండ్ల నుండి జానపద పాటలు నృత్యాలూ ఇలాగే జీవించి ఉన్నాయి ఈ పరంపరకు ఎక్కడా అంతరాయం కలుగలేదు ఆట పాట ఉంటే రోగంతో మూలకు పడ్డవాళ్లు కూడా లేచి గంతులేస్తారు సామూహిక సంస్కృతికి ఉన్న ఆకర్షణ అటువంటిది

మా చుట్టూ ఉన్నవాళ్లెవరూ మా సంభాషణను పెద్దగా పట్టించుకోవట్లేదు వారికి మేము గ్రహాంతర వాసులతో సమానం - మా భాష, వేషధారణ ప్రవర్తన అనీ పరాయివే వాళ్లు అప్పుడప్పుడు అర్థం కానట్టు చూసేవారు కొన్నిసార్లు ఏమీ అర్థం కాకపోయినా ఒక చిరునవ్వు నవ్వేవాళ్ళు



మేము మరోసారి పాల మీదికి చర్చను మళ్లించాం అడవిలో గడ్డి ఎండిపోయినప్పుడు ఆవులు ఆకలికి మృత్యువాత పడతాయని అప్పుడు వాటికి ఏం మేపాలో తెలియదన్నారు వాళ్లు తినడానికి ఏమైనా ఉంటేనే కదా ఆవులు పాలిచ్చేది అడవిలో అప్పుడప్పుడే గడ్డి ఎండిపోవడం మొదలైతోంది ఆవులు బక్కచిక్కి కనిపిస్తున్నాయి అస్థిపంజరాలు పాలెలా ఉత్పత్తి చేస్తాయి? పాల ఉత్పత్తికి సంబంధించి చాలా పెద్ద ప్రశ్నకే జవాబు వెతకాలి

అప్పుడే ఒక చిన్న పిల్లవాడిని ఎత్తుకుని వచ్చి మా పక్కన నిలుచుందొక మహిళ ఆమె మాతో ఏదో చెప్పలనుకుంటున్నట్టుంది

చందన్ ఆమె వైపు తిరిగి ఏం కావాలి చెల్లెమ్మా? అని అడిగాడు

పిల్లవాడికి జ్వరం వచ్చిందని చెప్పిందామె తన చేతిలోంచి పిల్లవాడిని ఎత్తుకుని నాకు అందించాడు చందన్ నేను డాక్టర్‌ను కానని చందన్‌కు చెప్పాను నా మెడిసిన్ కిట్‌లో జ్వరానికి ఏం మందుంటే అది ఇవ్వమని చెప్పాడు చందన్

'జ్వరం ఎప్పటి నుండి వస్తుందమ్మా?' అని అడిగాను ఆ మహిళను. ఆమెకు నా భాష అర్థం కాదనే విషయాన్ని ఒక క్షణం మర్చిపోయాను.

ఆమె నావైపు చూసి చందన్ వైపు చూసింది. నా ప్రశ్నను తర్జుమా చేసి చెప్పాడు చందన్.

'గత కొన్ని రోజులుగా వస్తోంది' బదులిచ్చింది.

రోజుల తరబడి విరామం లేకుండా జ్వరం ఉంటోంది కాబట్టి అది మలేరియా కాదని చందన్, నేను తేల్చాం. ఇద్దరం శిక్షణ పొందిన డాక్టర్లం కానప్పటికీ సరైన వైద్యుడు లేని చోట ఒక ప్రాణాన్ని కాపాడగలం. బస్తర్ గిరిజనులకు ప్రతి గెరిల్లా ఒక వైద్యుడే. ఎందుకంటే వారి కిట్ బ్యాగుల్లో మందులుంటాయి కదా...

'ఇంట్లో చక్కెర, బెల్లం వంటివేమైనా ఉన్నాయా?' అని అడిగాను ఆమెను. లేవని చెప్పింది. మావద్ద జ్వరానికి ద్రవరూప మందు కానీ, జ్వరం మాత్రను కలిపి ఇవ్వడానికి తీయని పదార్థం కానీలేదు. అందుకే జ్వరం మాత్రను పొడిచేసి, కొని నీళ్లలో కలిపి ఇచ్చాం. ఇంకొన్ని మాత్రలను ఆ మహిళకు ఇచ్చాం.

72

తన వద్ద తినడానికి బియ్యం తప్ప మరేం ఉండి ఉండదు కనుక బలవర్ధకమైన ఆహారం తినిపించమనే సూచన మాత్రం చేయలేకపోయాం.

ఒకరి తరువాత మరొక రోగి రావడం మొదలుపెట్టారు. వారిలో అత్యధికులు మలేరియా పీడితులే. గెరిల్లాల వద్ద మలేరియా మందులు ఎప్పుడు సిద్ధంగా ఉంటాయి. కానీ చిన్న పిల్లలు మాత్రలను నలిపి ఇచ్చినా మింగలేరు. వారికి ఇవ్వడానికి ద్రవరూప మందులేమీ లేవు మావద్ద. అందుకే పిల్లలతో మందులు మింగించడం ఒక సమస్య అయి కూర్చుంది. దీన్ని ఎలా అధిగమించాలా అని మేము కాసేపు ఆలోచించాం. చివరికి ఒక నిర్ణయానికి వచ్చి గ్రామస్తులను తాజాగా తీసిన తాటి కల్లును తెమ్మని పురమాయించాం.

అక్కడ గుసగుసలు మొదలయ్యాయి. గెరిల్లాలు ఎప్పుడూ కల్లు తాగరు. మరి ఇవ్వాళ కల్లు తెమ్మని అడుగుతున్నారేమిటి? కొందరికి అది ఆశ్చర్యం కలిగిస్తే మరికొందరికి సంతోషం కలిగింది. ఒకవేళ గెరిల్లాలే కనుక కల్లు

తాగితే ఇక వాళ్లు మద్యపానం చేసే గ్రామస్తులకు ఎట్లా బుద్ధి చెప్పుతారు? అక్కడి మహిళలకు గెరిల్లాలు తాటి కల్లు కొరకు అడగడం నచ్చలేదు. కానీ వారేమీ మాట్లాడలేదు.

మరునాడు ఉదయమే తాజా తాటి కల్లును ఒక కుండలో తీసి మంటపైన పెట్టారు. సాంస్కృతిక బృందం సభ్యులు, గ్రామస్తులు ఈ తంతును ఆసక్తిగా చూడసాగారు. దాదాపు రెండు గంటల తరువాత తాటి బెల్లపు ద్రవం తయారయ్యాక అది రుచి చూడమని మేము అందరికీ ఇచ్చాం.

'ఇది మేము కూడా తయారు చేసుకుంటాం' అన్నారు వాళ్లు సంతోషంగా

అప్పటికప్పుడే సాంస్కృతిక బృందం ఒక నినాదానిచ్చింది

'కళ్లు తాగకండి...బెల్లం చేసుకోండి'

ఈ కొత్త ఆవిష్కరణ అందరికీ నచ్చింది. ముఖ్యంగా మహిళలకు. అక్కడ గిరిజన మహిళలు కూడా కల్లు తాగినా వాళ్లు పురుషులంత హెచ్చు మోతాదులో తాగరు. ఇంట్లో బెల్లం ఉంటే పిల్లలకు ఉపయోగపడుతుంది కదా అని ఈ మహిళల భావన.

బస్తర్‌లో మలేరియా స్వైరవిహారం చేస్తుంది. ఇక్కడెవరైనా వైద్యుడు స్థిరపడితే ఒక్క మలేరియా రోగులకు చికిత్స అందించే అతను ఒక రాజప్రసాదం నిర్మించుకోగలడు. కానీ దానికి అతను దళం నుండి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అదెలాగూ సాధ్యం అయ్యే పని కాదు. హిపోక్రేట్స్ ప్రమాణం గౌరవించే వైద్యులకే ఇక్కడ స్థానం ఉన్నది. అతను కమ్యూనిస్టే కానక్కరలేదు, కనీసం మానవతావాది అయినా చాలు. అటువంటి వైద్యులు దొరకడం అరుదు కాబట్టే ఈ వ్యాధులతో పోరాడే బాధ్యతను విప్లవోద్యమం తన భుజాలపై వేసుకున్నది. గెరిలాలు అనేక గ్రామాల్లో వైద్య విభాగాలు నెలకొల్పారు. పవన్ సంవత్సరంలో కొన్ని నెలలు దండకారణ్యంలో ఉండి ఈ వైద్య విభాగాలకు శిక్షణ ఇస్తాడు. అటువంటి వైద్యుడు ఒక్కడుంటే వందలాది గిరిజనులకు వైద్యం లభించినట్టే.

***

'ఈశ్వర్ భాయ్! ఎర్మియా డైకాల్!' దూరం నుండి రాజు అరిచాడు. నా దగ్గరికి వచ్చి గట్టిగా నవ్వేశాడు.

'డైకాల్?' డైకాల్! ఏం డైకాలో ఏమో! వీళ్ళ ఇష్టం ఉన్న పదం మాట్లాడితే నాకేం అర్థం అవుతుంది?

'ఎర్మియా డైకాల్' అంటే స్నానానికి పోదాం అని అర్థం'

'నదిలోనా'

'ఎర్దా'

'ఎర్' అంటే నీళ్ళు, 'ఎర్దా' అంటే చెరువు అని అర్థం.

ఇవ్వాళ గిరిజనులు తమ స్వయంశక్తితో నిర్మించుకున్న ఒక ఆనకట్టను కూడా చూడబోతున్నామని చెప్పాడు రాజు.

'అక్కడే స్నానం కూడా చేద్దాం' అన్నాడు రాజు తన కిట్ బ్యాగును తీసుకుంటూ.

రంగన్న, రాజు, నేను కలిసి ఆ చెరువువైపు నడవసాగాం. అడవి గుండా నడుస్తూ ఒక జమ్ము గడ్డితో నిండిన బురద నేలలోకి చేరాం. అక్కడక్కడా రెల్లు గడ్డి పొదలతో, కాలికింద నేలంతా చిత్తడి చిత్తడిగా ఉంది. రాళ్ల మీద అడుగులు వేస్తూ జాగ్రత్త నడుస్తున్నప్పటికీ కాలు జారితే మాత్రం ఆ చిత్తడి నేలలో పడిపోవడం ఖాయం. కాలికి బురద అంటడం చూసినా పెద్దగా పట్టించుకోకుండా రాజు నవ్వుకుంటూ ముందుకుసాగాడు. రంగన్న తూలిపడిపోకుండా కాగ్రత్తగా నడవడానికి ప్రయత్నిస్తున్నాడు.

'మనం తిరిగి ఈదారి గుండానే వచ్చేటట్టయితే అసలు స్నానం చేయాల్సిన పనిలేదేమో' అన్నాన్నేను

'నేను స్నానం చేసి నాలుగు రోజులయ్యింది. చెమట కంపు కొడుతున్నాను. స్నానం చేస్తే కొంచెం శరీరం సేద దీరుతుంది. ఇక పాదాలకు బురద అంటడం అంటావా, అదేమంత పెద్ద సమస్య కాదు. అయినా మనం వచ్చేటప్పుడు వేరే దారి తీసుకుంటాం' రాజు చిన్న పిల్లాడిలా కేరింతలు కొడుతున్నాడు.

'ఈ రెల్లు గడ్డి పొదల్లో తిరగడం నాకు భలే సరదా, చిన్నప్పుడు పొద్దున్నుంచి సాయంత్రం వరకూ వీటి చుట్టూ పిట్టల వేటలో తిరిగేవాడిని. ఒక్కటి దొరికినా సంతోషమే కదా. ఇలాంటి చిన్న చిన్న సరదాలే లేని జీవితం ఎందుకు?'

'ఇప్పటి దాకా ఎన్ని పిట్టలు కొట్టావు?' అడిగాను.

'పెద్దగా ఏం లేదు. ఒక రెండొందలు కొట్టి ఉంటా'

'ఇప్పుడు కూడా వేటాడుతున్నావా?'

'లేదు. టైం దొరకట్లేదిప్పుడు'.

'వేటకు పోవాలని మనసు గుంజుతుందా?'

'ఓహ్! చాలా. అందరు గిరిజన యువకులకూ వేటాడటం ఒక పెద్ద సరదా. కానీ ఇప్పుడు పిట్టలు కూడా బాగా తగ్గిపోయాయి'.

ఆ రెల్లు పొదలు దాటుకుని చెరువు ఒడ్డున ఉన్న ఒక ఎత్తైన ప్రదేశానికి వెళ్లాం. ఇక్కడే ఆనకట్ట మొదలవుతుంది. పైన దాదాపు 8 అడుగుల వెడల్పు ఉన్న ఆ మట్టి కట్ట కింది భాగాన మాత్రం 16-18 అడుగుల వెడల్పు ఉంది. పొడవు ఓ రెండు ఫర్లాంగుల వరకూ ఉండొచ్చు. కనుచూపు మేరా నీళ్లే నీళ్లు. నీటి పైన అక్కడక్కడా తామర ఆకులు తేలియాడుతున్నాయి. అడుగున గట్టి నేల ఉన్నదగ్గర రెల్లుగడ్డి లేదు. అలాంటి ప్రదేశాల్లో స్నానం చేయడానికి అనువుగా ఉంటుంది. చెరువు మధ్యలో రెండు భారీ రాళ్లు చిన్న సైజు ద్వీపాల్లా కనిపించాయి. ఈ చెరువు లోతు 10 నుండు 16 అడుగుల మధ్య ఉందట. చెరువు దిగువన గాలికి ఊగిసలాడుతున్న వరిచేన్లు కనిపించాయి. నీటి దిగువన ఉండి కూడా ఇంకా సాగుచేయని భూములు ఉనాయి. వరి పొలాలు కూడా గింజలను అడ్డదిడ్డంగా వెదజల్లినట్టు కనపడుతున్నాయి. పొలాల నిండా నత్తగుల్లలు, ఆల్చిప్పలూ కనపడుతున్నాయి. ఇక్కడ ఈ ఆనకట్టనే కనుక లేకపోయి ఉంటే బహుశా ఇది అడవి మధ్యలో ఎడారిలా ఉండేదేమో. అడవి నడిబొడ్డున ఈ చెరువు నిజంగానే ఒక అద్భుతం. ఖనిజాలు తవ్వే కాంట్రాక్టర్ల దృష్టిలో ఇంకా ఇది పడ్డట్టు లేదు. లేకుంటే దీన్ని తవ్విపారేసి కిందనున్న మెగ్నీషియమో, బాక్సైటో వెలికితీసేవారు.

'రాజూ, ఈ చెరువులో చేపలు ఉంటాయా'

'బోలెడన్ని ఉంటాయి. మేమే ఇందులో చేప విత్తనం వేశాం. కానీ ఇంకా చాలా చిన్నగా ఉన్నాయి. అవి పెద్దగా అయితే భలే మజా వస్తుంది'

ఇంత పెద్ద చెరువులో దొరికే చేపలు పది ఊళ్లు తిన్నా అయిపోవు. గిరిజనులకు చాలినన్ని చేపలు దొరికితే వారికింక దానికన్నా కావలిసిందేమున్నది! ప్రస్తుతమైతే వారికి పారే నీటిలో చేపలే లభ్యమవుతున్నాయి. ఇక్కడి నదులూ, ఏర్లూ ఎండిపోతే చేపలకు కొరత వచ్చి కరవులాంటి పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడీ గిరిజనులకు అడవిలో దొరికే వేర్లూ, దుంపలే గతి అవుతాయి.

ప్రజల సమష్టి కృషితో తయారైన చెరువులు ఇక్కడి ఖనిజాలు, మనుషుల్లాగే ఒక అద్భుతం. ఇలాంటి కార్యక్రమాలకు ఇక్కడి జీవితాన్నే మార్చేసే శక్తి ఉంది. ఇవ్వాళ చేపల పెంపకం మొదలైంది. రేపు సాగునీటి సౌకర్యాల కల్పన మొదలవ్వచ్చు. ఇక్కడ ప్రకృతి వనరులకు కొరత లేదు. ఆ వనరులను ఉపయోగించుకుని ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరచేందుకు అవసరమైన మౌలిక సౌకర్యాలే లేవు. ప్రపంచంలోనే అత్యంత విలువైన ప్రాంతంగా పేరుమోసింది బస్తర్. ఇక్కడి అడవులు, నీటి వనరులు, ఖనిజాల వల్ల దానికా గౌరవం వచ్చింది. కానీ ప్రకృతి ఇచ్చిన విలువైన బహుమతి – మనిషి – మాత్రం ఇక్కడ దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నాడు. ఆ దుర్భర పరిస్థితులను మార్చేందుకు మొదలుపెట్టిన ఒక గొప్ప ప్రయత్నం ఇప్పుడు మా ముందున్నది. ఆ ప్రయత్నపు విస్తారత రాజును అబ్బురపరుస్తున్నది.

ఆనకట్టకు దిగువన నీరు పారుతున్న గలగల శబ్దం వినిపించింది మాకు. ఆ నీరు ఎక్కడినుండి పారుతున్నదో చూద్దామని మేము ముందుకు వెళ్లాం. నిస్సందేహంగా ఆ నీరు ఆనకట్టలోంచే వస్తోంది. ఎవరో తూమును మూసేయకుండా వదిలేశారు. నీటితోపాటు చేపలు కూడా బయటికి వెళ్లిపోవడం మా కంటపడ్డది.

'అటు చూడు. చేప విత్తనం మొత్తం వృధాగా పోతున్నది' అంటూ రాజు ఆ ప్రవాహాన్ని ఆపడానికి ముందుకు దూకాడు.

'ఛ. అంతా వృధా అయిపోయింది' అంటూ ఆ తుముకు రాళ్లు, బురదతో అడ్డుకట్ట వేశాడు. ఎవరో చేపలు పట్టడానికి ఈ తుమును తెరిచి మళ్ళీ మూయడం మరచిపోయినట్టున్నారు.

'మావాళ్ల తీరు ఇదిగో ఇలా ఉంటుంది. తూమును మూయనే మూయరు. పారే నదినుండో, ఏరు నుండో చేపలు పడుతున్నట్టు ప్రవర్తిస్తారు. ఇది ఇలాగే వదిలేస్తే ఎండాకాలం వచ్చేసరికి మొత్తం చెరువు ఎండిపోయి ఒక్క చేప కూడా మిగలదు' అన్నాడు రాజు.

చెరువులో చేప విత్తనం వేయడం ఇదే తొలిసారి. ఈ గిరిజనులకు చేపల పెంపకం నేర్చుకోవడానికి ఇంకా కొంచెం సమయం పడుతుంది.

'గ్రామస్తులకు చేపలు ఎలా పట్టాలో నేర్పాలి మనం'

తుమునయితే మూసివేశాడు కానీ రాజు బాగా వ్యాకులపడుతున్నాడు. ఇక్కడి ప్రజలకు ఇలా చెరువులో చేపలు పట్టడం ఇంకా తెలియదు. దానికి వారు చేపలు పట్టేందుకు కొత్త పద్ధతులు నేర్చుకోవడమే కాక చేపలు పెరిగేంతవరకూ ఆగాలి కూడా.

స్నానాలు అయ్యాక మేము క్యాంపుకు తిరిగివచ్చాం. రాజు దీర్ఘాలోచనలో మునిగిపోయాడు. నీటిలో గెంతులాడిన ఆనందం లేదతనిలో. సాయంత్రం గ్రామస్తులంతా క్యాంపు వద్దకు వచ్చినప్పుడు చందన్ విజిల్ వేసి వారినందరినీ ఒక్క దగ్గరికి రమ్మన్ని సైగచేసాడు. రాజు వారితో ఏదో మాట్లాడాలనుకుంటున్నాడని చెప్పాడు.

రాజు తను కూర్చున్న చోటునుండి లేచి నిలుచున్నాడు. గ్రామస్తులందరిని ఒకసారి పరికించి చూసి మాట్లాడటం మొదలుపెట్టాడు.

'చెరువు నీటిని వృధా చేయకండి' అని మొదలుపెట్టి గోండిలో ఒక పొడవాటి ఉపన్యాసం ఇచ్చాడు. అందరూ శ్రద్ధగా విన్నారు. సాంస్కృతిక బృందం కూడా గంభీరంగా నిలుచుంది. 'చేపలు పెద్దగా పెరిగినంకనే తినాలి' అని ముగించాడు రాజు.

అతని ఉపన్యాసం గిరిజనుల్లో పెద్దగా అలజడి సృష్టించలేదు. వాళ్లలో వాళ్లు చాలాసేపు గుసగుసలాడుకున్నారు. తరువాత వారిలో ఒకరు పెద్ద చేపలు చప్పగా, తెల్లన్నంలా ఉంటాయని అన్నాడు. చాలామంది అది నిజమేనన్నట్లు తలలు ఊపారు. తాము చిన్నచేపలే పట్టుకు తింటామని మొండిపట్టుపట్టారు. పారే నీటిలో కాక ఇంకో విధంగా చేపలు ఎలా పట్టాలో తమకు తెలియదన్నారు. తమకు మరోలా చేపలు పట్టడం రాదు కనుక చెరువులో నీళ్లు నిలవ ఉంచడం సాధ్యపడదన్నారు.

తాను ఇంత చెప్పినా దాని ప్రభావం ఏమీలేకపోయేసరికి రాజు డీలాపడ్డాడు. తల అడ్డంగా ఊపుతూ 'సరే. చేపలు పట్టడానికి ఇంకో పద్ధతి కనిపెట్టే వరకూ ఇలాగే చేయండి. కాని పని అయిపోయాక తూమును మూయడం మాత్రం మరువకండి.'

తూమును మూయడం యొక్క ప్రాధాన్యత మాత్రం అందరికీ అర్థం అయ్యింది. ఎండాకాలంలో నదులూ, కొండవాగులూ ఎండిపోవడం వారికి అనుభవమే. నిరంతరం నీరు ఉంటే బాగుంటుందని వాళ్లూ అనుకుంటారు. కానీ ప్రస్తుతానికి మాత్రం వారికి చేపలు పట్టేందుకు ఇంకో మార్గం తెలియదు.

ఈ సమస్యకు పరిష్కారం కనుగొనడానికి ఆ రాత్రి సాంస్కృతిక బృందం సమావేశం అయ్యింది. ఏదో ఆట పాటల గురించి అయితే వారికి తెలుసు కానీ ఇది కొంచెం క్లిష్టమైన సమస్యనే అయి కూర్చుంది.

ఒక పెద్ద పడవ తయారు చేసి దాని సాయంతో చెరువులో చేపలు పట్టొచ్చనే సూచన చందన్ చేశాడు. విల్లును వెడల్పు, లోతు చేసి సాగదీస్తే పడవ అవుతుందని అక్కడివారికి వివరించాడు చందన్. ఒక కొబ్బరి చిప్పలాంటిదాన్ని తీసుకుని పడవ అంటే ఎలా ఉంటుందో చూపించే ప్రయత్నం చేశాడు. కానీ వారి బుర్రలకేమీ ఎక్కినట్టు లేదు. చివరికి పెద్ద చెట్ల మొదళ్లు నరికి ఒక తెప్పలాంటిది తయారుచేసి దాన్ని చెరువులో తేలియాడేటట్టు చేయాలని అనుకున్నారు. ఈ అలోచన అందరికీ అర్థం అయ్యింది. ఈ బాధ్యతను గ్రామ అభివృద్ధి కమిటీకి అప్పజెప్పాలని నిర్ణయించారు.

ఆ రాత్రి నిద్రపోయేముందు 'చెరువుకు స్నానానికి పోవడం మంచిదయ్యింది. మన కొత్త ఆలోచనతో చేపలు పట్టడం సులభమవుతుంది. చెరువు ఎండిపోకుండా ఉంటుంది, చేపలు కూడా ఎక్కువకాలం ఉంటాయి' అన్నాడు రాజు

'కానీ మీరు పెద్దగా ఉన్నా రుచిగా ఉండే కొత్త చేప రకాలను ప్రవేశపెట్టాలి. లేకుంటే వీరికవి నచ్చవు.' అన్నాను నేను.

'మాకు అదొక అదనపు పని' రాజు బదులు పలికాడు.

'ఇంతకూ ఆ పడవ ఎలా తయారుచేద్దాం?' అడవిలో కలపకు కొరతలేదు, కానీ పడవ తయారుచేసే మెళకువనే తెలియదు మనకు. అసలు మనకు ఈ పడవ ఉపాయం ముందు ఎందుకు తట్టలేదు?

'అందుకంటే ఇదివరకు మనం చేపల పెంపకం చేయలేదు కాబట్టి!'

'అవును నిజమే'

కాసేపు నిశ్శబ్దం రాజ్యమేలింది. దూరంగా ఒక చలిమంట చుట్టూ కూర్చున్న కళాకారులు ఏవో పాటలు పాడుతున్నారు. అది నిద్రపోయే సమయం. నిద్రతో కళ్ళు బరువెక్కుతుండగా రాజు అడిగాడు 'నువ్వెప్పుడైనా రైలు చూశావా?'

'చూశాను'

'మరి బస్సో?'

'అది కూడా చూశాను'

'నేనేదీ చూడలేదు.'

నేను ఆ రెండు ప్రయాణసాధనాల ద్వారా ప్రయాణించే ఇక్కడికి చేరుకున్నానని రాజుకు తెలియదు.

'ఇనుమును భూమినుండి వెలికితీస్తారని చెబుతారు. డబ్బు సంగతేంది? అది కూడా భూమిలోనుండే వస్తుందా?'

'లేదు. దాన్ని తయారుచేస్తారు'

'దేని నుండి తయారుచేస్తారు?'

'ఇనుము నుండి. కాదు! ఇనుము నుండి తయారైన యంత్రాల నుండి'
'ఈ కళ్లద్దాలు ఎలా తయారయ్యాయి?'
'వీటిని కూడా యంత్రాల ద్వారానే తయారుచేశారు'.
'యంత్రాలు అన్నిటినీ తయారుచేయగలవా?'
'దాదాపుగా చేయగలవు'
'బట్టను కూడా తయారుచేయగలవా?'
"ఆ చేస్తాయి. పత్తి నుండి తయారుచేస్తాయి'
'వీటన్నిటికీ అవసరమైన ఇనుము బస్తర్ నుండే వస్తుందా?'
'అవును. అధికశాతం ఇక్కడి నుండే'

'మీ అభిప్రాయం ప్రకారం ఈ ఇనుము మాదే... మా గిరిజనులదే కదా?'

'అవును. ఎందుకంటే అది మీ కాళ్ల కింద ఉన్న భూమిలోంచే వస్తుంది కదా'



'హు!...' అని నిట్టూర్చి రాజు కాసేపు మౌనంగా ఉండిపోయాడు. బహుశా కాసేపటికి నిద్రపోయాడేమో. నేను లేచి చలిమంటలో కాసిన్ని కర్రలు వేశాను. రాత్రి చల్లబడుతోంది. అక్కడ ఏ అలికిడీ లేదు. నేను ఆలోచనల్లో మునిగిపోయాను.

గిరిజనులు రాత్రి చాలా త్వరగా నిద్రపోతారు. అందుకే వాళ్లు ఇళ్లలో దీపాలు వెలిగించరు. పొద్దుగుంకే వేళకే భోజనాలు పూర్తిచేసేస్తారు. గిరిజనుల దినచర్య సందెచీకటి వేళకు గూడు చేరి, వేకువజామునే కువకువలాడే పక్షుల దినచర్యను పోలి ఉంటుంది. వారికి సమయం క్షణాల్లో, ఘడియల్లో ఉండదు. అది ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రిలోకి విభజించబడి ఉంటుంది. వారి జీవన విధానంలో సమయాన్ని చిన్న చిన్న భాగాలుగా చేయవలసిన అవసరం లేదు. వారు సంవత్సరాలను, దశాబ్దాలను కూడా లెక్కపెట్టుకోరు. ఈ కొలమానాలు వారి ఊహకందవు. వారి జీవనగతిని నిర్ణయించేవి రుతువులు, రోజువారీ పనులు మాత్రమే. అందుకే వాళ్లు వసంతం

పలకరించినప్పుడు, శిశిరం అడుగుపెట్టినప్పుడు, గ్రీష్మం మండించినప్పుడు, వర్షం తడిపేసినపుడూ ఆ రుతువుల పాటలే పాడుతారు. వారి పండుగలు కూడా స్థానికమైనవి. అటు విత్తనం వేయడంతోనో, ఇటు పంట కోతకోయడంతోనో ముడిపడి ఉన్నవి.

దీపావళి సమయంలో నేను దండకారణ్యంలోనే ఉన్నాను. కానీ అదెప్పుడు వచ్చివెళ్లిందో కూడా నాకు తెలియదు. వారు దీపావళి, దసరా వంటి పండుగలు జరుపుకోరు. ఎన్నడూ ఇంటిలో దీపం పెట్టనివాళ్లకు దీపావళి ఎట్లా అర్థమవుతుంది?

వాళ్లకు రాముడు, రామాయణము కూడా తెలియవు. అక్కడున్నప్పుడు వారి స్మశానాలు నాకంట పడ్డాయి. చనిపోయినవారిని బొందపెట్టడం, దహనం చేయడం అనే రెండు సాంప్రదాయాలూ ఉన్నాయి ఇక్కడి గిరిజనుల్లో. ప్రతి సమాధి, లేదా స్మారక చిహ్నం వద్ద ఒక రాయిని గుర్తుగా ఉంచి చనిపోయిన వారి వస్తువులు కొన్ని పెడతారు అక్కడ. సమాధులపై ఎప్పుడూ దీపం వెలిగించరు. ఇళ్లలోనే వెలిగించని దీపం సమాధిపైన వెలిగిస్తే అర్థరహితంగా ఉండదూ?



'ఈశ్వర్ భాయ్?'

'నువ్వింకా నిద్రపోలేదా రాజూ?' చాలాసేపు తరువాత అతని గొంతు వినిపించేసరికి ఆశ్చర్యపోయాను.

'ఆకాశంలోంచి ఈ చుక్కలు ఎలా వేలాడుతాయి?' రాజు తరచూ చిన్న పిల్లడిలా ఇటువంటి ప్రశ్నలు అడిగేవాడు. వాటికి జవాబు చెప్పడం కష్టమయ్యేది ఒక్కోసారి. అందుకే జవాబు చెప్పేబదులు నేనొక ఎదురుప్రశ్న వేశాను.

'చుక్కలను మీ భాషలో ఏమంటారు?'

'వియుక్క'

కాని రాజు తన ప్రశ్నను రెట్టించాడు. అదనంగా ఇంకొన్ని ప్రశ్నలు అడిగాడు. నేను చుక్కల గురించీ, సూర్యుడు, చంద్రుడు, భూమి గురించి నాకు తెలిసిన మేరకు చెప్పాను.

గోండుల్లో కూడా కథలు చెప్పుకునే సాంప్రదాయం ఒకటి ఉండుంటుంది కానీ రాజునడిగితే తానిప్పటివరకూ విన్న కథలేమీ లేవన్నాడు. నేను చాలామంది ఇతరులను కూడా అడిగాను, కానీ వారికి కూడా మనవళ్లకు, మనవరాళ్లకు కథలు చెప్పే తాతయ్యలు, నాయనమ్మలూ కనపడలేదట. దక్షిణ బస్తర్ లోని గిరిజనులకు పాటలు పాడుకునే సాంప్రదాయం ఉన్నది. కానీ రాజు, అతని మిత్రులకు తెలియని కథలు ఏవో ఈ ప్రాంతంలో ఉండే ఉంటాయి. నేను ప్రయాణించినంత మేరా మాత్రం అవి వినపడలేదు. కథ అంటే ఒక ఆలోచనల సమాహారపు సృష్టి, లేదా మనిషి సాధించిన విజయాల జ్ఞాపకాలను సజీవంగా ఉంచే ఒక ప్రయత్నం. ఒక తరం నుండి మరో తరానికి అందివచ్చే క్రమంలో ఇవే పురాణాలుగా మారుతాయి.

బస్తర్‌లో చలామణిలో అటువంటి పురాణగాధలు, జానపద గాధల గురించి తెలుసుకోవాలని నేను ప్రయత్నించాను. ఇంకొంచెం సమయం ఉండుంటే ఈ విషయాన్ని లోతుగా పరిశోధించేవాడినే. అయినప్పటికీ అటువంటి సాహసగాథ ఒకటి నాకు పరిచయమయ్యింది. 1910లో బ్రిటీషు వారికి వ్యతిరేకంగా మహోన్నత తిరుగుబాటు లేవదీసిన గుండధూర్ అనే సాహసవీరుడి గురించి తెలిసింది నాకు. చివరికి అతను అమరుడయ్యాడు. ఎందుకోగానీ గుండధూర్ కథ అటు పాటల రూపంలో కానీ కథ రూపంలో కానీ ఇక్కది ప్రజల్లోకి వెళ్ళలేదు. గుండధూర్ సాహసోపేత జీవితం గురించి మరిన్ని వివరాలు పరిశోధించి వెలికితీసి అతన్ని ఒక గిరిజన సాంస్కృతిక చిహ్నంగా నిలబెట్టాలని విప్లవోద్యమం కృషిచేస్తోంది. దండకారణ్యంలో గెరిల్లాలు నిర్వహించిన ఒక కార్యక్రమానికి వచ్చిన తెలుగు పాత్రికేయ మిత్రుడొకరు నాకు గుండధూర్ గురించి తెలియజెప్పాడు. అతడిని కలవకపోయి ఉంటే గోండు చరిత్రలో ఇటువంటి గాధలు లేవని నేను నిర్ధారణకు వచ్చేవాడిని. ఆ మిత్రుడు నాకు గోండులపై, ఇతర భారతీయ గిరిజనులపై ఎన్నోపుస్తకాలు రాసిన వెరియర్ ఎల్విన్ అనే ఇంగ్లీషు ఆంత్రోపాలజిస్టు గురించి కూడా చెప్పాడు.

***

మా మరుసటి గమ్యస్థానం చేరడానికి మేం ఒక రోజంతా నడిచాం. ఉదయం నుండి సాయంత్రం వరకూ మా నడక రాళ్లు రప్పలమయమైన ప్రాంతం గుండా సాగింది. ఆ ఊరు గిరిజనుల ప్రమాణాల ప్రకారం చూస్తే పెద్దదన్నట్టే. దాదాపు ఎనభై ఇండ్లు ఉన్న ఆ గ్రామం ఆ ప్రాంతంలోనే పెద్దదట. అక్కడికి చేరే సరికే మేమంతా బాగా అలసిపోయాం. కిట్ బ్యాగులు పక్కనపెట్టి నేలపై విశ్రమించాం.

'మీ బృందం చాలా అలసిపోయినట్టుంది?'

'మనం మొత్తం 18 కిలోమీటర్లు దుర్గమ మార్గం గుండా పయనించాం ఈశ్వర్ భాయ్. అయినప్పటికీ ఆ గ్రామస్తులు రాగానే మనోళ్లు లేచి ఆడి పాడుతారు చూడండి' అన్నాడు చందన్. అతను కూడా బాగా అలసిపోయినా దళ కమాండర్ ఎప్పుడూ విశ్రమించదు కదా. అతనికి తన బాధ్యతలేమిటో తెలుసు. ఇద్దరు దళ సభ్యులకు భోజనం, చాయ్ తయారు చేసే బాధ్యతను ఇచ్చాడు. వారు కూడా అలసిపోయినా ఎలాగోలా లేచి వెంటనే పని మొదలుపెట్టారు.

చీకటిపడే వేళకు నృత్యాల పరంపర మొదలైంది. గ్రామస్తులూ, సాంస్కృతిక బృందమూ కలిసి ఇచ్చిన ప్రదర్శన నన్ను అచ్చెరువొందేలా చేసింది.

రంగన్నలో కూడా ఒక కెరటం ఎగిసింది. అతను తన ఆయుధాన్ని ఎవరికో ఇచ్చి ఆ నృత్యపు వృత్తంలోకి అడుగుపెట్టాడు. అతను చాలాసేపటి వరకూ తన బాధ్యతలు మరచిపోయినట్టు కనపడింది.

ఒకటి మరోదానిలోకి దారితీసాయక్కడ. నృత్యం...పాట, లయబద్ధమైన పాదాల కదలిక, నవ్వుల గలగలలు, అదొక వీనులవిందైన పండుగ వాతావరణం.

అటువంటి వాతావరణంలో అందరూ పరవశులైపోతారు. కొద్దిసేపటి కిందట ఇదే బృందం 18 కిలోమీటర్లు నడచి వచ్చిందని, ఆకలిగొని, దప్పికతో, చెమట నిండిన దేహాలతో, డస్సిపోయి ఆహారం కూడా తినకుండా నిద్రపోదామని చూసిందని చెప్పితే అస్సలు ఎవరైనా నమ్ముతారా ఇప్పుడు.

అక్కడ ఎట్లాంటి వేదిక లేదు, కనీసం నేల కూడా సమతలంగా లేదు, జిలుగువెలుగులు లేవు. మధ్యలో మండుతున్న మంటనే అక్కడ ఉన్న ఏకైక వెలుగు. ఈ దృశ్యం అనేక వందల ఏళ్ల కిందటి పరిస్థితిని గుర్తుకుతెస్తుంది. ఈ పరవశం, ఈ సరదా, అందరం ఒక్కటనే ఈ భావన..ఇవి చాలా అపూర్వమైనవి.

అటువంటి సంబరాల మధ్య వారు పాడే పాటల అర్థాలు ఏమిటో అడగడం అసంభవమనిపించింది నాకు. నేనడిగినా ఆగే వాళ్ళూ లేరు, అర్థం చెప్పేవాళ్ళూ లేరు.

'నువ్వు కూడా వెళ్ళు!. ఆ ఆయుధం నాకివ్వు' అన్నాను రంగన్న వదిలి వెళ్లిన గార్డ్ ను ఉద్దేశించి. అతను చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు. కానీ కాసేపట్లోనే అతనూ ఆ కెరటాల్లో భాగమయ్యాడు.

అక్కడి వాతావరణానికి తుపాకీ చాలా పరాయిదిగా కనిపిస్తోంది. చుట్టూ ఉన్నవాటితో సామరస్యత లేదు దానికి. అంతే కాదు. ఇప్పుడేమైనా జరిగినా ఆ ఒక్క అయుధం మమ్మల్ని కాపాడలేదు కూడా.



ఇంత ఉత్సవాలు జరుగుతున్నా గ్రామంలో, చుట్టున్న అడవిలో కూడా రక్షణ కొరకు గార్డులను నియమించారు. ఇట్లాంటి సంబరాలు ఇంకో ఊళ్లో జరిగినప్పుడు ఆ గార్డులు వాటిలో పాల్గొంటారు. అప్పుడు రక్షణ బాధ్యతలు వేరొకరు తీసుకుంటారు.

అర్ధరాత్రి దాటి చాలాసేపయ్యాక, దాదాపు 2:30, 3:00 అవుతుండగా చందన్ ఒక దీర్ఘమైన విజిల్ వేశాడు.

'ఎలా ఉంది ఈశ్వర్ భాయ్! ఇప్పుడు నీ అలసట ఏమయ్యింది? ఈ సంబరాలు ఎంత అలసిన వారినయినా తిరిగి ఉత్తేజితులను చేస్తాయి. ఇది ఈ అడవి చేసే నృత్యం. దీన్నే నేను గుండధూర్ ఆగ్రహ ప్రకటనలా, భూంకాల్ తిరుగుబాటులా మార్చగలగాలి. లేకుంటే నగరం దీన్ని తినేస్తుంది. సినిమా దీన్ని మింగేస్తుంది.'

ఈ సాంస్కృతిక బృందం కమాండర్ పదేళ్ల వయసులో వరంగల్ నుండి వచ్చాడట ఇక్కడికి. గత 14 యేళ్లుగా ఇలా తిరుగుతున్నాడట. అతను

చదవగలడు, రాయగలడు, బాగా పాడతాడు, ఆడతాడు. అతనింకా ఏమేం సాధించగలడని అడిగితే చెప్పలేను. కానీ అనుకున్న లక్ష్యం సాధించడానికి అహరహరం శ్రమిస్తాడు. బస్తర్ అడవులకు వచ్చి ఏడాదిన్నర అయ్యిందట. ఈ కొత్త ఆటపాట కార్యక్రమాన్ని మొదలుపెట్టాడు ఇక్కడి గిరిజనుల కొరకు.

'గిరిజనుల నృత్యాల్లో వేగం కనపడలేదు నాకు' నా అభిప్రాయం అతనికి చెప్పాను.

'డోలు ఉన్నది కానీ దాని దెబ్బ లేదు, ఊపు ఉన్నది కానీ అందులో అనుకున్నంత ఆగ్రహం లేదు. ఆలాపన ఉన్నది కానీ అందులో ఛాలెంజ్ లేదు. ఇక్కడ యుద్ధ భేరి మోగించే వాయిద్యం ఏమీ లేదా?'

'నాంగోర్ అనే వాయిద్యం ఉన్నది. ధం!, ధం!, ధం!, అని మోగుతుందది. ఏదైనా ప్రమాదం ముంచుకువస్తున్నదని ప్రజలను హెచ్చరించడానికి, అందరూ ఒకచోటికి రావాలని చెప్పడానికి ఈ వాయిద్యాన్ని మోగిస్తారు. కాకపోతే ప్రత్యేకంగా యుద్ధ నృత్యం ఏమి లేదిక్కడ. పాత కాలంలో అటువంటిది ఏమైనా ఉండి ఉంటే దాన్ని మళ్లీ పునరుద్ధరించాలి. మేమొక కొత్త నృత్యం మొదలుపెట్టామిక్కడ. విల్లు, బాణాలతో ఇక్కడి మిలిషియా సభ్యులు చేసే నృత్యం. జానపద నృత్యాలు చాలా నెమ్మదిగా, అహ్లాదకరంగా ఉంటాయి. పూవులు, పండ్లు సేకరించడం, వరికోత కొయ్యడం, అటుపై ఆనందంలో మునిగితేలడం...కోపం, ప్రేమ, దయ, ఆగ్రహం...అడవిలో అన్నీ ఉన్నాయి. మేము ఇక్కడి మట్టినుండే మాకు కావలసినవన్నీ తీసుకుంటాం.'

ఇంకాసేపట్లో తెల్లవారబోతుందనగా కూడా మేము మాట్లాడుకుంటూనే ఉన్నాం. అప్పుడు నాలుగు అయినట్టుంది. అయిదింటికి ఉదయపు విజిల్ మోగుతుంది. ఒక గంట అయినా నిద్రపోతే రేపు కొంచెం ఉత్సాహంగా ఉండొచ్చు అని అనుకుని ఇద్దరం మా పక్కలపై విశ్రమించాం. విజిల్ మోగేసరికి అసలు నిద్రపోయామో లేదో కూడా తెలియలేదు మాకు. అందరూ లేచి కాలకృత్యాలు తీర్చుకోవడం మొదలుపెట్టారు.

క్యాంపులో పాలు, చక్కెర రెండూ అయిపోయాయి. అందుకే ఇవ్వాళ చాయ్ తయారుచేయడం లేదు. దళానికి సరుకులు సరఫరా చేసే నారంగ్ భాయ్ నిన్న రాత్రికే రావలసింది కానీ ఎందుకో ఇంకా చేరుకోలేదు.

పాలు, చక్కెర లేకుండానే చాయ్ పెట్టుకునే ప్రయత్నాల్లో కొంతమందిమి ఉండగానే నారంగ్ భాయ్ రానేవచ్చాడు. 52-53 ఉంటాయేమో అతనికి. జుట్టు ఇంకా తెల్లబడలేదు. చూడడానికి ఆరోగ్యంగా ఉన్నాడు. భుజంపై ఒక బస్తా తీసుకుని ఇద్దరు మనుషులను వెంటబెట్టుకుని వచ్చాడు.

మేమిద్దరం ఒకే వయసువాళ్లం. జీవితపు బాధ్యతలు అన్నీ ముగిసి, మనవలు, మనవరాండ్లతో ఆడుకునే వయసు అది. చేతిలో ఒక కర్ర, భుజంపై ఒక తువ్వాలుతో దండకారణ్యంలోని గ్రామాల గుండా పయనిస్తాడు అతను. కొన్నిసార్లు గ్రామస్తులకు విత్తనాలు పంచుతూ, ఇంకొన్నిసార్లు కలుపు మొక్కలు ఎలా ఏరివేయాలో, నారుమడులు ఎలా తయారుచేయాలో గిరిజనులకు నేర్పుతూ...అతనికి హిందీ, గోండీ, తెలుగు - మూడు భాషలు చదవడం వచ్చు. రాయడం మాత్రం నేర్చుకోలేదు. ఎప్పుడూ నవ్వు మొఖంతో పనులు చేపడుతుంటాడు. రాత్రంతా నిర్భీతిగా అడవి దారుల గుండా ప్రయాణం చేయగలడు. అతను నేర్పే మంచి విషయాల వల్లా, అతని వయసు వల్లా అందరూ అతనికి బాగా మర్యాద ఇస్తారు. అతని ఆత్మవిశ్వాసం ఎటువంటిదో ఈ ఉదాహరణ చెబుతుంది. ఒకసారి అడవిలో ఒక్కడే ఉండగా నారంగ్ భాయ్ కి జ్వరం వచ్చిందట. నాలుగు రోజులపాటు ఏ మందూ లేని పరిస్థితిలో ఒక నది ఒడ్డున పడుకుని కేవలం మంచి నీళ్లు తాగుతూ ఉన్నాడట. జ్వరం తగ్గి కొంచెం లేవగలిగినప్పుడు పడుతూ లేస్తూ సమీప గ్రామానికి చేరుకున్నాడట. అక్కడ కాస్త జావ, నూకల అన్నం తిన్నాక ఒంట్లోకి శక్తి వచ్చి మళ్లీ పనిలో పడ్డాడట.

ఇప్పుడు నారంగ్ ఒంటరివాడు కాదు. ఇంకో ఇద్దరు యువకులను ఉత్తేజపరచి వారి సహాయంతో దండకారణ్యంలో వ్యవసాయ అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్నాడు.



సత్నామ్

'నారంగ్ అన్నా నువ్వు తెచ్చే పాలు, చక్కెర కొరకు ఎదురుచూసి, చూసి ముసలివాళ్లం అయిపోయాం' నారంగ్ ను ఆలింగనం చేసుకుంటూ అన్నాడు ఒక కళాబృందం సభ్యుడు.

'నేను కోరుకునేదీ అదే. గిరిజనులు ఎక్కువ కాలం బతకాలి. వాళ్లు బాగా ముసలివాళ్లు కావాలి' అంటూ ఆ యువకుడిని చేతుల్లోకి తీసుకున్నాడు.

అందరు నవ్వేశారు ఆ ఛలోక్తి విని.

బస్తర్ ప్రాంతంలో ఎక్కువమంది ముసలి వాళ్లు కనిపించరు. 80 ఇండ్లు ఉన్న ఈ గ్రామంలో ముసలివారు అనదగ్గవాళ్లు ముగ్గురే - ఒక మగ, ఇద్దరు ఆడవారు - ఉన్నారు.

ముగ్గురూ పాతతరానికి చెందినవాళ్ళు. ఆ ఇద్దరు స్త్రీలు నడుము చుట్టూ ఒక వస్త్రం చుట్టుకున్నారు. పైన ఏ అచ్ఛాదనా లేదు. ఇక అ వృద్ధుడి వంటిపై ఒక గోచీ మాత్రమే ఉన్నది. వారు తమ జీవితం మొత్తం ఇదే రకపు వస్త్రధారణతో గడిపారు కాబట్టి ఇప్పుడు మారడానికి సిద్ధంగా లేరు. కొత్తతరం మాత్రం ఈ మధ్యనే పూర్తి వస్త్రధారణకు అలవాటుపడింది. గెరిల్లాలు ప్రజలకు చాలా దుస్తులే పంపిణీ చేశారు. ఇక్కడి యువతులు చీరలు, జాకెట్లు వేసుకోవడం నేర్చుకున్నారు. అడవిలో పనులు చేసుకునేటప్పుడు చీరలు సౌకర్యంగా ఉండవు కాబట్టి వాళ్లు వాటిని మోకాళ్ల పైకి కట్టుకుంటారు. ఏదైనా పండుగనో, జాతరనో ఉంటే మాత్రం అన్ని వయసుల స్త్రీలు చీరలు, జాకెట్లు ధరిస్తారు.

సరైన దుస్తులు ధరించకపోవడానికి కారణం పేదరికం మాత్రమే కాదిక్కడ. మంచి బట్టలు ధరిస్తే ఆడవాళ్లూ అందంగా కనపడతారని, దారితప్పుతారని ఇక్కడ కొందరి మగవారి అభిప్రాయం. ఇలాంటి కారణాలే చూపి స్త్రీలు వంటినిండా బట్టలు ధరించాలని హుకుం జారీ చేసే మౌల్వీల భావాలకు ఇది సరిగ్గా వ్యతిరేకం. ఈ రెండిటి మూల ఉద్దేశాలు ఒకటే. రెండు దిక్కులా మహిళల వస్త్రధారణను పురుషుడే శాసిస్తాడు. ఇంకో వైపు మహిళల శరీరాలను వాడుకుని డబ్బు చేసుకోవాలనుకుంటుంది పాశ్చాత్య

ఫ్యాషన్ పరిశ్రమ. ఈ మూడు వర్గాలూ స్త్రీ శరీరాన్ని పితృస్వామ్య దృష్టితోనే చూస్తున్నాయి.

అయినప్పటికీ ఇక్కడ స్త్రీలపై తాలిబాన్ తరహా అణచివేతకానీ, పాశ్చాత్య దిగజారుడుతనం కానీ లేదు. ఇక్కడ ఉద్యమం ప్రవేశించడం వల్ల ఒక నిజమైన మార్పుకు బీజం పడింది. అమ్మాయిలిప్పుడు పాత సాంప్రదాయాలను తోసిరాజంటున్నారు. సైనిక దుస్తులు ధరించి, భుజాలపై తుపాకులతో వాళ్లిప్పుడు ఊరూరు తిరుగుతున్నారు. గెరిల్లా సైన్యంలో ఇప్పుడు సగం మహిళలే. సామన్య స్త్రీలు కూడా ఈ మార్పు కెరటాలను సమర్థిస్తున్నారు. అరణ్యంలోను, చుట్టుపక్కల ప్రాంతాల్లో నిర్వహించే ఊరేగింపుల్లో మహిళల సంఖ్య చూస్తే ఇది అర్థం అవుతుంది.

గిరిజనుల జీవన విధానంలో త్వరితగతిన మార్పులు తీసుకురావాలని గెరిల్లాలు ఏమీ ఆత్రపడటం లేదు. అది సమాజంలో సమూల మార్పుతోనే సాధ్యపడుతుందని వారికి తెలుసు. ఇక్కడ కొత్త అవసరాలు కొత్త జీవనవిధానాలను, కొత్త వేషధారణలను, కొత్త ఆలోచనలను, కొత్త సాంప్రదాయాలను ఆవిష్కరిస్తున్నాయి. ఇక్కడ జరిగిన మార్పు, జరుగుతున్న మార్పు - రెండూ స్పష్టంగానే కనపడుతున్నాయి.

ముసలివాళ్లు అవడం గురించి నారంగ్ భాయ్ అన్న మాటలు ఎక్కువ కాలం జీవించాలనే గిరిజనుల కోరికను ప్రతిఫలిస్తుంది. అతని సమకాలీకులెందరో ఈపాటికే మరణించారు. వారిని కన్నీళ్ల మధ్య అతనే స్వయంగా సమాధి చేశాడు. తనకన్నా చిన్నవాళ్ళను, చిన్న పిల్లలు కూడా ఎందరో సమాధి అవడం దగ్గరుండి చూశాడతను. గిరిజనుల అల్పాయుష్షు సహజమైనది కాదని దాని వెనుక బలమైన కారణాలు ఉన్నాయని అతని నమ్మకం. ఒక సామాన్య గిరిజనుడు చావు ప్రకృతి సహజం అనుకుంటాడు, కాబట్టే జీవితానికి కూడా పెద్దగా ప్రాధాన్యతనివ్వడు. అతనికి చావు కూడా జీవితంలో ఒక భాగమే. అందుకే అతను పెద్దవారిదైనా, చిన్నపిల్లలదైనా మృత్యువును చూసి విచారించడు. వారికి పెద్దగా భావోద్వేగాలు లేవని మనం

అనుకోవచ్చు అయితే కావొచ్చు మృత్యువుపై వారికి ఎటువంటి నియంత్రణా లేదు జబ్బుపడ్డవాళ్లకు చికిత్స లేదు గాయపడ్డవారికి మందూ లేదు మనుషులు అసహజంగా మృత్యువాతపడటం వారు నిత్యం చూసినా అది వారి దృష్టిలో సహజ మరణమే వాళ్లిలాగే జీవించడానికి అలవాటుపడ్డారు

నారంగ్ మాత్రం దీనికి భిన్నమైన మనిషి తన స్వంత పిల్లలు పెరిగి పెద్దవాళ్ళు అవగానే తాను పొరుగు రాష్ట్రం నుండి ఒక రెండేళ్ల అనాథ ఎల్లను తీసుకువచ్చి పెంచుకున్నాడు ఇవ్వాళ ఆ అమ్మాయికి తనదంటూ ఒక స్వంత కుటుంబం ఉండటం చూసి నారంగ్ భాయ్ ఎంతో సంతోషిస్తున్నాడు

నారంగ్ భాయ్ వ్యాఖ్యకు అందరూ నవ్వగానే అతను ఇంకో మాటన్నాడు పాలు చక్కెర వచ్చాయి కదా ఇక అందరూ మళ్ళీ యువకులైపోతారు అని అక్కడ మళ్లీ నవ్వులు విరిశాయి

'రాత్రి రాలేకపోయారేమిటి నారంగ్ భాయ్‌తో మాటలు కలిపాను

టౌనుకి సరుకులు తేవడానికి వెళ్లిన పిల్లలు తిరిగిరాలేదు కానీ కంగారుపడాల్సినదేమీ జరగలేదు

ఈ వస్తువుల కొనుగోలు మీద కూడా నిషేధం ఉండి ఉండాలే?

ఆ! ఉన్నట్టే లెఖ్క ఇక్కడికి సబ్బులు చాయ్ పత్తా చక్కెర వంటివి రాకుండా అపాలని పోలీసుల ప్రయత్నం అందుకే అన్నీ స్థానికంగానే తయారుచేసుకోవాలి మనం కేవలం చాయ్ పత్తా దుస్తులు వంటివే బయటినుండి తెచ్చుకోవాలి గంభీరంగా చెప్పాడు నారంగ్

అతను చెప్పింది నిజమే సాధ్యమైనన్ని వస్తువులు ఇక్కడే తయారుచేసుకోవాలి దానివల్ల ఉద్యమ పునాదులు పటిష్టమవుతాయి కొంచెం నిదానంగానయినా అన్నీ సాధిస్తామని నారంగ్ అన్నాడు అది ఎలా జరుగుతుందో అతనికి తెలియదు కానీ జరుగుతుందని మాత్రం విశ్వాసం ఉంది

చెరువు వద్ద జరిగిన సంఘటనను నారంగ్‌కు వివరించాడు రాజు

రుచిగా ఉంటేనే పెద్ద చేపలు తింటామనే గ్రామస్తుల అభిప్రాయంతో పాటు, నీరు, చేపల వృధాను అరికట్టడానికి అనుసరించాల్సిన ప్రణాళిక కూడా రచించాలని చెప్పాడు. ఇతర రకాల చేప విత్తనం సేకరించడంపై కూడా వారు చర్చించారు.

కానీ చేప విత్తనాన్ని ఇంత దూరం తీసుకురావడం అంత సులభం కాదు. దాదాపు యేడాది క్రితం ఇక్కడ చేపల పెంపకం మొదలుపెట్టించింది నారంగే. ఈ పథకం కొన్ని చెరువుల్లోనే విజయవంతమయ్యింది. చాలా చోట్ల చేపలు చనిపోయాయి. ఇది విజయవంతమైన చోట్ల మాత్రం గ్రామస్తులకు ఉచితంగా చేపలు దొరకడమే కాదు మిగిలినవి మార్కెట్లో అమ్మారు కూడా.

***

నారంగ్‌తో ఉండటం వల్ల ఆ గ్రామం గురించి బాగా అర్థం అయ్యింది. మాట్లాడుకుంటూ గ్రామం మొత్తాన్ని చుట్టివద్దామని మేము బయలుదేరాం.

'నారంగ్ అన్నా! ఎక్కువ దూరం పోకండి' చందన్ అరిచాడు.



'లేదు, లేదు. ఊర్లో వరకే పోయివస్తాం'

ప్రతి గిరిజన గూడెమూ చెల్లాచెదురుగా ఉన్న కొన్ని గుడిసెల సమూహం. ఇక్కడ వీధులూ, మురుగునీటి పారుదల వంటి సౌకర్యాలేం ఉండవు. అక్కడొకటి, ఇక్కడొకటి గుడిసె...ఒక్కో గుడిసెకు మూడు నాలుగు కాలిబాటలూ. ప్రతి గుడిసె ముందు భాగంలో వెదురుతో కట్టిన ఒక దడి. ప్రతి గుడిసెలోను ఒకటో రెండో చక్కగా అలికిన గదులు. గోడలు సాధారణంగా చెక్కలతో పెడతారు. పైకప్పు పది పదకొండు అడుగుల ఎత్తులో ఉంటుంది. గుడిసెల్లో కనపడే పాత్రలు – ఒకటో రెండో ప్లేట్లు, గ్లాసులు, గిన్నెలు, కొప్పెరలు, ఒక తెడ్డు, ఒక లొట్టి, ఒక కడాయి వంటివి. ఒక నాలుగు అడుగులు మించని నులక మంచం కూడ కొన్ని గుడిసెల్లో కనిపిస్తుంది. వడ్లు దంచడానికి ఒక రోలు, ఒక గొడ్డలి, ఒక పెద్ద కొడవలి, నూనె తీసేందుకొక పరుపు బండ దాదాపు అన్ని గుడిసెల్లోను ఉంటాయి.

ప్రతి ఇంట్లో ఒక వెదురు డ్రమ్ము మాత్రం ఉంటుంది. పెద్ద గ్రామాల్లో నలుగురు 'నిపుణులు' ఉంటారు. వాళ్లే మంత్రసాని, ఇనుము పని చేసే వ్యక్తి,

కుండలు చేసే వ్యక్తి, ఇంకా మంత్రగాడు. సాధారణంగా నేతపని చేసే వాళ్ళు, తోలుపని చేసే వాళ్లు, చెక్కపని చేసే వాళ్లు ఇక్కడ కనిపించరు.

ఎవరింట్లోనూ దేవుళ్లు, దేవతల విగ్రహాలు కానరావు. ఊళ్లల్లో గుడులు కూడా ఉండవు. ఊరి చివర ఉన్న ఒక గుడిసెలో ఏనుగు, మేకల విగ్రహాలు మాత్రం ఉంచుతారు. ఆరునెల్లకో, ఏడాదికో వచ్చే పండుగనాడు ఈ విగ్రహాలను శుభ్రంచేస్తారు. కొన్ని ఇళ్లలో బుడ్డి దీపం ఉంటుంది కానీ వారు దాన్ని ఎప్పుడో కానీ వాడరు. ప్రతి ఇంట్లో వెదురుతో చేసిన వస్తువులు కనిపిస్తాయి. ఇంట్లో ఎంతమంది ఉంటే అన్ని విల్లులు ఉంటాయి. బాణాలను అంబులపొదిలో ఉంచకుండా గుడిసె దూలాల సందుల్లో చెక్కుతారు. ఎక్కడో ఒక ఇంట్లో చాలాకాలంగా భద్రపరచిన పులిచర్మమో, సింహం చర్మమో కూడా కనపడొచ్చు. ఈ వస్తువులన్నీ కూడా చాలా ఒద్దికగా అమర్చి ఉంటాయి. ఇంటి ముందు ఒక కోళ్ల గూడు, పక్కన మేకల కొరకు ఒక దడి లాంటిది కట్టి ఉంటుంది. ఆవులు మాత్రం కట్టేసి ఉండకుండా స్వేచ్ఛగా మేస్తుంటాయి. 91

గిరిజనులకు కాళ్లకు పాదరక్షలు ధరించే అలవాటు లేదు. ఆసక్తి ఉన్న మగవాళ్ళు కొందరు పట్నం నుండి పాదరక్షలు కొనుక్కొచ్చుకుంటారు కానీ వాటిని ఎప్పుడూ ధరించరు. తమ సామాజిక హోదాకు చిహ్నంగా దాచి ఉంచుకుంటారంతే. స్త్రీలకు మాత్రం అసలు పాదరక్షలే ఉండవు.

చిన్న పిల్లలయితే దిసమొలలతోనే తిరుగుతూ కనిపిస్తారు. వారి నడుము చుట్టూ మొలతాడు కట్టడం ఇక్కడి గిరిజనుల అలవాటు. దాన్నీ గోండీలో పనొడె అంటారు. సాధారణంగా ఇంటికి ఇద్దరు ముగ్గురు మించి పిల్లలు కనపడరు. ప్రసవ మరణాల రేటు, పసిపిల్లల మరణాల రేటు చాలా ఎక్కువ ఇక్కడ.

కొంచెం ఆదాయం ఎక్కువ ఉన్న గిరిజనుల ఇళ్లు పెంకులతో కప్పబడి ఉంటాయి. కాకపోతే అలాంటి ఇళ్లు చాలా అరుదుగా కనిపిస్తాయి. గుడిసెల బయటిగోడలపై చక్కగా ఎర్రమట్టితో అలికి పూవులు, లతలు, పక్షుల బొమ్మలు గీస్తారు.

స్త్రీ పురుషులిరువురూ పొగాకు సేవిస్తారు. మగవారు బీడీలు కూడా తాగుతారు. గెరిల్లాల వైద్య విభాగం వారు ఎన్నిసార్లు 'మట్టితో వంటపాత్రలు తోమవద్దు, అందుకు బూడిద వాడాలని' చెప్పినా ఈ గిరిజనులు మాత్రం దానిని చెవికెక్కించుకోవడం లేదు.

ఇప్పుడు చాలా మంది గిరిజనులకు అడవిలో ఎంతో కొంత భూమి ఉన్నది. ఈ మధ్యనే వాళ్లు స్థిరంగా ఒకచోట ఉండి వ్యవసాయం చేయడం నేర్చుకున్నారు. ఇదివరకైతే ప్రతి యేడూ ఒక కొత్త ప్రదేశానికి వలస వెళ్లేవాళ్ళు. గెరిల్లాలు ఇతర ప్రాంతాల నుండి గిరిజనులను తీసుకువచ్చి ఇక్కడ వారికి భూమిని పంచారు. వారికి ఆ భూమిపై యాజమాన్య హక్కులు కూడా ఇచ్చారు. పాతకాలం ఊళ్లలో ఉండే భూస్వాములు (పటేళ్లు) ఇప్పుడు ఊళ్లు విడిచి సమీప నగరాలకు వలసవెళ్లారు. ఊళ్లోనే ఉండిపోయిన కొంతమంది పటేళ్లు వ్యవసాయం చేస్తున్నారు. అయితే వారికి కూడా ఒక సామాన్య గిరిజనుడికి ఉన్నంత భూమే ఉంటుంది. భూమి విస్తీర్ణం సాధారణంగా కుటుంబం సైజును బట్టి నిర్ణయిస్తారు. వ్యవసాయ కూలీలు ఎక్కడో కానీ కనిపించరు. ఇక్కడ ప్రతి ఒక్కరూ మిగతా వారి వ్యవసాయ పనుల్లో సాయపడతారు. ఎనిమిదేళ్ల క్రితం ఎవరికి చేతనైనంత వారు అడవిని కొట్టి భూమిని సాగుచేసుకొమ్మని చెప్పారు గెరిల్లాలు. ఇప్పుడు గిరిజనులందరికీ భూమి దొరికింది కాబట్టి అడవిని నరకడం ఆగిపోయింది.



గిరిజనేతరులను ఇక్కడ స్థిరపడనీయరు. ఇక్కడ వ్యాపారం చేయాలంటే గెరిల్లాల అనుమతి తీసుకోవాలి. వారాంతపు సంతల్లో కూడా గిరిజనులను ఎవరూ మోసం చేయకుండా గెరిల్లాలు పహారా కాస్తుంటారు. నేను కొంతమంది వ్యాపారస్తులతో మాట్లాడినప్పుడు గెరిల్లాలు వారినేమీ భయపెట్టడంలేదని చెప్పారు. గెరిల్లాలు ఉన్న ప్రాంతంలో దోపిడీల భయంలేదని అందుకే ఇప్పుడు నిశ్చింతగా వ్యాపారం చేసుకోగలుగుతున్నామని వారు నాకు చెప్పారు.

నారంగ్, నేను కలిసి గ్రామం అంతా తిరిగి చూసే క్రమంలో ప్రతి ఇంట్లో ఉన్న పెరటి తోటలను, సేంద్రియ ఎరువు కొరకు తవ్విన గోతులను,

సహకార పద్ధతిలో నిర్వహించబడుతున్న వ్యవసాయ క్షేత్రాలను చూశాము. కొంతమంది గిరిజనులు ఇంకా పెరట్లో కూరగాయలు సాగుచేయడం మొదలు పెట్టలేదు. అంట్లు తోమిన నీళ్లను మడులకు పారించడం ద్వారా కూరగాయలు సాగుచేసే ప్రయోగం దాదాపు రెండేళ్ల క్రితం మొదలైంది. కొన్ని ఇళ్లలో మాత్రం కూరగాయ మడులు పచ్చగా కనిపించాయి.

నారంగ్ బృందం అనేక గ్రామాల్లో గిరిజనులకు బెండకాయ, టమాట, వంకాయ, క్యారెట్, ముల్లంగి ఇంకా కాకరకాయ విత్తనాలను పంచిపెట్టారు. ఇటువంటి పంటలను ఈ గిరిజనులు మొదటిసారి చూస్తున్నారు. అత్యధికశాతం గిరిజనులు కూరగాయ విత్తనాలను ఆ మడులల్లో చెల్లాచెదురుగా వెదజల్లారు. అందుకే మొక్కలు దగ్గర దగ్గరగా మొలకెత్తి ఒకదానికొకటి అల్లుకుపోయాయి. మడుల నిండా రాళ్లు రప్పలు, కలుపుమొక్కలతో నిండిఉన్నాయి. కొందరు గిరిజనులు మాత్రం తమ మడులలోంచి రాళ్లు కలుపు మొక్కలు ఏరివేసి విత్తనం చల్లారు. అలా చేసిన తోటలు చూడడానికి చక్కగా ఉన్నాయి. మొదటిసారి సాగుచేసినప్పుడు కూరగాయ మడులన్నీ అడవి తీగలతో నిండిపోయాయి. గిరిజనులకు ఇంకా కలుపు తీయడం రాదు. అందుకే ఈ ఏడాది నారంగ్ వారికి ఆ మెళకువలు నేర్పిస్తున్నాడు.

ఆ గ్రామంలో రెండు సహకార కూరగాయ మడులు ఉన్నాయి. ఊరి చివర ఉన్న మడి చెరువు నీరులో మునిగి పాడైపోయింది. ఊరి మధ్యలో ఉన్నదాని నిర్వహణ మాత్రం బాగానే ఉన్నట్టుంది. పశువులు మేయకుండా చుట్టూ కంచె వేశారు. ఇందులో విత్తనాలు కూడా వరుసక్రమంలో వేశారు. కాకపోతే ఈ మడిలో కూడా రాళ్లూ, కలుపు మొక్కలూ బాగానే ఉన్నాయి. ఇది వరికోతల సమయం కాబట్టి వాటిని తొలగించలేకపోయారట. ఆ పెద్ద మడిపక్కన నిలబడి నారంగ్ చాలా సంతోషపడ్డాడు. ఈ మడి పరిస్థితి గ్రామంలోని మిగతా మడులతో పోలిస్తే పెద్ద గొప్పగా ఏమీలేకపోయినా అది సామూహికంగా నిర్వహిస్తున్న క్షేత్రం కదా. అందుకే నారంగ్‌కు అంత సంతోషం.

'చూశావా ఈశ్వర్ భాయ్, ఇక్కడి ప్రజలు సృష్టించిన ఈ సామూహిక అద్భుతం!' అంటూ నారంగ్ ఆ కూరగాయ మొక్కల్ని పసిపిల్లలను నిమిరినట్టు నిమిరాడు.

'వచ్చే పంటకు పరిస్థితి చాలా మారుతుంది. ఈ యేడాది రాళ్ల రప్పలూ ఏరేస్తాం, వచ్చే ఏడాది మేము సేంద్రియ ఎరువును తయారుచేసుకుంటాం. ఇక ఆపై ఏడు వచ్చేసరికి సాగునీటికి కూడా ఏదో ఒక ఏర్పాటు చేస్తాం.' తమ ప్రణాళిక వివరించాడు నారంగ్

ఒక ఇంట్లో బెండకాయ ముదిరిపోతున్నా తెంపని ఇంటావిడను కారణమేమిటని ప్రశ్నించాడు నారంగ్. వచ్చే పంటకు విత్తనం కదుతున్నానని బదులిచ్చింది ఆమె. రెండు నెలల తరువాత దీని విత్తనం సేకరించే అదను వస్తుంది కాబట్టి ప్రస్తుతానికి ఆ బెండకాయలు కూరవండుకోవచ్చు అని చెప్పాడు.ఒక అడుగు పొడవు పెరిగిన బెండకాయలు చూసి నారంగ్ ఆనందంతో తబ్బిబ్బయ్యాడు.

వెనక్కి తిరిగివస్తూ మేము కొంతమంది గిరిజనులు సామూహిక క్షేత్రాల కన్నా తమ వ్యక్తిగత క్షేత్రాలపైనే ఎక్కువ శ్రద్ధ పెడుతున్న ఉదంతాల గురించి చర్చించాం. ఇలాంటివి జరిగే అవకాశం ఉందని నారంగ్‌కు తెలుసు. అందుకే సామూహిక క్షేత్రాల ఆవశ్యకతను గురించి ఇక్కడి ప్రజలకు ఎప్పటికప్పుడు చెబుతునే ఉన్నాడు. సాగునీటి కల్పన ప్రయత్నాలు నెరవేరినప్పుడు మొదట ఆ నీటిని సామూహిక క్షేత్రాలకే ఇస్తారట. తమ ఇళ్లవద్ద తయారైన సేంద్రియ ఎరువును కూడా తలాకొంత సామూహిక వ్యవసాయ క్షేత్రానికి ఇవ్వవలసి ఉంటుంది.

వ్యక్తిగత, సామూహిక క్షేత్రాల మధ్య మీమాంస వచ్చినప్పుడు అందరూ సామూహిక క్షేత్రాలకే ప్రాధాన్యత ఇవ్వాలని భోదిస్తే ఫలితం ఉంటుంది. చేపల చెరువులు పెంచడం కన్నా ఈ సామూహిక క్షేత్రాల వ్యవసాయ నిర్వహణే కష్టం. ఎందుకంటే ఇక్కడ ప్రతి ఒక్కరికీ స్వంత వ్యవసాయాలు కూడా ఉన్నాయి.

బస్తర్‌లో సాగునీటి సమస్యను పరిష్కరించడం అంత సులువు కాదు. ఉండటానికి అనేక నదులు, చెరువులు ఉన్నా, నీటికి అవసరమైన వాలును తయారుచేయడం కష్టసాధ్యమైన పని. రాతిమయమైన నేలలో కాలువలు తవ్వడం చాలా శ్రమతో కూడుకున్న పని. తాము తవ్విన చెరువుల నుండి సామూహిక వ్యవసాయ క్షేత్రాలకు ఎలాగైనా నీటిని పారించాలని నారంగ్ సంకల్పం. భూగర్భ జలాలను వెలికి తీయడం ఇంకా కష్టమైన పని. 250 నుండి 300 అడుగుల లోతున ఉన్న నీటిని పైకి తీసుకురావాలంటే మాటలా. అదీకాక ఇక్కడ విద్యుత్ సరఫరా లేదు. రోడ్డు మార్గమూ లేదు. అందుకే ఇక్కడ బోర్ వేయడం కానీ దానికి అవసరమైన డీజిల్ ఇంజన్లు, పైపులు సమకూర్చుకోవడం అసాధ్యమైన పని. అన్నిటికన్నా పెద్ద సమస్య ఏమిటంటే దండకారణ్యం చుట్టున్న ప్రాంతాలన్నీ ప్రభుత్వ నియంత్రణలో ఉన్నాయి కాబట్టి అడవిలోకి ఎలాంటి పనిముట్లూ వెళ్లనివ్వరు. అందుకే నారంగ్, అతని ఉద్యమమూ ఈ పనులన్నిటినీ తామే సాధించాలి. అందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.



తరువాతి రోజుల్లో నీటి పారుదల సమస్యను అధిగమించిన ఒక ప్రాంతాన్ని చూశాను నేను. చెరువు కింద సాగుచేయడం మొదలుపెట్టి దానికి ఒక కాలువను తవ్వారు. ఆ రాతి నేలలో తవ్వడం చాలా కష్టమైనప్పటికీ గ్రామస్తుల ఉమ్మడి కృషి వల్ల అది సాధ్యపడింది. అందుకు వారు ఉపయోగించిన పనిముట్లు కేవలం గడ్డపార, పార, తట్ట మాత్రమే.

దక్షిణ బస్తర్‌లో సాగుతున్న ఈ నూతన ప్రయత్నాలు వార్తాపత్రికల్లో ప్రస్తావించబడవు. ప్రపంచబ్యాంకు నిధులతో ఏ ఎన్‌జీఓనో సాధించినది కాదు కదా ఇది. అందుకే పత్రికల వాళ్లు, ఆర్థిక సంస్థలు దీనిని పట్టించుకోవు. ఇక్కడికి బీబీసీ కానీ మరో వార్తాసంస్థ కానీ ఇంటర్వ్యూల కొరకు రావు. పేరు, ప్రచారం, చర్చ అన్నీ డబ్బున్నోళ్ల చేతుల్లోనే ఉన్నాయి. వాళ్లెవరిని కావాలంటే వారిని అందలం ఎక్కిస్తారు వద్దనుకున్నవాళ్లను పాతాళంలోకి తోసేస్తారు. బస్తర్‌లో ఖనిజాలు దోచుకుంటున్నవాళ్లని వారు ప్రధాన

స్రవంతిలోకి తేవాలనుకుంటున్నారు. వాళ్లు బస్తర్‌ను ఒక పర్యాటక క్షేత్రం చేసి ఇక్కడి ప్రకృతి అందాలపై అజమాయిషీ చేయాలనుకుటున్నారు. గిరిజన సంస్కృతిని, జీవితాన్ని మ్యూజియంలో ప్రదర్శనకు పెట్టి వ్యాపారం చేయాలనుకుంటున్నారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జష్పూర్‌లో ఒక గోల్ఫ్ కోర్స్‌ను నెలకొల్పి దాన్ని ఒక పర్యాటక ఆకర్షణ చేయాలని ప్రయత్నాలు సాగుతున్నాయి. ఆరోన్, పహాడీ కొర్వా వంటి ఆదిమ తెగలను 'నాగరీకులను' చేసే నేరపూరిత కుట్రలు రచించబడుతున్నాయి. ఇప్పుడు పర్యాటకం అంటే నేరం వ్యభిచారం కలగలిసి, డబ్బున్నోళ్లకు వినోదం అందించే సాధనం అయిపోయింది కదా. గిరిజన జీవితాలోకి జరుగుతున్న ఈ చొరబాటే ఒక అభివృద్ధిగా, ఒక ఉపాధి అవకాశంగా చూపిస్తున్నారివ్వాళ.

దక్షిణ బస్తర్‌లో మొగ్గ తొడుగుతున్నది ఒక అభివృద్ధి నమూనా అయితే లక్షలాది మంది గిరిజనులను నిరాశ్రయులను చేసిన బైలడిల్లా, నర్మదా లోయ ప్రాజెక్టు వంటివి మరొక అభివృద్ధి నమూనా. ఇప్పుడు గోల్ఫ్ కోర్సుల అభివృద్ధి ప్రాజెక్టు తలపెడుతున్న జష్పూర్ నిజానికి బస్తర్ నుండి పెద్ద దూరం ఏమి కాదు. ఢిల్లీనే గెలవాలనుకున్న గెరిల్లాలకు 250- 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న జష్పూర్‌ను చేరడం పెద్ద కష్టం కాదు. జష్పూర్‌లోని పురాతన తెగలు తమ అడవిని గోల్ఫ్ కోర్స్ చేసి తమ స్త్రీలను పర్యాటకుల ముందు ప్రదర్శనకు పెడతారా? లేదా దక్షిణ బస్తర్‌లో, జార్ఖండ్ లో కోయల్ - కైమూర్ పర్వత శ్రేణిలో ఉన్న గిరిజనుల వలె విల్లు బాణం చేపట్టి పోరాడుతారా అనేది కాలమే నిర్ణయిస్తుంది.

గోరంత సేవచేసి కొండంత ప్రచారం చేసుకుంటున్నాయి బడాబాబులు నడుపుతున్న స్వచ్ఛంద సంస్థలు. ఈ సంస్థలు ధనికుల నుండి విరాళాలు వసూలు చేసి గుడులు, మసీదులు, చర్చిలు కడతాయి. తద్వారా ఆ ధనికులను గొప్ప మానవతావాదులుగా ప్రచారం కల్పిస్తాయి. ఈ అభివృద్ధి నమూనా మొదలు ప్రజలను నిరాశ్రయులను చేసి అటుపై వారికి ఆశ్రయం కల్పిస్తుంది. అభివృద్ధి పేరిట వారి జీవనోపాధిని దెబ్బతీసి, వారిని నిస్సహాయులను చేసి,

దిక్కులేక వారు ఏ వ్యభిచారపు రొంపిలోకో దిగితే మళ్లీ వారి కొరకు ఒక స్వచ్ఛంద సంస్థను తెరిచి వేశ్యా సంస్కరణ కేంద్రాలను నడుపుతారు. అటవీ సంపదను దోచుకున్నదానిలో చిటికెడంత సొమ్ము వెచ్చిస్తే చాలు ఒక పెద్ద ప్రచార యంత్రాంగం తయారు. తెహ్రీ డ్యాం, నర్మదా ప్రాజెక్టు వంటి నేరపూరిత ప్రాజెక్టులకు మానవీయ ముఖం తొడగడానికి డజన్ల కొద్దీ స్వచ్ఛంద సంస్థలు నెలకొల్పి దినపత్రికల్లో రంగురంగుల ప్రకటనలు ఇస్తారు. దీనికి పెద్దగా డబ్బు కూడా ఖర్చు కాదు. వేల యేళ్లనుండి ఉన్న గిరిజనుల భద్రమైన జీవన విధానాన్ని దెబ్బతీసిన తరువాత చేసే ఒక చిన్న పునరావాస పథకానికి భారీ ప్రచారం కల్పిస్తారు. అట్లా చేసి నరకకూపంలో ఉంటున్న ప్రజల నిజస్థితిని ఎవరికీ కనపడకుండా దాచేస్తారు.

ప్రజా శ్రేయస్సే పరమావధిగా ఒక విస్తృతమైన స్థానిక అభివృద్ధి నమూనాను ఇక్కడ ఆవిష్కరించదానికి కృషి చేస్తున్నది గెరిల్లా ఉద్యమం. వారికి ప్రజాసేవలో నిమగ్నంకాగల నిపుణులు కావాలి – ఇక్కడి స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొత్త అభివృద్ధి ప్రణాళికలు రచించగల కమ్యూనిస్టు నిపుణులు కావాలి. నిజానికి ఈ అభివృద్ధి, ప్రజల జీవన స్థితిగతుల అభివృద్ధి. కొత్త మైనింగ్ ప్రాజెక్టులు, డ్యాముల వల్ల వచ్చే సరుకుల అభివృద్ధి కాదు.

ఈ గిరిజనులను పుట్టుకనుండే దారిద్ర్యం వెన్నాడి వారిని తొందరగా కాటికి పంపుతోంది. చిన్న చిన్న అవసరాలు తీర్చుకోవడానికి కూడా వారు కష్టపడి సేకరించింది, పండించింది మొత్తం సమర్పించుకోవాల్సి వస్తుంది. వరి ఉత్పత్తి పెరిగి, స్థానిక వనరులతోనే నిత్యావసరాలు కనుక తీరితే అప్పుడు అభివృద్ధిలో రెండో దశలోకి వెళ్లడం పెద్ద కష్టమేమీ కాదు. వ్యవసాయ భూముల నుండి రాళ్లను ఏరివేసే పనిని యుద్ధప్రాతిపదికన తీసుకోవాలనుకుంటున్నాడు నారంగ్. అలా ఏరివేసిన రాళ్లతో ప్రతి ఊరిలో ఒక స్థూపం వంటిది నిర్మించి, ప్రజల సమష్టి కృషి సాధించగల అద్భుతాలకు గుర్తుగా నిలపాలని నారంగ్ ఆలోచన. అలాంటి కట్టడం భవిష్యత్ తరాలకు గొప్ప స్ఫూర్తిగా కూడా నిలువగలదు.

కలుపు మొక్కలు ఎప్పటికీ ఒక పెద్ద సమస్యగానే ఉంటాయి. వాటిని తొలగించడం అనేది నిరంతరం కొనసాగే ప్రక్రియ. అది ఒక్కరితో అయ్యే పని కూడా కాదు. అటవీ భూముల్లో ఈ సమస్య ఇంకా తీవ్రంగా ఉంటుంది. సమస్య ఎంత ఉన్నా కూడా కలుపు నివారణకు కలుపునాశక రసాయనాలు వాడొద్దని గ్రామ అభివృద్ధి కమిటీ నిర్ణయించింది. బస్తర్ వ్యవసాయంలో క్రిమిసంహారక మందులు అమ్మే కంపెనీలు జోక్యం చేసుకోకుండా చూడాలని విప్లవోద్యమం కృతనిశ్చయంతో ఉన్నది. ఈ ప్రాంత జీవజాలంపై పురుగు మందులు ఎంత దుష్ప్రభావం చూపుతాయో ఉద్యమకారులకు తెలుసు. అటువంటి విపరిణామాల నుండి వారు తమ అడవిని రక్షించుకోవాలను కుంటున్నారు.

మార్కెట్ మీద ఆధారపడి ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హర్యానా రైతులు ఎలా ఆత్మహత్యల ఊబిలోకి కూరుకుపోయారో నారంగ్‌కు అవగాహన ఉన్నది. అందుకే ప్రత్యామ్నాయ ఉత్పత్తి విధానాలు అవలంభించడం, ప్రజల్లో సమష్టితత్వపు గొప్పదనాన్ని గురించి చైతన్యాన్ని కలిగించడం ఇప్పుడు అతని ముందున్న ప్రధాన కర్తవ్యాలు.

ఇక్కడ నిర్మించిన ఆనకట్టలు, చెరువులు ప్రజల సమష్టి కృషి తాలూకు ఘననీయమైన విజయాలు. ఇప్పుడిప్పుడే ఉద్భవిస్తున్న ప్రజాశక్తి వల్లనే అవి సాధ్యపడ్డాయి. ఆ ప్రజాశక్తి తాలూకు ప్రతినిధులు కొంతమందిని నేను ఇక్కడి క్యాంపుల్లో కలిశాను. వారే లేకుంటే ఆ విజయాలు సాధ్యమయ్యేవికావు.

తెహ్రీ డ్యాం, నర్మద ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఇటువంటి శక్తి ఒకటి ఉండి ఉంటే ఆ పోరాటాలు ఢిల్లీలోని న్యాయస్థానాల గడపదొక్కే అవసరం వచ్చేది కాదు. ఆ పోరాటాలు సజీవంగా కూడా ఉండేవి. ఆ లోయల్లోనే ప్రజలు ధైర్యసాహసాలతో పోరాడి విజయం సాధించేవారు. ఈ రెండే కాదు, ఎంత పోరాడినా అనేక ఉద్యమాలు సఫలీకృతం కాకపోవడానికి కారణం కూడా ఇదే.

భారీ ప్రాజెక్టులు కొందరు బడాబాబుల జేబులు నింపడానికి మాత్రమే పనికివస్తాయి. ఈ ప్రాజెక్టు బాధితుల మొరను అటు ప్రభుత్వం కానీ ఇటు సుప్రీం కోర్టు కానీ ఆలకించడంలేదు. శాసనకర్తలు ఆ ఉద్యమాలకు వ్యతిరేకంగా నిలిస్తే, చట్టాన్ని రక్షించవలసినవాళ్లు ఆ చట్టాన్నేఉల్లంఘించారు. ఇక న్యాయమూర్తులు అన్యాయపు తీర్పులిచ్చారు. మొత్తం ప్రభుత్వ యంత్రాంగమంతా నిజాన్ని పాతరేయడానికే పనిచేసింది.

'అభివృద్ధి అంటే ఎవరి అభివృద్ధి?' అనేది నారంగ్ అడిగే ప్రధమ ప్రశ్న. జీవితాన్ని ఇంకా వికారంగా, భరించలేనిదిగా మార్చే అభివృద్ధి అసలు అవసరమేలేదంటాడు అతను.

***

'ఎస్' అక్షరంతో మొదలయ్యే ఆ *గూడెం* పొలిమేరల్లో నాతో ఉన్న సాంస్కృతిక బృందం క్యాంపు వేసింది. మా రాకను తెలియజేయడానికి ఇద్దరు మనుషులను ఊళ్ళోకి పంపారు. అర్ధగంట తరువాత ఇద్దరు గ్రామస్తులను వెంటబెట్టుకుని వచ్చారు వెళ్లినవారు. ఒక కావడిలో రెండు కుండల నిండా మంచి నీళ్లు తెచ్చారు. 99

గ్రామస్తులిద్దరి నుండీ గుప్ మని వాసన వస్తోంది. ఇంకా మధ్యాహ్నం కూడా కాలేదు అప్పుడే తాగినట్టున్నారు. గిరిజనులకు తాటి కల్లు తాగడానికి ప్రత్యేకించి సమయం ఏమీలేకపోయినా ఇవ్వాళ అందరూ తాగేసే ఉన్నారట. ఇవ్వాళ *బీజా పండుం* అనే పండుగ. ఇది వరికోతల తరువాత కొత్త బియ్యం తినే ముందు గిరిజనులు చేసుకునే పండుగ.

'ఈ పండుగనాడు గిరిజనులు చాలా ఆనందంగా ఉంటారు. కొత్త పంట ఇంటికి వచ్చిందన్న సంతోషంతో మస్తుగా తాగుతారు. పండుగ కాగానే కొత్త వడ్లు కొనడానికి వ్యాపారస్తులు సంతలకు వస్తారు. కొన్ని నెలలు గడిచాక ఈ గిరిజనులు మళ్లీ ఆ వ్యాపారస్తుల దగ్గరే వడ్లు కొనుక్కుంటారు. ప్రతి ఏడు ఇదే తంతు' గిరిజన రైతు జీవితచిత్రాన్ని నా ముందు ఆవిష్కరించాడు చందన్.

అప్పుడే నారంగ్ భాయ్ చిన్న కునుకుతీసి లేచాడు.

అతడు లేవడం చూసి 'నారంగ్ భాయ్ ఈ సమస్యకు ఏదైనా పరిష్కారం కనుక్కునే దాకా ఇలాగే కొనసాగుతుందిది. ఏమంటావు నారంగ్ భాయ్' అన్నాడు చందన్.

'తప్పకుండా ప్రత్యామ్నాయం కనుక్కుందాం. ప్రతి ఊళ్లో ఒక గిడ్డంగి, ఒక నిత్యావసర వస్తువుల దుకాణం ఉండాలి. దీనితో కొంతమేర సమస్య పరిష్కారం అవుతుంది. గ్రామ సహకార సంస్థనే ప్రజల వద్ద నుండి వడ్లు కొనాలి, నిత్యావసరాలు అమ్మాలి. గ్రామస్తులకు ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఇక్కడినుండి వడ్లు కొనుక్కోగలగాలి' నారంగ్ వివరించాడు.

'కానీ నారంగ్ భాయ్ ఇది ఆచరణసాధ్యంగా కనిపించడం లేదు నాకు. ఇంతమంది ప్రజలకు కావలసినవన్నీ కొనేంత డబ్బు ఎక్కడి నుండి తెస్తాం?" చందన్ కు ఈ ప్రణాళిక చాలా భారీగా కనపడింది. అతని సంశయం హేతుబద్ధమైనదే.

'మనం మొదలు కొన్ని ఇళ్లతోనే మొదలు పెడతాం. బాగా పేదలతో మొదలుపెట్టి ఇతరులను ఇందులోకి మెల్లగా తీసుకువస్తాం. గిడ్డంగుల్లో కేవలం స్థానికంగా పండిన ధాన్యం మాత్రం ఉంచి అటవీ ఉత్పత్తులను మాత్రం సహకార సంస్థ ద్వారా మార్కెట్లో అమ్ముతాం. అలా వచ్చిన డబ్బుతో నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయవచ్చు. సహకార పద్ధతి వల్ల అమ్మకందార్లకు, వినియోగదారులకు ఇద్దరికీ లాభం చేకూరుతుంది. ఇదొక్క దాని వల్లనే అన్ని సమస్యలు తీరవనుకోండి. ఇక్కడ ఆహారధాన్యాల ఉత్పత్తి పెంచడం అతి ముఖ్యమైన పని' నారంగ్ సమస్యను చాలా తీవ్రంగానే తీసుకున్నాడు.

'సరే నారంగ్ అన్నా! నువ్వు ప్రణాళికలు సిద్ధం చేయి, మేము పొలాల్లో రాళ్ళు, కలుపు మొక్కల ఏరివేత గురించి పాటలు స్వరబద్ధం చేస్తాం.'

***

తన సంచీ తీసుకుని 'పద ఈశ్వర్ భాయ్ అలా ఊళ్లోకి వెళ్లొద్దాం' అని అన్నాడు నారంగ్.

'ఇవ్వాళ అందరూ తాగి ఉంటారు కదా. మనం చేప్పేది ఎవరు వింటారు?'

పాండుం అయిపోయినట్టే మనకు కాస్త ముందే తెలిసి ఉంటే మనమూ ఆ పండుగ సంబరాల్లో పాలుపంచుకునేవాళ్లం పద ఒకసారి ఆ చెరువు పరిస్థితి ఏమిటో చూద్దాం

'నేను కూడా వస్తాను చందన్ జతకలిశాడు

రంగన్నతో కలిసి నలుగురమూ గ్రామంవైపు నడిచాం

చుట్టుపక్కల పది గ్రామాల ప్రజలు ఈ చెరువు తవ్వడంలో పాలుపంచుకున్నారు మూడు గ్రామాల వారు దీనినుండి లబ్ధి పొందుతారు ప్రజలు స్వశక్తితో ఈ చెరువును నిర్మించుకుంటున్నారని తెలిసి ప్రభుత్వ అధికారులు ఇక్కడికి వచ్చారు యాభై లక్షలు ఇస్తామని చెప్పారు కానీ ప్రజలు ఆ మొత్తాన్ని తిరస్కరించారు ఇదివరకు ఒక ఆనకట్ట కట్టుకుంటే దాన్ని ప్రభుత్వం కూల్చేసింది అందుకే ప్రజలు ఆ అధికారులపై కోపంగా ఉన్నారు

అలా చేశారంటే ప్రభుత్వానికి ప్రజలు ఇటువంటి ప్రయత్నాలు చేయడం ఇష్టం లేదనా?

అవును ఆ ఆనకట్టను గెరిల్లాల అజ్ఞపై నిర్మించారని ప్రభుత్వం 101
ఆరోపించింది ఇక అప్పటినుండీ అధికారులను ఎవరినీ ఇటువైపు రానీయలేదు ప్రజలు

నారంగ్ ఈ అందమైన కథ చెప్పడం పూర్తయ్యేసరికి మేము ఊరిలోకి వచ్చాం మాచుట్టూ గ్రామస్తులు గుమికూడారు అందరి మొహాలపై ఆనందం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది

'నారంగ్ అన్నా! ఇవ్వాళ పాండుం సంతోషంగా అంటూ ఒక గిరిజనుడు నారంగ్ వైపు అడుగులు వేశాడు అతను బాగా తాగి ఉన్నాడని అర్థమవుతోంది

మంచిది మిత్రమా! కొత్త పంట ఊరికి కొత్త సంతోషాలను తెచ్చినట్టుంది?

అందరం బాగా తాగినం మీరొస్తారని ముందే తెలిస్తే పండుగ మరోరోజైనా జరుపుకునేవాళ్ళం మా రాక పట్ల సంతోషంగా ఉన్న ఓ గిరిజనుడు అన్నాడు

17554

'అరే! ఎందుకట్లా అంటారు. ఏం మేము పండుగలో పాలుపంచుకోవద్దా ఏం?. మీ సంబరాలు కానీయండి'

'మీకు కూడా కొంచెం తెచ్చేదా?' గుంపులోంచి ఎవరో అరిచారు

'తాటి కల్లా?'

'మరింకేంటి?'

'అదొద్దు కానీ గొడ్డళ్లు తీసుకురండి. కొంచెం పని ఉంది' నారంగ్ హాస్యమాడాడు.

అందరూ గొల్లుమని నవ్వారు. మరునిముషం అక్కడ వాతావరణం గంభీరంగా మారింది. అందరూ నారంగ్ ఏం మాటాడతాడా అని ఎదురుచూస్తున్నారు. చెరువు చుట్టూ కంచె వేసి అందులో కొన్ని పండ్ల మొక్కలు నాటుదామని, గొడ్డళ్లు తీసుకురమ్మని పురమాయించాడు నారంగ్.

'నువ్వెన్ని తెమ్మంటే అన్ని తెస్తాం నారంగ్ అన్నా! ఇవ్వాళ నువ్వేది చెపితే అది వింటాం' అన్నాడు ఇంతకుముందు తాటికల్లు తెస్తానన్న గిరిజనుడు.



కాసేపట్లోనే అందరూ గొడ్డళ్లు తీసుకుని వచ్చారు.

ఆ చెరువు చాలా విశాలంగా ఉంది. ఇందులో చేపలు పట్టడానికి ఒక పడవ సరిపోదు. కనీసం రెండు కావాల్సిందే. రెండున్నర యేళ్లు సాగిన ఆ చెరువు నిర్మాణంలో దాదాపు 230 రోజులు పనిచేశారు ప్రజలు. ప్రతి ఇంటిలో ఉండే ఆడా, మగా, పిల్లా పాపా అందరూ పాల్గొన్నారు చెరువు తవ్వకంలో. చుట్టుపక్కల గ్రామల వాళ్లు కూడా తలా ఒక చెయ్యి వేశారు. రేపు ఇందులో పెరిగే చేపలను అందరూ పంచుకుంటారు.

రాజ్యం ఇటువంటి ప్రయత్నాలను ఎప్పటికీ గుర్తించకపోవడమే కాక వీటి పట్ల అసహనం కూడా వ్యక్తం చేస్తుంది. చెరువులు, కుంటల తవ్వకం కాంట్రాక్టులతో డబ్బులు సంపాదించే వారికి ప్రజలే ఇలాంటి పనులు చేసుకోవడం చూస్తే కడుపుమండదూ?

ఆ రోజు కంచె వేసే పని సగం కూడా పూర్తవలేదు. రెండు మూడు రోజుల్లో ఆ పని పూర్తి చేయమని గ్రామస్తులకు నారంగ్ చెప్పాడు.

చాలా గ్రామాల్లో చిన్న చిన్న పండ్ల తోటలు కూడా నాటామని నారంగ్ నాకు చెప్పాడు. మామిడి, జామ, నిమ్మ చెట్లు నాటారట. చేతిపంపుల దగ్గర వృధాగాపోయే నీటిని మళ్లించి చిన్న కుంటలను నిర్మించే పథకం కూడా మొదలుపెట్టారట. ఆ కుంటల చుట్టు అరటి చెట్లు నాటుతారట. నా ప్రయాణంలో చాలా ఊళ్లలో ఇలా నాటిన అరటి చెట్లు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అరటి చెట్లు ఇంకా నాటని చోట్ల చేతిపంపు చుట్టూ ఉన్న మురుగు నీటిలో పందులు పొర్లాడుతూ కనిపిస్తాయి. చేతి పంపు నుండి వృధాగా పోయే నీరు కూడా నారంగ్ దృష్టిని దాటిపోలేదు. ఆ మురుగును కూడా సుందరంగా మార్చాలని అతని తాపత్రయం.

***

ఇక్కడి ప్రజలకు వాజ్‌పేయి ఎవరో, పీవీ నరసింహారావు ఎవరో తెలియదు. వారికి నెహ్రూ ఎవరో, 1947లో ఏం జరిగిందో కూడా తెలియదు. తెల్లదొరల నుండి అధికారం నల్ల దొరలకు మారిందన్న సంగతి వారి ఎరుకలోకి రాలేదు. వారి దృష్టిలో ఢిల్లీ అంటే ప్రభుత్వానికి పర్యాయపదం. ఇక ప్రభుత్వం అంటే కాంట్రాక్టర్లు, పోలీసులు, అణచివేత, నిర్వాసన... వెరసి తమకు నిస్సహాయత. వారికి ఢిల్లీ గురించి తెలియడం మొదలైంది విప్లవోద్యమం అక్కడ అడుగుపెట్టినాకనే. వారు అమెరికా, అఫ్ఘానిస్తాన్ పేర్లను కూడా ఈ మధ్యనే విన్నారు. తమ మనుగడకు ప్రమాదకరమైన సంబంధం ఏదో భారత ప్రధానికి, అమెరికా అధ్యక్షుడికీ మధ్య ఉన్నదని ఇప్పుడిప్పుడే వారికి తెలుస్తోంది. తమ అభివృద్ధికి ఆటంకాలు పోలీసులు, కాంట్రాక్టర్లు మాత్రమే కాదని ఆ జాబితాలో ఢిల్లీ, అమెరికా కూడా ఉన్నాయని వారికిప్పుడు అవగతం అవుతుంది. అమెరికా గురించి వారు తెలుసుకున్న మొదటి విషయం ఏమిటంటే అది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ప్రథమ శత్రువని. తమ స్వార్ధ ప్రయోజనాల వలయంలో పడ్డ మేధావులు అర్థం చేసుకోలేని ఈ విషయాన్ని గిరిజనులు మాత్రం అవగాహన చేసుకున్నారు. అందుకే అఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడి చేసినప్పుడు నిరసన ప్రదర్శనలు జరిపి ఇస్లామిక్ ప్రపంచానికి బాసటగా నిలబడ్డారు.

***

గత కొన్ని రోజులుగా అఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా ఒక భారీ నిరసన ప్రదర్శన ఉంటుందని చుట్టు పక్కల గ్రామాలవారికి సమాచారం పంపిస్తున్నాయి ఇక్కడున్న ప్రజా సంఘాలు. (దండకారణ్యంలో ఇటువంటి ప్రదర్శనలు చాలానే జరిగాయని నాకు తరువాత తెలిసింది). ఇప్పుడు తలపెట్టిన ప్రదర్శనకు వేదిక ఈ గ్రామమే కాబట్టి సాంస్కృతిక బృందం మూడు రోజులుగా ఇక్కడే మకాం వేసింది.

నిన్నటి నుండే గిరిజన యువతీ యువకులు గుంపులుగుంపులుగా రావడం మొదలుపెట్టారు. వచ్చిన యువతను చూస్తే ప్రతి గిరిజనుడూ జన్మతః కళాకారుడేమో అనిపిస్తుంది. ఒక్కో ఊరినుండి అయిదారుగురు చొప్పున దాదాపు 125 మంది వచ్చారు. ప్రతి ఒక్కరూ తమతో పాటు ఒక జత బట్టలు, ఒక తువ్వాల, ఒక సంచీ తెచ్చుకున్నారు. వస్తూ వస్తూ కొన్ని బియ్యం కూడా మూటగట్టుకు వచ్చారు. సామూహిక వంటలకు ఈ బియ్యం వాడతారట.

***



ఇవ్వాళటి సాయంత్రం కొత్త రంగును సంతరించుకుంది. చందన్ సాంస్కృతిక బృందం, పొరుగు గ్రామాల నుండి వచ్చిన కళాకారులు ఒక నాలుగు ఇళ్లలో బస చేశారు.

గ్రామం మధ్యలో ఉన్న ఒక ఖాళీస్థలంలో వాళ్లు కూర్చున్నారు. కొంతమంది రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు కూడా అక్కడికి చేరుకున్నారు. వాళ్లంతా అమెరికా దురాక్రమణ గురించి, తాము పాడాల్సిన పాటల గురించీ చర్చించుకుంటున్నారు. ఈ నిరసన సభలో మొత్తం వందమందికికిపైగా పాల్గొనేటట్టున్నారు.

ఆ ప్రాంగణమంతా రంగులమయం అయిపోయింది. కొప్పులో పూలమాలనో లేక రంగురంగుల గుడ్డముక్కనో చుట్టుకోని గిరిజన యువతి లేదక్కడ. యువకుల భుజాన కండువాలు కనపడుతున్నాయి. ఎక్కడ చూసినా ఏదో ఒకటి మాట్లాడుకుంటున్న చిన్న చిన్న గుంపులు...ఒకరు జుట్టు ముడివేసుకుంటున్నారు, ఇంకొకరు తన దప్పును సరిచూసుకుంటున్నారు. మరొకరెవరో తన సంచీలో వస్తువులను కింద కుమ్మరించి దేని కొరకో

వెతుకుతున్నారు. ప్రతి ఒక్కరూ ఏదో జాతరకు వచ్చినంత ఉత్సాహంగా కనిపిస్తున్నారు.

ఇంతలో ఒక మూల నుండి ఒక శ్రావ్యమైన గొంతు

'రేలా రె...రే రే రే రేలా, రేల రేల రేల...'

ఒకటి...నాలుగు...ఆ తరువాత ఎన్ని గొంతులు ఆలాపించడం మొదలుపెట్టాయో లెఖ్ఖ తెలియదు నాకు.

'రేలా రె...రే రే రే రేలా, రేల రేల రేల...'

రేల! ప్రతి గిరిజన పాటా ఆ పదంతోనే మొదలై ఆ పదంతోనే ముగుస్తుంది. ..ఆ పదం లేని పాటను ఊహించడం కష్టం. పైపైకి ఎగిసే ఆనందపు కెరటంలా ఉంటుందది. సౌందర్యానికి, ఆనందానికి, ఉత్సాహానికి, పరవశానికి అదొక పర్యాయపదం.

పచ్చని గుత్తులు గుత్తుల పూలు పూసే రేల చెట్టు అందం, దాని నిండైన రూపానికి గిరిజన జీవితంతో, సంస్కృతితో విడదీయరాని అనుబంధం ఉన్నది. ఇప్ప పూల చెట్టు తరువాత గిరిజనులతో అంతగా ముడిపడినది రేల చెట్టే. ఇప్ప పూల చెట్టులో ప్రతి భాగమూ ఉపయోగపడితే రేల పూల చెట్టేమో అందానికి, అన్యోన్యతకు చిహ్నం. రేల! ఆ పదం విన్నంతనే ప్రతి గిరిజనుడి చేయి పనిచేయడం ఆగిపోతుంది, పాదం నాట్యం చేయడం మొదలుపెడుతుంది.

ఇప్పుడు కూడా రేలపాట పల్లవి వినగానే అక్కడ కూర్చున్న యువతీ యువకులు వెంటనే అటువైపు ఉరికారు. ఒకరి భుజంపై మరొకరు చేయివేసి ఒక గొలుసు ఆకారంలోకి, తిరిగి ఒక వృత్తాకారంలోకి మారారు. ఒక వృత్తం నాలుగు వృత్తాలుగా చీలి మొదటి వృత్తం కుడి నుండి ఎడమకు, రెండో వృత్తం ఎడమ నుండి కుడివైపుకు తిరగడం మొదలు పెట్టింది. మూడు, నాలుగో వృత్తాలు కూడా ఇదే విధంగా చేశాయి. పాట చరణం, దానితో పాటే గిరిజనుల నృత్యం మొదలయ్యాయి.

*ఓ రాములక్కో, వానొచ్చెనమ్మో, వానొచ్చెనమ్మా!*

*ఓ తమ్ముడూ, కలిసి పాట పాడుదాం రారో!*

*వానొచ్చెనమ్మో, వానొచ్చెనమ్మా!*

*జోగి, కోసా అందరూ రండిరో, వానొచ్చెనమ్మో, వానొచ్చెనమ్మా!*

ఒక్కో పేరు ఆ పాటకు జత కలుస్తూ పాట సాగుతోంది. పాత జానపదాల్లో ఉన్నట్టు పదే పదే వచ్చే చిన్న చిన్న వాక్యాల అల్లిక. పైపైన చూస్తే ఈ పాటల్లో అర్థం పెద్దగా ఉన్నట్టు కనపడదు. కానీ జాగ్రత్తగా వింటే ఆ పాట జీవితపు పాట అని తెలుస్తుంది...జీవితం అనంతం అనే భావన. ఆ పాట వానకు స్వాగతం పలుకుతోంది. వానంటే జీవితాన్నిచ్చే నీరు! మొత్తం ఊరు ఊరంతా కలిసి ఈ పాట పాడినప్పుడు, ఈ పాటకు నృత్యం చేసినప్పుడు అదొక మేఘగర్జనలాగా, తొలకరి పులకరింతలాగా ఉంటుంది. ఆ గిరిజనులలా పాడుతూనే ఉంటారు. ఆ పాటలో తడిసి ముద్దవుతూనే ఉంటారు!

ముందే చెప్పినట్టు గోండిలో ఒంటరిగా పాడే పాటలు ఉండవు. ఇక్కడ అన్నీ బృందగానాలే. గిరిజన సంస్కృతిలో ఒక సామూహిక భావన అంతర్లీనంగా ఉంటుంది. ఆఖరికి వడ్లు దంచడం కూడా ఆరేడుగురు కలిసే చేస్తారు. పంజాబ్‌లో కూడా అమ్మాయిలు కలిసి నూలు వడికే సాంప్రదాయమొకటున్నది. కాకపోతే పంజాబ్ లో వివక్ష ఉన్నది – పెద్ద కులం అమ్మాయిలు చిన్న కులాల వారితో కలవరు. ఇక్కడి గిరిజనుల్లో మనకు ఎటువంటి వివక్ష కనపడదు. వృత్తుల పంపిణీ ఉన్నది కాని అది కులతత్వం కాదు. గిరిజనుల్లో కులాలు లేవు. ఉన్నదల్లా వివిధ తెగలు మాత్రమే.

ఒక గంట సేపు పాటలు అయిన తరువాత సమావేశానికి సమయం అవుతుండటంతో చందన్ ఇక ఆపమని విజిల్ వేశాడు. అప్పటికే చీకటిపడింది.

కళాకారుల వద్ద ఉన్న ప్లాస్టిక్ షీట్లన్నీ కింద పరిచారు. మధ్యలో ఒక దీపం పెట్టి అందరూ దాని చుట్టూ కూర్చున్నారు. చందన్ ఒక పెన్ను, నోట్ బుక్కు తీసుకుని కొందరి పేర్లు రాసుకున్నాడు. ఒక్కో ప్రజాసంఘం నుండి బాధ్యులను పిలిచి అమెరికా దురాక్రమణపై వారివారి అభిప్రాయాలు చెప్పమని కోరాడు.

'కామ్రేడ్ మాసే' మొదటి పేరు పిలిచాడు చందన్.

ఒక మూలకు కూర్చున్న ఆకారం లేచి నిలుచుని వేదికవైపు రాసాగింది. ఆ మహిళ వేదికను అధిరోహించగానే అప్పటిదాకా ఉన్న గుసగుసలు సద్దుమణిగాయి. అందరూ ఈ మహిళా సభ్యురాలు ఏం చెబుతుందా అని ఆతృతగా చూస్తున్నారు. మాసే ఆ ఊళ్లో మహిళా విభాగానికి నేతృత్వం వహిస్తోంది. తనకిచ్చిన పనిని సమర్ధవంతంగా నిర్వహిస్తూ ఎప్పుడూ చలాకీగా ఉండే మాసే అంటే అందరికీ గౌరవభావం.

దీపం చెంతకు వచ్చి నిలుచున్న మాసే తన పాదాల వైపు ఒకసారి చూసుకుని, చీర కుచ్చిళ్లు ఒకసారి సర్దుకుని, ఇక మాట్లాడడానికి అలా తన తలపైకెత్తిందో లేదో, ఒకేసారి ఫక్కున నవ్వేసింది. అక్కడి జనమంతా ఆమెతో గొంతుకలిపారు.

'కామ్రేడ్ మాసే! అఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడి మీద మీ అభిప్రాయం చెప్పండి' లోగొంతుకతోనే అయినా చందన్ ఇచ్చిన ఆజ్ఞ విని ఆమె నవ్వు ఆపింది. ఒక క్షణం చందన్ వైపు చూసి మరోసారి ఎదురుగా చీకట్లోకి విస్తరించిన జనంవైపు చూసింది. మరోసారి చందన్ వైపు చూసి పకపకా నవ్వుతూ తాను కూర్చున్న చోటికి పరుగెత్తింది. మాసే ప్రవర్తన చూసి అందరూ మరోసారి బిగ్గరగా నవ్వేశారు.

'అయ్యో! మన మొదటి వక్తనే విఫలమయ్యింది' చందన్ మెల్లిగా అన్నాడు. మరోసారి జనాన్ని ఉద్దేశించి మాట్లాడటం మొదలుపెట్టాడు.

'ఇవ్వాళ మనమిక్కడ కలిసింది అమెరికా దురాక్రమణ గురించి మాట్లాడుకోవడానికి. కామ్రేడ్లంతా ఈ అంశం గురించి తమకు తెలిసింది వచ్చిన ప్రజలకు చెప్పాలి'

ఒక అర నిముషం ఆగి మరో పేరు ప్రకటించాడు చందన్.

'కామ్రేడ్ తిరిపా'

చీకట్లో నుండి ముందుకు వచ్చింది ఆ మహిళా విభాగం సభ్యురాలు. స్టేజీ ఎక్కి స్థిరమైన గొంతుకతో మాట్లాడటం మొదలుపెట్టింది.

'అఫ్ఘనిస్తాన్ పై అమెరికా దాడి చేసింది. కనుక మనమంతా మన. నిరసన తెలపాలి' అని అన్నది. మరుక్షణం 'లాల్ సలాం' అని తుర్రుమని అక్కడినుండి జారుకుని తన స్థానంలో కూర్చుంది.

తను మాట్లాడిన రెండు వాక్యాలు అక్కడ వాతావరణాన్ని గంభీరంగా మార్చాయి. ఆమె 'లాల్ సలాం' తో తన ప్రసంగం ముగించగానే అందరూ 'చక్కని వక్త' అని చప్పట్లు కొట్టారు.

'ఫరవాలేదు' అన్నాడు చందన్.

'కామ్రేడ్ వాగా!' చందన్ మూడో వక్తను పిలిచాడు.

వాగా స్టేజీ మీదికొచ్చి కామ్రేడ్ తిరిపో చెప్పిన రెండు వాక్యాలనే మళ్లీ చెప్పి దానికో మూడో వాక్యం జతచేసింది 'రేపు మనం విల్లు బాణం తీసుకుని ఈ పోరాటంలో పాల్గొందాం' అంటు లాల్ సలాం చెప్పకుండానే వెనుతిరిగింది.

ఒకరి తరువాత మరొకరిని వేదిక మీదిక పిలుస్తున్నారు.

వక్తలందరూ దాదాపుగా తన ముందు మాట్లాడిన వారి మాటలను వల్లె వేసి చివరికి 'లాల్ సలాం' అంటూ ముగిస్తున్నారు. కాసేపటికి ఆ వ్యవహారం కొంచెం కంగాళీగా తయారయ్యింది. ఇది సరిదిద్దడానికి ఏంచేయాలా అని చందన్ కాసేపు ఆలోచనలో మునిగిపోయాడు. ఈ చర్చను సమర్ధవంతంగా ముందుకు తీసుకువెళ్లడానికి రాజును మాట్లాడడానికి పిలవాలని నిర్ణయించుకున్నాడు.

చందన్ పక్కనే కూర్చుని ఉన్న ఉన్న రాజు కాస్త గంభీరంగా లేచి నిలబడ్డాడు. ఒకసారి చుట్టూ పరికించి మొదలుపెట్టాడు.

'కామ్రేడ్స్' అని ఒక క్షణం ఆగాడు. రెండో వాక్యం మాట్లాడుదామని నోరు తెరిచాడో లేదో ఒక్కసారిగా నవ్వేశాడు. అంతకు ముందు మాసే నవ్వినప్పటికన్నా బిగ్గరగా నవ్వడం మొదలుపెట్టారు ముందున్న గిరిజనులు. రాజు కొద్దిసేపటిదాకా అలా నవ్వుతూనే ఉన్నాడు. చందన్ తల పట్టుకున్నాడు. చాలాసేపటిదాక అక్కడ నవ్వులే నవ్వులు. దీంతో ఇక సమావేశం ముగించాలని చందన్ అనుకుంటుండగా రాజు నవ్వు ఆపాడు. మరుక్షణం చేయి ఎత్తి

అందరినీ నిశ్శబ్దంగా ఉండమని సైగ చేశాడు ఒకసారి బలంగా ఊపిరితీసుకుని తన ప్రసంగం మొదలుపెట్టాడు ఒకటి రెండూ నాలుగు పది రాజు మాట్లాడుతూనే ఉన్నాడు చందన్ మధ్యలో ఒకేసారి తలపైకెత్తి రాజు మొహాన్ని చూశాడు రాజు మాటల ప్రవాహం కొనసాగుతూనే ఉంది అర్ధగంట సేపు ప్రసంగించాడు రాజు మధ్య మధ్య కరతాళధ్వనులు అమెరికా నుండి మొదలుపెట్టి ఒసామా బిన్ లాడెన్ బ్రిటన్ భారత దేశం పాకిస్తాన్ చమురు యుద్ధం పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి అనర్గళంగా మాట్లాడాడు ప్రపంచానికి అమెరికా ఎందుకు పెద్ద శత్రువో టెర్రరిజంపై యుద్ధం పేరిట ప్రపంచాన్ని కబళించాలని అగ్రరాజ్యం ఎలా పన్నాగాలు పన్నుతుందో పూసగుచ్చినట్టు వివరించాడు రాజు చివరికి కొన్ని ఉత్తేజపూరితమైన నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించాడు అమెరికన్ సామ్రాజ్యవాదంపై తాము రాసిన కొత్త పాటను కూడా పాడి వినిపించాడు

రాజు ప్రసంగం చందన్‌కు అమితానందాన్ని ఇచ్చింది అతని ముఖంపై సంతృప్తి కనిపించింది

'కామ్రేడ్ అద్మా ఇంకో పేరు పిలిచాడు

అద్మా లేచి గర్వంగా నిలబడ్డాడు వేదికపైకి వడివడిగా నడిచాడు చుట్టూ చూసి ఇంకా చెప్పడానికి ఏం మిగిలిందా అని బుర్రగోక్కున్నాడు నడుంపై చేతులువేసుకుని ఒకసారి రాజు కళ్లలోకి చూశాడు అందరి తలలమీదుగా ఒకసారి అలా చీకట్లోకి దృష్టిసారించాడు

ప్రపంచానికి ప్రథమ శత్రువు అమెరికా రేపు అందరూ విల్లు బాణాలు గొడ్డళ్లు కొడవళ్లు తీసుకుని ఇక్కడికి రండి మనం అమెరికాతో కొట్లాడుదాం ఎకబిగిన ఈ మాటలు మాట్లాడి తుపుక్కున ఉమ్మేసి వచ్చినంతా వేగంగానే వెళ్లి కూర్చున్నాడు

రాజు ప్రసంగమే చివరిదని ఇక మిగతావారికి మాట్లాడానికి పెద్దగా ఏమీలేదని చందన్‌కు తెలుసు కానీ ఈ గిరిజన యువతీ యువకులు వివిధ ప్రజాసంఘాలలో పనిచేస్తున్నారు వారు ఉద్యమవ్యాప్తిలో కీలక బాధ్యతలు

నిర్వహించాలి కాబట్టి వారికి ప్రజలముందు మాట్లాడటం అలవాటు కావాలి. వారిలో ఉన్న బెరుకు, భయం ఇప్పుడే తొలగించకపోతే భవిష్యత్తులో అదొక సమస్య అవుతుంది. ఆట, పాటల్లో ముందున్న గిరిజనులకు కొంచెం తర్ఫీదు ఇస్తే చక్కని వక్తలుకూడా కాగలరు. అందుకే మిగతా వారిని కూడా వేదికపైకి పిలిచాడు. మనసుకి తోచింది మాట్లాడమని వారికి చెప్పాడు. అయినా కొందరు సిగ్గుతో అసలు ఏం మాట్లాడలేదు. కొందరు కూర్చున్నచోటు నుండే ఒకటి రెండు మాటలు మాట్లాడారు.

దాదాపు 11 అయ్యింది సమయం. మరునాడు కూడా కార్యక్రమం ఉన్నది. అప్పటికే రాత్రి భోజనాల సమయం కూడా మించిపోవడంతో చందన్ సమావేశాన్ని ముగించాడు.

రాజు మాట్లాడుతున్నప్పుడు నా అనువాదకుడు కాసేపు అనువదించడానికి ప్రయత్నించాడు. కానీ అతని ప్రసంగ వేగాన్ని అందుకోలేక నోరుమూసుకున్నాడు. నాకు తెలిసిన పదాల సాయంతో రాజు ఏం మాట్లాడాడో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను నేను.

భోజనం చేస్తుండగా రాజుపై ప్రశంసల జల్లు కురిపించాడు చందన్.

రాజు కూడా ఈ గిరిజనుల్లో ఒకడే. ఉద్యమంలో చేరేనాటికి నిరక్షరాస్యుడే. కానీ ఒకటిన్నర ఏళ్లలో సాంస్కృతిక బృందంతో ఉండి చదవడం, రాయడం, ప్రసంగించడం నేర్చుకున్నాడు.

ఆ రాత్రి పడుకున్నాక రాజు నన్ను అనేక ప్రశ్నలు అడిగాడు. అమెరికాతో పాటు తనకు తెలిసిన రెండు మూడు దేశాలు కాక ప్రపంచంలో ఉన్న ఇతర దేశాల పేర్లు అడిగాడు. అమెరికాలో చమురు దొరకదా?, అది ఎందుకు ఇతరదేశాలపై దాడిచేస్తుంది? అని ప్రశ్నించాడు. కాసేపు అయ్యాక హఠాత్తుగా:

'ఈ చమురు సంగతేంది. అది కూడా ఇప్ప గింజల నుండి వచ్చినట్టుగానే చెట్ల నుండి వస్తుందా?'

చమురు భూమిలోనుండి వస్తుందని చెప్పగానే, 'ఇనుము వచ్చినట్టా?' అని అడిగాడు.

'భూమినుండే. ఇనుప ఖనిజంలా కాకుండా కొంచెం వేరే పద్ధతిలో వెలికితీస్తారు చమురును. కిరోసిన్ కూడా చమురునుండే తీస్తారు'

అతను ఇప్ప గింజల నుండి నూనెను తీయడం మాత్రమే తెలుసు కాబట్టి చమురు గురించి చెప్పడం కొంచెం కష్టమయ్యింది.

తాను చూసిన, విన్న ఇతర వస్తువులు - ప్లాస్టిక్, పెట్రోలు, పెన్ను, ప్లాస్టిక్ షీట్ - వంటివన్నీ ఎలా తయారవుతాయో తెలుసుకోవాలని రాజుకు చాలా కుతూహలం.

సాంస్కృతిక బృందం వారి శిక్షణా విధానం ప్రకారం రాజు ఇప్పుడు మూడో తరగతికి వచ్చినట్టు. పాటలు పాడడం, నృత్యం చేయడం, నాటకాల్లో పాత్రలు వేయడమే కాక ఇప్పుడతను రాజకీయ అంశాల గురించి కూడా తెలుసుకోవడానికి ఉత్సుకత చూపిస్తున్నాడు. చమురు, ఖనిజాల గురించి మరోరోజు మాట్లాడుకుందాం అని అనుకుని నిద్రకు ఉపక్రమించాం.

***



ఉదయం నేను లేచేసరికి చాలామంది కళాకారులు ఆపాటికే నిద్రలేచారు. ఇంకా విజిల్ వేయలేదు అయినా అక్కడి సందడికే అందరూ నిద్రలేస్తున్నారు. చందన్ విజిల్ వేసేసరికి మిగిలిన వారూ నిద్రలేచారు. చాయ్ తాగే సమయానికి ఒక కంచరగాడిదపై గుడ్డలు, కార్డ్ బోర్డ్, కాగితాల వంటి సరంజామ తీసుకుని ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఇక్కడున్న చాలామంది కంచరగాడిదను చూడడం అదే మొదటిసారి. బస్తర్‌లో గుర్రాలు, గాడిదలు కనిపించవు. ఆ కంచరగాడిద మోస్తున్న బరువులు చూసి చాలా మంది ఆశ్చర్యపోయారు.

"దీన్ని వడ్లు మోయడానికి ఉపయోగించొచ్చు" ఎవరో సలహా ఇచ్చారు.

బహుశా అతనికి పదికిలోమీటర్ల దూరంలో ఉన్న రైస్ మిల్లు గుర్తుకువచ్చి ఉంటుంది. ప్రజల సమష్టి కృషితో ఏర్పాటైంది ఆ మిల్లు. కానీ అంత దూరం వడ్లు మోసుకువెళ్లలేక చాలా మంది గిరిజనులు ఆ రైస్ మిల్లును వాడుకోవట్లేదు. నామమాత్రపు రుసుముకు వడ్లను మర ఆడించే అనేక రైస్ మిల్లులను బస్తర్ ప్రాంతంలో నెలకొల్పారు గెరిల్లాలు. ఈ రైస్ మిల్లులు ఉన్నచోట మహిళలకు

వడ్లు దంచే బాధ తప్పింది. చాలా గ్రామాలో ఉదయం మూడు గంటలకే లేచి మహిళలు ఆరోజు కుటుంబానికి సరిపడా వడ్లు దంచడం చూశాను నేను. మహిళా విభాగం వారు ఈ రైస్‌మిల్లు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ప్రచారం చేస్తారు. దీనితో పొగతాగుతూ కాలక్షేపం చేసే మగవారికి కూడా బాధ్యతలు పెరిగాయి.

సాంస్కృతిక బృందం సభ్యులు కంచరగాడిద మోసుకువచ్చిన సామాన్లను అనేక భాగాలుగా విభజించి అక్కడ ఉన్న వేర్వేరు బృందాలకు పంచారు. ఒక పెన్సిల్ తీసుకుని బ్యానర్లు, ప్లకార్డులపై దేవనాగరి లిపిని ఉపయోగించి గోండీ భాషలో నినాదాలు రాశాడు చందన్. అక్షరాలు రాయడం వచ్చిన గోండు యువతీయువకులకు వాటిని ఇచ్చి మరిన్ని బ్యానర్లు ప్లకార్డులు తయారు చేయమని చెప్పాడు. రాయలేని వారిని అక్షరాల్లో రంగులు నింపమని పురమాయించాడు.

ఈ పని చేయడానికి చెట్ల నుండి పుల్లలు విరిచి వాటి చివరలు నమిలి బ్రష్షులు తయారు చేసుకున్నారు వాళ్లు. ఎవరికిచేతనైన పని వారు చేస్తూ బ్యానర్లు, ప్లకార్డుల తయారీలో మునిగిపోయారందరూ. కాసేపయ్యాక చందన్ వారిని ఆపాడు. కొన్ని బ్యానర్లపై సిల్వర్ రంగులో రాసిన అక్షరాలు కిందికి కారుతున్నాయి. కొందరు యువకులు దేవనాగరి లిపిలో ఒక అక్షరానికి బదులు మరొక అక్షరం రాసేశారు. వారు తయారుచేసిన బ్యానర్లు కొన్నిటిని చూస్తే అక్కడేదో చిత్రకళా పోటీ జరుగుతున్నట్టు, చెయ్యి తిరిగిన చిత్రకారులు అర్థం కాని నైరూప్య కళాఖండాలు తయారుచేస్తున్నట్టు కనపడుతున్నది.

చందన్ తప్పుగా రాసిన అక్షరాలను సరిదిద్దాడు. బ్రష్షును ఎలా పట్టుకోవాలో, పెయింటులో ఎంత ముంచాలో వారికి నేర్పించాడు. రెండు గంటలు వారితో పాటే ఉండి సూచనలు ఇచ్చాడు. ఇక ఫరవాలేదు వీళ్లు తప్పులులేకుండా రాయగలరు అన్న నమ్మకం కలిగాకే అక్కడి నుండి కదిలాడు. అక్కడ ఉన్నవాళ్లలో 99% మందికి ఆ బ్యానర్లు చదవడం రాకపోయినా అవి తప్పులు లేకుండా, అందంగా ఉండాలని అతని తాపత్రయం.

ఈ గిరిజన యువతీ యువకుల తాతముత్తాతలు ఏనాడు కలగని ఉండరు తమ ముందు తరాల యువత ఏదో ఒకనాడు అడవిలో దొరికే దుంపలు ఏరుకుని బతుకుతూనే ఇలా కుంచె, రంగులతో భావాలను వ్యక్తీకరిస్తారని, ఎండ్రకాయలు పాములు పడుతూనే వారొక అందమైన దస్తూరి అలవర్చుకుంటారని.

అక్కడికి వచ్చిన గ్రామస్తులకు ఇదొక వింతగొలిపే దృశ్యం. ఆ కాగితాలపై ప్రాణంపోసుకుంటున్న విచిత్రమైన ఆకారాలను వారు ఆసక్తిగా చూడసాగారు.

'ఇక్కడ ఏం తయారుచేస్తున్నారు' ఎవరో చందన్‌ను అడిగారు.

'ఏమీ తయారుచేయడం లేదు. మేము రాస్తున్నాం. అక్షరాలు రాస్తున్నాం'

ఒక ప్లకార్డు తీసుకుని దాని మీద ఏం రాసి ఉందో వివరించాడు.

'ఓహ్! ఇవి రాస్తున్నారా? కానీ ఇవి మా సమస్యలు కదా. వీటిని ఈ అట్టముక్కపై రాస్తే సర్కారు చదువుతుందా?' అతను చందన్‌ను ప్రశ్నించాడు.

'అవును. ఇది చదివి మీకేం కావాలో ప్రభుత్వం తెలుసుకుంటుంది'

'అంటే దానర్థం ప్రభుత్వం మంచిదన్నమాటే'

'అది చదివేంత మంచిది మాత్రమే. మన సమస్యలను ఒప్పుకునేంత మంచిది కాదు. సమస్యలు తీరాలంటే మనం బాగా శ్రమించాల్సిందే'

చందన్ ఇద్దరు కళాకారుల భుజాలపై చేయివేసి పాడడం మొదలుపెట్టాడు.

*"ఈ అడవి మాది, ఈ కొండ మాది!*

*ఈ వీధి మాది, ఈ భూమి మాది!!*

*ఈ అడవి మాది, ఈ కొండ మాది, మా వీధి, మా భూమీ...!!!'*

***

మరునాడు ఉదయం జరిగే బహిరంగ సభకు ప్రజలను సమీకరించడానికి ముందురోజు సాయంత్రమే చుట్టుపక్కల గ్రామాలకు కళాకారులను పంపించారు. దూరం గ్రామాల నుండి వచ్చేవారు ఈపాటికే సభాస్థలికి బయలుదేరారట. వారి రాత్రికి మార్గమధ్యలో ఎక్కడైనా బసచేసి రేపు ఉదయానికి ఇక్కడికి చేరుకుంటారు.

ఉదయం ఎనిమిదింటి నుండే గుంపులుగుంపులుగా ప్రజలు రావడం మొదలైంది పది గంటల వరకూ అలా వస్తూనే ఉన్నారు రంగు రంగుల దుస్తులు ధరించి కొంతమంది తలపై లేడి కొమ్ములు ధరించి కొందరు నెమలి ఈకలు ధరించి ఇంకొందరు డప్పు మోతల నడుమ వారంతా సభాస్థలిలోకి అడుగుపెట్టారు ఇక్కడ వసంతం వచ్చినట్టూ పూవులు పూసినట్టూ ఉంది వాతావరణం ఒక్కో ఊరి ప్రజలు ఒక్కో దగ్గర కూర్చున్నారు ఎక్కడా రణగొణధ్వనులు కానీ గందరగోళం కానీ లేవు

చందన్ విజిల్ వేయగానే ఆ ప్రజలంతా మూడు వరుసల్లో నిలబడ్డారు కొద్దిసేపట్లోనే ఒక పొడవాటి అనంతమైన వరుస ఏర్పడింది ఇంకాసేపటికి ఆ వరుస ఒక ప్రదర్శనగా ముందుకు సాగడం మొదలైంది బ్యానర్లు జెండాలు ప్లకార్డులు చేబూని డప్పుల మోతల మధ్య దండకారణ్యంలో సాగుతున్న ఒక మహా ప్రదర్శన

ఎక్కడా ప్రభుత్వ అధికారులు కానీ పోలీసులు కానీ ప్రేక్షకులు కానీ లేరు ఇక్కడ ప్రతి నిరసనకారుడూ ఒక ప్రేక్షకుడే ప్రతి ప్రేక్షకుడూ ఒక నిరసనకారుడే దగ్గరలోని టౌను నుండి నలుగురైదుగురు చిరు వ్యాపారస్తులు కూడా వచ్చి తాత్కాలిక దుకాణాలు పెట్టుకున్నారు పాత్రికేయులు ఫొటోగ్రాఫర్ల బృందం ఒకటి వచ్చింది కొంతమంది ఉపాధ్యాయులు కూడా వచ్చారు టౌను నుండి మైక్ సిస్టం తాలూకు వ్యక్తులు కూడా ఉన్నారక్కడ ఎక్కడి నుండో ఇంకొక గెరిల్లా దళం వచ్చి కలిసింది

అడవిలోపల జరుగుతున్న ఈ నిరసనలు బయటి ప్రపంచంపై ఏమైనా ప్రభావం చూపుతాయో లేదో తెలియదు కానీ ఇక్కడికొచ్చిన ప్రజల ఉత్సాహం మాత్రం చూసి తీరాల్సిందే

బస్తర్ అడవుల్లో జరిగినన్ని అమెరికా వ్యతిరేక కార్యక్రమాలు మొత్తం భారత దేశమంతటా కూడా జరిగి ఉండవు చదువులేని అక్షరజ్ఞానం లేని అమాయక గిరిజనులేమో ఈ అంశంపై ఇంత చురుకుగా ఉంటే నాగరికులు

'తెలివిగలవాళ్లు', 'చదువుకున్న వాళ్లు' మాత్రం కనీసం నిరసన తెలిపే సాహసం చేయలేదు.

ఒక రెండు గంటల తరువాత ఊరేగింపు ఊరిమధ్యకు చేరుకుంది. అక్కడ ప్రదర్శనకారులు ఆగారు కానీ డప్పుల మోత మాత్రం ఆగలేదు. కొందరు మహిళలు శిగం ఊగినట్టు ఊగిపోసాగారు.

'చందన్ భాయ్! వాళ్లెందుకు అలా ఊగుతున్నారు?' అని అడిగాను.

'ఇక్కడిలాగే జరుగుతుంది. ఈ డప్పుల మోత వారికి పండుగను గుర్తుకు తెస్తుంది. అందుకే అలా శిగం ఊగుతారు. డప్పుల మోత ఉన్నంత సేపూ వారు సాంప్రదాయ నృత్యాలు చేస్తూనే ఉంటారు"

ఒక రెండు గంటల పాటు ఆ కార్యక్రమం కొనసాగింది. కొన్ని నాటకాలు, పాటలు, ఉపన్యాసాల తరువాత భారత, అమెరికా పాలకుల దిష్టిబొమ్మలు తగులబెట్టారు. చాలా సమయం గడిచినా ప్రజలు ఇంకా ఏమైనా కార్యక్రమాలు ఉంటాయేమోనని ఎదురుచూడడం కనిపించింది. చివరికి వేదిక మీద నుండి కార్యక్రమం ముగిసిందని, ఇక ప్రజలు తమతమ గ్రామాలకు వెళ్లిపోవాలని ప్రకటించాల్సి వచ్చింది.

వాళ్లు వచ్చినంత వేగంగానే తిరుగుప్రయాణం కూడా అయ్యారు. దగ్గరి గ్రామాల నుండి వచ్చిన కళాకారులు కూడా వెనుదిరిగారు. అందరూ బాగా అలసిపోయినా సంతోషంగా ఉన్నారు. అడవి చాలా నిశ్శబ్దంగా ఉందిప్పుడు. కాసేపటిక్రితం వేలాది మంది ఇక్కడ సమావేశం అయ్యారంటే ఎవరూ నమ్మరు. ఎక్కడా చెత్తాచెదారం లేవు, మిగిలిపోయిన వస్తువులు లేవు. ఒక పెద్ద ఊరేగింపు జరిగిన అవశేషాలు అసలేమీ లేవు. నగరాల్లో, టౌన్లలలో ఇది అస్సలు సాధ్యపడేది కాదు.

***

'ఈశ్వర్ భాయ్!' నన్ను భుజం పట్టి లేపాడు చందన్. అతని వెంట మూడు కొత్త ముఖాలు. వారు ఆయుధాలు చేబూని ఉన్నారు. ఇంకా నిద్రలేచే సమయం కాలేదు. విజిల్ కూడా మోగలేదు. అందుకే వచ్చినవారి వైపు

జాగ్రత్తగా ప్రశ్నార్ధకంగా చూశాను చలినెగడు వెలుతుర్లో వారి ముఖాలు వెలిగిపోతున్నాయి

ఇంత త్వరగా లేపావు ఎమిటి సంగతి?

బయలుదేరే సమయం వచ్చింది

నేను చుట్టూ చూశాను ఇంకా అందరూ నిద్రపోతూనే ఉన్నారు అయితే బయలుదేరే అజ్ఞ వచ్చింది నాకొక్కడికేనన్నమాట

వీరే నిన్ను తీసుకువెళ్లేది

నేను లేచి వారితో కరచాలనం చేశాను ముగ్గురూ తమతమ పేర్లు చెప్పారు

లచ్చుక్క!

బసంతి!

కన్నన్న!

రాత్రంతా నడిచి వచ్చినా వారిలో ఆ అలసట కనిఎంచలేదు నేను

116 బూట్లు వేసుకునే సరికి చాయ్ తయారయ్యింది

కొత్త ప్రదేశం కొత్త వ్యక్తులూ దండకారణ్యంలో ఇది చాలా సహజం ఎప్పుడూ కదులుతూనే ఉండాలి! ఇదొక సుదీర్ఘ యుద్ధం! చందన్ అన్నాడు చాయ్ తాగుతూ

అతని మాటలు విని అందరూ నవ్వారు

మరేమీ భయంలేదు ఈశ్వర్ భాయ్! మేమున్నాం! నాకు ధైర్యం చెప్పాడు కన్నన్న. అతని భుజానికి తుపాకీ వేలాడుతోంది కిట్ బ్యాగును కూడా కిందపెట్టలేదతను

మనం చాలా దూరం వెళ్లాలా? అడిగాను కన్నన్నను

'లేదు రెండు గంటలే కళ్లు మూసి తెరిచే లోపు చేరుకుంటాం అక్కడికి భయపడాల్సిందేమీ లేదు ఎమంటావు బసంతి? ఆ అమ్మాయి వైపు తిరుగుతూ అన్నాడు కన్నన్న

అవునవును భయపడాల్సిందేమీ లేదు కన్నన్న మాటలనే వల్లె వేసింది బసంతి

కొత్తగా దళంలోకి వచ్చిందట ఆ అమ్మాయి. ఆ అడవిలో పూసిన పువ్వులా మోముపై దరహాసంతో ఉన్నది. పేరు చూస్తే ఉత్తర భారత దేశం నుండి వచ్చినట్టు అనిపించినా పక్కా గోండీ యువతి. ఆలివ్ గ్రీన్ దుస్తుల్లోనూ ఆమె గెరిల్లా వలె కనపడటం లేదు. అడవిలో పూలు సేకరించడానికి వచ్చిన అమాయక గిరిజన అమ్మాయిలా ఉంది.

చాయ్ తాగడం అయిపోయాక చందన్ విజిల్ వేసి అందరినీ వరుసలో నిలబడమని అన్నాడు. అంటే మేము బయలుదేరే సమయం ఆసన్నమైందన్నమాట.

అందరూ వీడ్కోళ్లు చెప్పుకున్నారు. కరచాలనాలు అయ్యాయి. ఎవరూ మళ్లీ కలుద్దాం అని మాత్రం అనలేదు. మేమెవరమైనా మళ్లీ కలుస్తామో లేదో చెప్పడం కష్టమే. అందుకే ప్రతి వీడ్కోలు సమయంలో అదే చివరి కరచాలనంలా అనిపిస్తుంది.

***

ప్రస్తుతం దంతెవాడలో భాగంగా ఉన్న పాత బస్తర్ జిల్లాలోని నైరుతి భాగానికి మేము ఇంకా మూడు రోజుల దూరంలో ఉన్నాం. మా ప్రయాణపు మొదటి రోజు మా దారిలో కనపడ్డ గూడేనికి వెళ్ళి బసంతి కొన్ని మొగురం గడ్డలు తీసుకొచ్చింది. ఆ తరువాత మూడు పూటలూ మాకు ఆ తీయని గడ్డలే ఆహారం. ఒక గెరిల్లా స్క్వాడ్ లాగానే మేము మూడు పగళ్ళు, రాత్రుల పాటు నడక, విరామం, క్యాంపు చేసుకుంటూ సాగాం. విశ్రాంతి తీసుకోవడానికి ఒక ప్రదేశం చూసుకోవడం, రక్షణ బాధ్యతలు చూసుకోవడం వంటివన్నీ అత్యంత క్రమశిక్షణతో చూసుకోబడ్డాయి.

కన్నన్నకు పొగతాగడం అంటే చాలా మక్కువ. కానీ జేబులో బీడీలవంటివేవీ ఉంచుకోడు. నా జేబులోంచి ఒక చిన్న పొగాకు ముక్కను అడిగి తీసుకుని దాన్ని ఒక తునికాకులో చుట్టి దమ్ములాగుతాడు.

'కంగారేం లేదు. మన దగ్గర సరిపడా బీడీలు, సిగిరెట్లు ఉన్నాయి. దగ్గరలో పట్నం కూడ ఉంది. కావలిస్తే ఎవరినైనా పంపించి తెప్పించుకోవచ్చు.' నా జేబులో నుండి ఎప్పుడు పొగాకు తీసుకున్నా ఇదే చెప్పేవాడతను.

కన్నన్నకు తనతో పాటు పొగాకు ఉంచుకోవడం అలవాటు లేదు. దగ్గరుంటే 20 బీడీలైనా ఊదిపారేస్తాడట. లేకపోతే రెండు నెలలైనా పొగతాగకుండా ఉండగలడట.

మధ్యస్థపు ఆకారం, వెడల్పాటి భుజాలు, విశాలమైన నుదురు, గుండ్రటి ముఖం, పలచటి పెదాలు...మూడుపదుల వయసు ఉంటుందేమో కన్నన్నకు. అతని ముక్కు మొనలిన గిరిజనుడి కత్తిలాగుంటుంది.

వడివడిగా నడవలేకపోయినా ఎప్పుడు చూసినా ఏదో ముఖ్యమైన పని మీద ఉన్నట్టు కనపడతాడు.

లచ్చక్క చాలా మౌనంగా కనిపిస్తుంది. మా సంభాషణల్లో పెద్దగా పాలుపంచుకోదు. అప్పుడప్పుడూ సన్నగా నవ్వుతుందంతే. 20 ఏళ్లు ఉంటుందేమో, చామనఛాయ శరీరం, మెరిసే నల్లని కళ్ళు. ఆమె కళ్లలాగే చూపు కూడా చాలా చురుకైనది. చిమ్మచీకట్లో కూడా ఆమె కళ్లపై చిన్న వెలుతురుపడ్డా అవి పిల్లి కళ్లలా చమక్‌మని మెరుస్తాయి. లచ్చక్క రాత్రి కూడా చూడగలదని అందుకే గార్డ్ డ్యూటీ చేయడానికి ఆమెనే సమర్థురాలని కన్నన్న అభిప్రాయం. తను తొందరగా అలసిపోదు కాబట్టి అందరికన్నా ఆమెకే పని ఎక్కువ ఇస్తారు. దాన్ని ఆమె అందరికన్నా ముందే పూర్తిచేస్తుంది కూడా.



మరునాడు సాయంత్రం.

'లచ్చా' అని పిలిచాను

'లచ్చా కాదు లచ్చక్క అనాలి' కన్నన్న సరిదిద్దాడు నన్ను

'ఆ! లచ్చక్కా!' మరోసారి పిలిచాను

ఆమె పలకలేదు.

'లచ్చక్క పలకదు. కేవలం నవ్వుతుందంతే',

కన్నన్న చెప్పినట్టుగానే ఒక అందమైన చిరునవ్వు పరచుకుంది ఆమె పెదాలపై.

'పరవాలేదు లచ్చక్క, నిన్ను ఇంటర్వ్యూ చేస్తాడట. ఇంటర్వ్యూ! పేపర్‌లో అచ్చవుతుంది'

పేపర్‌లో వచ్చినట్టుగానే ఆమె గురించి వివరాలు చెప్పడం మొదలుపెట్టాడు కన్నన్న.

'లచ్చక్క ప్రజా గెరిల్లా సైన్యం సభ్యురాలు, వయసు...అ అన్నట్టు నీ వయసు ఎంత లచ్చక్కా'? ఆమెను ఆటపట్టిస్తూ అడిగాడు కన్నన్న.

దానికీ నవ్వే సమాధానమయ్యింది.

'సరే లచ్చక్క. ఇక నిజంగానే మొదలుపెడదాం. నీ వయసు ఎంత?' అడిగాను నేను.

ఆమెను మాట్లాడించడానికి చాలా శ్రమించాల్సి వచ్చింది. భయపడాల్సిన పనేంలేదని కన్నన్న నచ్చచెప్పాక ఆమె ఒప్పుకుంది.

తన భుజానికి ఉన్న తుపాకీని తీసి తన మోకాళ్ల వద్ద ఉంచుకుంది.

'వయసు'

'తెలియదు'

మీ కుటుబంలో ఇంకా ఎవరెవరు ఉన్నారు?

'అమ్మ, నాన్న, ఇద్దరు చెల్లెళ్లు'

'నీకు పెళ్లయిందా?'

పెళ్లి అన్న పదం వినగానే ఆమె ఒక క్షణం నవ్వింది. మరుక్షణం ఆమె పెదాలు అదిరాయి. ఆమె నల్లని కళ్ళు మరింత నల్లబడ్డట్టు అనిపించింది నాకు. 'ఇదేం ప్రశ్న' అన్నట్టుగా ఆమె కన్నన్న వేపు చూసిందొకసారి.

'జవాబు చెప్పు లచ్చక్క. మరే ఫరవాలేదు' కన్నన్న భరోసా ఇచ్చాడు

'మూడేళ్ల క్రితం పెళ్లయింది నాకు. పెళ్లయిన మరునాడే ఇంటినుండి పారిపోయాను'

'ఎందుకు?'

'ఎందుకంటే...నాకా పెళ్లి ఇష్టం లేదు కనుక. నాకిష్టం లేని పెళ్లిని ఖాయం చేశారు మావాళ్ళు. ఆరోజు తరువాత నేను మళ్లీ ఇంటి మొఖం చూడలేదు. దళంలో చేరాను'

'మీ అమ్మా, చెల్లెళ్లూ నీ కొరకు ఎదురుచూస్తుంటారేమో కదా'

లచ్చక్క జవాబు చెప్పలేదు. బహుశా తను కూడా వారిని గుర్తుకుతెచ్చుకుని బాధపడుతుందేమో. ఇంట్లో జీవితం కన్నా గెరిల్లా జీవితమే నచ్చిందామెకు. ఏదో సాధించాలనే తపన ఉందామెలో.

గిరిజన యువతి అయినా ఆమెకు పెద్దగా నృత్యం చేయడం రాదు. ఎప్పుడైనా పాటలు పాడే బృందంతో గొంతుకలుపుతుందంతే. ఖాళీ సమయం దొరికితే పుస్తకం పట్టుకుంటుంది.

తన 'అత్తవారిల్లు' నుండి లచ్చక్క పారిపోయాక చాలా రోజులపాటు గెరిల్లాల కొరకు వెతుకుతూ అడవిలో తిరిగింది. ఒక గూడెం నుండి ఇంకో గూడెం అన్నల కొరకు ఆరాతీస్తూ వెళ్లేది. తనుండే గ్రామం గెరిల్లాల క్యాంపుకు చాలా దూరంలో ఉన్నప్పటికీ మార్పు కొరకు వారు యుద్ధం చేస్తున్నారని ఆమె తెలుసుకుంది. చివరికి ఆమె ఎలాగోలా మావోయిస్టు క్యాంపు చేరగలిగింది. ఆమె ఎక్కడినుండి వచ్చిందో అడిగిన గెరిల్లాలకు ఆమె యాభై కిలోమీటర్ల పైగా దూరం నుండి నడచి వచ్చిందని అర్థమయ్యింది. వారు ఆమెను తన పుట్టినింటికి తిరిగి వెళ్లిపోమని సూచించారు. కానీ ఆమె ఆ ఆలోచనను తిరస్కరించింది. ఈనాటికీ ఆమె నిర్ణయం సడలలేదు. లచ్చక్క ఒక కొత్త జీవితాన్ని స్వప్నిస్తోంది. దాన్ని సాకారం చేసుకోవడానికి ఆమె పోరాడుతోంది. ఆ కొత్త జీవితం ఎలా ఉండబోతుంది? అందులో అందరూ స్వేచ్ఛగా, అక్షరాస్యులై సంతోషంగా ఉంటారని మాత్రం ఆమెకు తెలుసు. ఐహిక సుఖాలపై ఆమెకు పెద్దగా ఆసక్తి లేదు. ఆమెకు స్వేచ్ఛ అంటే ప్రాణం. ఆమె దృష్టిలో స్వేచ్ఛ అంటే సామాజిక బంధనాల నుండి విముక్తి. అది యుద్ధం చేస్తేనే సాధ్యపడుతుందని ఆమెకు తెలుసు. ఆమెకు సమాజమనే చీకటి కొట్టులోకి తిరిగివెళ్లడం సుతరాము ఇష్టం లేదు.

లచ్చక్కకు అక్షర జ్ఞానం అబ్బింది దళంలో చేరాకనే. పుస్తకాల్లో నిక్షిప్తమై ఉన్న ప్రపంచం ఆమెను అబ్బురపరుస్తుంది.

'లచ్చక్క అనేది గోండీ పేరు కాదు కదా కన్నన్నా?' అడిగాను నేను.

'అవును ఇక్కడికొచ్చాక మేమే పెట్టాము ఆ పేరు' చెప్పాడు కన్నన్న.

అతను ఇంటిని వదిలి నాలుగేళ్లయిందట. భార్యతో విభేదాలు వచ్చి ఇంటిని వదిలాడట. ఆరు నెళ్లకో, ఏడాదికో తన గూడెం మీదుగా దళం ప్రయాణిస్తున్నప్పుడు తన పిల్లలను కలుస్తాడట. ఊరివాళ్లనడిగి భార్య యోగక్షేమాలు కనుక్కుంటాడట. పిల్లల గురించి పెద్దగా చింతేమీ లేనట్టుంది అతనికి. అందరు గిరిజనుల్లాగే వాళ్లు కూడా అడవిలో దొరికేవి సేకరిస్తూ, చేపలు పడుతూ, వేటాడుతూ కాలం గడిపేస్తారని అతని ధీమా.

మూడో రోజు సాయంత్రం మేమొక గిరిజన గూడెం చేరాం. దాని పేరు ఎక్కడో విన్నట్టు అనిపించింది నాకు. ఊరికి కుడి పక్కన ఒక కొట్టం వంటి దాని దగ్గర క్యాంపు వేశాం. ఇక్కడ కొట్టాన్ని ఖేతుల్ అని అంటారట.

కాసేపు ముగ్గురూ గోండీలో ఏదో మాట్లాడుకున్నారు. బసంతి లేచినిలుచుని తుపాకీ చేతిలోకి తీసుకుంది.

'ఊళ్లోకి వెళ్తున్నావా?'

'అవును' అంది. నేనూ లేచి నిలబడ్డాను. నేనూ వెళ్లడానికి ఉద్యుక్తుడవడం చూసి కన్నన్న లచ్చక్కను నాతో పాటు పంపాడు. 121

చాలా గుడిసెలు దాటి ముందుకు వెళ్లాక ఒక గుడిసె వద్ద ఆగాం. మాచుట్టూ అనేక మంది గ్రామస్తులు గుమికూడారు. మేము నలుగురమే ఉన్నామని తెలుసుకుని ఊళ్లోనే వంట చేయాలని నిర్ణయించుకున్నారు. కన్నన్నను కూడా ఊళ్లోకే రమ్మని కబురుపెట్టారు.

మేము పక్కనే ఉన్న గుడిసెలోకి అడుగుపెట్టగానే ఒక చిన్నపాప కెవ్వుమని ఏడిచింది. గుడిసెలో ఉన్న చలిమంట చుట్టూ కొంతమంది గ్రామస్తులు కూర్చుని ఉన్నారు. లచ్చక్క ఆ పాపను రమ్మని చేయి సాచింది. ఆ పాప ఇంకొంచెం గట్టిగా ఏడుపు లంకించుకుంది. పక్కనున్న ఒక వ్యక్తి లచ్చక్కను ఎత్తుకోవద్దని సైగ చేస్తూ, ఆ పాపకు వీపు దగ్గ కాలిందని చెప్పాడు.

లచ్చక్క తనవద్ద ఉన్న టార్చిలైటుతో ఆ పాప వీపును పరీక్షించింది. బాగానే కాలిందా పాప వీపు భాగం. గాయాలు కొంచెం మానుతున్నా వాటి నొప్పివల్ల ఆపాప శరీరం బిర్రబిగుసుకుపోయింది.

'ఎప్పుడు జరిగిందిది? మందేమీ రాయలేదా దీనికి? అయినా దవాఖానకు ఎందుకు తీసుకుపోలేదు?' వెంటవెంటనే ప్రశ్నలు కురిపించింది లచ్చక్క

ఎవరూ మాట్లాడలేదు.

లచ్చక్క రెట్టించేసరికి ఆ పాప తల్లితండ్రులు ఇక్కడ లేరని జవాబు వచ్చింది. నాలుగేళ్ల క్రితం ఆ పాప తల్లిని ఆమె తండ్రే హత్యచేశాడట. ప్రస్తుతం జగ్‌దల్‌పూర్ జైల్లో ఉన్నాడట. ఎవరో ఈ పాపను తీసుకు వచ్చి ఈ ఊళ్లో వదిలిపెడితే నాలుగేళ్ల నుండీ ఇక్కడే పెరుగుతోందట. వారం క్రితం నిద్రలో పక్కనే ఉన్న నిప్పులపైకి దొర్లడంతో వీపు కాలిందట. అప్పటి నుండి కూర్చోలేక, పడుకోలేక బాధపడుతోంది. ఎవరూ వైద్యం కూడా చేయించలేదు.

కాసేపయ్యాక కన్నన్న కూడా వచ్చాడు. ఎవరమూ అన్నం సరిగ్గా తినలేకపోయాం.

రాత్రి పడుకోవడానికి అడవిలోకి వెళ్లాం. అరగంట నడిచాక దట్టమైన అడవిలో బసచేసేందుకు ఒక ప్రదేశాన్ని ఎన్నిక చేశాడు కన్నన్న. బసంతి రక్షణ బాధ్యత తీసుకోగా మేము షీట్లపై మేనువాల్చాం.

'కాలిన గాయాలకు మందేమిటి?' పక్కకు తిరుగుతూ అడిగింది లచ్చక్క

'నాకు తెలియదు' బదులిచ్చాను నేను.

అడవిలో ఇలా జరిగినప్పుడు ఏం చేస్తారని అడిగాను. ఏదో ఒక మందో, పసరో ఉండే ఉండాలి కదా?

'నాకూ తెలియదు. బహుశా వాళ్లేమీ చేయరేమో...గాయాలు వాటంతట అవే మానిపోతాయి లేదా అవి ఎక్కువై మనిషి ప్రాణాలే తీస్తాయి. ఇక్కడికి వైద్యులెవరూ రారు. కష్టపడి దవాఖానాకు పోయినా అక్కడ మందు దొరకాలి కదా. చివరికి వారికి చావే గతి అవుతుంది.'

'ఆ చిట్టితల్లికి ఏమవుతుందో ఏమో. పాపం తన గురించి పట్టించుకోవడానికి తల్లితండ్రులు కూడా లేరాయె. వేరేవాళ్లు ఎందుకు పట్టించుకుంటారు' అంది లచ్చక్క కాసేపయ్యాక.

'నేనా పాపను చనిపోనివ్వను ఎంత ముద్దుగా ఉంది ఏదో ఒకటి చేసి నేను డాక్టర్‌ను తీసుకొస్తాను ఇక్కడికి' అంది కృతనిశ్చయంతో కానీ దగ్గరలోని దవాఖానా 18 కిలోమీటర్ల దూరంలో ఉంది కాలినడకన తప్ప మరో దారిలేదు ఇక్కడికి రావడానికి ఏ డాక్టరైనా ఎందుకు వస్తాడింత దూరం?

ఆ రాత్రి లచ్చక్క నిద్రపోయిందో లేదో నాకు తెలియదు ఉదయం నేను లేచే సరికి తను లేదు పొద్దున్నే లేచి దగ్గరలోని గూడెంలో ఉన్న మహిళా విభాగం వారితో ఆ పాప పరిస్థితి గురించి చర్చించడానికి వెళ్లిందట మేము బయలుదేరే సమయానికి వచ్చింది

మా తదుపరి ప్రయాణం మొదలుపెడుతుండగా హమ్మయ్య! భయం లేదు మహిళా విభాగం వాళ్లు ఆ పాప బాధ్యతను తీసుకున్నారు అని కన్నన్న చెప్పాడు

***

కొత్త ప్రాంతం కొత్త వ్యక్తులు!

నాకు కొత్తగా పరిచయం అయినవాళ్లలో మొదటివాడు దస్రు అయిదున్నర అడుగుల ఎత్తు నవ్వు ముఖం అమాయకమైన కళ్లున్న ఈ కుర్రవాడి వయసు 24 యేళ్లు రెండేళ్ల క్రితమే అప్పటిదాకా చేసిన పక్షుల వేటను వదిలి పెద్ద వేటకు వచ్చాడతను చేతిలో విల్లు బాణం స్థానంలో తుపాకీ ఒంటి మీద గోచీ బనీను స్థానంలో మిలిటరీ యూనిఫారం వచ్చిచేరాయి మడుగుల్లో రాళ్లకింద ఎండ్రకాయలు పట్టడం చిటారుకొమ్మల చివర ఉన్న పండ్లను తెంపడం మాత్రం ఈనాటికీ మానలేదు ఎక్కడైనా ఎర్ర చీమలు కనపడితే వెంటనే వాటిని ఆకుల్లో పొట్లం కట్టేస్తాడు స్నానానికి వెళితే ఉట్టిచేతులతో తిరిగిరాడు ఎండ్రకాయలు దొరకకపోతే కనీసం ఆల్చిప్పలయినా దొరకబడతాడు మంచి గురికాడు మిత్రులతో కలిసి ఎన్నో అడవి పందులను లేళ్లను ఎలుగుబంట్లను కొట్టాడట ఇక కొట్టుకొచ్చిన పక్షులకయితే లెఖ్ఖేలేదట అడవి దారుల గుండా మోటర్‌సైకిల్ నడపడంలో బహునేర్పరి అందుకే వివిధ దళాల మధ్య సమన్వయ కార్యకలాపాలకు ఉపయోగపడుతుంటాడు

నన్ను దస్రుకు పరిచయం చేసిన తరువాత కన్నన్న, లచ్చక్క వెళ్లిపోయారు. నేను, దస్రు, బసంతి కలిసి దగ్గరలోనే ఒక రాత్రి కొరకు బసచేసిన మరో గెరిల్లా దళాన్ని కలిశాం.

ఈ కొత్త దళం కమాండర్ బక్కపలుచగా, ఎత్తుగా, మెరుపు వేగంగా ఉన్నాడు. వడివడిగా నడుస్తూ ఎప్పుడు చూసినా ఏదో పనిలో విరామం లేకుండా ఉన్నాడు. నాకెదురైన ప్రతి సారి నవ్వుతూ 'హిందీ ఇల్లా' (హిందీ రాదు) అంటున్నాడు. గోండీలో మాత్రం చాలా వేగంగా మాట్లాడుతున్నాడు. ఆజ్ఞలు ఇచ్చేటప్పుడు లోగొంతుకతో మార్దవంగా పలుకుతున్నాడు. అతని సైగలని బట్టి ఏం చెబుతున్నాడో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. కానీ అతని మాటల వేగం అందుకోలేకపోయాను. ఇక ఆ దళంతో ఉన్నప్పుడు బసంతినే నాకు అనువాదకురాలిగా పనిచేసింది.

రాజేశ్ ఆ దళానికి కమాండర్ మాత్రమే కాదు అతనొక పొలిటికల్ ఆర్గనైజర్. అతని మాతృభాష తెలుగు. అతనున్న దళంలో ముగ్గురు తెలుగు వాళ్లున్నారు. వారితో మాత్రం తెలుగులో మాట్లాడుతున్నాడు. మిగతావాళ్లంతా గోండీ అబ్బాయిలు, అమ్మాయిలే.

ఒకరోజు మేము అడవిగుండా ప్రయాణిస్తుంటే ఒక 10–11 ఏళ్ల కుర్రాడు మాతో పాటే రావడం గమనించాం. చాలా దూరం వరకూ అతను అలాగే వస్తుండటం చూసిన రాజేశ్ విజిల్ వేసి అందరినీ ఆగమన్నాడు. ఆ అబ్బాయిని పిలిస్తే వాడు ఏ జంకూగొంకూ లేకుండా వచ్చి అందరితో చేయికలిపాడు. అతనిది ఏ వూరు, అడవిలో ఒక్కడే ఎందుకు తమను వెంబడిస్తున్నాడో అడిగారు అతణ్ని. ఆ ప్రశ్నలకు తాపీగా జవాబులు చెప్పాడతను. అతను చెప్పినదాన్ని బసంతి నాకు వివరించింది. అతని తండ్రి కొంతకాలం క్రింద మరణించాడట. తల్లి కూడా ఇతణ్ని వదిలేసి ఎక్కడికో వెళ్లిపోయిందట. ఊళ్లో ఇతని మామలు కలిసి వీళ్ల భూమిని గుంజుకోవడానికి ప్రయత్నిస్తున్నారట. ఆ విషయమే విప్లవోద్యమ రైతాంగ కమిటీకి ఫిర్యాదు చేయడానికి బయలుదేరాడట.

'ఇక్కడ కూడా ఇలా ప్రవర్తిస్తారా ప్రజలు' అని ఆశ్చర్యంగా అడిగాను బసంతిని.

‘అపుడప్పుడు ఇలాంటివి జరుగుతుంటాయి. కానీ అవి వెంటనే పరిష్కారం అయిపోతాయి. గ్రామస్తులే దానిని పరిష్కరించుకోలేకపోతే ఏరియా కమిటీ జోక్యం చేసుకుంటుంది. విషయం మరీ వివాదాస్పదమైనదైతే అది దళానికి నివేదించబడుతుంది. దళం చెప్పిన పరిష్కారాన్ని సాధారణంగా అందరూ ఆమోదిస్తారు.

‘ఎవరైనా ఒప్పుకోకపోతే ఏం చేస్తారు?’

‘అలా అరుదుగా జరుగుతుంది. ఇక్కడ కేసులు కోర్టుల దాకా పోవు. గ్రామ కమిటీల ద్వారా ఎక్కువ శాతం అంశాలు శాంతియుతంగానే పరిష్కారం అవుతాయి.

పాత రోజుల్లో తగాదాల పరిష్కారానికి పోలీసులు వచ్చినప్పుడు అందరూ వారికి మూల్యం చెల్లించాల్సి వచ్చేది. దెబ్బలూ, అవమానం కూడా దానికి తోడయ్యేవి. చాలాసార్లు బలం ఉన్నోడికే గెలుపు దక్కేది. ఇప్పుడు పరిస్థితి మారింది. ఇప్పుడీ అబ్బాయి మామలకు కూడా ఆ విషయం అర్థం అవుతుంది. ఇప్పుడు సత్వరంగా న్యాయం లభించడమే కాదు, అది నిజమైన అర్థంలో న్యాయం అయి ఉంటోంది. ఈ కొత్త శక్తే కనుక లేక పోయి ఉంటే ఇటువంటి పిల్లలు బాగా నష్టపోయి ఉండేవారు.

ఇదే విషయంలో పోలీసులు జోక్యం చేసుకుని ఉంటే వారు అన్యాయాన్ని బలవంతంగా రుద్దేవారు. ఆ పిల్లవాడి మామలకే భూమిని హక్కుభుక్తం చేసేవారు. ఆ అన్యాయాన్ని అమలుచేయడానికి గూడెంలో పోలీసు క్యాంపు పెట్టేవాళ్లు. అటువంటి అన్యాయం ప్రజలూ హర్షించేవాళ్ల కాదు. గెరిల్లాలు కూడా ఇలా గూడేలలో పోలీసు క్యాంపులు పెట్టనిచ్చేవాళ్లు కాదు. ఈ విధంగా మొత్తానికి ప్రజల హక్కులు అయితే సురక్షితంగా ఉన్నాయి.’

ఒక సామాన్య గిరిజన యువతి అయిన బసంతికి ఇంత విషయ స్పష్టత ఉండటం నన్ను ఆకట్టుకుంది. ఆమె ఏ చట్టాలో, క్లిష్టమైన పుస్తకాలో చదవలేదు. అయితేనేం జీవితపు అనుభవాల ద్వారా ఆమె న్యాయమంటే ఏమిటో, దాన్ని అధికారం ఎలా ప్రభావితం చేస్తుందో, అన్యాయానికి అధికారానికి గల సంబంధం ఏమిటో అర్థం చేసుకునే చక్కని తర్కాన్ని అలవర్చుకుంది.

ఆ అబ్బాయి మరికొంత దురం మాతో పాటు వచ్చి ఆ తరువాత ఎటో వెళ్లిపోయాడు. దళాన్ని అతను ఏ సహాయమూ అడగలేదు. రైతాంగ కమిటీ తన సమస్యను పరిష్కరిస్తుందనే నమ్మకం అతనిలో ఉంది.

***

భోజనం తరువాత రాజేశ్‌తో మాట్లాడటం మొదలుపెట్టాను. బసంతి మాకు దుబాసీలా వ్యవహరించింది.

'ఎంతకాలం నుండి ఇక్కడ ఉన్నారు మీరు?'

'రెండేళ్లు'

'ఉద్యమంలోకి వచ్చి ఎన్నేళ్లు?'

'పదేళ్లు'

ఇంకా బ్రహ్మచారిగానే ఉన్నారా

'అవును'

'మీరు చాలా వేగంగా మాట్లాడుతారు. బుల్లెట్లు కూడా ఇంతే వేగంగా కాలుస్తారా?'



'లేదు. మాకు అంత విలాసంగా ఉండే అవకాశం లేదు. మందుగుండు చాలా విలువైంది, దాన్ని వృథా చేయలేం. లక్ష్యాన్ని గురి చూశాకే ట్రిగ్గర్ నొక్కుతాను నేను. ఇప్పుడైతే తుపాకీ వాడకం ఇంకా తగ్గించాలనుకుంటున్నా. కొత్త కమాండర్ రాగానే నేను విప్లవ రాజకీయాల వ్యాప్తికే పరిమితమవుతాను.'

గోండ్ గిరిజన ఉద్యమకారులకు రాజకీయ శిక్షణ అవసరమని రాజేశ్‌కు తెలుసు. గ్రామాల్లో రాజకీయ నిర్మాణాన్ని బలపరిచే కార్యక్రమం కొంతకాలంగా సజావుగా సాగట్లేదని అతను నాకు చెప్పాడు. దళంతో కాకుండా తాను స్వతంత్రంగా పనిచేస్తేనే ఎక్కువ ప్రభావం ఉంటుందని అతని భావన. దళం రెండు నెలలకు ఒకసారి మాత్రమే ఊళ్లోకి వస్తుంది. కానీ రాజకీయాలు రోజూ అవసరం కదా. ఎన్నో పనులు మధ్యలోనే ఆగిపోయాయని, తనకు కొంచెం ఈ బాధ్యతల నుండి విముక్తి దొరికితే ఆ పనులను చక్కబెట్టాలను కుంటున్నట్టు రాజేశ్ చెప్పాడు.

అతను మాట్లాడుతున్న పొడగాటి సంభాషణలను అనువాదం చేయడానికి బసంతి చాలా కష్టపడుతోంది. వాటిని చిన్న చిన్న వాక్యాలుగా విడగొట్టి తర్జుమా చేస్తోంది తను. రాజేశ్‌ను సరళంగా మాట్లాడమని కూడా చెప్పింది.

ఎంతో కృషి అవసరమైన అంశాలైన ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు, పోలీసుల అణచివేత, రిక్రూట్మెంట్ సమస్య వంటివాటి గురించి రాజేశ్ సంభాషణ కొనసాగించాడు. అన్నిటికీ కీలకం రాజకీయ నిర్మాణమే అని అతని నమ్మకం. రాజేశ్ క్లిష్టమైన విషయాలు మాట్లాడుతున్న కొద్దీ బసంతికి అనువాదం చేయడం కష్టమైపోతోంది. మామూలు రాజకీయ సంభాషణను అయితే తను అనువాదం చేయగలుగుతోంది కానీ సిద్ధాంతాలు, వివరణలు, రాజకీయ సంక్లిష్టతలు వచ్చినప్పుడు మాత్రం తను ఆగిపోతుంది.

'రాజకీయాలు ఎందుకు ఇంత గొట్టుగా ఉంటాయి? మీరు చిన్న చిన్న పదాలను ఉపయోగించి మాట్లాడుకోవచ్చు కదా? నాకు అసలు అనువాదం చేయడం రావట్లేదు. వీటిని అర్థం చేసుకోవడానికి నేను కూడా అధ్యయనం చేయాలి ఇక. అసలు ఒక్కోసారి ఈ గొట్టు సిద్ధాంతాల వల్లనే మన విప్లవోద్యమం ముందుకు వెళ్లలేకపోతుందేమోనని అనుమానం వస్తుంది. మన సిద్ధాంతాలు అందరికీ అర్థం అవ్వాలి.' అని

'సరే! ఇక నేను వెళతాను' అని తను బయలుదేరబోయింది.

కొన్ని రోజులు ఓపిక పడితే ఆమెకు ఇవన్నీ వాటంతట అవే అర్థం అవుతాయని రాజేశ్ ఆమెకు ప్రేమగా చెప్పాడు.

మా మధ్య వారధిలా ఉన్న బసంతి వెళ్లిపోయాక ఇక చేసేదేం లేక మేము కూడా మళ్లీ కలుద్దామనుకుని మా మాటలు ముగించాం. అప్పటికే పరచిన పక్కలపై విశ్రమించాం.

***

ఒకరోజు ఉదయాన్నే మాసే అనే చిన్న పాప మరణించిందనే దుర్వార్తను మోసుకువచ్చాడో వార్తాహరుడు. కొన్నాళ్ల క్రితం లచ్చక్క వైద్యం చేయించాలనుకున్నది ఆ పాపకే.

'ఇది రాజ్యం చేసిన హత్య' అని బాధపడ్డాడు రాజేశ్. లచ్చక్క ఈ వార్తను ఎలా తీసుకుంటుందో అని మధనపడ్డాడు. తనకు తెలుసు లచ్చక్క ఎలా ప్రతిస్పందిస్తుందో. తనని తాను ఇంకొంచెం ఎక్కువ పనిలో నిమగ్నం చేసుకుని ఎవరితోనూ మాట్లాడకుండా ఒక గూడులోకి వెళ్లిపోతుంది తను.

'ఆ పాప గురించి కొంచెం ముందు తెలిస్తే రక్షించగలిగేవాళ్లమేమో... ఉహు. అప్పుడూ పరిస్థితిలో పెద్దగా మార్పేమీ ఉండేది కాదేమో. మన వైద్య విభాగం వెంటనే స్పందించలేదు. మహిళా విభాగం వాళ్లూ ఏమీ చేయలేదు. ఇంకా మన ప్రజాసంఘాలను బలోపేతం చేయలేదు. కనీసం నేను కొంచెం సమయం ఇచ్చినా ఆ అమ్మాయి బతికుండేది'

పౌరులపట్ల రాజ్యం యొక్క నేరపూరిత నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూనే జరిగినదాంట్లో తన పాత్ర కూడా ఒప్పుకోవడానికి వెనుకాడలేదు రాజేశ్. విప్లవోద్యమశక్తులు బలపడితే మాసే లాంటి ఎందరో పసిపాపల ప్రాణాలు రక్షించబడతాయి.



బసంతి అభిప్రాయం మరోలా ఉంది. మాసే మరణం బస్తర్‌లోని అనేకానేక అసహజ మరణాల్లో ఒకటని ఆమె అన్నది. అయితే తను కొంచెం ప్రయత్నిస్తే మాసే ప్రాణాలు నిలబడేవన్న రాజేశ్ మాటతో ఆమె విభేదించింది. విప్లవోద్యమం మాసేలాంటివాళ ప్రాణాలు రక్షించాలంటే ఇంకా సమయం పడుతుందని, రాజేశ్, లచ్చక్కలాంటి వ్యక్తులు అన్నిపనులూ తామే చేయలేరని ఆమె అభిప్రాయం.

'మనం దళ కమాండర్లను, పొలిటికల్ ఆర్గనైజర్లను వేరు చేయాలి. ఒకరే రెండు పనులూ నిర్వర్తించడం సాధ్యం కాదు. నిన్న రాత్రి నువ్వు సూచించింది కూడా బహుశా ఇదే కావొచ్చు. ఇలా చేస్తే అనేక సమస్యలు పరిష్కారం అవుతాయి'. అన్నది బసంతి రాజేశ్ వైపు చూస్తూ.

'నువ్వు చెప్పింది కరెక్టు. వేర్వేరు అంశాలపై పనిచేయడానికి మనకు వేర్వేరు వ్యక్తులు కావాలి. ఈ సమస్యకు ఎలాగైనా పరిష్కారం కనుగొనాలి' అన్నాడు రాజేశ్ కృతనిశ్చయంతో.

***

మా ప్రయాణంలో మాకు తగిలిన తదుపరి గిరిజన గూడెం కొంచెం పెద్దది. దాదాపు 60–65 ఇళ్లు ఉన్నాయి. అందరి నీటి అవసరాలు తీర్చడానికి ఒక చేతిపంపు ఉన్నదక్కడ. ఊరిలోకి ప్రవేశించాక ఒక వసారా ఉన్న గుడిసె ముందు ఆగాం. ఆ చుట్టుపక్కల మనుషులెవరూ కనపడట్లేదు. ఆ గుడిసె ముందు తలుపు మూసేసి ఉంది. గుడిసెకున్న వెదురు తడికెలు బాగా చీకిపోయి ఉన్నాయి. కానీ బంతి పూల మొక్కలతో గుడిసె ముందున్న స్థలం చాలా శుభ్రంగా ఉన్నది. కొత్తగా చూసేవాళ్లకు ఈ గుడిసె యజమానులెవరో సోమరిపోతులున్నట్టున్నారు, తడికెలు చీకిపోతున్నా వాటిని మార్చట్లేదు అనిపిస్తుంది.

'ఇదొక స్కూలు' బసంతి నా మనసులో ప్రశ్నకు జవాబిచ్చింది.

గేటు తెరిచి లోపలికి అడుగుపెట్టాం. గుడిసెలోకి తొంగిచూస్తే అక్కడంతా నిశ్శబ్దంగా ఉన్నది. ఓ మూలకు బ్లాక్ బోర్డ్, దాని ముందొక చిన్న టేబుల్, గది మధ్యలో పక్కకు పడిపోయిన ఒక కుర్చీ. గోడ మీద ఒక మ్యాప్, దాని పక్కనే ఒక చెక్క బోర్డ్ పై 'ఇవ్వాళటి హాజరు' అని హిందిలో రాసి ఉంది. ఒకటో తరగతిలో పదకొండు మంది, రెండో తరగతిలో అయిదుగురు, మూడో తరగతిలో ఇద్దరు, నాలుగో తరగతిలో ఒకరు. మొత్తం 19 మంది విద్యార్థులు ఆ స్కూల్ రిజిస్టరులో నమోదై ఉన్నారు. అయిదుగురు విద్యార్థులు స్కూలుకు హాజరయినట్టు రాశారు. తారీఖు చూస్తే 20 రోజుల కిందటిది. బహుశా ఈ స్కూల్లో పనిచేసే ఉపాధ్యాయుడు రాసినట్టున్నాడు ఈ వివరాలు. అతని చేతిరాత చాలా అందంగా ఉంది. నెలకు ఏ రెండు మూడు సార్లో స్కూలుకు వచ్చేటట్టున్నాడీ మాష్టారు గారు.

ఆ గ్రామ పటేల్ (మాజీ ప్రభుత్వోద్యోగి) మాత్రం 'గురూజీ' రెండు మూడు నెలలకు ఒకసారి మాత్రమే వస్తాడని చెప్పాడు. ఆ గూడెంలో పిల్లలను మీకు చదువుకోవాలని ఉందా అని ప్రశ్నిస్తే, 'ఉపాధ్యాయుడు వస్తే తప్పక చదువుకుంటామని' చెప్పారు. స్కూళ్లున్న 50 గిరిజన గూడేలను నేను నా పర్యటనలో చూశాను, అందులో ఒక స్కూళ్ళో ఉపాధ్యాయుడు వారానికి మూడు సార్లు వస్తున్నాడు. ఇంకొక స్కూలు మాత్రం ఉపాధ్యాయుడు అదే

ఊళ్లో ఉండటం వల్ల రోజూ తెరుస్తున్నారు. ఇక మిగతా 48 గ్రామల్లోని స్కూలు టీచర్లు వేరే ఊళ్లలో కానీ సమీప పట్టణాల్లో కానీ నివసిస్తున్నారు. వాళ్లు ఆ స్కూళ్లని భ్రష్టుపట్టించి విద్యార్థులని దిక్కులేనివారిని చేశారు.

ఈ టీచర్లు ఎందుకు సరిగా పాఠాలు చెప్పట్లేదని ఆరా తీస్తే దానికి గెరిల్లాల భయమో, ప్రభుత్వ నిర్బంధమో కారణం కాదని తేలింది. వీరిపై సరైన యాజమాయిషీ లేదు కాబట్టి ఈ టీచర్లు స్కూలు ఎగ్గొట్టి పుణ్యానికి జీతాలు పొందుతున్నారు.

ఈ పరిస్థితి చక్కదిద్దడానికి విప్లవోద్యమం చాలా చర్యలు చేపట్టింది. టీచర్లు జీతాలు తీసుకోవడానికి బ్లాక్ ఆఫీసులకు వచ్చినప్పుడు అక్కడ వారు స్కూళ్లకు రావాలని ర్యాలీలు నిర్వహించారు. అక్కడ స్కూలుకు వస్తామని ప్రమాణం చేసిన టీచర్లు మాట నిలబెట్టుకోలేదు.

ఇంకొకటి రెండు సార్లు టీచర్లను మార్చడానికి ప్రయత్నించి, ఈ గ్రామాల్లో చదువుకున్న గిరిజనులకు శిక్షణ ఇచ్చి వారికే స్కూళ్ల నిర్వహణను అప్పగిస్తామని రాజేశ్ తెలిపాడు. దండకారణ్యంలో ఇప్పటికే అనేకచోట్ల గెరిల్లాలు స్కూళ్లు ఏర్పాటుచేశారు. అందులో ప్రాథమిక విద్యతో పాటు గిరిజన సంస్కృతి, ఆటలు, పరస్పర సహకారం వంటి అంశాలు భోధిస్తారు. నా పర్యటన సమయంలో అటువంటి స్కూళ్లను దర్శించే అవకాశం రాలేదు నాకు. దళాల్లో విద్యాభోధనకు ఎంత ప్రాముఖ్యతనిస్తారో నేను ప్రత్యక్షంగా చూశాను కాబట్టి ఈ స్కూళ్ల నిర్వహణ ఎలా ఉంటుందో నేను ఊహించుకోగలను.

రష్యన్ విప్లవ సమయంలో తయారైన 'ఫస్ట్ టీచర్స్'. చైనా విప్లవం సమయంలో సేవలందించిన 'బేర్ ఫుట్ డాక్టర్స్' వలె ఏ విప్లవోద్యమం అయినా కొంతకాలమయ్యాక ప్రజల సేవకే అంకితమైన మేధావులు, వృత్తి నిపుణులను తయారుచేయడం వింతేమీ కాదు. సృజనాత్మకత ఉన్న ఏ ప్రజా ఉద్యమమైనా ఇలాంటి అవకాశాలు సృష్టించడం సహజం.

***

రాత్రి నేను డైరీ రాసుకుంటుండగా బసంతి వచ్చింది. దగ్గరలోని పల్లె నుండి కొంతమంది గిరిజన యువతీయువకులు దళంతో స్థానిక సమస్యలు చర్చించడానికి వచ్చారని, తను కూడా వస్తే ఏమైనా సమాచారం దొరకవచ్చని పిలిచింది. నోట్ బుక్, పెన్సిల్ కూడా తెచ్చుకోమని చెప్పింది బసంతి. అవి తీసుకుని తనవెంట నడిచాను.

మేము బసచేసిన చోటుకు 150 మీటర్ల దూరంలో ఒక చలి నెగడు చుట్టు ఏడెనిమిది మంది గుమికూడారు. అందులో ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. వారు మాట్లాడేది అనువాదం చేయమని బసంతికి చెప్పాను.

గడచిన మూడు నెలల్లో వారి గ్రామంలో జరిగిన అన్ని సంగతులూ వివరించారా యువతీయువకులు. చేపల చెరువు, మలేరియా మరణాలు, స్కూలు ఎగ్గొట్టే మాస్టారు, అటవీ ఉత్పత్తుల ధరలు పడిపోవడం, మహిళా యూనిట్ పునర్వ్యవస్థీకరణ మొదలైన అంశాలు. సంతల్లో తాము తీసుకువెళ్లే ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రావడం లేదని, అలాగే గ్రామంలో మగవాళ్లు వచ్చిన డబ్బంతా ఇప్ప సారాకే తగలేస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయి. అన్నీ ఓపికగా విన్న రాజేశ్ వారికి కొన్ని సూచనలు ఇచ్చాడు. మళ్లీ కలుద్దామని చెప్పి ఆ సమావేశాన్ని ముగించాడు. 131

'రకరకాల సమస్యలు ఉన్నాయిక్కడ' అంది బసంతి వారు వెళ్లిపోయాక.

'దళం రెండు మూడు నెలలకు గానీ మళ్ళీ ఇటువైపు రాలేదు. ఈలోపు ఈ సమస్యలు ఇంకా పెరిగిపెద్దవవుతాయి.' అన్నాడు రాజేశ్ లేచి నిలబడుతూ.

'ప్రభుత్వం ఏమీ చేయదు. మనమే ఏదో ఒకటి చేయాలి' అంది బసంతి

'ప్రభుత్వం ఎప్పుడూ ఏదీ చేయదు. బాధ్యత తీసుకున్నాం కనుక మనమే ఈ సమస్యలు పరిష్కరించాలి'

తిరిగివచ్చాక చాలాసేపు రాజేశ్, బసంతి ఏదేదో చర్చించుకున్నారు. రాత్రి పొద్దుపోయే వరకూ రాసుకుంటూ కనిపించాడు రాజేశ్. మరుసటి రోజు మధ్యాహ్నం పక్కనే ఉన్న గ్రామంలోకి వెళ్లి అందరినీ జనరల్ బాడీ సమావేశానికి పిలిచాడు.

సమావేశం ముగిశాక ఎందుకో రాజేశ్ అసంతృప్తిగా కనిపించాడు. క్యాంపు పక్కన ఒక చెట్టుకింద కూర్చుని భూమ్మీద గడ్డిపరకలు తుంచుతూ శూన్యంలోకి చూడసాగాడు.

'సమావేశం విజయవంతం కాలేదా రాజేశ్' ఏదో ఒకటి మాట్లాడించాలని అడిగాను.

'లేదు'

'రాత్రి నిద్ర సరిపోలేదా?'

'అదేం లేదు'

'మరి దేని గురించి అంతలా ఆలోచిస్తున్నావు?'

'రెణ్నెళ్ల తరువాత మేము మళ్లీ ఇక్కడికి తిరిగి వచ్చేసరికి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంటుంది. ఇక్కడ జరిగే విషయాలపై ఎప్పటికప్పుడు ప్రతిస్పందించే వ్యవస్థను సృష్టించలేకపోతున్నాం. సమస్య ముదిరినకొద్దీ అది



ఇంకా వ్యాప్తిచెందుతోంది. యుద్ధక్షేత్రంలో బుల్లెట్లను ఎదురుకోవడమే ఒక్కోసారి సులభంగా అనిపిస్తోంది. అప్పుడు శత్రువు ఎదురుగా కనిపిస్తే ట్రిగ్గర్ నొక్కితే సరిపోతుంది. బుల్లెట్ లక్ష్యాన్ని ఛేదిస్తే మనకు సంతోషం కలుగుతుంది. మనకే బుల్లెట్ తగిలితే అంతకన్నా గర్వకారణం ఏముంటుంది?

కానీ ఇక్కడ! ఎన్నెన్నో విషయాలు బుర్రను చికాకు పరుస్తాయి.

ఒక్కో గూడెంలో ఉపాధ్యాయులుగా పనికివచ్చే నలుగురు మనుషులు దొరకడం కష్టం. ఏమిలేని దగ్గర కూడా ఒక పాఠశాలను నిలబెట్టగలిగే మనుషులు కావాలి మాకు. మా వైద్య బృందం మలేరియాను అరికట్టగలిగితే అదో పెద్ద విజయమవుతుంది, మహిళా విభాగానికి సరైన నాయకత్వం అందించకపోతే అది అభివృద్ధి చెందదు. ఒక కొత్త రాజకీయ వ్యవస్థను నిర్మాణం చేయాలనే మా ఆలోచన ఇంకా కార్యరూపం దాల్చలేదు. ప్రజా సంఘాలను స్థాపించినప్పుడు మేమెంతో సంతోషపడ్డాం, ఎంతో సాధించాం అనుకున్నాం. ఇప్పుడర్థం అవుతుంది వాటిని నడపడానికి ఎంతో శ్రమించాల్సి ఉంటుందని.

ఒక విభాగంపై శ్రద్ధపెడితే మరో విభాగం దెబ్బతింటుంది. మళ్లీ దీన్ని సరిచేసుకునేసరికి మొదటిది పనిచేయడం ఆగిపోతుంది.

ఈసారి బసంతి పెద్దగా ఇబ్బంది లేకుండానే తర్జుమా చేయడం చూసి మేమిద్దరం ఆశ్చర్యపోయాం. ఈ కళను తొందరగానే ఔపోసనపట్టింది తను. గోండు యువతీ యువకులిప్పుడు అక్షరాస్యులవుతున్నారు, బహుభాషా ప్రవీణులవుతున్నారు, దళ కమాండర్లవుతున్నారు. వివిధ సంఘాలకు నేతృత్వం వహిస్తున్నారు, రోగాలను నయం చేయగలుగుతున్నారు. వారు సాధించిన వాటి చిట్టా చిన్నదేమీ కాదు. కానీ ఏదైనా సజీవంగా ఉండాలంటే అది చలనశీలమై ఉండాలి కదా. అందుకే విప్లవోద్యమ ప్రగతిలో ఉన్న అడ్డంకులను తొలగించే పనిలో నిమగ్నమై ఉన్నాడు రాజేశ్.

ఆరోజు సాయంత్రం లచ్చక్క, కన్నన్న మరో ఇద్దరు గెరిల్లాలతో పాటు మమ్మల్ని కలిశారు.

సూర్యాస్తమయాన వాళ్లిద్దరూ రాజేశ్, బసంతిలతో సుదీర్ఘంగా సమావేశమయారు. లచ్చక్కకు మాసే మరణం గురించి తెలియజేసినప్పుడు ఆమె చాలాసేపు కదలకుండా కూలబడిపోయింది. కాసేపటికి తేరుకుని మళ్ళీ సంభాషణ కొనసాగించింది.

ఉదయానికి అందరిలోనూ ఒక కొత్త ఉత్సాహం గమనించాను నేను. తమ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు అనేక ముఖ్యమైన నిర్ణయాలు జరిగాయి రాత్రి సమావేశంలో. అడ్డంకులను అధిగమించగలమనే ఆత్మవిశ్వాసం తొణికిసలాడింది వారిలో. ఇప్పుడున్న వివిధ సంఘాల బాధ్యులకే అదనపు బాధ్యతలు ఇచ్చి ఆయా సంఘాలను ఇంకా శక్తివంతం చేయాలని నిర్ణయించారు.

***

మూడు గంటలు ప్రయాణించిన తరువాత దట్టమైన అడవిలోపల ఒకచోటికి చేరుకున్నాం. మేమే కాక మరో రెండు గెరిల్లా బృందాలు కూడా అక్కడికి ఏకసమయంలో చేరుకున్నాయి. అందరం కరచాలనాలు చేసుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నాం.

నన్ను పదిరోజుల తరువాత కలవాల్సిన మహిళా కమాండర్ దాదాపు నెల గడిచిన తరువాత కలిసింది. ఉద్యమం గురించి అప్పటికే చాలా తెలుసుకున్నాను కనుక మళ్లీ అవే విషయాలు అడగదల్చుకోలేదు తనని. కొంతకాలం క్రితం దండకారణ్యంలో ఒక సెలయేరులో స్నానం చేస్తుండగా పోలీసులు పట్టుకుని కాల్చి చంపిన ఏడుగురు కరీంనగర్ అమ్మాయిల గురించి ఆమెను అడగాలి. 14 నుండి 20 ఏళ్ల వయసున్న ఆ అమ్మాయిల పట్ల పోలీసులు ఎట్లా ప్రవర్తించారో తెలుసుకుంటే ఎవరికైనా ఒళ్లు గగుర్పొడుస్తుంది. అసలు నిజానికి వారిలో అందరూ గెరిల్లాలు కాదు. వారిలో కొందరైతే కేవలం దళాన్ని కలవడానికి వచ్చిన సామాన్య పౌరులు. పోలీసులు వారిని చుట్టుముట్టి, వారిపై అత్యాచారం జరిపి, వారి రొమ్ములు కోసివేసి, మర్మాంగాల్లో కారంపొడి కూరి, చివరికి కాల్చిచంపారు. ఆ అమ్మాయిలు ఎవరు? ఎక్కడివారు? వారి తల్లితండ్రులు, అన్నలు, అక్కలు ఎవరు?

ఆ మహిళా కమాండర్ చెప్పినదాని ప్రకారం ఆ అమ్మాయిలు నేనిప్పటి దాకా అడవిలో కలిసిన అనేక మంది గిరిజన అమ్మాయిల వంటి వారే. ఇక్కడ అందరు స్త్రీలు ఒకటే....అది లచ్చక్క, మాసె, బసంతి...జీవితాంతం అణచివేత, అవమానాలను నిశ్శబ్దంగా భరించగలదా స్త్రీ, తుపాకీ పట్టుకుని నలభై ఒక్క మందికి వరుసబెట్టి ఒంటిచేత్తో కాల్చగలదు కూడా.

గెరిల్లా అయినా కాకున్నా గిరిజన మహిళలు తెగువ కలవారు. వారు ఆ అడవిలో స్వేచ్ఛగా విహరించడం చూశాను నేను. అటువంటి స్వేచ్ఛా జీవితాన్ని 10 ఏళ్లు బతికినా, 10 రోజులు బతికినా ఒకటే.

బంధనాల బతికిన ఒక జీవితకాలం కన్నా స్వేచ్ఛగా బ్రతికిన ఒక క్షణం చాలదూ?

*కరీంనగర్ నుండి వచ్చిన ఆ ఏడుగురు అమ్మాయిలు*
*ఏడుగురు చెల్లెల్లు ఏడు కొండల వంటివారు*
*వాళ్లు తారలై ఆకాశానికి ఎగిశారు*
*వాళ్లు చెట్లై ఈ అడవిలో మొలిచారు*

*వాళ్లు ఎర్రమందారాలై వికసించారు*

*వాళ్లు నదులై ఏడేడు ఖండాల గుండా ప్రవహించారు*

మహోన్నత చైనా గోడకన్నా పొడవైన త్యాగాల పరంపరలో వాళ్లిప్పుడొక భాగం అయ్యారు. తూర్పున ఉన్న వియత్నాం నుండి మొదలైన ఆ పరంపర ఇరాన్ గుండా, పాలస్తీనా, టర్కీ నుండి అటు ఉత్తరాన ఉన్న కొలంబియా, పెరూ వరకూ కొనసాగుతోంది.

ఎవరనుకున్నారు, అడవిలో పూలు ఏరుకునే లచ్చక్క, బసంతి వంటి అమ్మాయిలు తమ భుజాలపై తుపాకి ఎత్తుకుని గ్రామ గ్రామాన అరుణపతాకం ఎగురవేస్తారని.

వీరిలో ఎవరు 'నలభై ఒకటో లక్ష్యాన్ని' ఛేధించి శత్రువు వెన్నులో వణుకుపుట్టిస్తారో సమయమే చెప్పాలి. దళాల్లో అధిక సంఖ్యలో కనిపిస్తున్న స్త్రీలు, ఆకాశంలో సగం కొరకు జరుగుతున్న పోరాటం పెద్ద మలుపే తీసుకున్నదని మాత్రం రుజువుచేస్తున్నారు.



***

సాయంకాలానికి క్యాంపులో ఒక విభిన్న వాతావరణం కనిపించింది ఏమిటి సంగతని బసంతిని అడిగాను అపుడప్పుడు తాము సినిమాలు చూస్తామని ఇవ్వాళ క్యాంపులో సినిమా వేస్తున్నారని చెప్పింది తను.

ఒక జెనరేటర్ తెచ్చారు. ఒక టెంటు వేసి దానిలో ఒక కంప్యూటర్ పెట్టారు. ఆ రాత్రి రెండు సినిమాలు చూపించారు. ఒకటి చార్లీ చాప్లిన్ 'ద గ్రేట్ డిక్టేటర్', ఇంకొకటి 'మిర్చి మసాలా' అనే హిందీ సినిమా. మరునాటి రాత్రి లిబియా విప్లవంపై తీసిన 'ఒమర్ ముఖ్తార్' ఇంకా 'స్పార్టకస్' చూపించారు. ఆ గిరిజన యువతీయువకులకు ఈ సినిమాలు అర్థం అవుతాయో లేదో నాకు అనుమానమే. ఆ సినిమాలు చూపిస్తున్నపుడు మాత్రం మధ్యలో ఆపి గోండీ భాషలో కథను వివరించారు. ప్రదర్శన ముగిశాక సినిమా అర్థమయ్యిందా అని చాలామందిని అడిగాను. కొంచెం అర్థమయ్యింది అని జవాబొచ్చింది.

మరుసటి రోజు మధ్యాహ్నం.

దస్రు నేను ఇంకొక గిరిజన యువకుడు కలిసి ఉసిరికాయలు ఏరుకురావడానికి అడవిలోకి వెళ్లాం. గోండీలో ఉసిరిని నెల్లి అని అంటారు. ఒకప్పుడు బస్తర్ అడవుల్లో ఉసిరి చెట్లు విస్తారంగా ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్య బాగా తగ్గిపోయింది. అడవి తల్లి ఇచ్చిన అద్భుత వరమైన ఉసిరికాయ కొరకు మేము చాలా దూరం వెతుకుతూ వెళ్లాం. దారిలో స్థానికంగా దొరికే ఇక్ పండి అనే పండ్లు సేకరించాం దస్రు అతనితో పాటు వచ్చిన యువకుడూ కలిసి ఎంద్రకాయలు ఆల్చిప్పలను ఏరుకొచ్చారు కాసేపటికి మాకు నిండా కాయలతో ఉన్న మూడు నాలుగు ఉసిరి చెట్లు కనపడ్డాయి లిప్తపాటులో దస్రు ఆ చెట్టు మీదున్నాడు పక్షుల గూళ్ల నుండి గుడ్లు పట్టుకొచ్చే అలవాటున్న దస్రుకు చెట్లు ఎక్కడం వెన్నతో పెట్టిన విద్య. కోతిలా ఒక కొమ్మనుండి మరో కొమ్మకు దుంకడం అంటే అతనికి భలే సరదా.

ఒక్కో కొమ్మను పట్టుకుని అతను ఊపుతుంటే పైనుండి ఉసిరికాయల వర్షమే కురిసింది సంచుల నిండా కాయలతో మేము క్యాంపుకు తిరిగి వచ్చాం సాయంత్రానికి ఉసిరికాయ పచ్చడి తయారయ్యింది కానీ దాన్ని నోట్లో పెట్టుకోగానే చాలా మంది ఊసేశారు.

'వగరుగా, పుల్లగా ఉందిది. మేము దీన్ని ఎప్పుడూ తినం. ఇది కూరకు కూడా పనికిరాదు.' దాన్ని ఉమ్మేస్తూ అన్నాడు దస్రు.

'పట్నాల్లో ఉండేవాళ్లు ఇటువంటివి ఎందుకు కొంటారు అసలు ఇది తినే పదార్ధమేనా?'

'వాళ్లెందుకు కొంటారో నాకు తెలియదు కానీ దాని రుచి ఒకసారి తింటేనే తెలుస్తుందట. వాళ్ళు దానినుండి నిలవపచ్చడి , మురబ్బా, ఔషధాలు తయారుచేస్తారు. మీరు పనికిరానివని పారేసే వాటినే పట్నపోల్లు ఉపయోగిస్తారు.'

తాము అడవిలో సేకరించి వారాంతపు సంతల్లో అమ్మే వస్తువులు అసలేమవుతాయో తెలుసుకోవాలనే కుతూహలం గిరిజనుల్లో కనిపించింది. తాము తెచ్చినవి షావుకారుకి ఇచ్చి బదులుగా బియ్యం, ఉప్పు, మిరపకాయలు తీసుకుని

సంతృప్తి పడతారు ఈ గిరిజనులు. అడవిలోని సహజ సంపదలో తాము నేరుగా తినగలిగేవి ఉపయోగించే వాటిపైనే వారికి ఆసక్తి. మిగతావన్ని వారి దృష్టిలో నిష్ప్రయోజనమే. ఉసిరికాయతో పోలిస్తే కూర చేసుకోవడానికి ఉపయోగపడే లేత వెదురుగడలు సేకరించడమే వారికి ఇష్టం. వారి జీవితంలో అధికభాగం ప్రాథమిక అవసరమైన క్షుద్బాధను తీర్చుకోవడానికే సరిపోతుంది.

అడవిలో ఎన్నో విలువైన వనమూలికలు దొరికినా వాటిని ఉప్పు మిరపకాయలకు బదులుగా ఇచ్చేస్తారీ గిరిపుత్రులు. ఆ ఔషధమూలికల అసలు విలువ ఏమిటో డాబర్, జందు వంటి కంపెనీలకే ఎరుక.

అనేక అరుదైన వరి రకాలకు ప్రసిద్ధి చెందిన బస్తర్‌లో ఆకలే ప్రధాన సమస్య అవడం విషాదం.

క్యాంపులో ఉన్న వారిలో కేవలం ఇద్దరే ఉసిరికాయ పచ్చడిని తిన్నారు. అందులో ఒకరు బెంగాలీ మహిళా కామ్రేడ్ కాగా మరొకరు కన్నన్న. రుచి పెద్దగా నచ్చకపోయినా ఆరోగ్యానికి మంచిదనే ఉసిరికాయను తిన్నానని కన్నన్న చెప్పాడు. 137

ఉసిరికాయలను ఎలా ఉపయోగించాలో ఆ బెంగాలీ కామ్రేడ్ కు తెలుసు కానీ ఆమెకు అంత సమయం కానీ అందుకు కావలసిన వనరులు కానీ లేవు ఈ గిరిజనులు మందుపాతరలు తయారు చేసే బదులు ఉసిరికాయ పచ్చళ్లు మురబ్బాలు, ఔషధాలూ కూడా తయారుచేయొచ్చు. కాని ఇప్పటికయితే అది చాలా ఖరీదైన వ్యవహారం ఆ బెంగాలీ కామ్రేడ్ దృష్టిలో పచ్చళ్లు మురబ్బాల తయారీలో శిక్షణ కన్నా యుద్ధానికి శిక్షణనివ్వడమే ఇప్పుడు ప్రాధాన్యత. తను తలుచుకుంటే ఒక అయిదేళ్లలో ఉసిరి ఉత్పత్తుల పరిశ్రమనొకదాన్ని నెలకొల్పి చక్కని వ్యాపారం చేసేది. దాని ద్వారా ప్రజలకు సంతోషాన్ని పంచేది. కానీ ప్రస్తుతానికి ఆమెకు ప్రజలకు దుస్తులు, గెరిల్లాలకు యూనిఫారాలు, బూట్లు తయారుచేసేందుకు కుట్టుమిషన్లు కావాలి.

డెబ్బైయవ దశకంలో ఆమె తల్లితండ్రులు ఢాకా నుండి వలస వచ్చారట అప్పటికామె వయసు కేవలం రెండేళ్లు. ఆమె ఇంట్లో బెంగాలీ మాట్లాడితే

బయట మాత్రం ఒరియా మాట్లాడేవారు. స్కూల్లో హిందీ నేర్చుకున్న ఈ కామ్రేడ్ దండకారణ్యం వచ్చాక దుర్లా, కోయా, తెలుగు భాషలు నేర్చుకున్నది తస్లీమా నస్రీన్ రచనలు హిందీ, బంగ్లా రెండు భాషల్లో చదివింది తను వివిధ ప్రాంతాల్లో మైనారిటీల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసామెకు ఆమె తల్లితండ్రులు ఢాకా వదిలి పారిపోయి వచ్చింది కూడా ఈ సమస్యవల్లనే. ఇక్కడికొచ్చాక ముస్లిములపై విద్వేషం వెళ్లగక్కుతూ ఉమాభారతి వంటి వారు ఇచ్చే ప్రసంగాలు చూశాక ఆమెకు జీవితం పట్ల ఒక దృక్పథం ఏర్పడింది. తానెక్కడికి వెళ్లినా అక్కడ మైనారిటీల్లో భాగమేనని ఆమె భావన. ఢాకాలో, హిందూగా, ఒరిస్సాలో బంగ్లా శరణార్థిగా, ఇప్పుడు హిందూ మతోన్మాదుల పరిపాలనలో కమ్యూనిస్టుగా ఉండటం ద్వారా మరోసారి మైనారిటీల్లో భాగమయ్యానని ఆమె అనుకుంటుంది. ప్రధాన స్రవంతికి ఆమె ఎప్పుడూ వ్యతిరేకమే.

తెలుగులో అందరూ సుష్మక్క అని పిలుచుకునే ఈ సుష్మ బాధ్యత దళంలోని మహిళా కామ్రేడ్లకు రోజూ బెల్లం, గుడ్లు, వేరుశనగ గింజలు
138
ఇంకా ఐరన్ టాబ్లెట్లు ఇవ్వడం ఎవరైనా గెరిల్లా సరిగా భోజనం చేయకపోతే వెంటనే వారివద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి ఆరా తీసేది తను. తనవద్ద ఎప్పుడూ ఒక మెడికల్ కిట్ ఉండేది. అందులో మందులను సమీపంలోని టౌన్ నుండి తెప్పించుకునేది. ఏ మందు ఎంత మోతాదులో ఇవ్వాలో ఆమెకు బాగా తెలుసు. ఏ మందుపాతరలో ఎన్ని జెలాటిన్ స్టిక్స్ పెట్టాలో కూడా అంతే బాగా తెలుసామెకు. శస్త్ర చికిత్స చేసే కత్తీ, యుద్ధం చేసే ఖడ్గం, రెండూ పట్టుకోవడం వచ్చు సుష్మక్కకు. కత్తీ, ఖడ్గం రెండిటినీ ఒకరే చేబూనడం అదీ ఒక మహిళ ఆ పని చేయడం, కొంతమందికి వింతగా కనిపించొచ్చు.

యుద్ధం చేయాలంటే ఆరోగ్యంగా ఉండాలని ఆమెకు బాగా తెలుసు అందుకే ఆమె భుజాలపై మెడికల్ కిట్ భారాన్ని కూడా ఎత్తుకుంది. అందరినీ ఆరోగ్యం బాగా చూసుకోవాలని జాగ్రత్తలు చెప్పే సుష్మక్క మాత్రం అప్పుడప్పుడూ దగ్గుతో బాధపడేది.

***

మరునాడు మాతో ఉన్న గెరిల్లాలను రెండు బృందాలుగా చేశారు అందులో ఒకటి తూర్పు వైపుకు వెళ్లగా మేము దక్షిణం వైపుకు ప్రయాణం మొదలు పెట్టాం. రోజంతా ప్రయాణించి సాయంత్రానికి ఒక పర్వతశ్రేణి వద్దకు చేరుకున్నాం. ఒక గంట విశ్రాంతి తీసుకున్నాక మా బృందం మళ్లీ రెండుగా చీలింది. ఒక గెరిల్లా దళం పడమటి దిక్కుకు వెళ్లింది. మేము మా దారిలో నడవసాగాం. అర్ధరాత్రి అయ్యాక ఒక ఎత్తైన పర్వతపు అడుగు భాగాన విశ్రమించి మరునాడు ఉదయం మళ్లీ నడక కొనసాగించాం. ఆ కొండ ఎక్కడానికి మాకు దాదాపు నాలుగు గంటలు పట్టింది. యువకులు ఆగకుండా పైదాకా ఎక్కితే కొందరం మాత్రం అప్పుడప్పుడూ ఆగి అలసట తీరాక మళ్లీ ఎక్కాం

రాళ్లు రప్పలతో నిండిన ఆ మార్గంలో మేము చెట్టుకొమ్మలు బండరాళ్ల ఆసరాతో నడిచాం. కాలు ఏమాత్రం తడబడ్డా వందల అడుగుల లోతున ఉన్న లోయలోకి పడిపోవడం ఖాయం. మా నాలుగు గంటల ప్రయాణంలో ఇద్దరు గిరిజన యువతులు తప్ప వేరేవరూ ఎదురుపడలేదు. ఒకప్పుడు ఇక్కడ పోలీస్ ఔట్ పోస్ట్ ఉండేదట. ఇప్పుడు అన్నలు దాన్ని ఇక్కడినుండి లేపేశారు.

కొండపైకి చేరుకున్నాక కాసిన్ని వేరుశనగ గింజలు, కొంచెం బెల్లం తిని కాస్త సేదతీరాం. తరువాతి ప్రయాణం కొంచెం తేలికగానే అనిపించింది.

దారంతా కొండలపైనుండి జాలువారుతున్న జలపాతాలు కనిపించాయి ఇంకొన్ని రోజులయితే ఇవన్నీ ఎండిపోతాయట. అప్పుడు అడవిలో ఉన్న కొద్దిపాటి నీటి వనరులనీ జంతువులతో పంచుకుంటారు ఇక్కడి మనుషులు. సాధారణంగా ఇలాంటి ప్రదేశాల్లో వేటాడటం ఎక్కువ ఉంటుంది. కానీ విప్లవోద్యమం ఇక్కడ వేటని నిషేధించింది.

ఒక జలపాతం వద్ద ఆగి స్నానాలు చేశాం. ఆ పూటకు అక్కడే ఉన్నాం. నాతో ఉన్న కొత్త గెరిల్లా బృందంలో సింగన్న అనే యువకుడు నాకు దుబాసీలా వ్యవహరించాడు. వాక్యాలను సాగదీయకుండా, అలాగని వాటిని మరీ కత్తిరించకుండా చాలా బాగా అనువాదం చేసేవాడు సింగన్న. అతను చక్కటి హిందీలో మాట్లాడేవాడు ఏడో తరగతి దాకా చదివిన ఈ 21 ఏళ్ల చురుకైన

యువకుడు చాలా తక్కువ వయసులోనే అన్నగా ఎదిగాడు. దళంలో కొందరు అతన్ని సింగన్న అంటే ఇంకొందరు సింగ దాదా అని పిలుస్తారు.

మరునాడు ఉదయం అక్కడినుండి మళ్ళీ ప్రయాణం మొదలుపెట్టాం. కొండ దిగి వెళ్తుంటే దారిలో చేపలు పడుతున్న కొంతమంది యువకులు కనిపించారు. అందులో ఒక్కరు మాత్రం మాతో పాటు వచ్చాడు. ఇంకో గంట నడిచాక ఒక గూడెం చేరుకున్నాం. అక్కడ నాకు దస్రు, కన్నన్న కనిపించారు. ఇద్దరూ లాగు, తువ్వాల చుట్టుకుని అచ్చమైన గిరిజనుల్లా ఉన్నారు.

తామొక పనిమీద ముందే ఇక్కడికి చేరుకున్నాం. అని దస్రు చెప్పాడు నాకు. ఆ రాత్రి వారు వచ్చిన పనేమిటో అర్థం అయ్యింది నాకు.

తాళ్లతో కట్టేసిన ఒక యువకుడిని ప్రజా కోర్టుకు తీసుకువచ్చారు.

ఆరోజు సాయంత్రానికి మరో నలుగు గెరిల్లాలతో కలిసి రాజేశ్ కూడా చేరుకున్నాడు అక్కడికి



ఏం జరిగింది సింగన్నా అడిగాను నేను

'ఈ యువకుడు ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చాడు దళంలో చేరడానికి వచ్చానని చెబుతున్నాడు. కానీ మావాళ్లకు ఇతను పోలీస్ ఇన్‌ఫార్మర్ అని అనుమానం. అది తేల్చడానికే ఈ ప్రజాకోర్టు.'

మూడు రోజులు పట్టింది అతని నుండి నిజం రాబట్టడానికి. రాజేశ్ అతడిని అనేక ప్రశ్నలు అడిగాడు. కానీ అతనిచ్చిన జవాబులు మాత్రం సంతృప్తికరంగా లేవు. ఆ యువకుడికి హిందీ గానీ గోండీగానీ రావు. కేవలం తెలుగులోనే మాట్లాడుతున్నాడు. విప్లవోద్యమంలో చేరడానికి వచ్చాననే చెబుతున్నాడు. భగత్ సింగ్ ఆలోచన నుండి ప్రేరణ పొందానని, అందుకే ఇల్లువదిలి వచ్చానని చెప్పుకొచ్చాడు.

ఆ రాత్రి ఆ యువకుడి విషయం తేల్చడానికి రాజేశ్ ఇంకొందరితో కలిసి సమావేశమయ్యాడు. తన తల్లితండ్రుల పేర్లు, ఊరి పేరు, తన బంధువైన ఒక ప్రొఫెసర్ ఫోన్ నెంబరు ఇచ్చాడట ఆ యువకుడు. పొద్దున విచారణ సమయంలో భగత్ సింగ్ గురించి అడిగిన అనేక ప్రశ్నలకు సరైన సమాధానాలు

ఇవ్వలేదతను. పేరుకు భగత్ సింగ్ రచనలన్నీ చదివానని చెప్పుకున్నాడు కానీ అతడికి భగత్ సింగ్ పేరు తప్ప ఇంకేమీ తెలియదని తేలింది

రెండు గంటలు అతడిని విచారించిన తరువాత మరొకసారి తన బృందంతో సమావేశమయ్యాడు రాజేశ్. ఆ యువకుడు పోలీస్ ఇన్‌ఫార్మర్ అనే అనుమానం నిజమవుతున్నట్టుంది. అతను నిజంగానే పోలీస్ ఇన్‌ఫార్మరే కనుక అయితే అతని పని ఖతం. కానీ ఒక అభిప్రాయానికి వచ్చేముందు అతను ఇచ్చిన ఫోన్ నెంబరులో విచారిద్దాం అని నిర్ణయించారు. అందుకొరకు అతని ఫోన్ నెంబర్, అడ్రస్ ఇచ్చి విషయం కనుక్కురమ్మని ఒక బృందాన్ని పంపారు. మూడు రోజుల తరువాత ఆ బృందం తిరిగొచ్చింది. అప్పటివరకూ అతడిని బంధించే ఉంచారు.

ఇంట్లో ఏదో గొడవపడి దళంలో చేరుతానని బయల్దేరాడట ఆ యువకుడు. అదృష్టవశాత్తూ గిరిజనుల చేతికిచిక్కితే వాళ్లు దళానికి అప్పజెప్పారు. ఏ నరబలిని నమ్మే గిరిజనులకో చిక్కి ఉంటే అన్యాయంగా మరణించేవాడు. 141

ఉద్యమం విస్తరించిన ప్రాంతాల్లో నరబలి వంటివి దాదాపుగా కనుమరుగు అయ్యాయి. అయినా ఇప్పటికీ ఇలాంటి ఒంటరి యువకుడు పోలీసులకు దొరికితే నక్సలైటని ఎన్‌కౌంటర్ చేసేస్తారు. ఇలాంటి వ్యక్తి ప్రజలకు దొరికితే పోలీస్ ఇన్‌ఫార్మర్ అని కూడా చంపేయొచ్చు. అందుకే మొదట ఒంటరిగా దండకారణ్యం వెళదామనుకున్న నేను, తరువాత ఆ ఆలోచన విరమించుకున్నాను.

అన్ని మార్గాల నుండీ వచ్చిన సమాచారం విశ్లేషించాక ఆ యువకుడిని వాళ్ల తల్లితండ్రులకు అప్పగించాలని నిర్ణయించారు. ఉద్యమంపై ఆసక్తి ఉంటే అతని ప్రాంతంలో పనిచేస్తున్న ప్రజాసంఘాలతో కలిసి పనిచేయాలని అతడికి సలహా ఇచ్చారు. క్షణికావేశంతో ఇల్లువదిలి వచ్చే వారిని సాధారణంగా ఉద్యమంలోకి తీసుకోరు. కొన్ని బూర్జువా పత్రికలు మావోయిస్టులు నిరక్ష్యరాస్యులను చేర్చుకుంటున్నారని, డబ్బు ఆశ చూపి మనుషులను చేర్చుకుంటున్నారని రాయడం నేను చూశాను. నిజమే! కొందరు గెరిల్లాలు

సినిమా తారలు, క్రికెటర్ల పేర్లు తెలియని నిరక్ష్యరాస్యులు అయి ఉండొచ్చు. అందులో కొందరు ఏ ఉద్యోగము లేక రెండు పూటలా తిండి దొరకని వారూ కావచ్చు. కానీ డబ్బు కొరకు వచ్చే వారిని ఎప్పుడూ దళంలో చేర్చుకోరు. ప్రజా వ్యతిరేకులకు, రివిజనిస్టులకు, వృత్తి ఉద్యమకారులకు దళంలో ఎప్పుడూ స్థానం లేదు.

నెలకు ఓ అరబిళ్ల వంటి సబ్బు, మరో అరబిళ్ల బట్టల సబ్బు ఒక యూనిఫారం, అర్ధాకలి జీవితం. ఇదే ఉద్యమంలో చేరితే వచ్చే ప్రతిఫలం. దీనికి వారు అడిగే అర్హత, ప్రజల కొరకు ప్రాణాలు తృణప్రాయంగా అర్పించగలగడం. చదువురాని వాళ్లకు అక్షరాలు, నోటు బుక్కులు. చదువుకున్నవాళ్లకు పుస్తకాలు. చదువుకోనివాళ్లకు జ్ఞానం. నిరుద్యోగులకు ప్రపంచాన్ని మార్చే పని. ఉన్నత విలువలు కలిగిన వాళ్లకు ప్రజా సేవ చేసే అవకాశం. ఇవే ఇక్కడికి వచ్చినవారికి లభించేవి.



గెరిల్లాలను కలవడానికి కిలోమీటర్లు నడిచివచ్చిన ఆ యువకుడు తనలో మండుతున్న అగ్నికి ఒక దారి చూపించడానికి ప్రయత్నించాడు. ఇక్కడికి వచ్చిన వాళ్లలో అతను మొదటివాడు కాదు. చివరివాడూ కాబోడు.

***

ఆరోజు రాత్రి మేము లోయలోకి తిరిగివెళ్లాం పర్వతానికి అటువైపు మమ్మల్ని వదిలివెళ్లిన ఏడుగురు సభ్యుల గెరిల్లా బృందం మమ్మల్ని తిరిగి కలిసింది. ఇక్కడ అడవి చాలా దట్టంగా విశాలంగా ఉంది. చెట్లకొమ్మలు ఆకాశానికి తాకుతాయా అన్నట్టు ఉన్నాయి. చలివల్ల చాలామందికి గొంతునొప్పి పట్టుకుంది. ఉదయంపూట మంచుబిందువుల నుండి తమను తాము రక్షించుకోవడానికి అందరినీ కొంచెం దట్టంగా ఉన్న చెట్లకింద పడుకోమని చెప్పారు. ఉదయాన్నే అందరూ గోరువెచ్చని నీటితో పుక్కిలిస్తూ కనపడ్డారు ఏ సమయంలో చూసిన మొత్తం దళంలో మూడోవంతు మంది ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధపడుతూ కనిపిస్తారు. ప్రతిరోజూ కనీసం ఇద్దరి ముగ్గురి

కిట్ బ్యాగులైనా వేరేవాళ్లు మోయాల్సివస్తుంది. పగలంతా చెమటతో తడిసిపోయిన గెరిల్లాలు రాత్రి మంచుబిందువుల్లో తడిసి వణికిపోవాల్సి వస్తుంది. చలిమంట వేసుకునే సౌలభ్యం రోజూ ఉండదు కదా. కాస్త బలిష్ఠంగా ఉన్నవాళ్లు జలుబు బారినుండి తప్పించుకున్నా వారిలో కొందరు చర్మ వ్యాధుల బారినపడ్డారు. కాటన్ యూనిఫారం వేసుకున్నవారి పరిస్థితి సింథటిక్ యూనిఫారం వేసుకున్నవాళ్లతో పోలిస్తే మెరుగ్గా ఉంది. కానీ సింథటిక్ యూనిఫారాలు తొందరగా ఆరిపోతాయి కనుక చాలామంది వాటినే ఇష్టపడుతున్నారు. ప్రతి గెరిల్లాకు ఒకటే జత యూనిఫారం ఉంటుంది కనుక దాన్నే ఉతికి ఆరాక మళ్ళీ వేసుకోవాలి. సమయం లేనప్పుడు తడిగా ఉన్న యూనిఫారమే ధరిస్తారు. చెమట, తడి కలగలసి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. ఒక గెరిల్లా అయితే ఆరు నెలల నుండి ఏదో చర్మరోగానికి ఆయింట్మెంట్ వాడుతూ కనిపించాడు నాకు.

సామాన్య పౌరుల జీవితాల్లోలాగే గెరిల్లా జీవితంలోనూ రోగాలు ఒక విడదీయరాని భాగం. నగరాల్లో లెఖ్ఖలేనన్ని ఆసుపత్రులు, డాక్టర్లూ ఉన్నా వైద్యం పౌరులకు అందని మావిపండే. నగరాల్లోని మురికివాడల్లో ఉండే రోగాలూ, రొష్టులూ అడవిలో లేకపోయినా మొత్తమ్మీద చూస్తే ఇరుచోట్లా పరిస్థితుల్లో పెద్దగా తేడాలేదు. అక్కడైనా, ఇక్కడైనా పేదరికమే వైద్యునికి రోగికి మధ్య అడ్డుగోడలా నిలుస్తుంది.



బస్తర్‌లో గెరిల్లా పోరాటయోధుడే కాదు అతనొక వైద్యుడు కూడా కన్నన్న ఒక డజన్, బసంతి ఒక పది ఆరోగ్య సమస్యలను, అవి చిన్నవైనా సరే నయం చేయగలరు. ఇక్కడి ప్రజలు గెరిల్లాలతో సన్నిహితంగా ఉండటానికి ఒక ప్రధాన కారణం వారికి లభించే వైద్యసదుపాయాలే. ప్రభుత్వ అణచివేత, దోపిడీకి వ్యతిరేక పోరాటం తరువాత ఉద్యమం ఎజెండాలో రెండో స్థానంలో ఉన్నది వైద్య సహాయమే.

***

ఆ రాత్రి నాకు దేవనాగరి లిపిలో ప్రచురించే గోండీ రాజకీయ పత్రిక 'వియుక్క' చదవమని ఇచ్చారు. అది చదివే సరికి నా తల ప్రాణం తోకకు వచ్చింది. చదవనైతే చదువుతున్నాకానీ ముక్క కూడా అర్థం కాలేదు నాకు. అలా అర్థం కానిదాన్ని చదవడం ఎక్కువసేపు చేయలేకపోయాను. గోండీ, హిందీ రెండు భాషల్లో ప్రావీణ్యం ఉన్న జయ నేను ఆ పత్రికను చదవడం చూసి ఇన్నాళ్లకు సరైన ఉచ్ఛారణతో చదివారొకరు అని సంతోషపడింది.

'మేము ఎన్నో రోజుల నుండి చేస్తున్న పనులన్నీ నువ్వు రెండు గంటల్లో చదివేశావు. ఇక నీకు గోండీ వచ్చేసినట్టే' అంది జయ.

'లేదు లేదు. ఒక కంప్యూటర్‌లా, టేప్ రికార్డర్‌లా అందులో ఉన్నదాన్ని చదివాను కానీ నాకు అర్థం అయ్యిందేమీ లేదు'

***

మరునాడు.



'నీకు తొందరగానే గోండీ వస్తుంది' అంది జయ

'ముందు నేను కూడా అట్లాగే అనుకున్నా. కానీ నిన్న జరిగిన ప్రహసనం చూశాక నా ధైర్యం సడలింది.' అన్నాను

పెద్దగా మాట్లాడకుండా ఉండే జయ మనసులో ఏదీ దాచుకోకుండా మాట్లాడుతుందని గమనించాను నేను.

'నీక్కొంచెం సమయం ఉంటే కాసేపు మాట్లాడాలి'

'ఇంటర్వ్యూనా?'

'అహ. ఇంటర్వ్యూ కాదు. ఇంటర్వ్యూ అంటే అదొక తంతులా ఉంటుంది. అయినా నేనిక్కడికి ఇంటర్వ్యూలు చేయడానికి రాలేదు. మామూలుగా మనం బయటికి చెప్పని సంగతులను తెలుసుకోవడానికి వచ్చాను. ఇంటర్వ్యూల్లో ఒకేరకం మాటలు చెబుతారందరూ. 'నాకు ప్రజలంటే ఇష్టం, నేను యుద్ధం చేయాలనుకుంటున్నాను, నేను నన్ను నేను అర్పించుకోవాలనుకుంటున్నను' అవే రొడ్డకొట్టుడు సమాధానాలు. నాకు నేరుగా

హృదయం నుండి వచ్చే విభిన్నమైన జవాబులు కావాలి'.

'మధ్యాహ్నం కూర్చుందాం'

'సరే!'

మధ్యాహ్నం జయ వచ్చి నేను పరచుకున్న ప్లాస్టిక్ షీట్ పైన కూర్చుంది. తన షాట్‌గన్‌ను ఒడిలో పెట్టుకుని నేనడిగే ప్రశ్నల కొరకు నావైపు చూసింది.

'నీకా కరీంనగర్ అమ్మాయిల గురించి తెలుసా'

'తెలియదు'

'అసలా సంఘటన గురించి తెలుసా?'

'పెద్దగా తెలీయదు. పోలీసులు వారిని పట్టుకుని, చిత్రహింసలు పెట్టి కాల్చేశారని మాత్రం తెలుసు'

'మీకు ఆ సంఘటన గురించి చెప్పలేదా?'

'ఇంతే చెప్పారు'

'ఒక వేళ నువ్వు ఏడుగురిలో ఒకరివై ఉంటే ఏమై ఉండేది?' 

ఆ ప్రశ్న విని ఒకసారి నావైపు చూసింది. ఏ భావమూ లేని చూపులవి. బహుశా నా ప్రశ్న అర్థం అయి ఉండదు. లేదా అది అర్థం లేని ప్రశ్న అనుకుని ఉంటుంది. అందుకే కామోసు అలా చూసింది నావైపు.

నేను ప్రశ్నను రెట్టించాను.

'నాకా ప్రశ్నకు జవాబు ఏంచెప్పాలో తెలియదు' అంది

నేను టాపిక్ మార్చాను

'నిన్న ఓ పాత యుగళగీతం పాడుతూ కనిపించావు?'

'నాకిష్టం అలాంటి పాటలు'

'ఇప్పుడు కూడానా'

'ఇక్కడున్నంత మాత్రాన మనసులో భావోద్వేగాలు చచ్చిపోవు కదా' అంది చిరునవ్వుతో.

'నీ కుటుంబం గురించి మాట్లాడుకుందాం. ఎవరెవరు ఉంటారు మీ ఇంట్లో?'

'అమ్మ', ఈ మాట అని దూరంగా ఉన్న చెట్లవైపు చూస్తూ ఉండిపోయింది.

'మరి నాన్న?'

ఆమె బదులివ్వలేదు. ఆమె పెదాలు అదరసాగాయి. చేతులు కూడా వణికాయి. చాలా నిముషాల సేపు ఆమె అలాగే ఉండటంతో ఆమె దృష్టిని మళ్లించడానికి ప్రయతించాను.

'బహుశా అడగగూడని ప్రశ్న అడిగినట్టున్నాను. పాత గాయాలను కెలకదలుచుకోలేదు నేను. ఆ ప్రశ్నను వదిలెయ్'

'లేదు. నువ్వా ప్రశ్న అడగడం తప్పేమీ కాదు'. ఇంకా ఆమె పెదాలు అదరడం, చేతులు వణకడం ఆగలేదు. ఆ వణుకు ఆపడానికన్నట్టు ఆమె వడిలోని షాట్‌గన్ ను గట్టిగా పట్టుకుంది. ఇప్పుడామె చేతి నరాలకు పాకిందా వణుకు.

'నాకు నాన్నంటే ద్వేషం!' మొదలుపెట్టింది తను. 'నాకు పితృస్వామ్యం అంటే ద్వేషం. నేను దండకారణ్యంలోకి వచ్చానంటే దానికి కారణం పితృస్వామ్యం పట్ల నాకున్న ద్వేషమే. అమ్మ చాలా అనుభవించింది ఆ క్రూరత్వాన్ని. నేను, మా వదిన కూడా చాలా బాధలుపడ్డాం. అది ఉన్నంత కాలం నేను దాన్ని ఎదిరిస్తాను'.

146

మాట్లాడుతున్నంత సేపూ ఆమెలో వణుకు తగ్గలేదు. ఆ జవాబు వెనుక ఎంత వేదన ఉన్నదో పాపం. అక్కడ వాతావరణం చాలా భారంగా మారింది. ఆమె నా ప్రశ్నలన్నిటికీ జవాబు చెప్పినా నేను మళ్లీ నా మొదటి ప్రశ్నను కొంచెం తిప్పి అడిగాను.

'ఒక్క చివరి ప్రశ్న. అసలైతే ఇది నా మొదటి ప్రశ్ననే' తను కళ్లతోనే ఏమిటన్నట్టు చూసింది.

'ఒకవేళ నువ్వే కనుక ఆ ఏడుగురు కరీంనగర్ అమ్మాయిల్లో ఒకదానివైతే నీ సహచర కామ్రేడ్లు నిన్నెలా గుర్తుపెట్టుకోవాలనుకుంటావు?' ఆమె చేతిలోని షాట్‌గన్‌ను నేలపై పెట్టి ఒక నోట్ బుక్, పెన్సిల్ తీసుకోవడానికి ముందుకు వంగింది.

ఆ నోట్‌బుక్‌లో తెలుగులో కొన్ని వాక్యాలు రాసింది. అవి నాకు హిందీలో వివరించడానికి ప్రయత్నించింది. ఆమె మాటలకర్థం ఇదీ.

*'పితృస్వామ్యాన్ని అంతం చేయాలని స్వప్నించిన ఒక అమ్మాయి ఇక్కడ శాశ్వతంగా నిద్రిస్తోంది. కేవలం విప్లవోద్యమం మాత్రమే పితృస్వామ్యాన్ని అంతం చేయగలదన్న నమ్మకంతోనే ఆమె ఉద్యమంలో చేరింది'*

ఇక అడగడానికి ఏమీ మిగలలేదు నాకు. ఆమె కూడా మౌనంగా కూర్చుంది. కొన్ని నిముషాల తరువాత తన షాట్‌గన్ తీసుకుని వీడ్కోలు పలికి తన సెంట్రీ పోస్ట్ వైపుకు నడిచింది.

కరీంనగర్ నుండి వచ్చిన ప్రతి మహిళా మగవాడి అధిపత్యంలో ఉన్న ఈ వ్యవస్థ చేతిలో బాధితురాలే. అయితే అందరూ జయ వ్యక్తీకరించినట్లు ఆ బాధను వ్యక్తీకరించలేకపోతుండవచ్చు. మన సమాజంలో స్త్రీలపై పురుషుల క్రూరత్వం, వర్గ అణచివేతకన్నా దారుణమైనది.

అప్పుడే కన్నన్న నావైపు రావడం గమనించాను. చేతితో ఒక చుట్టను చుడుతూ, 'జయక్క కోపంగా వెళ్తూ కనిపించింది. ఎవరైనా కోపంతో వణికిపోతున్నారంటే కొంచెం ఆలోచించాల్సిందే. దిగులేం లేదు. మనకు పార్టీ ఉంది అని ఆమెకు చెప్పాలి అన్నాడు'.

'మీ జయక్క ఎప్పుడైనా ఇంటికి వెళ్తుందా కన్నన్నా?'

'అపుడప్పుడూ వెళ్తుంది. వాళ్ల అమ్మనూ, వదిననూ కలుస్తుంది. జయక్క కవిత్వం కూడా రాస్తుంది. తనెప్పుడూ వంటరిగానే కూర్చుంటుంది. చాలా తక్కువ మాట్లాడుతుంది, మితంగా తింటుంది. అందరికన్నా చివరికి నిద్రపోయి, అందరికన్నా ముందే నిద్రలేస్తుంది.'

★★★

మరునాడు మేము అక్కడి నుండి బయలుదేరడానికి సిద్ధమయ్యాం. మా బృందాన్ని మళ్ళీ రెండుగా విభజించారు. అందులో అయిదుగురు సభ్యులున్న ఒక బృందం వేరే దారిలో వెళ్లింది. మిగతా వారిమి ఒక రెండు

గంటలు ప్రయాణించాక మాలో నుండి మరో ముగ్గురు విడిపోయి మరో వైపుకు వెళ్లిపోయారు. దళాల్లోని గెరిల్లాలు ఒకరినొకరు కలిసే విధానమూ, తిరిగి విడిపోయే విధానమూ నన్ను చాలా ఆశ్చర్య పరిచాయి. బస్తర్ ప్రాంతంలో పనిచేస్తున్న వివిధ గెరిల్లా బృందాలు ఒకదానితో మరొకటి ఇలాగే సమన్వయం చేసుకుంటాయని నాకు రాజేశ్ వివరించాడు. ఇక్కడ గుర్రాలు, వైర్ లెస్ సెట్లు, వాహనాలు లేవు. ఈ చిన్న చిన్న బృందాలే దళాలకు సమాచార వాహికలుగా పనిచేస్తాయి. గెరిల్లా దళాలు ప్రతిరోజు తాముండే తావు మార్చినా ఈ మానవ సమాచార వాహికల సాయంతో నిరంతరం ఒకరితో ఒకరు సంపర్కంతో ఉంటారు.

'ఈ విధానంలో మీరు సమాచారాన్నైతే పంపుకోవచ్చు కానీ అదనపు బలగాలని పంపలేరు కదా?'

'ఇంకా అంత అభివృద్ధి చెందలేదు మేము. కానీ అవసరమైనప్పుడు ఇతర సమాచార, రవాణా సాధనాలు కూడా ఉపయోగిస్తాము.'



మరునాడు ఉదయం ఇంకో ఇద్దరు కామ్రేడ్లు మమ్మల్ని వీడిపోయారు. 'వీళ్లు కూడా ఏదైనా సమాచారం అందజేయడానికి వెళ్తున్నారా' అని అడిగాను.

వాళ్లు ఇంటికి వెళ్తున్నారని జవాబు వచ్చింది.

'ఎన్ని రోజుల కొరకు వెళ్తున్నారు?'

'వారేమీ సెలవుపై వెళ్లడం లేదు. శాశ్వతంగా వెళ్లిపోతున్నారు'

'ఎందుకు వెళ్తున్నారు?'

'వాళ్లు అలసిపోయారు. అప్పుడప్పుడు ఇలా జరుగుతుంది. ఉద్యమంలో అలసిపోయినవాళ్లు ఇంటికి తిరిగివెళ్లిపోవాలనుకుంటారు'

'కానీ వాళ్లు ఆయుధాలను కూడా వెంట తీసుకువెళ్లారెందుకు?'

'ఓహ్ అదా. వాళ్ళు చాలా దూరం వెళ్తున్నారు కదా అందుకే రక్షణ కొరకు వాటిని తీసుకువెళ్లారు. అక్కడ దగ్గరలోని దళానికి వాటిని అప్పజెప్పుతారు'

'అట్లా చేయకుండా పారిపోతే?'

'వాళ్లు ఇంటికే వెళ్లాలనుకుంటున్నారు. పారిపోవాలని అనుకునేవారు చెప్పి వెళ్లరు. వీళ్ళు మళ్లీ ఎప్పుడైనా తిరిగిరావచ్చు'

'వాళ్ళు బహుశా పెళ్లిచేసుకుందామని అనుకుంటున్నారేమో?' (వెళ్లిన వారిలో ఒక యువతి, ఒక యువకుడు ఉన్నారు)

'ఆ అమ్మాయికి ఇదివరకే పెళ్లయ్యింది. ఈ దళంలోనే ఒక అబ్బాయిని పెళ్లిచేసుకుంది. ఆమె జీవితంలో స్థిరపడాలనుకుంటోంది. ఇంటిపట్టునే ఉండి మహిళా విభాగంలో పనిచేయాలని అనుకుంటోంది.'

ఆ వెళ్లిన యువకుడి పేరు కూడా సింగన్ననే. చాలా చురుకైన వ్యక్తి.

దళంలో పెళ్ళైన మగవాళ్లు కొంతమంది ఉన్నారు. వారి భార్యలు మాత్రం ఇంటివద్దనే ఉన్నారు. భార్య, భర్త ఇద్దరూ దళంలోనే ఉన్న ఉదాహరణలు కూడా ఉన్నాయి.

'భార్య దళంలో ఉండి భర్త ఇంటిదగ్గర ఉన్న ఉదాహరణలు ఏమైనా ఉన్నాయా?' అనడిగాను.

రాజేశ్ నవ్వి 'ఇప్పటికయితే అలాంటి ఉదాహరణలేమీ లేవు. పరిస్థితి ఇంకా అంతా దూరం వెళ్లలేదు, బహుశా అక్కడిదాకా ఎప్పుడూ వెళ్లకపోతుండవచ్చు. మహిళ ఇంకా నాలుగు గోడల మధ్యనే ఉన్నది. పురుషుడు ఇంటిని దాటి ఎప్పుడో బయటికి వచ్చాడు. అతను మళ్లీ ఇంటికి ఎందుకు తిరిగి వెళతాడు?.'

'దళాల్లో ఎవరైనా తండ్రి కొడుకులు ఉన్నారా?'

'కొందరున్నారు'

***

ఆరోజుల్లో అఫ్ఘానిస్తాన్‌లోని తోరాబోరా పర్వతశ్రేణిపై అమెరికా బాంబుల వర్షం కురిపిస్తున్నది. ఆ మంచు నిండిన పర్వత సానువుల్లో ఉన్న రాతి గుహలను కొత్త రకపు బాంబులతో పేల్చివేస్తున్నాయి అమెరికన్ సేనలు. భూమిలోకి ఆరు గజాలలోపలికి చొచ్చుకుపోయి మరీ పేలే శక్తివంతమైన బాంబులవి. తాలిబాన్‌ల ప్రతిఘటన వార్తలు పెద్దగా రావట్లేదు.

బస్తర్...తోరాబోరా...

రెండిటినీ పోల్చిచూశాను నేను.

బస్తర్‌లో పెద్ద పర్వతాలేమీ లేవు, వియత్నాంలో ఉన్నటువంటి దట్టమైన అడవులు లేవు, చమురు కూడా లేదు. కానీ వేల, లక్షల కోట్ల విలువైన సహజ సంపద ఉందీ భూమిలో. వాటిని పీల్చిపిప్పి చేయడానికి ప్రపంచ బ్యాంకు భారీ ప్రణాళికలు వేస్తున్నది. ఇక్కడ నుండి గుట్టలకొద్దీ ఇనుప ఖనిజాన్ని ఈపాటికే జపాన్ దిగమింగుతున్నది. ప్రపంచంలో అతివిలువైన ఖనిజాల ఖజానా చత్తీస్‌గఢ్ అని అనేక నివేదికలు చెబుతున్నాయి. లక్షలకోట్ల విలువైన వనరుల మధ్య దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్న గిరిజనులు...

ఒకవైపు పెట్టుబడి యొక్క విధ్వంసక శక్తి - మరోవైపు బక్కపలచటి గిరిజనులు- ఈ రెండు ఎప్పుడూ పరస్పర వ్యతిరేకమైనవే. ఇందులో మొదటిది రెండో దాన్నైనా నిర్మూలిస్తుంది, లేదా రెండోది మొదటిదానిపై విజయమైనా సాధిస్తుంది. మూడో ఆప్షన్ లేదు. ఈ సంఘర్షణ ఏదో ఒకనాడు తీవ్రరూపం దాల్చక మానదు.

'మేమిక్కడ బతికి బట్టకలిగామంటే కారణం ఇక్కడి అడవులో, గుట్టలో కాదు. ఇక్కడి ప్రజల మద్దతు. అదే కనుక లేకపోతే తోరాబోరా పర్వతాలు, గుహలు కూడా మమ్మల్ని రక్షించలేవు. ప్రజా మద్దతు ఉంటే అది బస్తర్ అయినా, తోరాబోరా అయినా, మైదాన ప్రాంతం అయినా విజయం తథ్యం.'

మళ్లీ కొనసాగించాడు. 'మా యుద్ధం బస్తర్‌కే పరిమితం కాదు. అది మొత్తం భారతదేశానికి వ్యాపించాలి. బస్తర్ అంతం కాదు కేవలం ఒక ఆరంభం మాత్రమే. దేశంలో ఉన్న 11 కోట్లమంది గిరిజనులు అటు చివర నుండి ఇటు చివర వరకూ ఉన్నారు. అటు ఒరిస్సా నుండి గుజరాత్ వరకూ, ఇటు బీహార్ నుండి మధ్య ప్రదేశ్, కేరళ వరకూ. వీరికే ఇవ్వాళ విప్లవం అవసరం. మేము దాక్కోవాల్సిన పని లేదు. మాకు తోరాబోరా అక్కరలేదు. మా ముందు ఉన్నది వియత్నాం, అఫ్ఘనిస్తాన్ కాదు. మా వెనుక ఉన్నది మావో సిద్ధాంతం, అల్‌ఖైదాది కాదు.'

★★★

ఆరోజు మధ్యాహ్నం మేమొక నది ఒడ్డున క్యాంపు పెట్టాం. చెమటతో తడిసిన మా దుస్తులను, వాసనగొడుతున్న మా బూట్లను ఉతికి ఆరేసుకునే సమయం దొరికింది. నదికి దాదాపు పావుకిలోమీటర్ దూరంలో అల్లిబిల్లిగా పరచుకున్న చిన్న చిన్న నీటి మడుగులతో ఒక అందమైన దృశ్యం ఆవిష్కృతమయ్యింది. అక్కడి దట్టమైన చెట్ల మధ్య మేము చాలా సేపు ఉసిరికాయలు తెంపుకుంటూ, జలకాలాడుతూ విశ్రాంతిగా గడిపాం. ఇలాంటి సందర్భాలు చాలా అరుదుగా వస్తాయికానీ వీటివల్ల కలిగే ఆనందం అంతాఇంతా కాదు. సాయంత్రం పరుగు పందాలు, లాంగ్ జంప్ వంటి ఆటలతో ఉత్సాహంగా గడిచింది. చాలా రోజుల తరువాత ఆ రోజు చలినెగడు కూడా వెలిగించాం. మరునాడు ఉదయానికి అందరికీ తేలికగా, ఉల్లాసంగా అనిపించింది. ఇంకో రెండు మూడు రోజులు ఇక్కడే గడపగలిగితే బాగుండు!

మరునాడు కూడా బయలుదేరడానికి అవసరమైన ఆజ్ఞ రాలేదు. అందరూ సామాన్లు సర్దుకుని సిద్ధంగా ఉన్నారు. ఒకవేళ రాత్రికి ఇక్కడే ఉండాలని ఆజ్ఞ వస్తే ప్లాస్టిక్ షీట్ పరిచేసుకుంటారు.

అప్పుడే సెంట్రీ నుండి ఏదో సమాచారం వచ్చింది. రాజేశ్ విజిల్ వేయగానే అందరూ వరుసలో నిలబడ్డారు. కాసేపటికి ఓ గెరిల్లా దళం మా ముందుకు వచ్చింది. వాళ్లకు స్వాగతం పలికామో లేదో, మాతో ఉన్న ముగ్గురి పేర్లు చదవబడ్డాయి: సింగన్న, విద్యా, ఈశ్వర్. మేము లైను నుండి బయటికి వచ్చి కొత్త స్క్వాడ్ తో కలిశాం. మళ్లీ కరచాలనాలు...రెండు దళాలూ వేర్వేరు దిక్కుల్లో పయనమయ్యాయి.

పాత దళం సభ్యులతో చాలా రోజులే ఉన్నాన్నేను - లచ్చక్క, దస్రు, బసంతి, జయ, ఇతరులు... కొందరూ 'మళ్ళీ కలుద్దాం' అంటే మరికొందరు చిరునవ్వుతో వీడ్కోలు పలుకుతున్నారు. ఇక్కడ 'మళ్లీ కలుద్దాం' అని అనే సాంప్రదాయం లేకపోయినా, నన్ను మరోసారి దండకారణ్యం రమ్మనే ఆహ్వానం అది.

మొత్తానికి అందరం సంతోషంగానే సెలవు తీసుకున్నాం.

***

గెరిల్లా జీవితం...ఒక క్షణం తీరిక ఉండదు, ఒక చోట శాశ్వతమైన నివాసం ఉండదు, ఒక రాత్రికి మించి ఎక్కడా బస ఉండదు. ఒక గూడెం నుండి మరో గూడెం, ఒక అడవి నుండి మరో అడవికి, ఒక పర్వతం నుండి మరోదానికి. ఉదయం ఒక నదిలో నీరు వారి దాహం తీరిస్తే సాయంత్రం మరో నది వారికి నీరందిస్తుంది. కొన్నిసార్లు ఒకటే ప్రాంతంలో చాలా రోజులు పనిచేస్తే మరికొన్నిసార్లు దూరప్రాంతాలకు వెళ్లి ఎన్నో ఏళ్లకు గానీ తిరిగిరాని పరిస్థితి. అప్పటివరకూ ఈ కాలిబాటలు ఆ యోధుల పాదముద్రలు గుర్తుపెట్టుకుంటాయి. అందులో కొన్ని పాదాలు తెలిసిన దారుల్లోకి తిరిగివస్తే మరికొన్ని ఎన్నటికీ తిరిగిరాని దూరతీరాలకు పయనమవుతాయి. అప్పుడా కాలిబాటలు ఆ యోధులను గుర్తుకుతెచ్చుకుని అశ్రుతర్పణం చేస్తాయి. పాత జ్ఞాపకాలను పదిలపరచుకుని కొత్త బంధాలు ఏర్పరచుకుంటాయి.

ఆ కాలి బాటలకు కామ్రేడ్ భీమా దాదా తీయని పాదస్పర్శ ఇంకా గుర్తుంది. బస్తర్ కాలిబాటల నుండి మొదలైన భీమా దాదా నీలాకాశంలో కలిసిపోయాడు. అతను ఈ అడవిలో, ఇక్కడి గాలిలో, నదుల్లో ఒక భాగమయ్యాడు. ఏ గిరిజన గూడేనికి వెళ్లినా అక్కడి ప్రజలు ఇంకా భీమా దాదాను మరచిపోలేదని అర్థమవుతుంది మనకు. గెరిల్లాలు అతడి స్మృతిలో పాటలు పాడితే, గిరిజనులు తాము కూడా గొంతు కలుపుతారు.

ప్రజలతో ప్రగాఢమైన అనుబంధంలేని గెరిల్లా జీవితాన్ని ఊహించలేం. మామూలుగానైతే చేతిలో చిల్లిగవ్వలేని వారితో ఆ పేద గిరిజనులు రెండు మూడు రోజులకు మించి గడపలేకపోయేవారు. ప్రజల మంచి చెడులు చూసుకోకపోతే ఈ గెరిల్లా దళాలు ఎక్కువకాలం ఉండలేవిక్కడ. దళం వచ్చిందటే కాలిబాటలే వీరికి కబురందిస్తాయి – అంతే మొత్తం గూడెం వీరి దగ్గరికి వస్తుంది. చాలా రోజుల పాటు గెరిల్లాలు రాకపోతే కాలిబాటలు చిన్నబోతాయి. అప్పుడు గూడెం మొత్తం దిగులు పెట్టుకుంటుంది. గెరిల్లాలు రానప్పుడు పోలీసులు వస్తారు.

పోలీసులొస్తే ఏం జరుగుతుందో గిరిజనులందరికీ తెలుసు. గెరిల్లాలొస్తే తమ బాధలు పంచుకోవచ్చని గిరిజనులు ఎదురుచూస్తారు. వారిద్దరి మధ్యా ఉన్న అనుబంధం ఇద్దరికీ అయుష్షు ఉండేలా చేస్తుంది.

నేనిప్పుడున్న దళ కమాండర్ చాలా హుషారైన యువకుడు. సోమ, సోమన్న, సోం దాదా, సోం భాయ్, ఇలా అనేక పేర్లతో పిలిచేవారు ప్రజలు అతడిని. అతను ఈ ప్రాంతానికి వచ్చి ఏడాది అయ్యిందట. ఇక్కడి ప్రతి ఇంటిలో అతనంటే అభిమానం ఉంది. ఇతర కమాండర్లు మామూలు ప్రజల నుండి కొంచెం దూరం ఉన్నట్టు అనిపించినా సోమకు మాత్రం ప్రజల్లో మమేకమై తిరగడం అలవాటు.

ఆ నీటి మడుగులున్న స్థలం నుండి బయలుదేరాక మా మొదటి పని ఎదురుగా ప్రవహిస్తున్న నదిని దాటడం. ఆ నది చాలా వెడల్పుగా ఉండి కొన్నిచోట్ల బాగా లోతుగా ఉన్నదట. కొన్నిచోట్ల నడుములోతు నీళ్లు ఉంటే మరికొన్ని చోట్ల మెడ వరకు, ఇంకొన్ని చోట్ల మొత్తం మనిషి మునిగిపోయేటన్ని నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఈ నదిని గురించి తెలిసిన అనుభవజ్ఞులు మాత్రమే దీన్ని దాటగలరు. కానీ మా దళంలో అలాంటి వారెవరూ లేరు.

సోమన్న ఒక తాడును తీసుకుని నది ఒడ్డున ఉన్న చెట్టు మొదలుకు కట్టాడు. తాడు ఇంకొక కొసను పట్టుకుని 'మన బృందంలో ఈత సరిగారాని వాళ్లెవరైనా ఈ కొసను తీసుకువెళ్లి నదికి అటువైపు ఉన్న చెట్టుకు కట్టాలి' అని ప్రకటించాడు.

దళ సభ్యులందరూ గుసగుసలాడుకోవడం మొదలు పెట్టారు. ఒక వ్యక్తి ముందుకు వచ్చి తాడు ఇవ్వమని అడిగాడు.

'నువ్వొద్దు. నీకీ నది గురించి బాగా తెలుసు. నేనడిగింది ఏమీ తెలియని వ్యక్తి ముందుకు రావాలని'

ఇప్పుడు గుసగుసలు ఆగిపోయాయి.

కొన్ని క్షణాల తరువాత ఇంకొక యువకుడు ముందుకు వచ్చాడు.

'ఉహు. నువ్వు కూడా వద్దు. నీకూ ఈ నది తెలిసినదే. ఇద్మా, నువ్వు రా ఇటు'

నిజమే ఇద్మాకు అసలేమి తెలియదు.

'నేను మునిగిపోతానేమో' ఇద్మా నవ్వుతూనే భయం నటించాడు.

'ఎర్ర సైన్యపు యోధుడివి, నువ్వే మునిగిపోతానని అంటే, ఇక ఈ అమ్మాయిలకు దిక్కెవరు? వాళ్ల నది దాటలేక ఇక్కడే దిక్కులేని చావు చస్తారు. ఇదిగో, ఈ తాడు నడుముకి కట్టుకొని నదిలోకి దుముకు. నువ్వు మునిగిపోతే మేం తాడు పట్టుకుని నిన్ను పైకి లాగుతాం.'

భుజానికి ఉన్న కిట్ బ్యాగు తీసి కిందపెట్టి తాడు నడుముకి కట్టుకుని నీళ్లలోకి దుమికాడు ఇద్మా. సగం దాకా పోయాక నీటి ఉధృతికి కొంచెం దూరం కొట్టుకుపోయి మళ్ళీ అక్కడి నుండి కొద్దిపాటి కష్టంతో అటు ఒడ్డును చేరుకున్నాడు.

'బాగా ఈతకొట్టావు ఇద్మా' అని సోమన్న చప్పట్లు కొట్టాడు.



సింగన్న, అతనితో పాటు ఈత బాగా వచ్చిన ఇంకొక యువకుడు కలిసి నదిని అవలీలగా దాటారు. వాళ్లు అటు ఇటు చాలా సార్లు ఈదుకుంటూ అనేక కిట్ బ్యాగులు, సామాన్లు మోసుకువెళ్లారు. అందరు నదిని దాటాక అటు ఒడ్డుకు చేరిన సోమ మహిళా గెరిల్లాలను ఉద్దేశించి 'అమ్మాయిలూ వినండి! వెంటనే ఈత నేర్చుకోండి. తేలికగా దొరికే మార్గాల కొరకు చూడొద్దు. ఈత వస్తే నది మీ నేస్తమవుతుంది, లేకుంటే అది మీ శత్రువే.'

అతని మాటలు ఆ అమ్మాయిలకు నవ్వు తెప్పించాయి.

ఆ రాత్రి నది ఒడ్డునే క్యాంపు పెట్టాం. భోజనం దగ్గరలోని గూడెం నుండి వచ్చింది.

వారికి ఈత రాకపోవడం వల్ల ఎప్పుడూ నది లోతు తక్కువ ఉన్న చోటు కొరకు వెతకాల్సి వచ్చేది. అందుకు చాలా గంటలు అదనంగా నడవాల్సి వచ్చేది. తెలుగులో చింత అని పిలిచే తాల్పేర్ నది అనేక చోట్ల చాలా లోతుగా ఉంటుంది, కానీ ఆ నదిని దాటడానికి అవే సురక్షితమైన ప్రదేశాలు.

తాడు వాడకం ఆపేయాలని సోమన్న ఆలోచన. ప్రతి గెరిల్లా తలపై కిట్ బ్యాగు, తుపాకీతో నదిని దాటగలగాలని అతని ఆకాంక్ష. గోదావరి నదీ ప్రాంతంలో ఈత రాకుండా అసలు మనుగడ సాధించలేం. దళం ఎప్పుడు ఏ దిశలో వెళ్లాల్సివస్తుందో ఎవరూ చెప్పలేరు.

సోమ ఇక్కడికి వరంగల్ నుండి వచ్చాడు. అక్కడైతే తుపాకీ ట్రిగ్గర్ పై ఒక క్షణం కూడా వేలు తీయడానికి లేదు. అక్కడ తుపాకీ భుజానికి వేలాడదు. దాన్ని భుజంపై నుండి తీసుకుని గురి చూసే టైం కూడా దొరకదు. కొంచెం ఏమరుపాటుగా ఉంటే తుపాకీ గుళ్లకు ఎదురుపడాల్సిందే. కానీ బస్తర్‌లో పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉంది. సాలెగూడు లాంటి రోడ్లు లేవు, మార్కెట్‌తో కుమ్మక్కూ లేదు, బయటివాళ్ల కదలికలు లేవు, శత్రువు పహారాలేదు! ఇక్కడ గెరిల్లాలు ఒక స్వయం సంవృద్ధ ఆర్థిక వ్యవస్థను తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది సాకారమయితే శత్రువుకు ఇబ్బందులు తప్పవు. అప్పుడు గెరిల్లాలు ఒక గొప్ప శక్తిగా తయారవుతారు. ప్రస్తుతానికి అయితే ఉద్యమం కేవలం గెరిల్లాలు ఉండే ప్రాంతానికే పరిమితం అయ్యింది. 

సైనిక శిక్షణ, అభివృద్ధి పనులు రెండిటి మీదా సోమన్న దృష్టి కేంద్రీకరించాడు. అతని దళానికి ఉదయం చాయ్ దొరకకపోయినా శనగలు, వేరుశనగ గింజలు, బటానీలు మాత్రం దొరికేలా చూసుకుంటాడు. 'చాయ్‌లో ఏముంది? చాయ్‌కి వాడే బదులు ఒంట్లో బాగోలేనివాళ్లకు ఆ పాలు ఇవ్వొచ్చు కదా' అనేవాడు. అతని దళంలో ఎవరూ మలేరియా బారిన పడకుండా జాగ్రత్తగా చూసుకుంటాడు.

మలేరియా వచ్చిందంటే ఒకవారం రోజుల పాటు గెరిల్లా అశక్తుడైనట్టే. ఆ వ్యాధి మన శక్తిని మొత్తం హరించివేస్తుంది. అందుకే సోమన్న తన దళానికి క్రమం తప్పకుండా మలేరియా నిరోధకమందులు ఇస్తాడు.

ఆ రోజు సాయంత్రం మేము 'గూడెం' అనేపదంతో అంతమయ్యే పేరున్న ఊరును చేరాం. ఆ ప్రాంతంలో ప్రతిఊరి పేరూ గూడెంతోనే ముగుస్తుందని నాకు తరువాత తెలిసింది - కల్‌గూడెం, పెద్దగూడెం, రాజగూడెం...

ఆ ఊరిలో దాదాపు ప్రతి ఇంటికీ వెళ్లాడు సోమన్న.

'బాగున్నావా విద్మేమడియం?'

'ఎలా ఉన్నావు మాసెమడకం?'

వాళ్ల ఇళ్లలోకి వెళ్లి పిల్లలను భుజాలపైకి ఎత్తుకునేవాడు. కోళ్లగూడులోకి తొంగి చూసేవాడూ. కొట్టంలో గొర్రెలను నిమిరేవాడు.

సోమన్న ఆ ఇంటి ముందుకు వెళ్ళేసరికి ఇద్మే అప్పుడే గిన్నెలు కడగడం పూర్తి చేసింది. నల్లా దగ్గర మంచినీళ్లు తెద్దామని ఒక కుండను తీసుకుని ఆమె బయలుదేరబోగా ఆమె చేతి నుండి దాన్ని తీసుకున్నాడు సోమన్న.



'పిల్లలెక్కడ?'

'పెద్దోడు వేటకుపోయాడు. చిన్నోడు ఇదిగో ఇక్కడే ఉన్నాడు' అంది ఇంటి ముందు ఉన్న వాడికేసి చూపిస్తూ

'మరి వాడిని నీళ్ళు తీసుకురమ్మని చెప్పొచ్చు కదా?'

'వాళ్లిట్లాంటి పనులు చేయరు. తాటికల్లు తేవడం, పశువులు కాయడం వంటి పనులయితే చేస్తారు కానీ నీళ్లుతేవడానికి మాత్రం ఇష్టపడరు'

సోమన్న ఆమె చిన్నకొడుకుని పిలిచి చేతికి కుండను ఇచ్చి 'తొందరగా వెళ్లి నీళ్లు తీసుకురాపో' అని పురమాయించాడు.

ఇద్మే మహిళా విభాగంలో పని చేస్తుంది. ఆమె పెద్ద కొడుకు కోసా గ్రామ మిలిషియా సభ్యుడు. అతను మంచి విలుకాడు. మిత్రులతో కలిసి వేటకు వెళ్లాడట. ఈ పాటికి దళం ఊళ్లోకి వచ్చిందని తెలిసి ఉంటుంది. తొందరలోనే వస్తాడని సోమన్న ఆశాభావం వ్యక్తం చేశాడు.

ఆ ప్రాంతంలో ప్రతి ఊళ్లో మిలిషియా దళాలు ఉన్నాయి. ఇంకొన్ని అదనపు దళాలు కూడా ఏర్పాటు చేయాలని సోమన్న అనుకుంటున్నాడు. పాత గెరిల్లా దళాన్ని ఇక్కడి నుండి మరో ప్రాంతానికి పంపి ఈ ప్రాంతం బాధ్యతను మరో కొత్త దళానికి ఇస్తారట.

'మావద్ద సరిపోయినన్ని ఆయుధాలులేవు. ఆ కొరత తీరిన వెంటనే మేము కొత్తదళాలను ఏర్పాటు చేయడం మొదలు పెడతాం.' అనిచెప్పాడు సోమన్న

కొత్త దళాలకు అవసరమయ్యే దళకమాండర్లు ఇప్పుడున్న దళాల్లోంచే ఎదుగుతారని అతని విశ్వాసం.

ఇద్మేకు వీడ్కోలు పలికి ఒకసారి గ్రామం మొత్తం చుట్టి వచ్చాడు సోమన్న. ఆ రోజురాత్రి వివిధ ప్రజాసంఘాలతో సమావేశం జరిగింది. మరునాడు ఉదయం గ్రామస్తులందరితో జరిగిన సమావేశంలో గ్రామం అంతటికీ ఉన్న సమస్యలు చర్చించారు. వాటి పరిష్కారానికి రాజేశ్ ఎదుర్కొన్న అడ్డంకులే ఇక్కడ సోమన్న కూడా ఎదుర్కొంటున్నాడు.

నిన్న కోసా, అతని మిత్రులు కలిసి ఒక అడవి పందిని కొట్టుకొచ్చారట. ఆ రాత్రి మాకు విందు భోజనమే అయ్యింది.

రాత్రి పొద్దుపోయేవరకు గ్రామ మిలిషియా సభ్యులు దళంతోనే గడిపారు. సోమన్న వారితో ఏదో చర్చించడం కనిపించింది.

మరుసటి రోజు ఉదయం బయలుదేరాలని నిశ్చయించాడు. అయిదు నిముషాల్లో తయారయి హాజరుకమ్మని అజ్ఞాపించాడు. షీటును దులిపి మడతపెట్టి బూట్లు వేసుకోవడానికి మూడు నిముషాలు చాలు. అయిదు నిముషాలు గడిచేసరికి అందరూ లైనులో నిలబడ్డారు. అక్కడి నుండి బయలుదేరడానికి కొన్ని నిముషాల ముందు దారి చూడడానికి ఒక బృందాన్ని, వాళ్లు వెళ్లిన కొన్ని నిముషాలకు దళాన్ని బయలుదేరదీశాడు సోమన్న.

'రోమన్ సైనికదళానికి ఉన్నటువంటి క్రమశిక్షణ, స్పార్టకస్ సేనలకున్నటువంటి పోరాట స్ఫూర్తి ఉండాలి' అన్నాడు. అక్కడికి దగ్గరలోనే ఉత్తర తెలంగాణ ఉన్నది కనుక అనూహ్యంగా దాడి జరిగే ప్రమాదం ఉన్నది. అందుకే సోమన్న చాలా జాగ్రత్తలు తీసుకున్నాడు.

ఉదయపు చల్లగాలికి నాలుగు కిలోమీటర్లు నడిచాక మేము ఒక చోట ఆగాము. సంకేతస్థలానికి ముందే దారి సరిచూడడానికి వెళ్లిన బృందం ఇంకా చేరుకోలేదు. వాళ్లు దారితప్పి కొంచెం చుట్టూ తిరిగి ఆలస్యంగా అక్కడికి చేరుకున్నారు. మేము గుర్రం నాడా ఆకారంలో క్యాంపు చేశాం. సాయంత్రానికి ఇంకో దళం వచ్చి మమ్మల్ని చేరింది. అప్పుడు గుర్రం నాడా కాస్తా వృత్తం అయ్యింది.

ఇప్పుడన్ని దిక్కులూ కవర్ అయ్యాయి. చీకటి పడ్డాక మళ్లీ కదలాలనే ఆజ్ఞలు వచ్చాయి. ఆ చీకట్లో దాదాపు 32–33 మంది ఒకేవరుసలో నడవడానికి చాలా కష్టమయ్యింది. ఒకసారి ఇటు చివర, మరోసారి అటు చివర ఏదో ఒక సమస్య వచ్చేది. ముందు దారి చూపుతూ వెళ్తున్న గెరిల్లాలు తప్పితే ఎవరూ టార్చిలైట్ వాడటానికి వీలులేదు. ఎవరికైనా సమస్య వస్తే వాళ్ల వెనుక ముందు ఉన్నవాళ్లే ఆగి సహాయం చేయాలి. అందరూ ఒక చోట గుమికూడరాదు. ఫార్మేషన్లో ఉన్న ఇతర సభ్యులు కొంచెం ముందుకు వెళ్లాక మిగతావారు వచ్చే వరకూ ఆగుతారు.

ఆ రాత్రి మేము అనేక గిరిజన గూడేలను దాటుకుంటూ వెళ్లాం. పొలాలకు కాపలా ఉన్న రైతులు కొందరు మాకు తారసపడ్డారు, కానీ మేమెక్కడా ఆగలేదు. ఆ రైతులు కూడా మమ్మల్ని చూసి కిక్కురుమనలేదు. వెళ్తున్నదెవరో వాళ్లకు తెలుసు. ఏ పొలం ఎవరిదో దళానికీ తెలుసు. మధ్యలో ఒక చిన్న గ్రామం కూడా మాకు తగిలింది. అక్కడ కాసేపు ఆగి గ్రామస్తులతో ముచ్చటించాడు సోమన్న. అక్కడి నుండి మా దారి మరో వైపుకు మళ్లింది.

రెండు రోజుల కింద ఆ గ్రామంగుండా ఒకపెద్ద పోలీస్ పెట్రోలింగ్ పార్టీ వెళ్లి మళ్లీ తిరిగిరాలేదట. అందుకే మా దళం ఊరి పక్కన ఉన్న ఏరుదాటకుండా ముందుకే వెళ్ళింది. ఆ గ్రామం నుండి ఒక గంట ప్రయాణించాక ఆగాం. ఎవరూ షీట్లు కింద పరవలేదు ఇవ్వాళ. అందరం బాగా అలసిపోయాం కాబట్టి బ్యాగులపైనే ఒరిగి నిద్రపోయారు. క్యాంపు చుట్టూ రాత్రంతా పెట్రోలింగ్ నడుస్తూనే ఉంది.

వేకువజాముకు ముందే, విజిల్ మోగకుండానే అందరూ మేల్కొన్నారు. అందరూ యుద్ధరంగంలో ఉన్నట్టు చెట్లమాటున పొజిషన్లు తీసుకున్నారు. అక్కడికి దగ్గర నుండే పోలీసులు వెళ్తున్నారని ఒక గెరిల్లా పెట్రోలింగ్ బృందం సమాచారం ఇచ్చింది. గాలింపు చర్యల నుండి తిరిగివస్తున్నారు పోలీసులు. వాళ్లు వెళ్లిన దారి గుండానే తిరిగి వచ్చి ఉంటే ఇద్దరూ ఎదురెదురు అయ్యేవారు. 159

'కొంచెం ముందే సమాచారం తెలిసి ఉంటే...' సోమన్న గొణిగాడు

'ఇప్పటికైనా మనం అంబుష్ చేయొచ్చు వారిని' ఎవరో అన్నారు

'ఊహు. ఆలస్యం అయిపోయింది' సోమన్న బదులు చెప్పాడు.

కాసేపటికి వచ్చిన ఇంకో రెండు గెరిల్లా పెట్రోలింగ్ బృందాలు దరిదాపుల్లో పోలీసుల కదలికలు ఏమీ లేవని తేల్చారు. చెప్పుకోదగ్గ పోలీసు కార్యకలాపాలేమీ జరగట్లేదని సోమన్న ఒక అంచనాకు వచ్చాడు. దాదాపు రెండేళ్లతరువాత ఈ ప్రాంతంలోకి గాలింపుకు వచ్చారు పోలీసులు. అంటే దీనర్థం వాళ్లూ మళ్ళీ వస్తారనే. ఇప్పుడు వాళ్లు జీపులు వాడటం మానేశారు. అప్పుడప్పుడు ఒక పోలీస్‌స్టేషన్ నుండి మరో స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో పోలీసులు కాలినడకనే కవాతు చేస్తున్నారు. కానీ ఈసారి మాత్రం వాళ్లు అడవి లోపలికి చొచ్చుకు వచ్చే ధైర్యం చేశారు. వచ్చే రోజుల్లో జరగబోయే పరిణామాలకు ఇది ఒక హెచ్చరికలా తీసుకున్నాడు సోమన్న.

'సమస్యల్లా వాళ్లు ఇక్కడి దాకా వచ్చే ధైర్యం చేయడమే. అయితే వాళ్ళు ఇంకా ఇంకా లోపలికి రావడానికి ప్రయత్నిస్తారు, అది ఒక విధంగా మాకు శుభవార్త. వాళ్లు ఎక్కడో ఒక చోట మాకు దొరుకుతారు కదా'

ఇలా పోలీసులు అడవిలోకి రావడం కాక ఒక స్టేషన్నుండి మరో స్టేషనుకు కవాతు చేయడం అరికట్టాలని సోమన్న అనుకుంటున్నాడు.

గెరిల్లాల సమాచార వ్యవస్థలోని అంతర్గత బలహీనతలను ఈ పోలీసు గాలింపు వేలెత్తి చూపింది.

ఆ రోజు మేము ఎక్కడా ఎక్కువ సేపు ఆగలేదు. మరుసటి రోజు రాత్రి కూడా బాగా జాగ్రత్తగా ఉన్నాం. మూడో రోజు సమీప గ్రామాల మిలిషియా నేతలతో సమావేశం నిర్వహించాడు సోమన్న. ఆ సమావేశం ముగిశాక కొంచెం స్థిమితపడ్డట్టు కనపడ్డాడు అతను. భవిష్యత్తులో వారి సమాచార వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుండవచ్చు.



నేను దండకారణ్యంలో కలిసిన అన్ని దళాలతో పోలిస్తే సోమన్న దళం కొంచెం విభిన్నంగా కనపడింది నాకు. సోమన్న ప్రత్యేకత ఏమిటంటే అడవిలో నివసిస్తున్నప్పటికీ అతని దారిలో ఎదురయ్యే ప్రతి గ్రామంలో ఆగి ప్రజల యోగక్షేమాలు కనుక్కుని వెళ్లడం.

***

'ఎలా అనిపించింది అడవి?' ఒక రోజు కొట్టంలో కూర్చుని ఉండగా అడిగాడు నన్ను సోమన్న

'బాగుంది. నిజంగా చెప్పాలంటే అందంగా ఉంది'

'మరి ఇక్కడి ప్రజలో?'

'అడవి కన్నా బాగున్నారు'

'మేము?'

ఇక్కడ 'మేము' అనే దాంట్లో చాలా వస్తాయి - వారి లక్ష్యాలు, జీవనవిధానం, సమస్యలు, సంతోషాలు ఇంకా ఎన్నెన్నో. అందుకే ప్రశ్న ఉన్నంత చిన్నది కాదు జవాబు.

నేను బయలుదేరే ముందు నాకున్న ప్రతీ కుతూహలం గురించి వాటికి జవాబుల కొరకు నేను చేసిన పరిశోధన గురించి సోమన్నకు నేను వివరించాను

అన్నీ విని అతనన్నాడు నువ్వు చెప్పేది నిజమే మా మీద ఎంతో వత్తిడి ఉంది మాకున్న పరిస్థితుల పరిధులలోనే మేము మా కార్యకలాపాలు నిర్వహించాలి మాకు ఎదురైన అడ్డంకులను ఛేదిస్తాం మేము అసలైతే మా పోరాటం అంతా ఈ అడ్డంకులను తొలగించడానికే బహుశా అన్ని చోట్లా ఇట్లాగే ఉంటుందేమో ఒక సమస్య పరిష్కరిస్తే మరొకటి తలెత్తుతుంది మానవ పురోగతికి అడ్డుపడే అనేక అన్యాయమైన అడ్డంకులున్నాయిక్కడ వాటిని తొలగించి పురోగతికి బాటలు వేయాలనేదే మా ప్రయత్నం

మీరు జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాధిస్తారు అందుకేనేమో మీరు ఎప్పుడూ ఆనందంగా ఉంటారు

అతను సన్నగా నవ్వాడు నా మాటలు విని

మధ్యలో ఆగడం సోమన్న నైజంకాదు నాకు ఆగిపోవడం నచ్చదు నేను ఆగలేను అన్నాడతను సమస్యలు అతడిని ఎప్పుడూ చీకాకు పెట్టవు

'కానీ బస్తర్‌లో ప్రవహించే నదుల్లాగే మీ వేగం చిరుగాలిలా ఉంది అదింకా గర్జించే నదిలా లేదు

మా వేగం తక్కువ ఉండటానికి కారణం మేము పురాతనకాలం నుండి ఉన్నవాటిని మార్చడానికి ప్రయత్నిస్తున్నాం కాబట్టి నెమ్మదిగా మొదలు పెట్టినా తొందరలోనే వేగం పుంజుకుంటాం మేము మరీ వేగంగా వీరిని తోసుకుంటూపోలేము ఇక్కడి గిరిజనులను వారి మానాన వారిని వదిలెయ్యాలని వారంతటవారే అభివృద్ధి చెందుతారని కొందరి భావన కానీ పెట్టుబడి దురాక్రమణ సహజ అభివృద్ధిని సాగనిస్తుందా? అస్సలే వీలుకాదు! అలా రాయ్‌పూర్ జరగనివ్వదు భువనేశ్వర్ జరగనివ్వదు రాంచీ భోపాల్ ఢిల్లీ కూడా అది జరగనివ్వవు

ఇదివరకు మాత్రం వారిని ఉన్న చోట ఎవరుండనిచ్చారు? బైలడిల్లానా? టాటానగరా? ఇప్పుడు ఎవరుండనిస్తున్నారు? సర్దార్ సరోవర్ ప్రాజెక్టా? ప్రపంచబ్యాంకా? ప్రపంచీకరణనా? అలా ఇదివరకూ జరగలేదు, ఇక ముందూ జరగదు. మేమొక కొత్త అభివృద్ధి మార్గాన్ని ఆవిష్కరించాలనుకుంటున్నాం - ఆ మార్గంలో విధ్వంసం ఉండదు, నిర్మాణం ఉంటుంది. దోపిడీ, పీడనలు ఉండవు. అది జరగాలంటే మేము ఢిల్లీలో అడుగుపెట్టాలి.

'అది జరగాలంటే తుపాకీ తప్ప మరో మార్గం లేదా?'

'ఒక వేళ అలాంటిదొకటి ఉందుంటే అసలు తుపాకీ పట్టుకునే అవసరమే ఉండేది కాదు'

***



17554

సత్నామ్

# అల్విదా!

సంవత్సరంలోని చివరి నెలలో చివరి వారం అది. ఎండ వెచ్చగా ఉంది. ఆ కొట్టంలోంచి లేచి బయట పొలాల్లోకి నడిచాను. ఈ అడవిలోకి నేను అడుగుపెట్టి రెండు నెలలు గడిచాయి. సోమన్న అడిగిన ప్రశ్నకు బదులు చెపుతుంటే నేనిక్కడికి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు జరిగిన సంఘటనలన్నీ ఒక రీలులా గిర్రున నా కళ్లముందు తిరిగాయి. 163

నేను దూరం నుండి విన్నవి, నిజంగా ఎలా ఉంటాయో తెలుసుకోవాలనుకున్నవి ప్రత్యక్షంగా చూసే అవకాశం దొరికింది.

నేను అడవిని, అడవి బిడ్డలను, గెరిల్లా జీవితాన్ని, వారి ఆశయాలను, వారి భావోద్వేగాలను, అన్నీ వారిలో ఒకడిగా ఉంటూ చూశాను. వారి భావాలను నాకు చేతనైనంత చదివాను. నా దృష్టిలో పడనివి, నేను లోతుగా పరిశీలించలేని అంశాలు చాలానే ఉండొచ్చు. అయినప్పటికీ నామటుకు మాత్రం ఇది ఒక విలువైన, ఆసక్తికరమైన అనుభవం. అందుకే దీనిని ఇతరులతో పంచుకోవాలనుకున్నాను.

ఈ సంగతులన్నీ నా డైరీ పేజీల్లో చెల్లాచెదురుగా ఉన్నప్పటికీ వాటిని ఒక వరుసక్రమంలో పెట్టడానికి, వాటిని నిజాయితీగా చిత్రించడానికీ, నేను ఆ అనుభవాలన్నీ తిరిగి జీవించాల్సివచ్చింది.

ఈ పుస్తకంలోని సంఘటనలు, పాత్రలూ అన్నీ నిజమైనవే. కొన్ని చోట్ల రెండు నిజజీవిత పాత్రలను ఒకదానిలో విలీనం చేశాను. ఇంకొన్ని చోట్ల ఒకటే పాత్రను రెండుగా విడదీశాను. ఈ కథను ఆసక్తికరంగా, ఆకట్టుకునేవిధంగా చేసేందుకే అలా చేయడం జరిగింది. జరిగినవి జరిగినట్టుగానే చెప్పాలని ప్రయత్నం చేశాను. అలా చేయకుంటే ఇది యాత్రానుభవం కాక ఒక కల్పిత కథ అయ్యేది.

నేను ఇందులో పాత్రలకు పెట్టిన పేర్లు నిజమైనవి కావనడంలో సందేహం లేదు. ఎందుకంటే నా పాత్రలు వారివారి నిజమైన పేర్లను ఎప్పుడో వదిలేసుకున్నారు. అలా కాకున్నా ఇక్కడ ఎవరి పేరూ శాశ్వతం కాదు. గెరిల్లా ప్రాంతం మారగానే వారి పేరు కూడా మారిపోతుంది. నేనిక్కడ చిత్రించింది నిజమైన మనుషులను, పేర్లను కాదు. బసు నుండి సోమన్న వరకూ, అందరూ ఈ సుదీర్ఘ యుద్ధంలో యోధులే. వారు తమ లక్ష్యానికి ప్రచారం కల్పించాలనుకుంటారు. తమ పేరుకు కాదు.



ఈ పుస్తకంలో నేను వర్ణించినది దక్షిణ బస్తర్‌లోని బైరాంఘఢ్, గొల్లపల్లి, కుంట, దోర్నపాల్, మాఢ్, మాదేడ్, బసుగూడ ప్రాంతం.

సోమన్నతో ఆ సంభాషణ జరిగాక గెరిల్లాలతో ఎక్కువ రోజులు లేను. నేనక్కడి నుండి తిరిగిరావడానికి ముందు రోజు మేమొకచోట విశ్రాంతి కొరకు ఆగాం. నాతో ఉన్న దళానికి వీడ్కోలు పలకడానికి వచ్చిన గ్రామస్తులలో ఒక గిరిజన అమ్మాయి వెనకకు తిరిగి వెళ్లకపోవడం నేను గమనించాను. మామూలుగానైతే వెనకకు పోవాలి తను. కొత్త బట్టలు వేసుకుని తలకొక రంగురంగుల దస్తీ చుట్టుకుని మంచిగా సింగారించుకుని వచ్చిందా అమ్మాయి ఇంటినుంచి. ఆ అమ్మాయి దళంలో కొత్తగా చేరిందని అందుకే వెనకకు వెళ్లలేదని ఊహించాను నేను. ఆమె ఊరివాళ్లు చాలా మంది ఆ అమ్మాయికి వీడ్కోలు పలకడానికి వచ్చారు. వెళ్లేటప్పుడు అందరినీ కౌగిలించుకుంది ఆ అమ్మాయి. నేను సోమన్నను ఆ అమ్మాయి గురించి అడిగితే అతను నవ్వి నేను ఊహించింది కరెక్టేనని చెప్పాడు.

సత్నామ్

కాళ్లకు చెప్పులు లేని ఆ నెమ్మది గుణపు అమ్మాయితో నేను మొదటి, చివరి సారి మాట్లాడాను. నా కిట్ బ్యాగు, పెన్సిల్, కొత్త నోట్ బుక్ ఆ అమ్మాయికి అందిస్తూ అందరికీ సెల్యూట్ చెప్పాను. కరచాలనాలూ చేశాను.

దండకారణ్యపు జ్ఞాపకాలు ముసురుకుంటుండగా దగ్గరలోని ఒక టౌన్ నుండి నా తిరుగు ప్రయాణానికి రైలెక్కాను.

సత్నామ్
డిసెంబర్ 2002

ఈ
మలుపు అందరిదీ
అందులో కొందరు...

- ప్రొ॥ ఘంటా చక్రపాణి
- ఎం. వేద కుమార్
- కాత్యాయని
- సుధామయి
- కొణతం దిలీప్
- కందాడి బాల్‌రెడ్డి

గ్రంథాలయ
17554

jangalnama * satnam

దండకారణ్యంలోని ఆదివాసులమీద, మావోయిస్టులమీద ప్రభుత్వం సాగిస్తున్న యుద్ధం అందరికీ తెలిసిందే. కాని అక్కడ నిజంగా ఆదివాసులజీవితం ఎలా ఉంది? వారి పోరాటం ఎందుకు సాగుతోంది? ముప్పై సంవత్సరాలుగా దండకారణ్య ఆదివాసులతో కలిసిమెలిసి సాగుతున్న మావోయిస్టుల నిత్యజీవిత అనుభవాలు ఏమిటి? వారు నిర్మిస్తున్న ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా ఏమిటి? రెండునెలలపాటు వారితో కలిసి తిరిగి, వారి ఆరాట పోరాటాలను సన్నిహితంగా చూసిన పంజాబీ పత్రికారచయిత సత్నాం రాసిన కథనం ఇది.



htpp://malupu.wordpress.com
email : malupuhyd@gmail.com